# క్రాంతి

లోపలి పేజీల్లో.....


| | |
|---|---|
| క్లింటన్ విజన్..... | 11 |
| వైట్ సదస్సుల..... | 17 |
| యహారంలో వేడే..... | 19 |
| జల జన్మభూమి..... | 25 |
| ధారకొండ..... | 27 |
| కా॥ వహీష్ ప్రసంగం..... | 30 |
| జెహానాబాద్..... | 45 |
| నీటి ఎద్దడి..... | 47 |



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] రాష్ట్రకమిటీ అధికార పత్రిక

సంపుటి : 24 సంచిక : 3 మే-జూన్ 2000 వెల : ఐదు రూపాయలు


## విద్యుత్ ఛార్జీల భారీ పెంపుకి సంబంధించి ఫాసిస్టు చంద్రబాబు చేస్తున్న వాదనలు, చెబుతున్న కారణాలన్నీ పచ్చి దగాకోరు అబద్ధాలే!

## ప్రపంచబ్యాంకుకి చంద్రబాబు గులాంగిరీ పర్యవసానమే ఈ అధిక ఛార్జీల దాడి!!

## పెంచిన ఛార్జీల రద్దుకేగాక చంద్రబాబు-ప్రపంచబ్యాంకుల విధానాలకి వ్యతిరేకంగా ప్రజలు వీరోచిత సమరశీల పోరాటాలకి నడుం బిగించాలి!!!

మే 27వ తేదీన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్ 1100 కోట్ల రూపాయల మేరకు విద్యుత్ ఛార్జీలు పెంచి, ప్రజలందరికీ ఒక పెద్ద షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో యావత్ ప్రజానీకం, ఈ 'షాక్' దెబ్బకు దిమ్మెరపోయి, పెంచిన ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ మొదలు పెట్టడంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు విద్యుత్ రంగానికిస్తున్న సబ్సిడీకితోడు అదనంగా 281 కోట్ల సబ్సిడీని ప్రకటించి, ఆ 'సబ్సిడీ'ని తాను 'ట్రాన్స్‌కో'కు ఇస్తానని, ఆ మేరకు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తున్నట్లుగా ప్రకటించాడు. అలా చంద్రబాబు సబ్సిడీ 'ప్రకటించినా' ప్రజలమీద పడిన భారం అక్షరాలా 840 కోట్లు. అంటే ఇప్పుడున్న ఛార్జీలకంటే 15శాతం ఎక్కువ. చంద్రబాబు ప్రకటించిన సబ్సిడీ రాష్ట్ర ప్రజలను ఏమాత్రం సంతృప్తిపరచలేదు. అది కేవలం కంటితుడుపు చర్యే అని భావించిన ప్రజానీకం, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని మరింతగా డిమాండ్ చేయటం మొదలు పెట్టారు. రాష్ట్రంలో వివిధ పార్టీల నాయకత్వంలో ఉద్యమం మొదలైంది.

ఆ ఉద్యమానికి ప్రతిగా, పెంచిన ఛార్జీలను సమర్థించుకుంటూ చంద్రబాబు, ట్రాన్స్‌కో, రెగ్యులేటరీ సంస్థలు ప్రచారం ప్రారంభించాయి. అందులో ముఖ్యమైన సారాంశం పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించటం కుదరదన్నదే.

ప్రజలకు నిరంతరాయ విద్యుత్, మెరుగైన సేవలు అందించటానికే ఈ పెరుగుదల అని, ట్రాన్స్‌కో నష్టాల్లో వుందని, మొత్తం సరఫరా అవుతున్న విద్యుత్‌లో 41 శాతానికే మీటరింగ్ అవుతుందని, విద్యుత్ పంపిణీ ప్రసార నష్టాలు 38 శాతం వున్నాయని, విద్యుత్ చౌర్యం అధికంగా కూడా వుందని, రైతాంగానికి కారుచౌకగా విద్యుత్ సప్లయ్ చేస్తున్నామని, వీటివల్ల ట్రాన్స్‌కో తీవ్రమైన ఆర్థికలోటులో వుందని, ఈ సం॥రం ట్రాన్స్‌కో మొత్తం ఆర్థికలోటు 2918 కోట్ల రూపాయలని చూయిస్తున్నారు. దానిలో 1626 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుందనీ, మరో 500 కోట్లు ట్రాన్స్‌కో తన అంతర్గత సామర్థ్యాన్ని పెంచుకోవటంద్వారా (ప్రసార పంపిణీ నష్టాలని తగ్గించుకోవడం, బిల్లింగ్ పెంచడం) సాధిస్తుందని, మిగిలిన వ్యత్యాసం మేరకే 840 కోట్ల రూపాయల విద్యుత్ ఛార్జీలు పెంచామని చెప్పటం మొదలు పెట్టారు. ఇంకా, పెంచిన ఛార్జీలవల్ల సామాన్యుల మీద భారం పడటంలేదని, ప్రజలు కోరుకున్నట్లుగా నాన్ టెలిస్కోపిక్ విధానం నుండి టెలిస్కోపిక్ విధానంగా మార్చామని, 1996 నుండి గృహ వినియోగదారులపై ఛార్జీలు పెంచలేదని; మొ॥నవి చెప్తూ, ప్రజలపై భారం లేదని కూడా నమ్మించటానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు.

అయితే, ప్రజలు, వివిధ రాజకీయ పార్టీలు ట్రాన్స్‌కో అసమర్థతకు ప్రజలకా శిక్ష? అని నిలదీయటం ప్రారంభించారు. విద్యుత్ ప్రసార పంపిణీ నష్టాలు అరికట్టే చర్యలు, విద్యుత్ చౌర్యం

అరికట్టే చర్యలు తీసుకోకుండా, విద్యుత్ మీటరింగ్ పెరిగే చర్యలు చేపట్టకుండా, ఛార్జీలు పెంచడం సరైంది కాదు. అందువల్ల పెంచిన ఛార్జీలు తగ్గించమని డిమాండ్ చేయటం మొదలుపెట్టారు. అంతేకాకుండా, ట్రాన్స్‌కోకు రావలసిన బకాయిలే 1400 కోట్ల పై చిలుకు వుంది అని చెప్తున్నారు కాబట్టి, ఆ బాకీలు వసూలు చేసుకొని, ఈ లోటును పూడ్చుకోక, ప్రజలనెత్తిన ఈ భారం వేయటం ఏమిటనీ ఇలా వివిధ రకాల హేతుబద్ధ ప్రశ్నలు వేయడం మొదలుపెట్టారు.

ఇలా ప్రశ్నలు సంధించిన వాళ్ళలో కేవలం రాజకీయ పక్షాలవాళ్ళే కాకుండా, పాలకవర్గాలచే 'తీవ్రవాదులనే' (తిట్టు) పేరుతో పిలవ బడుతున్న మార్క్సిస్ట్-లెనినిస్ట్ పార్టీల వాళ్ళేగాక, సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం, వివిధ వర్తక వాణిజ్య వర్గాలు, అవే కాకుండా, '99 అసెంబ్లీ ఎన్నికల ముందు మధ్యతరగతి వర్గాన్ని ఆకట్టు కోవటం కొరకు చంద్రబాబు, అతని సలహాదారులచే ముద్దుగా పేరుపెట్టబడ్డ 'న్యూట్రల్స్' అనే వివిధ రంగాలలోని ప్రముఖులతో సహా అనేకమంది వున్నారు. ఈ ప్రశ్నలకు వేటికీ సూటిగా సమాధానం ఇవ్వకుండా, రాష్ట్రఅభివృద్ధి కోసమే ఈ ఛార్జీలు పెంచవలసి వచ్చిందని, మరింతగా ఛార్జీలు తగ్గించమనడం అంటే, రాష్ట్రాన్ని అంధకారంలో ముంచే అభివృద్ధి నిరోధక చర్యేనని, ఛార్జీలు తగ్గించటం ఏమాత్రం కుదరదని ఎదురుదాడికి దిగాడు చంద్రబాబు.

ప్రజలకోసం తన ప్రాణాలు ఇవ్వటానికైనా సిద్ధంగా వున్నానని, సందర్భం వచ్చినపుడల్లా గంభీర ప్రకటనలు చేస్తున్న చంద్రబాబు, ప్రజలందరూ కోరుకుంటున్న విద్యుత్ ఛార్జీలు తగ్గించే విషయంలో మాత్రం ఎందుకు ఇట్లా ససేమిరా అంటున్నాడు? ట్రాన్స్‌కో పనితీరును మెరుగుపరిచి, విద్యుత్ చౌర్యాన్ని అరికట్టి, అప్పులు వసూలు చేసుకునే పనికి మారుగా, ఛార్జీలు పెంచటానికే ఎందుకు కంకణం కట్టుకున్నాడు?

ఇవాళ, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలనే డిమాండ్ చేసేటపుడు, విద్యుత్ ఛార్జీల పెరుగుదలకు అసలు కారణాలను పరిశీలించటం చాలా అవసరం.

1991లో పి.వి. నరసింహారావు ప్రధానిగా కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రాగానే, ప్రపంచబ్యాంక్ మాజీ అధికారి మన్మోహన్‌సింగ్‌ను ఆర్థికమంత్రిగా (కాంగ్రెస్‌లో పావలా సభ్యత్వం కూడా లేకపోయినా) తీసుకుని, నూతన ఆర్థిక విధానాలను మొదలుపెట్టాడు. ముఖ్యంగా అమెరికా కనుసన్నలలో మెలిగే ప్రపంచబ్యాంక్, దివాలా తీసిన భారత ఆర్థిక వ్యవస్థ (దివాలా తీయించటంలో ఆ మహానుభావులకేం సంబంధం లేనట్లుగా) పునర్నిర్మాణం పేరున 'సంస్కరణలు' ప్రవేశ పెట్టించింది. ప్రైవేట్‌రంగాన్ని పెంచడం, ప్రభుత్వ రంగాన్ని కుదించడం, రెవెన్యూలోటును తగ్గించే పేరుమీద సంక్షేమ పథకాలపై ప్రభుత్వం చేసే ఖర్చును కుంచింప చేయడం, వ్యవసాయరంగాన్ని ఆహార పంటలనుంచి వాణిజ్య పంటలవైపు మళ్ళించడం, తద్వారా దేశ ఆహార భద్రతను దెబ్బతీసి, తిండిగింజల కొరకు విదేశాలమీద ఆధారపడేలా చేయటం, ప్రజాధనంతో ఏర్పాటు చేసిన వందల, వేల కోట్ల రూపాయల ప్రభుత్వరంగ సంస్థలన్నిటినీ బహుళజాతి (సామ్రాజ్యవాద) సంస్థలపరం చేస్తూ, ఇక్కడి వనరులు, సంపద కొల్లగొట్టుకెళ్ళే రాచమార్గం వేయటం మొ॥నవి ప్రపంచబ్యాంక్ సంస్కరణల లక్ష్యాలు. ఆ 'సంస్కరణలు' దేశాభివృద్ధి కోసమేనని ప్రజల్ని నమ్మించటానికి '91 ప్రాంతంలో పి.వి. నరసింహారావు ఎప్పుడూ ఒకే మాట వల్లించేవాడు. 'మరో మార్గం లేదు' అని అంటే, ఈ దేశం అభివృద్ధి కావాలంటే, వేల కోట్ల పెట్టుబడులు అవసరం. అవి మన దగ్గర లేవు కాబట్టి, సంస్కరణలు అవసరం, 'మరో మార్గం లేదు' అన్నది. ఇవాళ చంద్రబాబు నోట కూడా ఈ మాట తప్ప మరోమాట రావటం లేదు. ప్రపంచబ్యాంక్ బడితొత్తులుగా మారినవాళ్ళు ఎవరైనా ఇదే మాట మాట్లాడతారు మరి!

1991-96 మధ్య దేశంలో రాజకీయ సంక్షోభం మరింతగా ముదిరి, ఏ పార్టీ తనంతట తానుగా స్వంత బలంతో కేంద్రంలో అధికారంలోకి రాలేని స్థితి ఏర్పడింది. సంకీర్ణ ప్రభుత్వాలు, మూణ్ణాళ్ళ ప్రభుత్వాలు కావటం వలన, ప్రాంతీయ పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతూ, కేంద్రంలో 'బలహీనమైన' ప్రభుత్వాలు ఏర్పడటంతో, ప్రపంచబ్యాంక్ సంస్కరణల అమలు నల్లేరుమీద బండిలా సాగని పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే, అప్పటిదాకా ప్రపంచబ్యాంక్ కేంద్రం ద్వారా సంస్కరణలను ఆయా రాష్ట్రాలలో అమలు చేయిస్తుంది. కానీ, కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాల మనుగడ, ఆయా రాష్ట్రాలలోని 'ప్రాంతీయ' పార్టీల ప్రభుత్వాల మీద ఆధారపడటంవలన, గతంలోలాగా కేంద్రం రాష్ట్రాలను 'శాసించి' అమలు చేయగలిగే పరిస్థితి లేకుండా పోయింది. అందువలన, తన పథకాలు, సంస్కరణలు అమలు చేయవలసింది రాష్ట్రాలు కావటంతో, ఆ రాష్ట్రాలతోనే నేరుగా సంబంధాలు పెట్టుకుని, అప్పులివ్వటం ద్వారా తన పథకాల్ని అమలు చేయబూనుకుంది ప్రపంచబ్యాంక్. అలా ప్రపంచబ్యాంక్‌కు నమ్మినబంటుగా చంద్రబాబు దొరికాడు. అప్పటికి, 1995 ఆగస్టులో మామ ఎన్టీఆర్‌ను కుట్రతో పడదోసి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాడు. అప్పటిదాకా రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల విధానాల కారణంగానే రాష్ట్రంలో అన్నిరంగాలు సంక్షోభంలో వున్నాయి. ప్రత్యేకించి, విద్యుత్ విషయానికొస్తే, ఎండాకాలం వచ్చిందంటే కరెంట్‌కోత, ఎప్పుడూ లోవోల్టేజీ, హైవోల్టేజీ సమస్యలు. ఈ సమస్యల నుండి, ఇతర సమస్యల నుండి ప్రజలను గట్టెక్కించడానికి అనే పేరుతో ప్రపంచబ్యాంక్ చంకనెక్కాడు. రాష్ట్రంలో ఇక ప్రపంచబ్యాంక్ సంస్కరణల ఊపు అందుకుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రజలకు వివరించే పేరుతో '96లో రకారకాల శ్వేతపత్రాలు ప్రకటించాడు. వాటి కొనసాగింపుగా సబ్సిడీ తగ్గించి బియ్యంధర పెంచాడు. విద్యుత్ ఛార్జీలు పెంచాడు. నీటి తీరువా రేటు పెంచాడు. కాదన్నవాళ్ళని కాల్దారిలో కాల్చి చంపాడు. ప్రజల పోరాట ఫలితమైన మద్య నిషేధానికి గండికొట్టి, దాన్ని సడలించాడు. (పాక్షికం అన్నది బూటకమే, బార్లు, సారాయి అంగళ్ళు లేవు కానీ, వీధి వీధికీ బ్రాందీ షాపులు, చీప్‌లిక్కర్ అమ్మకాలు ఏర్పాటు చేశాడు). ఇవన్నీ ప్రపంచబ్యాంక్ షరతులకు అనుగుణంగా చేసినవే. అలాగే విద్యుత్ రంగ సంస్కరణలకు పూనుకున్నాడు. అందుకోసం ఒక శ్వేతపత్రం ప్రకటించాడు.

**కుక్కను చంపాలనుకున్నప్పుడు దానికి పిచ్చికుక్కని పేరుపెట్టు!**

200 ఏళ్ళపాటు దేశాన్ని దోచుకెళ్ళిన బ్రిటీష్‌వాడి సూక్తి ఇది. మంచికుక్కను ఉత్తి పుణ్యానికే చంపితే ఎవరూ హర్షించరు కాబట్టి, దానికి పిచ్చికుక్కని పేరుపెట్టి చంపటం తేలిక. వీలయితే ఆ ప్రజలచేత నాలుగు రాళ్ళు కూడా వేయించవచ్చు. 'విద్యుత్ బోర్డు' పట్ల చంద్రబాబు ప్రభుత్వం సరిగ్గా ఇదే విధానం అవలంభించింది.

రాష్ట్రంలో విద్యుత్ కొరతకు, లోవోల్టేజి, హైఓల్టేజి సమస్యలతో ఇళ్ళల్లో బల్బులు, ఇతర గృహోపయోగ వస్తువులు కాలిపోవడానికి, రైతాంగం మోటార్లు కాలిపోవడానికి, విద్యుత్‌బోర్డు నిర్వాకం, నాసిరకం సేవలేనని సగటు ప్రజల్లో వున్న భావనని, శ్వేతపత్రంలో, మరింత బలంగా చూయించింది.

విద్యుత్ బోర్డు పనితీరు బాగా లేదని, అది ప్రజలకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేయలేక పోతూందని, నాణ్యమైన సేవలు (లో ఓల్టేజి, హై ఓల్టేజి సమస్య లేకుండా) అదించలేక పోతూందని, అది ఇప్పుడు అప్పుల్లో వుండి, దివాళా దిశలో వుందనీ, అది వట్టి పనికిమాలినది అయిపోయిందనీ తేల్చి చెప్పింది. ఇదే పద్ధతి కొనసాగితే రాష్ట్రం అంధకార బంధురం అవుతుంది, విద్యుత్ లేకపోతే కొత్త పరిశ్రమలు రావు, వున్న పరిశ్రమలు తరలి పోతాయి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది. కావున చెప్పొచ్చేదేమిటంటే, విద్యుత్‌రంగంను మెరుగుపరచాలంటే సంస్కరణలు అవసరం అని.

ప్రపంచబ్యాంక్ 'ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణ పథకం' పేరుతో ప్రకటించిన నివేదికకు నకలే ఈ శ్వేత పత్రాలు.

వాస్తవానికి విద్యుత్‌బోర్డు నష్టాలకి, దాని నాసిరకం సేవలకు అసలు కారణం ప్రభుత్వమే. ఇప్పటిదాకా రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలే. (కాంగ్రెస్ హయాంలో కూడా చంద్రబాబు మంత్రిగా చేసాడన్నది దృష్టిలో వుంచుకోవాలి).

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 1961లో విద్యుత్‌బోర్డు ఏర్పడింది. రాష్ట్రంలో జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తి, ప్రసార పంపిణీలు మొత్తం బోర్డు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. బోర్డు పనితీరుకు వస్తే, దేశంలోని మిగతా రాష్ట్రాలలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకంటే, రాష్ట్రంలోని బోర్డు అధీనంలోని ఉత్పత్తి కేంద్రాలు మెరుగైన పనితీరును కనపరుస్తూ, ప్రతి ఏటా అవార్డులు అందుకుంటున్నాయి. ఇంకా ఇతర విషయాలలో కూడా బోర్డు పనితీరు బాగుంది అని హితేన్‌భయ్యా నివేదిక కూడా చెప్పింది. తను ఉత్పత్తి చేస్తున్న విద్యుత్‌లో బోర్డు రాష్ట్రంలోని వ్యవసాయానికి, కొన్ని సెక్షన్ల గృహ వినియోగదారులకు ఉత్పత్తికంటే తక్కువ ధరకు, సబ్సిడీతో సరఫరా చేస్తుంది. అలాగే, మైనరు పంచాయితీల వీధిలైట్లకు, మంచినీటి సరఫరాకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తుంది. అలాగే పురపాలక సంస్థలకు కూడా తక్కువ ధరకు విద్యుత్‌ను అందిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం విధానాల ప్రకారం బోర్డు ఈ సబ్సిడీలు ఇస్తుంది. అయితే, విద్యుత్‌బోర్డు ఎంతైతే సబ్సిడీ ఇస్తుందో, అంత మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం బోర్డుకు తిరిగి ఇవ్వాలి. అలా ఇస్తే, బోర్డు నష్టాలలో పడదు. ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం తాను ఇవ్వాల్సిన మొత్తాన్ని ఇవ్వకుండా కోత పెట్టి, బోర్డు నష్టాలకు కారణమవుతూంది. ఇది ఒక అంశం కాగా, విద్యుత్ బోర్డులకు కేటాయించే ప్రణాళికా వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు క్రమక్రమంగా తగ్గించుకుంటూ వస్తున్నాయి. దాంతో పెరుగుతున్న అవసరాలకు సరిపడినంత విద్యుత్ ఉత్పత్తిని చేపట్టలేక పోయింది. అలాగే ప్రసార, పంపిణీ వ్యవస్థలను (తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు) మెరుగుపరచు కోవటానికి తగిన నిధులు కేటాయించక పోవటం వలన, ప్రసార పంపిణీ నష్టాలు పెరగటమేకాక, లోఓల్టేజి, హైఓల్టేజి సమస్యలతో వినియోగదారులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

బోర్డులో అవినీతి, మిగతా సమస్యలున్నా, విద్యుత్‌బోర్డు నష్టాలకి, విద్యుత్ కోతకి, ప్రసార పంపిణీ నష్టాలకి, లోఓల్టేజి, హైఓల్టేజి సమస్యలకి ప్రధానమైన కారణం ఇది. ఈ కారణాలను మరుగుపరచి, 'కేవలం బోర్డుని' దోషిగా నిలబెట్టి, ప్రపంచబ్యాంక్‌తో మిలాఖత్ అయిన చంద్రబాబు, హితేన్‌భయ్యా నివేదిక పేరుతో విద్యుత్ సంస్కరణలకు పూనుకున్నాడు.

## ప్రపంచబ్యాంక్ షరతులే 'హితేన్ భయ్యా' నివేదిక!

ప్రపంచబ్యాంక్ పథకాలని, అది విధించే షరతులను రాష్ట్రంలో నేరుగా అమలుచేస్తే, చంద్రబాబు ప్రపంచబ్యాంక్ తొత్తుగా వ్యవహరిస్తున్నాడని మామూలు ప్రజలకు కూడా అర్థమవుతుంది కాబట్టి, తను ప్రపంచబ్యాంక్, సామ్రాజ్యవాదులకు చేస్తున్న గులాంగిరీని కప్పిపుచ్చుకోవటానికి, సంస్కరణలు 'మేడ్ ఇన్ అమెరికా, మేడ్ ఇన్ వరల్డ్‌బ్యాంక్' కాదు, 'మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఆంధ్రా' అని రాష్ట్రాభివృద్ధి కోసమే చంద్రబాబు ఇవన్నీ చేస్తున్నాడు అని ప్రజల్ని నమ్మించటానికని, '95లో చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే వివిధ రంగాల సమస్యలను పరిశీలించి, వాటిని మెరుగుపరచటం కోసం, 'చేపట్టవలసిన సంస్కరణలు' సూచించటానికని వివిధ కమిటీలు వేశాడు. (ఆ కమిటీలన్నీ తేల్చిన విషయం, ఆయా రంగాలని ప్రైవేట్‌పరం చేయమనే!) వాటిల్లో విద్యుత్‌రంగంపై వేసిన కమిటీ 'హితన్ భయ్యా' కమిటీ.

### హితన్ భయ్యా కమిటీ సూచనలు:

1. విద్యుత్ బోర్డుని 3గా విభజించాలి. అవి 1. ఉత్పత్తి, 2. ప్రసార, 3. పంపిణీ వ్యవస్థలుగా.
2. ధరల నియంత్రణకి, విధాన నిర్ణయాలకి రెగ్యులేటరీ కమీషన్‌ని నియమించాలి. ఇది స్వతంత్ర ప్రతిపత్తిని కలిగి వుండాలి. ప్రభుత్వ జోక్యం అసలు ఉండరాదు.
3. 2002 తర్వాత పంపిణీ ప్రైవేట్‌పరం చేయాలి.
4. క్రాస్ సబ్సిడీలు తగ్గించాలి. విద్యుత్ రేట్లను హేతుబద్ధం చేయాలి. వాస్తవానికి ఇవి,

### ప్రపంచబ్యాంక్ షరతులు

1. విద్యుత్ బోర్డును పునర్వ్యవస్థీకరించాలి. అంటే దాన్ని మూడుగా విడగొట్టాలి.
   ఎ. ఆంధ్రప్రదేశ్ జనరేషన్ కార్పొరేషన్ (ఏ.పి. జెన్‌కో)
   బి. ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏ.పి. ట్రాన్స్‌కో)
   సి. ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిబ్యూటరీ కార్పొరేషన్ (ఏ.పి. డిస్కం)
2. విద్యుత్ ఉత్పత్తి, ప్రసార పంపిణీలను ప్రైవేట్‌పరం చేయాలి.
3. వ్యవసాయ రంగానికిస్తున్న సబ్సిడీలను ఎత్తివేయాలి. మొత్తంగా సబ్సిడీలను, క్రాస్ సబ్సిడీలను ఎత్తివేయాలి.
4. సంస్కరణలు మొదలుపెట్టిన తర్వాత, మొదటి మూడు సంవత్సరాలు సం॥రానికి 15శాతం చొప్పున విద్యుత్ ఛార్జీలు పెంచాలి. ఆపై ప్రతి ఏటా 12శాతం చొప్పున పెంచాలి.

2007 నాటికి పూర్తిగా సబ్సిడీలు ఎత్తివేసి, విద్యుత్ ఉత్పాదన ఖర్చును వినియోగదారుల నుండి రాబట్టాలి.

ప్రపంచబ్యాంక్ షరతులకి, హితేన్ భయ్యా సూచనలకి తేడా ఏమైనా వుందా? కానీ, తాను అమలు చేస్తున్న 'సంస్కరణలకి' ప్రపంచబ్యాంక్ షరతులు కారణం కాదని నమ్మమంటున్నాడు చంద్రబాబు. అలా నమ్మించటానికే హితేన్ భయ్యా నివేదిక!

నివేదిక వచ్చిన నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదన 6110 మెగావాట్లు. రాష్ట్రం అభివృద్ధి కావాలంటే, ప్రజలకి మెరుగైన విద్యుత్ సేవలు అందాలంటే, 2002 నాటికి రాష్ట్రంలో మరో 8 వేల మెగావాట్ల అదనపు విద్యుత్ అవసరం అని హితేన్‌భయ్యా కమిటీ అంచనా వేసింది. అందుకోసం 50 వేల కోట్ల రూ॥ల పెట్టుబడి (విద్యుత్ ఉత్పాదన కోసం 32 వేల కోట్లు, ప్రసార పంపిణీ వ్యవస్థ కోసం 18వేల కోట్ల రూ॥లు) అవసరం అని చెప్పింది. అంత పెట్టుబడి విద్యుత్‌బోర్డు దగ్గరకానీ, ప్రభుత్వం దగ్గరకానీ లేవు కాబట్టి, విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయమని, అలా చేసి పెట్టుబడులను ఆకర్షించక పోతే, ఆంధ్ర రాష్ట్రానికి అంధకారమే మిగులుతుందని హెచ్చరించింది. అప్పటిదాకా విద్యుత్ ఉత్పత్తి ప్రభుత్వ రంగంలోనే ఉన్నదన్న విషయాన్ని గమనంలో వుంచుకుని, మామూలుగా ఆలోచిస్తే, 'అమ్మ పెట్టా పెట్టక, అడుక్కు తిననివ్వక' అన్నట్లు, రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితి ఘోరంగా వుంటే, ప్రజలకి అవసరమైన విద్యుత్‌ను ప్రభుత్వం ఉత్పత్తి చేసి, సరఫరా చేయలేని స్థితి వుంటే, దాని దగ్గర అంత డబ్బు లేనప్పుడు, విద్యుత్ ఉత్పత్తిని ప్రైవేట్ పెట్టుబడిదారులకు ఇవ్వటంలో తప్పు ఏముందనిపిస్తుంది! ప్రజల్ని నమ్మించటానికి ఇలా అతి అంచనాలు, అబద్ధాలు చెప్పి (ఎందుకంటే ఇప్పుడు చంద్రబాబే 2002 నాటికి అదనంగా 1500 మెగావాట్లు విద్యుత్ చాలు అని చెప్తున్నాడు). ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించటానికి 'మరో మార్గం' లేదు అనే పేరుతో చంద్రబాబు ప్రపంచబ్యాంక్ షరతుల ప్రకారం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయబూను కున్నాడు. విద్యుత్ సంస్కరణల అమలు మొదలు పెట్టాడు.

**సంస్కరణలకు అంకురార్పణం జరిగిన నాడే విద్యుత్ ఛార్జీల పెంపుకు ముహూర్తం నిర్ణయించబడింది!**

విద్యుత్ రంగం అన్నది, దేశాభివృద్ధిలో కీలకమైన రంగం అని భావించి, విద్యుత్‌రంగం ఇప్పటిదాకా ప్రభుత్వ అధీనంలోనే వుంది. ఉత్పత్తి అంతా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని విద్యుత్ బోర్డులు, కేంద్ర ప్రభుత్వ అధీనంలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పోరేషన్ లాంటి సంస్థలు చేస్తున్నాయి. కొన్ని ప్రైవేట్ పారిశ్రామిక సంస్థలు సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని, తమ అవసరాలకు వినియోగించుకునే అవకాశం వుంది కానీ (దీనినే క్యాప్టివ్ జనరేషన్ అంటున్నారు), అమ్మకం కొరకు ఉత్పత్తి చేసే వీలు లేదు. ఒకవేళ, వాళ్ళు ఉత్పత్తి చేసిన దాంట్లో మిగులు వుంటే, అది అక్కడి విద్యుత్ బోర్డులకి ఇవ్వాల్సిందే!

ఒకప్పుడు ఆహార ధాన్యాల కొరతతో వున్న దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తి విషయంలో స్వయంసమృద్ధి కావటానికి విద్యుత్ ఎంతో దోహదపడింది. వ్యవసాయానికి అందించే విద్యుత్‌లో జాతి ప్రయోజనాలు ఇమిడి వున్నాయి కాబట్టే, వ్యవసాయ రంగానికి విద్యుత్ సబ్సిడీ ఇవ్వటం అన్నది దేశ ప్రయోజనాల రీత్యా ఎంతో అవసరమైనది. అందుకోసమే ఇప్పటిదాకా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, ఇంకా ఇతర సామాన్య గృహ వినియోగదారులు వినియోగించే విద్యుత్‌ను సబ్సిడీ రేట్లకు ఇస్తుంది. సబ్సిడీ మొత్తం తనే భరించటం కాకుండా, అందుకోసం క్రాస్ సబ్సిడీ విధానం అమలు చేస్తుంది. (అంటే, పెద్ద పరిశ్రమలు, ఉన్నత ఆదాయ వర్గాల వద్ద విద్యుత్ ఛార్జీలు ఎక్కువ వసూలు చేసి, దాన్ని ఇక్కడ సర్దడం). అలాగే,, సేవారంగం అన్న దృష్టితో, బోర్డులను 3శాతం కంటే లాభాలు వేసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నియంత్రిస్తుంది.

ఇప్పటిదాకా ప్రభుత్వరంగంలో ఇది వున్నది కాబట్టి, ప్రజలకు ఈ సౌకర్యాలు కల్పించాల్సిన సామాజిక బాధ్యత ప్రభుత్వానికి వుంది కాబట్టి, ఈ మేరకైనా ప్రస్తుతం గుడ్డిలో మెల్లగా అవి అమలవుతున్నాయి.

ఇక్కడ ముఖ్యమైన విషయం, ఇప్పుడు సంస్కరణల పేరుతో, ప్రభుత్వం ప్రజలపట్ల తనకున్న సామాజిక బాధ్యతను వదిలించుకుంటుంది. ఇక పెట్టుబడిదారులకు సామాజిక బాధ్యత ఏముంది? అందినకాడికి లాభాలు గుంజటమే వాళ్ళ లక్ష్యం!

అందువలన, సంస్కరణల బాట ఎప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందో, అప్పుడే విద్యుత్ ఛార్జీలు పెరగటానికి బీజాలు పడినాయి. ఏ రంగంలో పెట్టుబడి పెట్టినా పెట్టుబడిదారుడు లాభాల కోసమే పెడ్తాడు. ఇక ప్రభుత్వమే ''పెట్టుబడులు పెట్టడానికి మా రాష్ట్రం మంచి అనువుగా వుంటుంది.'' అని దేశ విదేశాలు తిరుగుతూ, పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్న నేటి స్థితిలో, ఇక్కడ లాభాలు గ్యారంటీ వున్నాయి అని పెట్టుబడిదారులకు విశ్వసనీయత కల్గించటం కొరకు విద్యుత్ ఛార్జీలు పెంచటం అవసరం మరి. విద్యుత్ కొనుగోళ్ళ ఒప్పందాలు అందుకు ప్రబల సాక్ష్యం.

**విద్యుత్ ఛార్జీల పెంపుకు రహదారి వేయటమే విద్యుత్ కొనుగోళ్ళ ఒప్పందాలు!!**

ప్రపంచబ్యాంక్ షరతుల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలకు లైసెన్స్‌లు ఇచ్చి ఎడాపెడా విద్యుత్ కొనుగోళ్ళ ఒప్పందాలు చేసుకుంది. ఒప్పందాలను చూస్తే, ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం ఛార్జీలను ఎవరికోసం పెంచిందో అర్థం చేసుకోవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న ప్రైవేట్ కంపెనీలన్నీ పెట్టుబడి ఖర్చులని విపరీతంగా చూపించాయి.

1. కంబైన్డ్ సైకిల్ గ్యాస్ ఆధారంగా, ఒక మెగా వాట్ విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వ సంస్థ ఆంధ్రప్రదేశ్ పవర్ కార్పోరేషన్ 2.73 కోట్లు చూపగా,

   ప్రైవేట్ సంస్థ జి.వి.కె. ఇండస్ట్రీస్ 4.75 కోట్లు చూపింది.

2. బొగ్గు ఆధారంతో ఒక మెగా వాట్ విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వరంగ సంస్థ అయిన సింహాద్రి పవర్ ప్రాజెక్ట్ 4.18 కోట్లు చూపితే, బహుళజాతి సంస్థ హిందూజా 6 కోట్లు చూపింది.

మారు మాట్లాడకుండా రాష్ట్ర ప్రభుత్వం వీటితో ఒప్పందం చేసుకుంది. అంతేకాదు, 'మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి కావలసిన యంత్రాలను సగటున 2 కోట్ల రూపాయల చొప్పున ఉత్పత్తి చేసి, ప్రాజెక్టు నిర్మిస్తాము, ఆ అవకాశం మాకివ్వండి' అని, ప్రభుత్వరంగ సంస్థ బి.హెచ్.ఇ.యల్. అడిగితే, ఆ స్వదేశీ సంస్థ గొంతు

నులుముతూ, విదేశీ కంపెనీలకు 4 కోట్లకు ఇచ్చారు. (విదేశీ సంస్థల దగ్గర యంత్రాలు కొనాలన్నది ప్రపంచబ్యాంక్ షరతులలో భాగం మరి. అంతేకాదు, బహుళజాతి సంస్థలు విదేశాలలో తయారు చేస్తున్న యంత్రాలకు మార్కెట్ సృష్టించటం, అందుకు తక్కువ వడ్డీకి అప్పు పేరుతో ప్రపంచబ్యాంక్ దళారీగా పనిచేయటమే ఇందులోని మతలబు. అలా, ఒక్క యూనిట్ విద్యుత్ కూడా ఉత్పత్తి చేయకుండానే, స్థాపక వ్యయాన్ని ఎక్కువ చూపి, లాభాలు కొట్టేశారు. వాళ్ళు పెట్టే పెట్టుబడిమీద ప్రభుత్వం 16 శాతం లాభాలకు గ్యారంటీ కూడా ఇచ్చింది. పెట్టుబడి ఎక్కువ చూపటం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వ్యయం ఎక్కువ చూపవచ్చును. దానిమీద 16శాతం లాభాలు కూడా వేసుకుని, విద్యుత్‌ను మరింత ఎక్కువ ధరకు అమ్ముకొనవచ్చును. విద్యుత్‌బోర్డులని మొత్తం పెట్టుబడిమీద 3శాతంకి మించి లాభాలు వేసుకోకుండా నియంత్రిస్తున్న ప్రభుత్వం (అలా నియంత్రిస్తుంటే ఇలా వున్న ధరలు), ఇపుడు ప్రైవేట్ కంపెనీలకు ఏకంగా 16 శాతం లాభాలకు గ్యారంటీ ఇస్తున్నపుడు, విద్యుత్ ఛార్జీలకు కోరలూ, కొమ్మలూ రావా? అందుకనే, విద్యుత్‌బోర్డు ఒక యూనిట్‌ను 1.20 పైసల చొప్పున ఉత్పత్తి చేస్తుంటే, ప్రైవేట్ కంపెనీలతో ఒక యూనిట్ 3 నుండి 7 రూ॥ల వరకు కొనేటట్లుగా ఒప్పందం చేసుకుంది. అంతేకాకుండా ప్రభుత్వం కౌంటర్ గ్యారంటీ కూడా ఇచ్చింది. కౌంటర్ గ్యారంటీ అంటే, ప్రైవేట్ విద్యుత్ సంస్థలు ఉత్పత్తి చేసే విద్యుత్ మొత్తాన్ని కొంటామన్న హామీ (మనకు అవసరం వున్నా లేకపోయినా కొనాల్సిందే!). విద్యుత్ కొనుగోలు (పి.ఏ.పి. - పవర్ పర్చేజ్ రేట్ అగ్రిమెంట్స్) ఒప్పందాల్ని ఎక్కువ ధరకు చేసుకుని, విద్యుత్ ఉత్పత్తి ఖర్చులు పెరిగినాయి కాబట్టి ఛార్జీలు పెరుగుతున్నాయి అని ప్రభుత్వం చెప్తున్నదంతా, ప్రజల్ని మోసం చేసి, ప్రైవేట్ పెట్టుబడిదారుల జేబులు నింపే పనిలో భాగమే.

## విద్యుత్ ప్రసార, పంపిణీ నష్టాల ఎక్కువ చూపించటమూ ప్రపంచబ్యాంక్ కుట్రలో భాగమే!

విద్యుత్ సంస్కరణల అమలులో భాగంగా, విద్యుత్ ఉత్పత్తిని ప్రైవేట్‌పరం చేయటంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం 1998 ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల చట్టం తీసుకువచ్చింది.

1999 ఫిబ్రవరిలో ముందుగా జెన్‌కో, ట్రాన్స్ కోలుగా విభజించారు. 2000 ఏప్రిల్‌లో రాష్ట్రం మొత్తాన్ని నాలుగు భాగాలుగా విభజించి, 4 డిస్ట్రిబ్యూటరీ (పంపిణీ) కంపెనీలు ఏర్పాటు చేశారు. ఇందులో ట్రాన్స్‌కోది కీలకపాత్ర. విద్యుత్‌ను కొనటం, దాన్ని సరఫరా చేయటం దాని పని.

ఇవాళ విద్యుత్ ఛార్జీలు పెరిగిన దానికి ట్రాన్స్‌కో అనేక కారణాలు చెప్తుంది. వాటిల్లో ముఖ్యమైంది, ట్రాన్స్‌కో కొని, సరఫరా చేస్తున్న మొత్తం విద్యుత్‌లో కేవలం 41శాతం విద్యుత్‌కి మాత్రమే మీటరింగ్ (లెక్కతీసి బిల్లులు ఇవ్వడం) అవుతుందని, మిగిలిన 59 శాతం విద్యుత్‌లో 38 శాతం ప్రసార పంపిణీ నష్టాలకు గురవుతుందని, మిగిలినదాంట్లో వ్యవసాయ రంగానికి, విద్యుత్ చౌర్యంకు పోతున్నాయని, అలా ట్రాన్స్‌కోకు తీవ్ర నష్టాలొస్తున్నాయి కాబట్టి, విద్యుత్ ఛార్జీలు పెంచాల్సి వచ్చిందని చెప్తున్నది. (విద్యుత్‌ను ఉత్పత్తి కేంద్రాల నుండి వినియోగదారులకి విద్యుత్ తీగల ద్వారా సరఫరా చేసే క్రమంలో కొంత విద్యుత్ ఆవిరై పోతుంది, దీన్నే ప్రసార పంపిణీ నష్టం అంటున్నారు) రాష్ట్ర ప్రభుత్వం ప్రసార పంపిణీ నష్టాలను 1996లో ప్రకటించిన శ్వేతపత్రంలో 19శాతం చూపింది. '1998-99లో 31 శాతం చూపింది. 'మెరుగైన సేవల కోసమే' ట్రాన్స్‌కో ఏర్పాటు అయిన సంవత్సరం తర్వాత ఈ సంవత్సరం 1999-2000కి ప్రసార పంపిణీ నష్టాలను 38 శాతం చూపుతుంది. ఒక శాతం నష్టం అంటే 140 కోట్ల రూపాయలకు సమానం. ప్రసార పంపిణీ వ్యవస్థను మెరుగుపరచటానికి గత సంవత్సరం 400 కోట్లు ఖర్చు పెట్టానని చెప్తున్నది. అయినా, ట్రాన్స్‌కో, పనితీరు మెరుగుపడకపోగా, అదనంగా ఈ ఏడాది 7శాతం నష్టం అంటే 980 కోట్లు కేవలం ప్రసార పంపిణీల్లో నష్టం పెరిగిందని చెప్తున్నది. అంటే ఈ సంవత్సరం పెంచిన ఛార్జీలకంటే కూడా ఎక్కువ.

అయితే, దీన్ని కేవలం ట్రాన్స్‌కో 'అసమర్థతగా' భావిస్తే, దాని ఉచ్చులో మనం చిక్కుకున్నట్లే. ఎందుకంటే లెక్కల గారడీతోటి ప్రజలనెత్తిన వడ్డించటం ప్రభుత్వం ఒక కళగానే అమలు చేస్తుంది. '96లో ప్రకటించిన శ్వేతపత్రంలో విద్యుత్‌బోర్డు నష్టానికి అసలు కారణం, వ్యవసాయ రంగమేనని, 59 శాతం విద్యుత్ ఆ రంగానికే పోతుందని చెప్పి, భారీగా ఛార్జీలు పెంచారు. ఇప్పుడు ప్రసార పంపిణీ నష్టాలు పెరిగినాయి అని చెప్తున్నారు.

ప్రసార పంపిణీ నష్టాలను 1996లో 19 శాతం చూపి ఇపుడు 38 శాతం చూపటంలో అర్థం ఏమిటి? ఏమిటంటే, ప్రపంచబ్యాంక్ షరతులకనుగుణంగా, విద్యుత్ సంస్కరణల మలిదశలో భాగంగా ప్రసార పంపిణీ రంగాలను ప్రైవేట్‌పరం చేయవలసిన అవసరం వుంది. ప్రసార పంపిణీ రంగాల్లో ఎక్కువ శాతం నష్టం చూయించటం ద్వారా, ఆ నష్టాన్ని పూడ్చుకునే పేరుతో ఛార్జీలు పెంచుకోవచ్చు. అలా ఛార్జీలు పెంచుకుని అధిక లాభాలు ఆర్జించవచ్చు అని ప్రసార పంపిణీ రంగాల్లోకొచ్చే బహుళజాతి సంస్థలకు ఇక్కడ లాభాలపంట వుందని నమ్మకం కల్గించటానికే ఇదంతా. ఒరిస్సాలో సంస్కరణల అమలుకు ముందు 22 శాతంగా వున్న ప్రసార పంపిణీ నష్టాలు ఇవాళ 52 శాతం అయినవి ఇందుకే. అక్కడ ఇప్పటికే పంపిణీ రంగం ప్రైవేట్‌పరం అయింది. అందుకే, 'ట్రాన్స్‌కో 'అసమర్థతకు' మాకా శిక్ష? ట్రాన్స్‌కో ప్రసార పంపిణీ నష్టాలను తగ్గించుకొని, విద్యుత్ ఛార్జీలను పెంచకుండా చూడమని' కోరుతున్న ప్రజల విన్నపానికి చంద్రబాబు కానీ, ట్రాన్స్‌కోకానీ, రెగ్యులేటరీ కమీషన్ కానీ కిమ్మనటం లేదు.

## విద్యుత్ ఛార్జీల పెంపుదల ఒక 'ఫిక్సింగ్' వ్యవహారం

క్రికెట్ ఆటలో ఫిక్సింగ్ గురించి ఈ మధ్య చర్చ జోరుగా సాగుతోంది. ఆటలో ఫిక్సింగ్ అంటే, ఏ టీమ్ గెలవాలి? ఏ టీమ్ ఓడిపోవాలి? అన్న 'ఫలితం' ముందే నిర్ణయమైపోయి వుంటుంది. మైదానంలో జరిగే ఆట, ఒట్టి ఫార్సు. దాన్ని వేలంవెర్రిగా చూసే ప్రజల్ని వెర్రివాళ్ళను చేస్తూ, నడుస్తుందది. విద్యుత్ సంస్కరణల చట్టంలో భాగంగా 2000 ఏప్రిల్‌లో ఏర్పడిన రెగ్యులేటరీ కమీషన్ విద్యుత్ ఛార్జీలు ప్రకటించిన తీరు కూడా అంతకు తీసిపోదు.

విద్యుత్ ఛార్జీలను పెంచాలని కోరుతూ, ట్రాన్స్‌కో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపింది. దాన్ని మంత్రి వర్గ ఉపసంఘం చర్చించి, 807 కోట్ల మేరకు విద్యుత్ ఛార్జీలు పెంచుకోమంటూ, ట్రాన్స్‌కోకు తెల్పింది. అంటే, 15శాతం విద్యుత్ రేట్లు పెంచుకోమని. ట్రాన్స్‌కో 15శాతం విద్యుత్ ఛార్జీల పెంపుదలను

కోరుతూ విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్‌కు పంపింది. విద్యుత్ ఛార్జీలు పెంచే విషయమై, విద్యుత్ వినియోగదార్లతో, విద్యుత్ రెగ్యులేటరీ కమిటీ హైద్రాబాద్, తిరుపతి, విశాఖపట్నంలో సమావేశాలు నిర్వహించింది. విద్యుత్ ఛార్జీలు పెంచాల్సిన అవసరాన్ని అది చెప్పగా, ఆ సమావేశాల్లో పాల్గొన్న అందరూ, ఆ ప్రతిపాదనని వ్యతిరేకించారు. ప్రసార, పంపిణీ నష్టాలను తగ్గించుకునే చర్యలు చేపట్టకుండా అది ప్రజలమీద వేయటం సరికాదని చెప్పారు. విద్యుత్ చౌర్యం అరికట్టకుండా, అది నిజాయితీగా బిల్లులు చెల్లించే వాళ్ళమీద వేయడం కూడదన్నారు. ట్రాన్స్‌కోకు 1475 కోట్లు బకాయిలు రావలసి వున్నాయి అని, అవి వసూలు చేసుకుంటే, విద్యుత్ ఛార్జీలు పెంచే అవసరం లేదనీ చెప్పారు. రైతాంగానికి విద్యుత్ సబ్సిడీ తగ్గించి, విద్యుత్ ఛార్జీలు పెంచటమంటే, వాళ్ళను మరింతగా దివాళా తీయించి ఆత్మహత్యలకు పురికొల్పటమేనని చెప్పారు.

పారదర్శకత పేరుతో, ప్రజల అభిప్రాయాలు తీసుకునే పేరుతో, రెగ్యులేటరీ కమీషన్ నడిపింది కేవలం 'తతంగం' మాత్రమే అని తెలియజేస్తూ, విద్యుత్ ఛార్జీల పెంపుదల నిర్ణయం చేసింది. ట్రాన్స్‌కో 15 శాతం విద్యుత్ ఛార్జీలు పెంచమని కోరితే, రెగ్యులేటరీ కమీషన్ ఏకంగా 20 శాతం పెంచింది. 1100 కోట్ల మేరకు. ఈ ప్రకటన రాగానే రాష్ట్రంలో గగ్గోలు చెలరేగగానే, ముఖ్యమంత్రి చంద్రబాబు అమాయకంగా ముఖంపెట్టి, ఛార్జీలు ఇంత పెంచారా, నాకు తెలీదే అని మాట్లాడాడు. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకే ఈ రాష్ట్ర ప్రజలమీద వేసిన విద్యుత్ ఛార్జీల పెనుభారం తెలియకపోతే, ఎవరికి తెలిసినట్లు? ఇంతకీ, రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నది చంద్రబాబు కాదా!

రాష్ట్ర అసెంబ్లీ ఏర్పాటు చేసిన 'విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్' ఒక స్వతంత్ర సంస్థ అనీ, దాని నిర్ణయాన్ని మనం కాదనలేం అని చంద్రబాబు మాట్లాడుతున్నాడు. రాష్ట్ర ప్రజల్ని ఎడాపెడా బాదే రెగ్యులేటరీ కమీషన్‌ను ఏర్పాటు చేసింది చంద్రబాబు ప్రభుత్వమే అయినా, ఏర్పాటు చేయమన్నది ప్రపంచబ్యాంక్ అన్న విషయాన్ని దృ ష్టిలో పెట్టుకున్నపుడు, ప్రపంచబ్యాంక్ ఆదేశాలకు అనుగుణంగానే కమీషన్ ఛార్జీలు పెంచింది కాబట్టి, రెగ్యులేటరీ కమీషన్ నిర్ణయాన్ని మనం కాదనలేం అని చంద్రబాబు చెప్పకనే చెప్తున్నాడు. ఇక్కడ 'ఫిక్సింగ్' సూత్రధారి ప్రపంచబ్యాంక్. చంద్రబాబు, రెగ్యులేటరీ కమీషన్‌లు అది చెప్పినట్లల్లా ఆడే తోలుబొమ్మలు. అందుకనే, విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్ ఛార్జీలు 20 శాతం పెంచటం, చంద్రబాబు దానిలో 5శాతం సబ్సిడీ ఇచ్చి ప్రజల్ని ఆదుకున్నట్లు నటించడం అంతా ప్రజల్ని మభ్యపుచ్చడానికే! ప్రపంచబ్యాంక్ 'ఫిక్స్' చేసిన 15 శాతం ఛార్జీలు పెంచాలన్న దానికి, పీసమెత్తు కూడా తగ్గలేదు. కాబట్టే ఇక తగ్గించటం ససేమిరా కుదరదు అంటే కుదరదు అని తెగేసి చెప్తున్నాడు. విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకించే వాళ్ళను, రాష్ట్రాభివృద్ధి నిరోధకులుగా తిట్టిపోస్తున్నాడు. ఎవరెన్ని అడ్డుచెప్పినా, సంస్కరణలు కొనసాగిస్తానని ఘంటాపథంగా చెప్తున్నాడు.

**మిలిటెంట్ పోరాటాలకు సిద్ధపడటమే ప్రజలముందున్న కర్తవ్యం!**

విద్యుత్ ఛార్జీలు పెరగ్గానే గుండె బాదుకోని ప్రజానీకం లేదు. గుండె బాదుకున్నంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. రాష్ట్రంలో వివిధ పార్టీలన్నీ కూడా ఆందోళనలకు పిలుపునిస్తున్నాయి. అయితే ప్రజలు గమనించవలసిన విషయం ఒకటుంది. విద్యుత్ ఛార్జీలు పెరిగిన విషయాన్ని కేవలం 'ధరల పెంపు'గా చూస్తే, సమస్య లోతు అర్థం కాదు. ఈ ధరల పెంపు అన్నది ప్రపంచబ్యాంకు షరతు అన్న విషయం, దాని విధానం అమలులో భాగంగా పెరిగాయి అన్న విషయం దృష్టిలో పెట్టుకుని ఆలోచించినపుడే, దాని మూలం ఎంత బలంగా వుందో అర్థమవుతుంది.

ప్రతిపక్షంలో వుండగా ఎంతో ప్రజాస్వామిక వాదిలాగా ఫోజుపెట్టిన వాజ్‌పెయి, 'స్వదేశీ జాగరణ్ మంచ్' పేరుతో బహుళజాతి సంస్థల, సామ్రాజ్యవాదుల దోపిడీని వ్యతిరేకిస్తున్నట్లు ఫోజులు పెట్టిన బి.జె.పి.లు, ఇవాళ సంస్కరణలు ఆరంభించిన కాంగ్రెస్‌కంటే మరింత వడిగా అమలు చేస్తున్నారు. అందుకనే, తిరిగి అధికారంలోకి రాగానే, సబ్సిడీలు తగ్గించి, ధరలు పెంచారు. మరింత వేగంగా ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేట్‌పరం చేస్తున్నారు.

ఇక్కడ చంద్రబాబు సంస్కరణల అమలులో మరింత మొనగాడుగా కన్పించటానికి కంకణం కట్టుకుని ఆంధ్ర రాష్ట్రాన్ని సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేయటానికి పూనుకున్నాడు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ఉద్యోగాలు కోల్పోయి వీధిన పడుతున్న రైతాంగం, ధరలు పెరిగి, జీవితం దుర్భరమవుతున్న ప్రజానీకం, విద్య, ఉద్యోగ అవకాశాలు కుదించుకుపోతున్న యువత, ఇలా అన్ని సెక్షన్ల ప్రజానీకం తమ సమ్యల పరిష్కారానికి పోరాటబాట చేపట్టాల్సి పరిస్థితులే నేడు నెలకొన్నాయి. అందుకనే, ఈ దళారీ పాలకులకి, వాళ్ళ 'బాస్'లు సామ్రాజ్యవాదులకీ వ్యతిరేకంగా పోరాటం చేపట్టిన పీపుల్స్‌వార్ పార్టీని నిర్బంధ, నిషేధాలతో అణచటానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తూ, ప్రపంచబ్యాంక్ సలహా, సంప్రదింపులతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంయుక్త కమాండ్‌ను ఏర్పాటు చేసాయి. ప్రజలమీద పెద్ద ఎత్తున దాడికి దిగబోయే ముందు ఎక్కడైనా దోపిడీ పాలకవర్గాలు చేసే పని, ప్రజలకు నాయకత్వం వహించే సమరశీల సంస్థల్ని అణచే కార్యక్రమమే. అంతేకాదు ఎటువంటి ప్రజా ఆందోళనను సహించే స్థితిలో కూడా వుండవు పాలక వర్గాలు. మన రాష్ట్రంలో, తమ సమస్యలు చెప్పుకుందామని హైద్రాబాద్ వచ్చిన అంగన్‌వాడీ మహిళా కార్యకర్తలపై, పోలీసుల లాఠీఛార్జీ అందుకు చిన్న ఉదాహరణ మాత్రమే.

కావున, ప్రజా వ్యతిరేకమైన ప్రపంచబ్యాంక్ విధానాలను క్రూర దమన నీతిని ప్రదర్శించి తప్ప, ప్రభుత్వం అమలు చేయలేదు. అందువలన, కేవలం ధర్నాలు, ఊరేగింపులతో ప్రభుత్వం పెంచిన ధరలను కానీ, ఇతర సమస్యలను కానీ పరిష్కరించదు. ఎందుకంటే, ఇక్కడున్నది 'ప్రజాస్వామిక' ప్రభుత్వం కాదు. దళారీ ప్రభుత్వం సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు ఈడేర్చటానికి వున్న తొత్తు ప్రభుత్వం.

అందువలన, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలన్న డిమాండ్‌కే పోరాటం పరిమితం కారాదు. కేవలం విద్యుత్ విషయంలోనే కాదు, అన్ని రంగాల్లోనూ, సంస్కరణల పేరుతో, గ్లోబలైజేషన్ పేరుతో సామ్రాజ్యవాదులు, దేశంలోని వారి దళారీ పాలకులు ప్రజల్ని, దేశాన్ని తీవ్రంగా దోచుకుంటున్నారు. కాబట్టి, ఈ పోరాటం, కేవలం ఛార్జీలు తగ్గించాలన్న డిమాండ్‌తో ఆర్థిక పోరాటంగానే కాక, సామ్రాజ్యవాదుల, దళారీ పాలకుల విధానాలకు వ్యతిరేకంగా రాజకీయ పోరాటంగా కూడా కొనసాగాలి. కుట్రలు, కుహకాలతో, నిర్బంధంతో ఉద్యమాన్ని అణచచూసే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని సమరశీలంగా కూడా కొనసాగించాలి. ❑

# సబ్సిడీల రైతాంగానికి బిక్షకాదు - హక్కు!
# రైతాంగం ఉసురుతీసే సంస్కరణలు - బహుళజాతి సంస్థల కోసమే!!

దేశంలో సంస్కరణలను అమలు చేయించే దానిలో భాగంగా, ప్రపంచబ్యాంక్ భారత పాలకులకు విధించిన షరతుల్లో ఆయా రంగాల్లో ప్రజలకిస్తున్న సబ్సిడీలు రద్దు చేయాలనేదొకటి. దాని ప్రకారమే, బియ్యంమీద, ఎరువులు మొ॥న వాటిమీద సబ్సిడీలు తగ్గించి ధరలు పెంచారు.

విద్యుత్ రంగానికి వస్తే, ఇక్కడా వ్యవసాయానికిచ్చే విద్యుత్‌పై సబ్సిడీని పూర్తిగా ఎత్తివేయాలన్నది ప్రపంచబ్యాంక్ షరతు. అందుకుగాను, ముందు వ్యవసాయానికిచ్చే విద్యుత్‌కు యూనిట్‌కు 50 పైసలు వంతున వసూలు చేయాలి. తర్వాత విద్యుత్ సప్లయి ఛార్జీలో సగం వసూలు చేయాలి. ఆ తర్వాత, 2007 నాటికి విద్యుత్ సప్లయి ఛార్జీ పూర్తిగా వసూలు చేయాలి.

ప్రజల బాగోగులు, దేశం బాగోగులు కంటే, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు నెరవేర్చటానికే కంకణం కట్టుకున్న పాలకులు, మన రాష్ట్రంలోని చంద్రబాబు ప్రపంచబ్యాంక్ చెప్పిన దాన్ని తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నారు.

రైతాంగానికి వ్యవసాయానికి సబ్సిడీలు ఇవ్వటం ప్రభుత్వ బాధ్యత - అది రైతాంగ హక్కు.

'సబ్సిడీలు' అన్నవి ప్రపంచంలో ఎక్కడా లేకుండా, 'కేవలం' భారతదేశంలోనే అమలవుతున్న పద్ధతి కాదు. ప్రపంచ వ్యాప్తంగా, ఎంతో అభివృద్ధి చెందిన అమెరికాతో సహా రైతాంగానికి ఆయా ప్రభుత్వాలు రకరకాల సబ్సిడీలు ఇస్తున్నాయి. ఇది అన్నిచోట్లా అమలులో వున్న ఒక సాధారణ విషయం.

ఇక మన రాష్ట్రంలో ఇస్తున్న సబ్సిడీలను మరింత ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం వుంది. మన రాష్ట్రం కోస్తా, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలతో కూడుకుని వుండగా, కోస్తా మినహాయించి, తెలంగాణా, రాయలసీమలు వెనకబడ్డ ప్రాంతాలన్నది స్పష్టమే. రాష్ట్రంలో కాలువల ద్వారా సాగునీటి సౌకర్యం వున్నది కూడా ప్రధానంగా కోస్తా ప్రాంతానికే. వేల కోట్లతో ప్రాజెక్టులు కట్టి, ప్రభుత్వం ఇక్కడ సాగునీటి వసతి కల్పించింది.

తెలంగాణా, రాయలసీమ (ప్రస్తుతం ప్రకాశం జిల్లా పేరుతో కోస్తాలో కలుపబడ్డ పాత రాయలసీమ ప్రాంతంతో సహా) లలో ప్రభుత్వం ఏర్పరచిన నీటి వసతులు అతి తక్కువ. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిన 688 మండలాలూ, దాదాపు ఈ ప్రాంతాలకి చెందినవే. ఇవాళ ఇక్కడ రైతాంగం పంటలు పండిస్తున్నారంటే అది ప్రభుత్వం కల్పించిన వసతుల వల్ల కాదు. ఒక్కొక్క రైతు, దాదాపు 50 వేల రూపాయలు పెట్టుబడితో బావులు తవ్వించుకుని, బోర్లు వేయించుకుని విద్యుత్ మోటార్ల సాయంతో పాతాళ గంగను పైకి తెప్పించి, భూమిని సస్యశ్యామలం చేసి, ఆహార ధాన్యాలు మొదలైనవి ఉత్పత్తి చేస్తున్నారు. నీటి పారుదల సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాగా, ప్రభుత్వం చేయవలసిన ఆ పనిని తమ స్వంత ఖర్చుతో తామే భరించి (అప్పో సప్పో చేసి) పంటలు తీస్తున్నారు.

ప్రస్తుతం, ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో వ్యవసాయానికి వాడే విద్యుత్ మోటార్ల మొత్తం సంఖ్య - 19, 27, 584 (పంథొమ్మిది లక్షల, ఇరవై ఏడువేల, ఐదువందల, ఎనభైనాలుగు) వున్నాయి.

వీటిలో రాయలసీమ, తెలంగాణాలలో వున్నవి - 15, 77, 560 (పదిహేను లక్షల, డెబ్బై ఏడువేల, ఐదువందల అరవై) కాగా,

కోస్తాలో (మెట్ట ప్రాంతంలో) వున్నవి - 3, 50, 024 (మూడు లక్షల, యాభైవేల, ఇరవై నాలుగు).

అలాగే, రాష్ట్రంలో కాలువల ద్వారా సాగవుతున్న భూమి - 22.86 లక్షల హెక్టార్లు కాగా,

విద్యుత్ మోటార్ల సాయంతో బోరులు, బావులు ద్వారా సాగవుతున్న భూమి - 26. 44 లక్షల హెక్టార్లు.

ఒకప్పుడు తిండి గింజల విషయంలో విదేశాలమీద ఆధారపడిన స్థితి నుండి, ఇవాళ రాష్ట్రంగానీ, దేశంగానీ ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిగా వుందంటే, దానికి బోరులు, బావుల వ్యవసాయం కూడా ముఖ్య కారణమే. అలాగే, వ్యవసాయానికి వాడే విద్యుత్తును ప్రభుత్వం సబ్సిడీకి ఇవ్వటం ద్వారానే అది వీలయింది.

అంతేకాదు, రైతాంగానికి ఇస్తున్న విద్యుత్ సబ్సిడీని వాళ్లకి 'వ్యక్తిగతంగా' ఇస్తున్నట్లు చూడటం పొరపాటు. వాస్తవానికి రైతాంగానికిస్తున్న సబ్సిడీ వలన మొత్తం సమాజమంతా ప్రయోజనం పొందుతుంది. రైతాంగానికి సాగునీటి వసతి ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదికాగా, అది ఏర్పాటు చేయలేదు. రైతులే తమ ఖర్చుతో ఏర్పాటు చేసుకున్నారు. వాళ్ళు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. కాగా, ఆ పనీ చేయటం లేదు. అటువంటపుడు వాళ్ళకి అవసరమైన విద్యుత్‌ను సబ్సిడీమీద అందించటం ప్రభుత్వ కనీస బాధ్యత. అది రైతాంగం హక్కు కూడా. సబ్సిడీ ఇవ్వటం వలనే, రైతాంగం ఆహార ధాన్యాలని తక్కువ ధరకి ఉత్పత్తి చేయగలుగుతున్నారు. ప్రజలకు అందివ్వ గలుగుతున్నారు. అలాగే, రైతాంగం ఈ పంటలు పండించటం ద్వారా, ఎంతో విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది, తిండి గింజల దిగుమతి లేదు కాబట్టి.

ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్‌కు ఇస్తున్నానని చెప్తున్న సబ్సిడీ అంతా తన వనరులలో నుండే (ఇతర మార్గాల ద్వారా వచ్చే పన్నులలో నుండి) ఇవ్వటం లేదు. 'క్రాస్ సబ్సిడీ' ద్వారా కూడా ఇస్తుంది. అంటే , పెద్ద పరిశ్రమలు, ఉన్నతాదాయ వర్గాల దగ్గర విద్యుత్ ఛార్జీ ఎక్కువ వసూలు చేసి, అది వ్యవసాయానికి ఇవ్వటం. వ్యవసాయానికి విద్యుత్‌ను సబ్సిడీ మీద ఇవ్వటం అన్నది బహుళ ప్రయోజనకారిగా వుంటే, ప్రపంచబ్యాంక్ పాదసేవలో మునిగిపోయిన చంద్రబాబు, రైతాంగాన్ని దివాళా తీయించబూనుకున్నాడు. అందుకనే, వాస్తవాలని మరుగుపరిచి, రైతాంగానికిచ్చే విద్యుత్‌పైన తప్పుడు ప్రచారం చేస్తున్నాడు.

96లో రైతాంగానికి 59శాతం విద్యుత్ సప్లై చేస్తున్నామని ప్రచారంచేసి, విద్యుత్ వినియోగదారుల ముందు రైతాంగాన్ని 'దోషులు'గా నిలబెట్టే ప్రయత్నం చేసి భారీగా ఛార్జీలు పెంచాడు. ఇప్పుడు ఏకంగా సగటున 60 శాతం విద్యుత్ రేటును పెంచాడు.

దాన్ని కప్పిపుచ్చుకోవడానికి మొత్తం విద్యుత్‌లో రైతాంగానికి 21 శాతం ఇస్తున్నామని, విద్యుత్ సప్లయ్ ఛార్జీ 216 పైసలు పడుతున్నా,

యూనిట్ 31 పైసలకే ఇస్తున్నామని, మోసపూరిత ప్రచారం చేస్తున్నాడు. అందుకు అన్నీ కాకి లెక్కలు చెబుతున్నాడు.

నేడు రాష్ట్రంలో, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సంఖ్య రీత్యా 19 లక్షలు వున్నా, వాస్తవానికి వినియోగంలో 13-14 లక్షల కంటే ఎక్కువ వుండవు. ఎందుకంటే, మోటార్లు కాలిపోయి, తిరిగి రీవైండింగ్ చేయించని రైతాంగాన్ని, దివాళా తీసి విద్యుత్‌తో వ్యవసాయం చేయలేక చేతులెత్తేసిన రైతాంగాన్ని లెక్కలోకి తీసుకోవటం లేదు. అలాగే, ప్రభుత్వం రైతాంగానికి రోజుకు 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నానని ప్రకటిస్తున్నా, వాస్తవానికి అది 5, 6 గంటల కంటే ఎక్కువ లేదు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | |
| | | | | | | | |
| | | | | | | | |
| | | | | | | | |
| | | | | | | | |
| | | | | | | | |

ప్రస్తుతం 5 హెచ్.పి. మోటార్ వాడే రైతు సంవత్సరానికి 1 హెచ్.పి.కి 400 రూ॥ల చొప్పున 2 వేల రూపాయాలు కట్టాలి. రైతాంగం సగటున 165 రోజులకి మించి, సంవత్సరంలో మోటార్లు వినియోగించరు. అంటే, ఒక్కో రైతు రోజుకు సగటున 12 రూ॥లు చెల్లిస్తున్నాడు. ప్రస్తుత సరఫరాని బట్టి రైతు రోజువారీ వినియోగం 10-12 యూనిట్లకు మించదు. సం॥రానికి 2వేల యూనిట్లకు మించదు. దీనిని బట్టి రైతు సగటున యూనిట్‌కు ఒక రూపాయి చెల్లిస్తున్నట్లు లెక్క. కానీ, చంద్రబాబు, ట్రాన్స్‌కోలు రైతుకి 31పైసలకే విద్యుత్ సప్లయ్ చేస్తున్నామని బుకాయిస్తున్నారు. విద్యుత్ వినియోగించే రైతాంగంలో 90 శాతం మంది 5 హెచ్.పి.లోపు మోటార్లు వాడే రైతాంగమే అన్నది దృష్టిలో పెట్టుకుంటే, సన్న, చిన్నకారు రైతాంగంపై మరింత భారం ఎలా మోపారో చూడవచ్చు. (ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతాంగం కూడా ప్రధానంగా వీళ్ళే).

## పైపైగా భారం కానున్న ఛార్జీలు!

ప్రస్తుతం ప్రభుత్వం వసూలు చేస్తున్న దాని ప్రకారం ఎకరా వ్యవసాయం చేయటానికి విద్యుత్ బిల్లు 650 రూ॥లు అవుతుంది. (5 హెచ్.పి. మోటార్ 3 ఎకరాలకు నీరందిస్తుంది. దానికి సం॥రానికి 2 వేల రూపాయలు మొత్తం బిల్లు.). ఇంతటితో ఆగదు. '96లోను, తిరిగి ఈ సం॥రం ఫిబ్రవరిలోనూ కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రాల విద్యుశ్ఛక్తి శాఖ మంత్రుల సమావేశంలో 2001 సం॥రం నుండి విద్యుత్ మీటర్లు అమర్చి, వ్యవసాయానికిచ్చే విద్యుత్‌కు యూనిట్‌కు 50 పైసలు చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. దాని ప్రకారం ప్రభుత్వం త్వరలోనే యూనిట్‌కు 50 పైసలు చొప్పున వసూలు చేసే పని మొదలు పెడుతుంది. అప్పుడు, విద్యుత్ ఛార్జీ మరింత పెరుగుతుంది.

అంతేకాకుండా, ప్రపంచబ్యాంక్ షరతు ప్రకారం రానున్న 2 సం॥రాలలో రైతాంగానికి సరఫరా చేస్తున్న విద్యుత్ ఖర్చులో సగం వసూలు చేయాలి. విద్యుత్‌రంగ నిపుణులు రైతాంగం వాడే విద్యుత్ (5 హెచ్.పి. మోటార్) ఏడాదికి 2వేల యూనిట్లకు మించదు అని చెప్తున్నా, అదేం పట్టించుకోకుండా, ట్రాన్స్‌కో కాకి లెక్కల ద్వారా 4302 యూనిట్లు అని చెప్తున్నది. అంటే సరఫరా ఛార్జీలో సగం వసూలు చేయడం మొదలు పెడ్తే, 5 హెచ్.పి. మోటార్ వాడే రైతు సం॥రానికి అయ్యే 4302 యూనిట్లకుగాను, రైతాంగానికి సరఫరా చేస్తున్న విద్యుత్ యూనిట్‌కు ఖర్చు 236 పైసలు అని చెప్తున్నారు కాబట్టి, దాని ప్రకారం దాన్లో సగం, అంటే యూనిట్‌కు 118 పైసల చొప్పున 5077 రూ॥లు బిల్లు కట్టాలి. అంటే, ఎకరాకు కరెంట్ ఖర్చు 1700 రూ॥లు ఆ క్రమంలో పూర్తి ఛార్జీ వసూలు చేస్తే, అప్పుడు సంవత్సరానికి 4302 యూనిట్లకు గాను యూనిట్‌కు 236 పైసల చొప్పున 10,140 రూ॥లు కట్టాలి. ఎకరానికి, అక్షరాలా 3,380 రూ॥లు. ఇది ఇప్పటి యూనిట్ ధర ప్రకారం అంచనా. ఏటేటా విద్యుత్ ఛార్జీలు పెంచాలన్న ప్రపంచబ్యాంక్ షరతు, అలాగే, మొత్తం ఉత్పత్తి, ప్రసార పంపిణీలు ప్రైవేట్ పెట్టుబడిదారుల చేతులలోకి వెళ్ళబోతున్న స్థితిలో విద్యుత్ ఛార్జీలు ఏ స్థాయిలో వుంటాయో ఊహించుకోవచ్చు.

ఇప్పటికే, గిట్టుబాటు ధరలు లేకపోవటం, అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ళు, ఎంతకీ తీరని అప్పులతో చావలేక, బతకలేక వ్యవసాయం చేస్తున్న రైతాంగం ఈ సబ్సిడీల రద్దును, అధిక ఛార్జీలను భరించటం సాధ్యం కాదు. ఎందుకంటే, రైతాంగం పండించే పంటలకు ఎటువంటి గ్యారంటీ, కౌంటర్ గ్యారంటీ లేదు. అంటే కనీస గిట్టుబాటు ధరలు కూడా లేకుండా పోతున్న స్థితిలో, ఇటు వ్యవసాయ విద్యుత్ రేట్లు పెరగటం, అటు ప్రపంచబ్యాంక్ ఆదేశానుసారం కేంద్రం ఎరువులపై సబ్సిడీలు ఎత్తివేసి ధరలు పెంచటం, ఇంకో ప్రక్క విత్తనాలు, పురుగుమందుల ఉత్పత్తి అంతా బహుళజాతి కంపెనీల గుప్పెట్లోనే వుండి వాళ్ళు ఏటికేడాది ధరలు పెంచడంతో, సామాన్య రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితులే ఇక్కడ నెలకొంటున్నాయి. బాగా డబ్బు గలవాడే వ్యవసాయం చేయగలిగిన స్థితిని సృష్టిస్తున్నారు.

అందుకనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచబ్యాంక్ షరతుల మేరకు, నూతన వ్యవసాయ విధానం పేరుతో 'కార్పొరేట్ వ్యవసాయాన్ని' (వ్యవసాయంలో భారీ పెట్టుబడులు పెట్టి చేసే వ్యవసాయం.) ముందుకు తీసుకు వస్తున్నారు.

వీటివలన అనివార్యంగా రైతాంగం తమ పొలాలను దీర్ఘకాలిక పద్ధతిన లీజుకివ్వటమో, అయినకాడికి తెగనమ్ముకోవటమో చేసి, చివరకు తమ పంటపొలాల్లోనే తాము కూలీలుగా మారిపోయే దృశ్యమే మనకళ్ళ ముందుంది. కార్పొరేట్ వ్యవసాయం పేరుతో చేసేది, ఆహార ధాన్యాలు పండించటం కాదు, పళ్ళతోటలో, పూలతోటలో అటువంటివే. ఇప్పటికే, రొయ్యల, చేపల చెరువులుగా మారిన పంటపొలాల సరసన ఇవీ చేరి, ఆహార ధాన్యాల దిగుబడి తగ్గిపోయి, తిరిగి ఆహార ధాన్యాలను బహుళజాతి వ్యాపార సంస్థల నుండి, సామ్రాజ్యవాద దేశాల్లో పండే ధాన్యాన్ని దిగుమతి చేసుకోవలసిందే! ఇక్కడి రైతాంగం ఉసురుతీసి, అక్కడి వాటికి మార్కెట్ సృష్టించటమే! ప్రపంచబ్యాంక్ లక్ష్యం అదే!

అందువలన, మెట్ట ప్రాంత రైతాంగాన్నే కాదు, మొత్తం రైతాంగం వుసురు తీసేవే ఈ సంస్కరణలు. ❑

# పెంచిన ఛార్జీల ప్రజలపై భారం మోపడం లేదంటూ, చంద్రబాబు, ట్రాన్స్కో, రెగ్యులేటరీ కమీషన్లు చేస్తున్న గోబెల్స్ ప్రచారం

'ఒక అబద్ధాన్ని పదేపదే ప్రచారం చేస్తే, చివరకు దాన్ని నిజమని నమ్మించవచ్చు'. ఇది, 2వ ప్రపంచ యుద్ధంలో నియంత హిట్లర్ వద్ద ప్రచారశాఖా మంత్రిగా పనిచేసిన గోబెల్స్ సూత్రం. ఇవాళ, ఆ గోబెల్స్‌కే పాఠాలు చెప్పేలా చంద్రబాబు తయారయ్యాడు. పత్రికలు, టీవీలు, రేడియోలకిచ్చే ప్రకటనలు, ఇంటర్వ్యూలు, 'ముఖ్యమంత్రితో ముఖాముఖి' ద్వారా చంద్రబాబు అదే చేస్తున్నాడు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు ప్రజలమీద భారం మోపడం లేదని చెప్తున్నాడు. మరి, పెంచిన 840 కోట్లు ఎవరి జేబుల్లోంచి దండుకుంటున్నట్లు? ప్రజలకి కనీస విజ్ఞత కూడా లేదని భావిస్తున్నాడు.

అందుకోసం అన్నీ తప్పుడు లెక్కలు చెప్తున్నాడు.

అందులో ఒకటి, నిన్నటిదాకా నాన్ టెలిస్కోపిక్ విధానంలో ఛార్జీలు వసూలు చేసామని, ఇప్పుడు ప్రజల కోరిక మేరకు టెలిస్కోపిక్ విధానానికి మార్చామని, అలా ప్రజలని ఉద్ధరించామని చెప్తున్నాడు. ముందు, నిన్నటిదాకా నాన్‌టెలిస్కోపిక్ విధానంలో ప్రజలని దోచుకున్నట్లు ఒప్పుకున్నట్లేనా!

**టెలిస్కోపిక్ విధానంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు!**

టెలిస్కోపిక్ విధానం పేరుతో, వాస్తవానికి ఒరిగిందేమీ లేకపోగా, భారం మరింత పెంచారు. అది ఈ క్రింది పట్టిక ద్వారా చూడవచ్చు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |

గతంలో 6 స్లాబ్‌లు వున్నాయి. ఇప్పుడు టెలిస్కోపిక్ విధానంకు మార్చామనే పేరుతో వాటిని 4 స్లాబ్‌లుగా చేసారు. గతంలో 51-100 వరకు ఒక స్లాబ్, 101-200 యూనిట్ల వరకు ఒక స్లాబ్ విడివిడిగా వుండగా, ఇప్పుడు 51-200 యూనిట్ల వరకూ ఒకే స్లాబ్‌ను చేసారు. అలాగే 201 యూనిట్ నుండి 300 వరకు ఒక స్లాబ్, 301 నుండి 400 యూనిట్ల వరకు ఒక స్లాబ్ విడివిడిగా వుండగా ఇప్పుడు ఈ రెంటినీ ఏకంచేసి, 201 నుండి 400 యూనిట్‌ల వరకు ఒకే స్లాబ్ చేసారు. మామూలుగా రేట్లు పెరగటం అన్నది కాకుండా, ఎంత ఎక్కువ పెరిగిందో చూడండి. 51-100 యూనిట్ల మధ్యన ఏకంగా, యూనిట్‌కు ఛార్జీ 175 పైసలు పెరిగింది. 101-200 యూనిట్లు వాడేవాళ్ళకు కూడా యూనిట్‌కు 135 పైసలు పెరిగింది. అదే విధంగా 201-300 యూనిట్ల మధ్య వినియోగించే వాళ్ళకు యూనిట్‌కు 240 పైసలు, 300-400 వరకు వినియోగించేవాళ్ళకు యూనిట్‌కు 160 పైసలు పెరిగింది.

పై పట్టిక చూసినా, ట్రాన్స్‌కో కోరిన దానికంటే కూడా అదనంగానే (చంద్రబాబు పెద్దమనసుతో అదనపు సబ్సిడీ ఇచ్చానని చెప్తున్న తర్వాత కూడా) రేట్లు వున్నాయని స్పష్టమవుతోంది.

0-50 వరకు ఒక స్లాబ్, 51-100 యూనిట్ల వరకు ఒక స్లాబ్, ఇలా విద్యుత్ వినియోగదారులను కేటగిరీ చేసి, వాళ్ళ స్థాయిని బట్టి ఛార్జీలు నిర్ణయించేందుకు స్లాబ్ విధానం వుంది. ఆ స్లాబ్‌ల ప్రకారం వివిధ స్లాబ్‌ల క్రింద వివిధ రేట్లు నిర్ణయించింది. 50 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకునే వాళ్ళది ఒక స్థాయి. అంతవరకు ఒక ఛార్జీ. 51 యూనిట్ల పైబడి వాడుకునేవాళ్ళది ఒక స్థాయి ఇలా. నాన్ టెలిస్కోపిక్ విదానంలో రేట్లు ఎలా అమలు చేసేవాళ్ళంటే, 0-50 యూనిట్లు వాడుకుంటే, 50 రూ॥లు బిల్లు. అదే వినియోగదారుడు ఆ లిమిట్ దాటి, అదనంగా ఒక్క యూనిట్ వాడుకున్న, అంటే 51 యూనిట్లు వాడుకున్నా, 51 నుండి 100 యూనిట్ల స్లాబ్ పరిధిలోకి వచ్చి, యూనిట్‌కి 120 పైసల చొప్పున, మొత్తం 60 రూ॥లు కట్టాలి. అదే 100 యూనిట్లు అయితే 120 రూ॥లు అంటే, 50 యూనిట్లు పైబడి ఎంత విద్యుత్ వాడకుంటే, వాడుకున్న యూనిట్లను బట్టి ఏ స్లాబ్‌లోకి వస్తే, ఆ స్లాబ్‌కి ఎంత రేటు నిర్ణయించి వుందో, అన్ని యూనిట్లకీ అదే రేటు చొప్పునకట్టాలి. ఉదాహరణకు, 300 యూనిట్లకు, యూనిట్‌కు 540 పైసల చొప్పున 1350 రూ॥లు కట్టాలి.

టెలిస్కోపిక్ విధానంలో అయితే, వినియోగదారుడు వినియోగించుకున్న 300 యూనిట్లకుగాను

0-50కి, యూనిట్‌కి 135 పైసల చొప్పున 50 యూనిట్లకు - 67.50

51-200కి యూనిట్‌కి 295 పైసల చొప్పున 150 యూనిట్లకు - 442.50

201-300కి యూనిట్‌కి 450 పైసల చొప్పున 100 యూనిట్లకు-450.00 రూ॥లు

మొత్తం కలిపి, 300 యూనిట్లకు-960.00 రూ॥లు వసూలు చేస్తారు.

గతంలోని టెలిస్కోపిక్ విధానం లాగా అయితే, 300 యూనిట్లకు 450 పైసల చొప్పున 1350 రూ॥లు కట్టాల్సి వచ్చేది. చూసారా, ఛార్జీలు పెంచినా మీకిప్పుడు బిల్లు ఎంత తగ్గిందో అని బులిపిస్తున్నాడు. కానీ, అక్షరాలా 330 రూ॥లు అంటే, ఛార్జీ 52 శాతం పెరిగిందన్న విషయం మరుగు పరుస్తున్నాడు.

క్రింది పట్టికలో వివరాలు చూడండి

| | | | | |
|---|---|---|---|---|
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |

300 పైబడి యూనిట్ వినియోగదారులకి 98 డిసెంబర్‌లో ఛార్జీలు పెంచారు కాబట్టి ఈసారి మరీ వడ్డించలేదు.

50 యూనిట్లు, ఆపైన కాల్చే వాళ్ళంతా ధనవంతులు, లేక తేరగా డబ్బొచ్చేవాళ్ళు కాదు. సామాన్య, మధ్యతరగతి (ఎగువ కూడా కలుపుకుని) ప్రజానీకం. రెక్కల కష్టంమీద, లేక జీతంమీద బ్రతికేవాళ్ళే ఎక్కువమంది. ఇండ్లలో బల్బులతోపాటు, ఫ్యాన్, టీ.వీ., ఇస్త్రీపెట్టె అన్నవి సామాన్యుల గృహాల్లో కూడా సాధారణ వస్తువులై పోయాయి. వీటితోపాటు మిక్సీ, రిఫ్రిజిరేటర్ (ఫ్రిజ్), వాటర్ హీటర్, వాషింగ్ మెషిన్ మొ॥నవన్నీనో లేక ఒకటీ అరా మినహాయింపుతో మధ్యతరగతి జీవితంలో (ఎగువనే కాకుండా దిగువస్థాయిలో కూడా, వినిమయ సంస్కృతి పెరిగిన నేపథ్యంలో) సర్వసాధారణం అయ్యాయి. పెంచిన ఛార్జీలతో ఈ వస్తువులు వాడటమే నేరం అయిపోయే పరిస్థితి వచ్చింది. ఎందుకంటే, 300 యూనిట్లలోపు వినియోగదారులు ప్రధానంగా వీళ్ళే. సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం నడ్డి విరిచేలా ఛార్జీలు పెంచి, అబ్బే ప్రజలమీదేం భారం లేదు. మీరు కోరినట్లే నాన్ టెలిస్కోపిక్ విధానం ఎత్తివేసి, టెలిస్కోప్ విధానం ప్రవేశపెట్టామని చెప్తూ, నీ ఎడంచేయి తీయి, నా పుర్రచేయి పెడతాను అన్న రీతిలో 6 స్లాబ్‌లను 4 స్లాబ్‌లకు తగ్గించి భారం మోపారు.

1996 నుండి 300 లోపు యూనిట్లు వాడుకునే గృహ వినియోగదారులపై ఛార్జీలు పెంచలేదు, ఈసారే పెంచాల్సి వచ్చిందని అర్థం చేసుకొమ్మని శెలవిస్తున్నాడు.

అసెంబ్లీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు వున్నాయి కాబట్టి, ఆ ఎన్నికల ఏరు దాటటానికి మాత్రమే ఛార్జీలు పెంచలేదు. అవి అయిపోయాయి కాబట్టి, 'ఏరు దాటిందాకా ఓడ మల్లయ్య, ఏరు దాటాక బోడిమల్లయ్య' అన్నట్లు, ఆవారా, ఈవారా ఎడాపెడా రేట్లు పెంచాడు. ఇవీ వాస్తవాలు.

## వినియోగదారుల సంఖ్యలన్ని తారుమారు చేయడం

పైదాన్ని సమర్థించుకోవడానికి చంద్రబాబు మరింత దగాకోరు అబద్ధాలు ఆడుతున్నాడు. అందుకు వినియోగదారుల సంఖ్యలను తారుమారు చేస్తున్నాడు. మొత్తం గృహ వినియోగదారులలో 80 శాతం మంది 200 యూనిట్లు దాకా వాడుకునేవాళ్ళు, 91 శాతం మంది 300 యూనిట్లు దాకా వాడుకునేవాళ్ళు. వీళ్ళు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం. ఆ వాస్తవాన్ని మసిబూసి మారేడు కాయ చేయడానికి మొత్తం విద్యుత్ వినియోగ దారులలో 50 యూనిట్ల లోపు వినియోగ దారులు 62 శాతం వున్నారని, అందువలన పెంచిన ఛార్జీల భారం వాళ్ళమీద పడదని చెప్తున్నాడు. కానీ, ఇదే చంద్రబాబు ప్రపంచబ్యాంక్‌కు అందజేసిన నివేదికలో వాళ్ళ సంఖ్య 21 శాతం మాత్రమేనని చెప్పాడన్నది చూస్తే, చంద్రబాబు వంచనాశిల్పం అర్థం అవుతుంది.

గృహాలకి సరఫరా చేసే విద్యుత్ ఖర్చు యూనిట్‌కి 496 పైసలు అవుతుందని, కానీ తాము అంతరేటు వసూలు చేయటం లేదని చెప్తున్నాడు. దానికి, సామాన్యులకు అర్థంకాని సాంకేతిక పరిభాషలో 'పీక్ లోడ్ అవర్' సమయం అని మాట్లాడుతున్నాడు. పీక్‌లోడ్ అవర్ అంటే, విద్యుత్ అత్యంత ఎక్కువగా వాడబడే సమయం. విద్యుత్ అన్నది ముందే తయారు చేసుకు పెట్టుకుని, నిల్వ వుంచుకొని, ఎప్పుడు ఎంత కావాలంటే అంత వినియోగించుకునే అవకాశం లేదు. ఎప్పుడు ఉత్పత్తి అయిన దానిని అప్పుడు వినియోగించుకోవాలి. లేదా వృధా అవుతుంది. ఇక సాయంత్రం 6-10 గంటల మధ్య గృహ వినియోగదారులు ఎక్కువగా వాడతారు కాబట్టి, ఆ టైమ్‌కే వీళ్ళకి ఉత్పత్తి చేసి సరఫరా చేయాలి కాబట్టి, అలా ఉత్పత్తి ఖర్చు, సరఫరా ఖర్చు ఎక్కువవు తుందని చెబుతోంది. కానీ, ఆ సమయంలో గృహాలే కాదు, అన్నిచోట్ల పారిశ్రామిక, వాణిజ్య సముదాయాలలో కూడా అదనంగా విద్యుత్‌ను వాడతారు అన్న విషయాన్ని పక్కకు పెట్టి, కేవలం గృహ వినియోగదారులే ఆ సమయంలో వాడతారు అన్న పద్ధతిలో చెప్తూ, ఆసమయంలో జరిగే ప్రసార పంపిణీ నష్టాలను, వాణిజ్య నష్టాలను (దొంగ కరెంట్‌కు ముద్దు పేరు) మొత్తంగా గృహ వినియోగదారుల ఖాతాలో జమచేస్తూ, తప్పుడు లెక్కలు చూపుతోంది.

అయితే, చంద్రబాబు ప్రచారంలో ఆరితేరాడు. అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేయటంలో మరింతగా ఆరితేరాడు. అవి నమ్మే, ప్రజలు తనకి పట్టంగట్టారనే మితిమించిన ఆత్మవిశ్వాసంతో, మరింతగా దగాకోరు పనులకు పాల్పడుతున్నాడు. ఇదే ఎల్లకాలం సాగుతుందను కుంటున్నాడు. కానీ, సంస్కరణల చేదుఫలాలు అన్ని సెక్షన్ల ప్రజలకి అనుభవంలోకి రావటం మొదలైన నేటి తరుణంలో, ప్రజల్ని ఇంకా ఇంకా నమ్మించగలనని పగటి కలలు కంటున్నాడు, పాపం!!! ❑

# భారత పాలకవర్గాల సంపూర్ణ బానిసత్వానికి ప్రతీకగా నిలుస్తున్న క్లింటన్ 'విజన్ స్టేట్‌మెంట్'

అదొక వలస పాలనను తిరిగి గుర్తుకు తెచ్చే ఘట్టం. తేడా అల్లా ఏమిటంటే బ్రిటీష్ రాజు, రాణిలకు బదులు ప్రపంచ దోపిడీదారుడు తెరమీది కొచ్చాడు....మునుపటి బానిస రాజులు, మహారాజుల స్థానంలో నేటి వాజ్‌పేయిలు, అద్వానీలు వచ్చి చేరారంతే. విదేశీ ప్రభువులు పరిపరి విధాలుగా అధికార దర్పాన్ని, గర్వాతిశయాన్ని ప్రదర్శిస్తూ ఐదు రోజుల పాటు దేశంలోని వివిధ ప్రాంతాలను వాస్తవంగానే తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. మరోవైపు ఈ అమెరికన్ ప్రభువుల మలమూత్రాల కోసం దేవులాటలో భారత పాలకవర్గాలు తమ ''ఆత్మగౌరవాని''కి కలుగుతున్న అవమానాలను, దూషణలను సైతం కిమ్మనకుండా భరిస్తున్నారు.

తమ హైటెక్ ఫాస్టెస్ట్ బూట్లతో ఈ దేశంలోకి కదం తొక్కుతూ వేంచేసిన అమెరికన్ దోపిడీ దొంగలు తమ భారత సందర్శనకు సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని తమ చెప్పు చేతుల్లోనే ఉంచుకున్నారు. వారు విమానాశ్రయాలను తమ అదుపులోకి తీసుకున్నారు. రోడ్లను, హోటళ్ళనే కాదు చివరకు ఢిల్లీలోని మురికి నీటి కాలువల వ్యవస్థలో కొన్ని భాగాలను సైతం వీరు తమ అదుపులోకి తెచ్చుకున్నారు. తమ ప్రధాన నేత సందర్శనకి సంబంధించిన వివరాలను సైతం వారే నిర్దేశించారు. అమెరికన్ అతిథుల గౌరవార్థం భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రులిచ్చే విందులు, ఇతర కార్యక్రమాలకు ఆహ్వానించాల్సిన ప్రముఖుల జాబితాను సైతం వారే రూపొందించుకున్నారు. ఈ దేశం మొత్తం తమ ముల్లె అనే రీతిలో అమెరికా భద్రతా బలగాలు భారతీయ పోలీసులను అడుగడుగునా ఆజ్ఞాపిస్తూ పోయాయి.

మరోవైపున ఈ విదేశీ సందర్శకుల అధికార దర్పంతో భారత దళారీ పాలకుల పరమ దాస్యప్రవృత్తి పోటీ పటింది. భారతీయ రాజకీయ నాయకుల, బడా వ్యాపారుల కూటమి అమెరికన్ యజమానులు తమ ముందుంచిన అన్ని ఒప్పందాలపై ఎక్కడ పెట్టమంటే అక్కడల్లా సంతకాలు పెడుతూ పోయింది. అమెరికన్ అతిథులు పయనించే రోడ్లను, బసచేసే హోటళ్ళను, రహదార్లను అలంకరించడానికి, మెరుగులు దిద్దడానికి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని అప్పనంగా ఖర్చు పెట్టేశారు. అతిథుల భద్రతా వ్యవహారాలన్నింటినీ అమెరికన్ ఇంటెలిజెన్స్, సాయుధ దళాలకు అప్పగించేశారు. బిక్షగాళ్ళను క్రూరంగా తరిమివేయటమేగాక నిరుపేదలు ఆక్రమించి వేసుకున్న గుడిసెలను పెకిలించి వేశారు. ఆ విధంగా విదేశీ దోపిడీదార్లకు పేదరికాన్ని, కనబడనీకుండా చేశారు. ఇక మీడియా అయితే అమెరికా అధ్యక్షుడిని, అతగాడి కూతురుని గురించి ఊదరగొట్టడంలో పోటీపడి 'క్లింటన్ క్రేజీ'ని సృష్టించింది. భారీ ఎత్తున తరలివచ్చిన ఈ అమెరికన్ అతిథులను సేవించడానికి వేలాదిమంది పోలీసుల్ని, బ్యూరాక్రాట్లను, అధికారులను సర్వవేళలా అందుబాటులో వుంచారు. కేంద్ర కేబినెట్, మంత్రిత్వశాఖలు మొత్తంగా 'అంకుల్ శ్యామ్' అడుగులకు మడుగులొత్తాయి. ఏమైతేనేం కాని, ఈ అవధులు మీరిన లొంగుబాటు తనానికిగాను భారతీయ పాలకులు తగిన రివార్డునే పొందారు. దక్షిణాసియాలో భారతదేశ ప్రాంతీయ ఆధిపత్యానికి అమెరికా ఆమోదముద్ర వేసింది. నిస్సందేహంగానే ఇది ఈ ప్రాంతంలో అమెరికా సొంత ప్రాదేశిక రాజకీయ వ్యూహానికి విస్తరణ మాత్రమే.

అయితే, పాలకవర్గం ఈ విదేశీ రాబందుల ముందు సాగిల పడుతుండగా, దేశం నలుమూలల నుండి భారత ప్రజానీకం ఈ లొంగుబాటుకు తీవ్ర నిరసన తెలిపింది. నిషేధాజ్ఞలు వున్నప్పటికీ దేశంలో నిరసనోద్యమం వైవిధ్యపూరితంగా సాగింది. క్లింటన్ గడ్డిబొమ్మని స్వచ్ఛందంగా ప్రజలు తగులబెట్టే కార్యక్రమంతో మార్చి 19న హోలీ పండుగ తళతళలాడింది. క్లింటన్ పర్యటన చివరలో యాదృచ్ఛికంగానే వచ్చిన మార్చి 23 భగత్‌సింగ్ అమరత్వ దినం నిరసన ప్రదర్శనలకు తలమానికమైంది. అది...విప్లవకారులు, కొంతమంది జాతీయవాదులు, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, పర్యావరణ కార్యకర్తలు, స్త్రీలు, దళితులతో కూడిన ఒక విశాల విస్తృత ప్రజా వుద్యమం అయింది. అదే సమయంలో ఆరెస్సెస్ 'స్వదేశీ' వాలాలు ఈ కార్యక్రమాల నుండి ప్రక్కకు తప్పుకున్నారు. అంతకుమించి కాశ్మీర్‌లో 36 మంది సిక్కులను వూచకోత కోసిన సంఘటన తర్వాత సిక్కు- ముస్లిం ద్వేష భావాన్ని ప్రజ్వరిల్ల జేయడంలోనే వీరు మునిగిపోయారు.

అమెరికా సామ్రాజ్యవాద రాక్షసుడి కోరల్లోకి మరింత లోతుగా దేశాన్ని నెట్టేందుకుగాను అమెరికా సామ్రాజ్యవాదులు, భారత పాలకవర్గాలు కలిసికట్టుగా భారత ప్రజలకు తెలియకుండా తెర వెనుక పన్నిన కుట్రే క్లింటన్ పర్యటన. భారత్, అమెరికా విదేశాంగశాఖా మంత్రులు జస్వంత్‌సింగ్, టాల్బోట్‌లు విదేశాలలో జరిపిన రహస్య చర్చల అంతిమ ఫలితమే ఇది. అమెరికా కబంధ హస్తాల్లోకి భారత పాలకవర్గాలు మరింత లోతుగా కూరుకు పోవడాన్ని క్లింటన్ పర్యటన సుగమం చేసింది. అమెరికన్ కుట్రలూ, కుహకాలకు భారతదేశం సంపూర్ణంగా లొంగిపోవడానికి తగిన మార్గాన్ని 'విజన్ స్టేట్‌మెంట్' చాలా స్పష్టంగా నిర్దేశించింది. మన దేశానికి మన ప్రజలకు మార్చి 21 ఒక అంధకార దినంగా నిల్చిపోతుంది.

ఈ నాటకం మొత్తానికి ప్రత్యేకించి ప్రమాదకరమైనదేమిటంటే, దేశంలోని పలు ప్రాంతాలను అమెరికన్ ఇంటెలిజెన్స్ ముందు విప్పి చూపించడమే. క్లింటన్ పర్యటనకు ఏర్పాట్లు చేయటం అనే ముసుగులో వందలాది మంది యఫ్.బి.ఐ., సి.ఐ.ఎ. ఏజెంట్లు గత ఆరునెలలుగా దేశమంతా చెడ తిరిగేశారు. వారు భారత భద్రతా బలగాలతో సంబంధమేర్పర్చుకుని తమ రక్షణ యంత్రాంగాన్ని ప్రచ్ఛన్నంగా నిర్మించుకున్నారు. క్లింటన్ పర్యటనకు పక్షం రోజుల ముందు ఇది పతాక స్థాయికి చేరుకుంది. అమెరికన్ ఏజెంట్ల జోక్యం ఏ స్థాయిలో వుందంటే గంటా 50 నిముషాలు మాత్రమే జరిగే క్లింటన్ ఆగ్రా పర్యటనకిగాను అమెరికా సీక్రెట్ సర్వీస్‌కి చెందిన ఏజెంట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాధికారులను 17సార్లు కలిశారు. దీనికితోడు వారు క్లింటన్ రక్షణ ఏర్పాట్ల రిహార్సల్స్ కోసం అనేకసార్లు ఉమ్మడి చర్యలు చేపట్టారు.

క్లింటన్ పర్యటనా కాలంలోనే భారత పాలకవర్గాల లొంగుబాటును ఖరారు చేసేందుకుగాను, అంతకు ఒక నెల

ముందునుండి అమెరికా ప్రభుత్వం వాషింగ్టన్‌లో తారాస్థాయి ప్రచారానికి పూనుకున్నది. ఫిబ్రవరి మధ్యనుండే వారు హెచ్చరికలు జారీ చేయటం, ఇండో-పాక్ సంధి పేరిట జూదమాడటం మొదలెట్టారు. క్లింటన్ వచ్చేంత వరకూ ఇది కొనసాగింది. అయితే ఒకసారి 'విజన్ స్టేట్‌మెంట్'పై సంతకాలు పూర్తవగానే క్లింటన్ రాత్రికి రాత్రే గొంతు మార్చేశాడు. ఆ మరుసటి దినం నుండే ఈ కొత్తగొంతు వినిపించటం మొదలైంది. మార్చి 22న భారత పార్లమెంట్‌లో ఇచ్చిన ఉపన్యాసంలో అతగాడు సరిహద్దులలో అధీనరేఖను గౌరవించి తీరాలని, హింసకు ముగింపు పలకాలని చెప్పాడు. కాశ్మీర్‌లో సిక్కుల ఊచకోతకి సంబంధించి అతడు స్పష్టంగా పాకిస్తాన్‌వైపు వేలెత్తి చూపాడు. డిసెంబర్‌లో హైజాక్ అయిన భారతీయ విమానంలో చంపబడిన వ్యక్తి భార్య రచనా కాత్యాల్‌ను కలవాలనుకుంటున్నట్లు కూడా క్లింటన్ సూచించాడు. ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో అతడు కాశ్మీర్‌లో హింసకు సంబంధించి పాకిస్తాన్ ప్రభుత్వానిదే నేరమంటూ మొట్టమొదటిసారిగా ప్రకటించాడు. అమెరికా తన దృక్పథాన్నే పూర్తిగా మార్చుకుంటున్న రీతిలో ఇతడు, భారతీయ ఉపఖండంలో పరిణామాలు 1948లో అమెరికా చేసిన తీర్మానాన్ని అధిగమించాయని చెబుతూ కాశ్మీర్‌లో రెఫరెండం జరపాలన్న భావనను తిరస్కరించాడు. ''జాతులపరంగా వైవిధ్య పూరితమైన భారతదేశం వంటి దేశం ఎక్కడా మనలేద''నే వైఖరిని అమెరికా తీసుకోరాదని చెప్పటం ద్వారా కాశ్మీర్ స్వయం నిర్ణయాధికార హక్కును క్లింటన్ వాస్తవంగానే తిరస్కరించాడు. పైగా క్లింటన్ పాకిస్తాన్‌కి బయలుదేరు సందర్భంలో అతని జాతీయ భద్రతా సలహాదారైన శాండీబెర్గర్ భారతదేశంతో ఘర్షణ పడరాదని, లేదంటే తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతూ పాకిస్తాన్‌ని హెచ్చరించాడు. చివరగా పాకిస్తాన్‌లో సైతం ''కాశ్మీర్ వివాదంలో మేం మధ్యవర్తిత్వం వహించలేం, ఇకముందు కూడా అందుకు పూనుకో''మంటూ అతడు ప్రకటించాడు.

ఒక్క రాత్రికి రాత్రే ఇంత అద్భుతం ఎలా సంభవించింది? నిజానికి ఇది అమెరికా ఆర్థిక, రాజకీయ డిమాండ్లకుగాను భారతదేశాన్ని పూర్తిగా లొంగదీసుకోడానికి, మరోవైపున భారత ప్రాంతీయాధిపత్య పాత్రను అమెరికా ఆమోదించడానికిగానూ పరస్పరం ఇచ్చిపుచ్చుకునే చర్య మాత్రమే. దీనికితోడు బి.జె.పి. అవలంభిస్తున్న ముస్లిం వ్యతిరేక దృక్పథం ఈ నూతన బంధాన్ని త్వరితం చేసింది. తైవాన్ సమస్యపై అమెరికాకు చైనాతో పెరుగుతున్న సంఘర్షణ నేపథ్యం, ఆసియాలో అమెరికా ప్రయోజనాలకు ఎదురవుతున్న తీవ్ర ప్రమాదం కూడా దక్షిణాసియా ప్రాంతంలో సరియెత్తు (కౌంటర్ బ్యాలెన్స్)ను అవసరం చేసింది. దీంతోపాటు ఇండో-పాక్ ఘర్షణలో ఒకప్పుడు ఈ ప్రాంతంలో సోవియట్ రష్యా ప్రభావం నడచిన రోజుల్లో పాకిస్తాన్‌కి ఇచ్చినటువంటి ప్రాధాన్యత ఇప్పుడు అవసరం లేదు. పైగా పాకిస్తాన్‌లోని ఇస్లామిక్ శక్తులు ఆ దేశాన్ని ఇప్పుడు నమ్మదగని మిత్రుడిగా మార్చేశాయి. దీంతో పోలిస్తే అమెరికా ఉత్పత్తులకు భారతదేశం అతిపెద్ద మార్కెట్‌గా వుంది. పైగా భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో అమెరికా ప్రయోజనాల పరిరక్షణకు భారీ సంఖ్యలో వున్న భారత సైన్యం ఓ బలిపశువులా పనిచేస్తుంది కూడా.

కాబట్టి ఈ లక్ష్యాలన్నింటి సాధనకుగాను క్లింటన్ తన బలాధిక్యతను ప్రదర్శిస్తూ భారీ సంఖ్యలో అధికార గణంతో సహా విచ్చేశాడు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు శాండీ బెర్గర్, వైట్‌హౌస్ ప్రధానాధికారి జాన్‌పొడెస్టన్, విదేశాంగ మంత్రి మాడలిన్ ఆల్‌బ్రైట్, ఆమె డిప్యూటీ అయిన స్ట్రోబ్ టాల్బోట్, వాణిజ్య కార్యదర్శి విలియండాలీ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అమెరికన్ ప్రభుత్వ శాఖల సమన్వయకర్త మైఖేల్ స్టీఫెన్, ఇంకా వందలాదిమంది బడా వ్యాపారులు, జర్నలిస్టులూ....ఇందరిని వెంటబెట్టుకుని మరీ వచ్చాడు క్లింటన్.

క్లింటన్ పర్యటనలో భాగంగా 1000 మంది అమెరికా భద్రతాధికారులు వచ్చారు. నిఘా, కమ్యూనికేషన్లకు సంబంధించి సకల సామాగ్రితో 50 రవాణా విమానాలూ, జనరేటర్లతో సహా రెండు సైనిక వాహనాలూ, 30 బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలూ, క్లింటన్ వెళ్ళినచోటకల్లా సరంజామాను తీసుకుని పోయేందుకు నాలుగు 'చినూక్' హెలికాప్టర్లు, ఆకాశం నుండి నిఘా వేసేందుకు ఎలక్ట్రానిక్ పరికరాలతో కూడిన ఐదు హెలికాప్టర్లు, అధ్యక్షుడు ఒకచోట నుండి మరో చోటుకి పోయినప్పుడు సహాయంగా 17 సాయుధ శకటాలు (ఇవి రోడ్డుకి కుడి ఎడమ రెండు వైపులనూ ఆక్రమిస్తాయి) కూడా వచ్చాయి. నాలుగు భద్రతా వలయాలు అతనిని కాపెట్టుకుని వుంటాయి. వీటిలో చిట్టచివరిదైన నాలుగో భద్రతావలయంలో మాత్రమే భారతీయులకుచోటు దొరికింది. మొదటి సెక్యూరిటీరింగ్‌లో అధ్యక్షుడి వ్యక్తిగత బాడీగార్డులు, రెండో రింగ్‌లో అమెరికన్ మెరైన్‌లూ, మూడో రింగ్‌లో యఫ్.బి.ఐ. ఏజెంట్లూ వుండగా నాలుగో రింగ్‌లో మాత్రమే భారతీయ భద్రతా బలగాలుంటాయి.

అహంకారం మూర్తీభవించిన అమెరికా అధికారులు రాష్ట్రపతి భవన్ సర్వసాధారణంగా ఇచ్చే ఆతిధ్యాన్ని సైతం తిరస్కరించారు. దేశంలో పర్యటిస్తున్న ఇతర దేశాధినేతలు సాధారణంగా రాష్ట్రపతి భవన్‌లోనే బస చేస్తారు. రాష్ట్రపతి భవన్‌కి బదులుగా వారు ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌ని మొత్తంగా తమ ఆధీనంలోకి తెచ్చుకుని దాన్ని వాస్తవంగా ఇతరులకు ప్రవేశంలేని ఒక అమెరికన్ భవంతిలాగా మార్చేశారు. దీని బిల్లు మాత్రం భారతదేశమే చెల్లించింది. ఆ హోటల్ ఉద్యోగులు అవమానకరమైన భద్రతా తనిఖీల బారినపడ్డారు. ఇంత జరిగినా, అమెరికన్ సేవకులే అధ్యక్షుల వారిని సేవించారు. చివరకు ఫర్నీచర్, షీట్లు, బెడ్ కవర్లు, మినరల్‌వాటర్, ఆహార సామాగ్రి సకలమూ అమెరికా నుండే తరలి వచ్చింది.

ఈ పనికిరాని ఆర్భాటాలన్నీ కేవలం భద్రత కోసం కాకపోగా ప్రపంచ ప్రభువు డాంబికపు ప్రదర్శనల కోసం, స్థానిక అసమ్మతివాదులను బెదరగొట్టేందుకు మాత్రమే ఉద్దేశించినట్టివి. ఇవి వాటి ఫలితాలనవి సాధించాయి కూడా.

## బానిస పాలకవర్గం

'ప్రపంచంలోకెల్లా అత్యంత శక్తిమంతుడైన వ్యక్తి'గా మీడియా పదే పదే పొగడ్తలు కురిపించటం అవమానకరమైన విషయం. క్లింటన్ ఆడంబర, ఆట్టహాసాల ముందు వాజ్‌పేయి ఒక బఫూన్‌లాగా నవ్వుతూ కనిపించటం బాధాకరమైనది. అమెరికా అధ్యక్షుడి 20 సం॥ల కూతురు హోలీ ఆడుతుంటే దేశ విదేశాంగమంత్రి జస్వంత్‌సింగ్ ఆమెకు రక్షణగా వుండటం ఆశ్చర్యం కల్గించింది. క్లింటన్‌తో విందుకు ప్రత్యేకంగా ఆహ్వానింపబడిన 700 మంది అత్యంత ప్రముఖ భారతీయులు అమెరికా అధ్యక్షుడి రాకకోసం

మండుటెండలో నాలుగ్గంటలపాటు వేచి వుండటం, వచ్చిన తర్వాత అతగాడితో చేతులు కలపడానికి బార్లు తీరి నిలబడి పోటీ పడటం మతిమాలినపని. చివరకు అధ్యక్షుడి పర్యటన కోసమై 10 కోట్ల రూ॥లు వెచ్చించి బిక్షగాళ్ళను తరలించి, ఆక్రమిత గుడిసెలను తొలగించి వీధి జంతువులను తరిమికొట్టి శుద్ధి చేసిన హైద్రాబాద్‌కి క్లింటన్ రాక సందర్భంలో అమెరికా భద్రతాధికారులు రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి వాహనాలను విమానాశ్రయం ప్రాంగణం వద్దే అడ్డుకోవటం ఘోర విషయం. ఇక క్లింటన్‌కి వీడ్కోలు సమయంలో అధ్యక్షుడి విమానం వద్దకు పోతున్న గవర్నర్‌ను మరోసారి అడ్డుకున్నారు. ఇక బొంబాయిలో అయితే భారతీయ ఉన్నతాధికారులు ''మేం రబ్బర్‌స్టాంప్‌ల స్థాయికి దిగజార్చబడ్డాం. మేం చేయగలిగిన ఒకే ఒక పని ఏమిటంటే అధ్యక్షుడి పర్యటన గురించి అమెరికా టీమ్ చెప్పినదానికి తలలూపుతూ కూర్చోవటం మాత్రమే'' అంటూ ఆరోపించారు. ఇక రాజస్థాన్‌లో ఆ రాష్ట్ర పర్యావరణ మంత్రిని అమెరికా రహస్య సర్వీస్ ఏజెంట్లు చేతులతో అడ్డుకుని అతడు అధ్యక్షుడిని చూడనీకుండా చేశారంటే ఎవరికీ ఆశ్చర్యం గొల్పించదు. ఇక అంతిమంగా అమెరికా అధ్యక్షుడితో కరచాలనం చేయడానికి పార్లమెంట్‌లో ఎం.పి.లు ఒకరినొకరు తోసుకుంటూ పోటీ పడడంతో మన పాలకవర్గాల బానిసత్వం నీచాతినీచంగా ప్రదర్శింపబడింది.

చివరగా క్లింటన్ పర్యటన ఉన్మాదం పాలకవర్గాలతోనే ముగియలేదు. కరడుగట్టిన స్వదేశీవాదిగా పేర్కొనబడుతున్న ఆర్.యస్.యస్. అధినేత సుదర్శన్ సైతం 'క్లింటన్ పర్యటన సరైన సమయంలోనే జరిగిందం'టూ పేర్కొన్నాడు. ఆశ్చర్యకరంగానే క్లింటన్ పర్యటనకు వ్యతిరేకంగా జరిగిన విస్తృత నిరసనోద్యమంలో ఈ స్వదేశీవాద, జాతీయవాద, జాతీయ ప్రయోజనవాదాల గురించి గొంతు చించుకునే ఆర్.యస్.యస్. కలికానిక్కూడా కనిపించకుండా పోయింది.

## దేశాన్ని తాకట్టు పెట్టేందుకే ''విజన్''

బి.జె.పి. ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం సాగిస్తూ వచ్చిన లొంగుబాటు క్రమం అంతిమంగా 'విజన్ స్టేట్‌మెంట్'లో ప్రతిఫలించింది. ఈ విజన్ స్టేట్‌మెంట్ దేశాన్ని అమ్మేయడానికి సంబంధించిన రెండో విడత సంస్కరణలకు నాంది వంటిది.

ఫిబ్రవరి మొదట్లోనే అమెరికా, భారతదేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సంయుక్త కార్యాచరణ బృందాన్ని ఏర్పర్చాయి. కనీవినీ ఎరుగని స్థాయికి ఈ రెండు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని సిద్ధం చేశారు. మొట్టమొదటిసారిగా రెండు పక్షాలలో కౌంటర్ టెర్రరిజంతో వ్యవహరిస్తున్న విభిన్న కార్యాచరణ ఏజెన్సీలు భవిష్యత్ సహకారాన్ని, శిక్షణను, అనుభవాలను పంచుకోవడాన్ని, చివరగా ఇంటెలిజెన్స్ మార్పిడిని గురించి కూడా చర్చించడానికి సమావేశమైనాయి.

అట్లే క్లింటన్ పర్యటనకి కొద్దిముందుగా అమెరికా ఫసిఫిక్ ప్రాంత నౌకా దళాధినేత డెన్నిస్ బ్లెయిర్ భారతదేశాన్ని సందర్శించిన సమయంలో రెండు పక్షాలూ తమ 'కార్య నిర్వాహక బృందాల' ను పునరుద్ధరించటానికి పూనుకున్నాయి. రక్షణ బలగాల అంతర్గత సర్వీసుల ఒప్పందాలకు ఈ బృందాలు మార్గ నిర్దేశం చేస్తాయి. ప్రత్యేకించి సైన్యం, నావికా బలగం, వైమానిక బలగం మూడింటికీ ప్రాతినిధ్యం వహించిన ఈ స్టీరింగ్ బృందాలు భవిష్యత్తులో ఇంటర్ సర్వీసుల కార్యకలాపాల ప్రాధాన్యతాక్రమాన్ని నిర్ణయిస్తాయి. రూపొందించిన కార్యక్రమాలలో సంయుక్త సైనిక విన్యాసాలు, సైన్యాధికారుల మార్పిడి వంటివి కూడా వున్నాయి.

ఈ ఒప్పందాల తర్వాత, అమెరికా ప్రయోజనాల ముందు మన దేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా పూర్తిగా బంధించి వుంచే అవమానకరమైన 'విజన్ స్టేట్‌మెంట్' ముందుకొచ్చింది. ఈ విజన్ స్టేట్‌మెంట్ మొట్టమొదటిసారిగా అమెరికా సామ్రాజ్యవాద భౌగోళిక రాజకీయ సైనిక వ్యూహంలో భారతదేశాన్ని భాగం చేసేందుకు ప్రయత్నించింది. గతంలో సోవియట్ లాగా, ఇప్పుడు అమెరికా కూడా మన దేశాన్ని ప్రాంతీయ అధిపతిగా ఆమోదించటానికి అంగీకరించింది. ప్రతిఫలంగా మన దేశాన్ని అమెరికా సామ్రాజ్యవాద పథకాలకు పూర్తిగా కట్టివేయటం జరుగుతుంది. అందుచేత ''శాంతి పరిరక్షణ, ఉమ్మడి ప్రయోజనాలు, ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రత, ఆసియాలో, బయటి ప్రపంచంలో వ్యూహాత్మక స్థిరత్వం వంటి అంశాల సాధనలో భారత్, అమెరికాలు భాగస్వాములుగా వుండే ఒక నూతన శతాబ్దాన్ని'' గురించి 'విజన్ స్టేట్‌మెంట్' నొక్కి చెప్పింది. దీంతో భారతదేశం దక్షిణాసియాలో ఇజ్రేయిల్ తరహా పాత్రను స్పష్టంగానే ఆశిస్తున్నది. ఇంతేగాక భారత అణు కార్యక్రమం, దాని కనీస అణుప్రమాద నిరోధ కార్యక్రమంకి అప్రకటిత ఆమోదం లభించింది. అట్లే టెర్రరిజానికి వ్యతిరేకంగా ఉమ్మడి చర్యలను పెంచేందుకు అమెరికా నేరుగా పూనుకుంటున్నది కూడా. మరో మాటల్లో చెప్పాలంటే కౌంటర్ ఇన్‌సర్జెన్సీ కార్యకలాపాలలో దేశంలో నేరుగా జోక్యం చేసుకోవడానికి ఇది అమెరికాను ఆహ్వానించటమే అవుతుంది. బహుశా అమెరికా, భారత భద్రతా బలగాలకు తెరవెనుక రిహార్సల్స్‌కి ప్రస్తుత పర్యటన ఒక మంచి అవకాశమే కావచ్చు.

ఈ రాజకీయ-సైనిక పొత్తుకు పునాదిని ఏర్పర్చిన తర్వాత అమెరికా మన దేశ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలకు సంబంధించిన అన్ని రంగాలలో పట్టు బిగించేందుకు పూనుకుంది. విదేశీ విధానం, అంతర్జాతీయ భద్రత, ఆర్థిక, ద్రవ్య రంగాలు, కాలుష్య రహిత ఇంధన, పర్యావరణ రంగాలకు సంబంధించి అత్యున్నత స్థాయి చర్చలను ఈ విజన్ స్టేట్‌మెంట్ 'నిర్మాణం' వ్యవస్థీకరిస్తుందని అమెరికా తెలిపింది. మరో విధంగా చెప్పాలంటే ఇండో-భారత్ సంబంధాల స్థాయిని అటువంటి వ్యూహాత్మక భాగస్వామ్యం వైపుకు 'విజన్ స్టేట్‌మెంట్' వాస్తవంగానే తీసుకు పోతుంది.

## రాజకీయ రంగం : విజన్

రాజకీయ రంగానికి సంబంధించి విజన్ స్టేట్‌మెంట్ ఇలా చెబుతోంది

1. భారత ప్రధానమంత్రి, అమెరికా అధ్యక్షుడు క్రమం తప్పకుండా వార్షిక సమావేశాలను నిర్వహిస్తారు. (ఇజ్రాయిల్‌తో అమెరికా జరిపినట్లుగా) అంతేగాక వారిద్దరూ ఫోన్ ద్వారా, ఉత్తరాల ద్వారా తరచూ సంబంధాలలో వుంటారు. మరోవిధంగా చెప్పాలంటే భారత ప్రధాని అమెరికా హెడ్‌క్వార్టర్స్ నుండి నిత్యం ఆదేశాలను పొందుతుంటాడు.

2. రెండు దేశాలూ సం॥కి రెండుసార్లు 'సమావేశాలు' జరుపుతాయి. అంతేగాకుండా భారత విదేశాంగ మంత్రి, అమెరికా విదేశాంగమంత్రి స్థాయిలో విదేశీ విధానంపై చర్చలు జరుగుతాయి. విదేశాంగ విధానంపై చర్చలు కేవలం ద్వైపాక్షికమైన విదేశీ విధాన

వ్యవహారాలపై చర్చలకే పరిమితం కాకుండా భద్రత, అణుపరీక్షల నిరోధంపై జస్వంత్-టాల్బోట్‌ల మధ్య చర్చలను అవి వ్యవస్థీకృతం చేస్తాయి. ఒకవైపున ప్రాంతీయ శక్తిగా వుండాలనుకుంటున్న భారతదేశ ఆకాంక్షలు ఆసియా భద్రతపై ఇండో-అమెరికా చర్చలలో ఇప్పటికే ప్రతిబింబించాయి. మరోవైపు, సి.టి.బి.టీ.పై అణునిరోధంపై అమెరికా వైఖరిని భారత ప్రభుత్వం వాస్తవంగానే ఆమోదించింది. ''రెండు దేశాలూ మరిన్ని అణువిస్ఫోటన పరీక్షలను నిర్వహించవని, అణు విచ్ఛేదక సామాగ్రి, అణ్వాయుధాల ఉత్పత్తిని ఆపివేసేందుకు గానూ ఒడంబడికలపై కలిసి పనిచేస్తా''యని 'విజన్ స్టేట్‌మెంట్' చెప్పడంద్వారా ఇది రుజువయింది.

మరోలా చెప్పాలంటే ప్రధానమంత్రి, భారత విదేశాంగ శాఖ అమెరికా విధాన రూపకల్పనా పరిధిలోకి లాగబడటమేకాదు. బి.జె.పి. ఆధ్వర్యంలోని ప్రభుత్వం దొడ్డిదోవన సమగ్ర అణు పరీక్షల నిషేధ ఒడంబడికను ఆమోదించేసింది.

## ఆర్థిక రంగం : విజన్

ఇక ఆర్థిక రంగంలో 'విజన్ స్టేట్‌మెంట్' మరింతగా పెనవేసుకు పోయింది. దీంట్లో సైతం రెండు దేశాలూ ఆర్థికపరమైన సంభాషణలను క్రమబద్ధం చేయడానికి అంగీకరించాయి. అవేవంటే;

1. ప్రధానమంత్రి కార్యాలయం, వైట్‌హౌస్‌ల నేతృత్వంలో ఒక అత్యున్నత స్థాయి ''సమన్వయ బృందం'' ఏర్పడుతుంది. ఈ 'కో ఆర్డినేషన్ గ్రూప్'' భారత్, అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖల మద్దతుతో ఈ చర్చలను సాగిస్తుంది. ఈ సమన్వయ బృందం అంతర్గత మంత్రిత్వశాఖల విస్తృత చర్చల ఆధారంగా ఒక ఉమ్మడి ఆర్థిక ఎజెండాను కూడా రూపొందించుకుంటుంది. ఇది సారాంశంలో, మన దేశం మొత్తం ఆర్థిక విధాన రూపకల్పనలో అమెరికా విదేశాంగశాఖ జోక్యానికి వీలు కల్పిస్తుంది. ఇంతకుముందు అనధికార పూర్వకంగా జరిగినట్టిది ఇప్పుడు అధికారిక విధానంగా మారుతుంది.

2. భారత్, అమెరికాలు ఒక ఇండో-అమెరికన్ ఆర్థిక ఫోరంని ఏర్పరుస్తాయి. పెట్టుబడి, స్థూల ఆర్థిక విధానాలకు సంబంధించిన ఈ విభాగం భారత్, అమెరికా ఆర్థికమంత్రుల నేతృత్వంలో నడుస్తుంది. కాబట్టి ఇప్పుడు, మన ఆర్థిక ప్రణాళిక మొత్తంగానే అమెరికా ఆర్థికశాఖ అభీష్టానుసారం రూపొందించబడుతుంది.

3. ఇదే విధంగా ఉభయదేశాల వాణిజ్య మంత్రుల ప్రమేయంతో కూడిన వేదిక కూడా ఏర్పరచబడుతుంది. భారత్, అమెరికా సమాజాలను మరింతగా సన్నిహితం చేసేందుకుగానూ భారత్, అమెరికా వాణిజ్యమంత్రులు ఈ వేదికకి సంబంధించిన చర్చలను సాగిస్తారు. మరోమాటలో చెప్పాలంటే భారతదేశ వాణిజ్య విధానాలు సైతం అమెరికా వాణిజ్యమంత్రి కనుసన్నలలో సాగుతాయి.

4. ఈ రెండుదేశాలూ కాలుష్యరహిత ఇంధన, పర్యావరణాలపై ఉమ్మడి సంప్రదింపుల బృందాన్ని ఏర్పరుస్తాయి. ఇది అమెరికా, భారత విదేశాంగశాఖల నేతృత్వంలో నడుస్తుంది. ప్రపంచంలోనే అత్యంత అధిక స్థాయిలో గ్రీన్‌హౌస్ వాయువును (వాతావరణ కాలుష్యం ద్వారా సూర్య నక్షత్రం నుండి రేడియేషన్‌ని అధికంగా ఆకర్షించి భూఉష్ణోగ్రతను పెంచివేసేవి) వాతావరణంలోకి విడుదల చేస్తున్నప్పటికీ అమెరికా దేశీయంగా ఆ వాయువులను తగ్గించడానికి అంగీకరించడం లేదు. దీనికి భిన్నంగా అమెరికా తన కాలుష్య కారకాల వాణిజ్య యంత్రాంగం (దీన్నే 'స్వచ్ఛమైన అభివృద్ధి యంత్రాంగం' అంటున్నారు) ఆధ్వర్యంలో వెనుకబడిన దేశాలు కాలుష్యకారక వాయువులను తగ్గించుకోవాల్సిందిగా కోరుతున్నది. అయితే వెనుకబడిన దేశాలకు అన్వయిస్తున్న ఈ యంత్రాంగాన్ని 'క్యోటో ప్రోటోకాల్' కింద అమెరికా తన సొంత కాలుష్య వాయువుల తగ్గింపులో భాగంగా ప్రదర్శించుకుంటుంది.

5. భారత్, అమెరికాలు 'ఇండో అమెరికన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫోరం' ఏర్పాటుకు నిర్ణయించుకున్నాయి. జన్యుశాస్త్ర పరిశోధన వంటి వాటిని ప్రోత్సహించే ఇలాంటి ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి అమెరికా గత రెండు సం॥లుగా తీవ్రంగా ఒత్తిడి తీసుకొస్తోంది. ప్రత్యేకించి ఇంధన కణాలు (ఫ్యూయల్ సెల్స్), జీవపరమైన ఇంధనాలు (బయోఫ్యూయల్స్) వ్యవసాయ జీవ సాంకేతిక శాస్త్రం, సంకరజాతి పంటలు వంటి అంశాలలో పరిశోధనకు అమెరికా డిమాండ్ చేస్తూ వచ్చింది. సాంకేతిక జ్ఞాన మార్పిడిని కూడా ఈ ఫోరం ప్రోత్సహిస్తుంది.

అందుచేత, అన్ని విధాలుగా ఈ 'విజన్ స్టేట్‌మెంట్' మనదేశ ప్రజలను అవమానిస్తూ, హీనపరుస్తూ, అగౌరవపరుస్తోంది. ఏ బహిరంగ చర్చా లేకుండానే, అత్యంత బలహీనమైన సంకీర్ణ ప్రభుత్వం ఇంతటి దుష్పరిణామాలను కల్గించగల ఒప్పందంపై సంతకాలు పెట్టడం జరిగిపోయింది. దీని వివరాలు చాలా ముందుగానే బయట పెట్టాల్సినప్పటికీ ఒప్పందాలపై సంతకాలు అయిన తర్వాత మాత్రమే వాటిని బహిరంగపర్చారు.

అయితే ఇది ఇంతటితోనే ముగియలేదు. విజన్ స్టేట్‌మెంట్ తర్వాత పలు ఆర్థిక ఒప్పందాలు వరుసగా ముందుకొచ్చాయి.

## బిగుసుకుంటున్న ఆర్థిక ఉచ్చు

ఇండో-అమెరికన్ వాణిజ్య సంభాషణలు, శాస్త్ర, సాంకేతిక రంగ వేదిక, ఇంధన, పర్యావరణ రంగపు ఒడంబడికలను రూపొందించటం ద్వారా 'విజన్ స్టేట్‌మెంట్' రెండురోజులలోపే ఆచరణలోకి వచ్చింది. వీటితోపాటుగా సియాటిల్ చర్చల కొనసాగింపుగా జరిగిన డబ్ల్యు.టి.ఒ. సమావేశంలో చర్చకొచ్చిన పలు అంశాలపై అమెరికా విధానాన్ని సమర్థించటానికి భారతదేశం ప్రతినబూనింది.

తన భారత పర్యటన ముగిసే నాటికి అమెరికా టి.ఎన్.సి.లకు మేలు కల్పించే 4 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు క్లింటన్ ప్రకటించాడు. వీటిలో సమాచార సాంకేతిక రంగంలో నాలుగు, పర్యావరణ రంగంలో మూడు, విద్యుచ్ఛక్తిపై మూడు, పర్యాటక రంగంలో ఒకటి కుదిరాయి. వాటితోపాటుగా అమెరికా నుండి దిగుమతుల కల్పనకై ఐ.డి.బి.ఐ.తో బిలియన్ డాలర్ల రుణంకి సంబంధించిన ఒక అవగాహనా పత్రంపై అమెరికాకు చెందిన 'ఎగుమతి-దిగుమతుల బ్యాంక్' సంతకం చేసింది. ఇక భారతదేశం వంతుకొస్తే, అది అమెరికా ఒత్తిడికి మరింతగా లోబడిపోయి, అమెరికా వ్యవసాయోత్పత్తుల ఎగుమతులకు నాలుగుకోట్ల డాలర్ల పైగా విలువయిన మార్కెట్ అవకాశాన్ని కల్పించేందుకు అంగీకరించింది. ఈ ఒప్పందం ప్రకారం భారతదేశం అమెరికన్ వ్యవసాయ సరకులపై సుంకాన్ని తగ్గించాల్సి వుంటుంది.

ఈ పర్యటన కాలంలో భారత పరిశ్రమల సమాఖ్య (సి.ఐ.ఐ.) భారతదేశంలో అమెరికా ప్రయోజనాలను కాపాడే అత్యంత ప్రధాన సాధనంగా ఉనికిలోకి వచ్చింది. దాని అధ్యక్షుడూ, 'స్వదేశీ' పతాకధారీ అయిన రాహుల్ బజాజ్ భారత్-అమెరికాల మధ్య ఒక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన భావాన్ని సి.ఐ.ఐ. ఎప్పుడో ఆమోదించిందని చెప్పేటంతవరకూ పోయాడు. అమెరికా వాణిజ్యమంత్రి సమక్షంలో ఇంధన, పర్యావరణ రంగానికి సంబంధించిన ఒక ఒప్పందంపై సి.ఐ.ఐ., అమెరికా ఇంధన సమితి రెండూ సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాలన్నింటిలోకెల్లా దక్షిణాసియాలో భారత విస్తరణ వాదం పాత్రను ఆమోదించిన ఒప్పందం దిగ్భ్రాంతి గొల్పుతుంది. ఇందుకు సంబంధించి ఆసియాలో ప్రజాస్వామిక పాలనను ప్రోత్సహించేందుకై సి.ఐ.ఐ. 'అమెరికన్ ప్రజాస్వామ్య ధర్మనిధి సంస్థ'తో ఒప్పందం కుదుర్చుకుంది. విదేశాంగశాఖమంత్రి మాండలిన్ ఆల్‌బ్రైట్ సమక్షంలో ఇందుకు సంబంధించి సంతకాలు జరిగాయి.

అమెరికా ఇప్పటికే భారత ఆర్థిక వ్యవస్థపై దుర్మార్గపూరితమైన పట్టు సంపాదించేసింది. ప్రస్తుత విధానాలూ, ఒప్పందాలూ దాని పట్టును మరింతగా బిగించడానికే తోడ్పడతాయి. ప్రపంచంలోకెల్లా ప్రధాన సామ్రాజ్యవాద శక్తిగా అమెరికా తన శత్రువులకన్నా చాలా ముందుంది. అమెరికాలోని అతిపెద్ద 500 కంపెనీలలో 20శాతం కంపెనీలు మనదేశంలో బలంగా పునాదులు వేసుకున్నాయి. ఆమోదించిన మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో 48శాతం పెట్టుబడులు అమెరికావే. 1991-99 మధ్యకాలంలో భారతదేశంలో అడుగుపెట్టిన అతిపెద్ద విదేశీ మదుపుదారుగా 24 శాతం వాటాతో అమెరికా మిగతా విదేశీ మదుపుదార్లకంటే చాలాముందుంది. (7 శాతం బ్రిటన్ పెట్టుబడులతో, తలొక నాలుగుశాతం జర్మనీ, జపాన్ పెట్టుబడులతో పోలిస్తే వ్యత్యాసమెంత వుందో అర్థమవుతుంది.) భారతదేశపు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అమెరికాయే. భారతదేశపు ఎగుమతులలో 22శాతం వాటా అమెరికాదికాగా బ్రిటన్, జర్మనీ, జపాన్ మూడింటి వాటా 16శాతం మాత్రమే వుంది. భారత దిగుమతుల్లో అమెరికాకు 9శాతం వాటా వుంది. 1999లో అమెరికాతో భారతీయ వాణిజ్యం 13 బిలియన్ డాలర్ల మేరకు వుండింది. కొద్ది సం॥లలోపే అది 20 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా, దీనికితోడుగా విద్యుచ్ఛక్తి, సమాచార రంగాలలో భారీ పెట్టుబడులకు పథకాలు సిద్ధమయినాయి.

చివరగా భారత ఆర్థిక వ్యవస్థ పగ్గాలను మరింతగా బిగించేందు కోసం క్లింటన్ తక్షణమే భారత ఆర్థికమంత్రిని అమెరికాకు రమ్మని కబురు పెట్టాడు. పార్లమెంట్‌లో బడ్జెట్ సమావేశాల మధ్యలో ఆర్థికమంత్రి అమెరికాకు పోవలసి వుంది. క్లింటన్ ఆజ్ఞలను యశ్వంత్‌సిన్హా శిరసావహిస్తాడు. ప్రధానమంత్రి సైతం సెప్టెంబర్‌లో అమెరికాకు పయనం కానున్నాడు.

అయినప్పటికీ, పాలకవర్గాలు అమెరికా దాడులకు పాదాక్రాంతమైపోగా, మరోవైపు అందుకు నిరసనగా లేచి నిలబడిందీ, గళమెత్తి నిరసన తెలిపిందీ ప్రజలు మాత్రమే. తమ నిరసన ద్వారా ప్రజలు విదేశీ దోపిడీదొంగలు, వారి భారతీయ తోడుదొంగల గుండెల్లో కలవరం పుట్టించారు.

## దేశవ్యాప్తా ప్రతిధ్వనించిన నిరసన వెల్లువ

## బంద్‌కు పిలుపిచ్చిన సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్సవార్]

నిరసనకి సంబంధించిన వార్తలను మీడియా తొక్కిపెట్టినప్పటికీ భారత్, బంగ్లాదేశ్‌లలో క్లింటన్ పర్యటనకు వ్యతిరేకంగా నిరసనల వెల్లువకు సంబంధించిన వార్తలు తగుమాత్రం వెలికి వచ్చాయి.

ప్రజాగ్రహానికి అమెరికా అధ్యక్షుడు ఎంతగా భయకంపితుడు అయినాడంటే తన పటిష్టమైన భద్రతావలయాన్ని దాటి అతగాడు బయటకు రాలేకపోయాడు. భారతదేశంలో ఇతడు విడిది చేసిన చోటల్లా వాస్తవంగానే అమెరికా భూభాగంలాగా మార్చబడింది. అంటే భారతదేశంలో ఎవ్వరితోనూ ఇతడికి సంబంధం లేకుండా పోయింది. 1982లో 'చోగమ్' సమావేశాలకు హాజరైన 95 దేశాల అధినేతలకు కల్పించిన భద్రతకంటే ఈ ఒక్కగానొక్క వ్యక్తికి కల్పించిన భద్రతే ఎక్కువగా వుండింది. బంగ్లాదేశ్‌లో తన కార్యక్రమంలో భాగంగా వెళ్ళాల్సిన ఒక గ్రామానికి క్లింటన్ వెళ్ళకుండా ఆగిపోయాడు. కారణం ఆ గ్రామానికి 30 కి.మీ. పాటు దట్టమైన అడవులగుండా అతడి హెలికాప్టర్ పయనించాల్సి రావడమే. ఇంకా బంగ్లాదేశ్‌లో పర్యటించినా, రక్షణ భయంతో 'అమర జవాన్ స్థూపానికి పూలదండ సైతం వేయలేక పోయిన ఏకైక దేశాధినేత'గా పేరును కూడా క్లింటనే కొట్టేశాడు. ఇక పాకిస్తాన్ పర్యటనలో ఈ భయం ఏ స్థాయికి చేరుకుందంటే తన సొంత విమానమైన 'ఎయిర్‌ఫోర్స్ వన్' ద్వారా కాకుండా ఏ గుర్తింపూలేని ముసుగు విమానంతో ఇతడు పాకిస్తాన్ వెళ్ళాడు. నిజంగానే ఈ సామ్రాజ్యవాదపు ప్రధాన నియంత ప్రపంచ పీడిత ప్రజానీకపు అత్యంత తీవ్ర ద్వేషానికి గురయిన వారిలో ఒకడుగా నిలిచాడు.

బంగ్లాదేశ్‌లో ఢాకా యూనివర్శిటీ విద్యార్థులు వందలాదిమంది అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిరసనగా ప్రదర్శన జరిపారు. విమానాశ్రయంలో క్లింటన్‌కి స్వాగత కార్యక్రమాన్ని అడ్డుకోకుండా విద్యార్థులను నిరోధించేందుకుగాను పోలీసులు యూనివర్శిటీ చుట్టూ వలయంగా ఏర్పడ్డారు. ''క్లింటన్ ఒక అంతర్జాతీయ టెర్రరిస్ట్, మన సహజ వనరులను కొల్లగొట్టేందుకే అతడిక్కడికొచ్చాడు'' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. (క్లింటన్ కొన్ని గంటల పర్యటనా కాలంలోనే బంగ్లాదేశ్ విస్తృతమైన సహజ చమురువాయు నిల్వలను రెండు అమెరికన్ టి.ఎన్.సి.లకు అప్పగిస్తూ రెండు ప్రధాన ఒప్పందాలు జరిగాయి) యూనివర్శిటీ భవనంపై విద్యార్థులు నల్లజెండాను ఎగురవేయగా పోలీసులు దానిని కిందికి దించేశారు. అదే సమయంలో ఢాకా శివార్లలో 'క్లింటన్ గోబ్యాక్' అనే నినాదాలతో కూడిన వందలాది నల్లబెలూన్లను ఆకాశంలో ఎగురేశారు.

భారతదేశంలో పక్షంరోజుల పొడవునా ప్రధాన నగరాలలోనేకాక చిన్న చిన్న పట్టణాలలో సైతం నిరసన ప్రదర్శనలు జరుగుతూ వచ్చాయి. నిరసన ప్రదర్శనలు క్లింటన్ రాకకు పదిరోజుల ముందు మొదలై భగత్‌సింగ్ సంస్మరణ దినంనాటికి పరాకాష్టకు చేరుకున్నాయి.

ఢిల్లీలో ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్., డి.యస్.యు. (డెమాక్రటిక్ స్టూడెంట్ యూనియన్) లు సామ్రాజ్యవాద వ్యతిరేకఫ్రంట్‌ని ఏర్పర్చడానికి చొరవ తీసుకున్నాయి ఈ ఫ్రంట్‌లో. సి.పి.ఐ. (యం-యల్) న్యూడెమాక్రసీ, జనశక్తి, 'న్యూ ఇనిషియేటివ్' లు కూడగా తర్వాత రెడ్‌ఫ్లాగ్ వచ్చిచేరింది. క్లింటన్ పార్లమెంట్‌లో

ప్రసంగిస్తున్న సమయంలోనే దానికి సమీపంలోని 'జంతర్‌మంతర్' వద్ద ఫ్రంట్ ఒక ఊరేగింపు తీసింది. పంజాబ్, హర్యానాల నుంచి వచ్చిన వారితో సహా 1000 మందిదాకా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. 'దిశా సాంస్కృతిక్ మంచ్' అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఒక నాటిక ప్రదర్శించింది. తర్వాత ప్రదర్శనకారులు పార్లమెంట్ వైపుగా తరలివెళ్ళి పోలీసు బారికేడ్లను విచ్ఛిన్నం చేయబోగా, వీరందరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. మార్చి 18కి ముందునుండే షాహద్రా, ఓఖ్లా కార్మికులు బహిరంగ సభలు పెట్టి, ఊరేగింపులు తీసి, క్లింటన్ గడ్డిబొమ్మను తగులబెట్టారు. 'ప్రపంచ బందిపోటూ.... వెళ్ళిపో'' అన్నది వారి ప్రధాన నినాదం. క్లింటన్ నేరాలకు సంబంధించిన ప్లేకార్డులను ప్రదర్శించారు. వీటితోపాటుగా,.... క్లింటన్ అడుగుపెట్టిన రోజున బహిరంగ ప్రదర్శనలన్నింటినీ నిషేధించిన ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కళాకారులూ, విద్యావేత్తలు నిరసన తెలిపారు. పోలీసులు దాడుల పరంపర సాగించి ఢిల్లీలో 300 మంది ముస్లింలను ముందు జాగ్రత్తచర్యగా అరెస్టు చేశారు. మార్చి 19, 21 తేదీలలో ప్రజా ప్రదర్శనలు జర్గ్గా పోలీసులు లాఠీచార్జి చేసి వాటర్ క్యానన్‌లతో చెదరగొట్టారు.

మహారాష్ట్రలో ముంబాయి, పూనే తదితర పలు పట్టణాలలో ఊరేగింపులు, ప్రదర్శనలు జరిగాయి. మార్చి 17 నుండి 25 దాకా ముంబాయ్‌లో 22 సంఘాలతో కూడిన ఫ్రంట్ ప్రదర్శనలు చేసింది. ఈ ఫ్రంట్ అనేక కార్మికసంఘాలు, విప్లవ విద్యార్థి, యువజన సంఘాలతో కూడుకుని వుంది. ఈ ప్రదర్శనలలో వందలాది మంది పాల్గొన్నారు. 10,000 పోస్టర్లను అంటించి కరపత్రాలు పంచారు. భగత్‌సింగ్ వర్ధంతి రోజున మానవహారం ఏర్పర్చారు. మార్చి 24న జరిగిన మరొక ప్రదర్శనపై లాఠీచార్జీ జరిగి 1000 మంది అరెస్టయినారు. పూనేలో ఫ్యాక్టరీ గేట్లు, కాలేజీ క్యాంపస్‌ల వద్ద పలు సంఘాలు గుమికూడి నిరసన సభలు జరిపారు. మార్చి 23న నిరసన ఊరేగింపు; ర్యాలీతో అవి ముగిశాయి. చివరకు జిల్లా పట్టణమైన జలగావ్‌లో సైతం ఒక రోజంతా నిరాహారదీక్ష జరిపి క్లింటన్ పర్యటనకు వ్యతిరేకంగా కరపత్రాలు పంచారు.

క్లింటన్ ప్రధాన మజిలీలో ఒకటైన హైదరాబాద్‌లో 40 సంఘాలు ఒకటై సామ్రాజ్యవాద వ్యతిరేక ఫోరంని ఏర్పర్చాయి. ఇది విప్లవ, ప్రజాతంత్ర, దళిత, మహిళా సంఘాలతో కూడుకున్నది. స్వాతంత్ర సమరయోధుడు కాళోజీ నారాయణరావు, రాజబహదూర్ గౌడ్, ప్రఖ్యాత జర్నలిస్ట్ ఏ.బి.కె. ప్రసాద్‌లు అధ్యక్షవర్గంగా, ప్రొఫెసర్ హరగోపాల్, కేశవరావ్ జాదవ్, ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్.కి చెందిన శరత్‌లు కన్వీనర్లుగా వున్న ఈ ఫోరం కింది కార్యక్రమాలను నిర్వహించింది. మార్చి 4న 100 మంది ప్రసిద్ధ రచయితలు పత్రికా కాన్ఫరెన్స్‌ని జరిపి, సాంస్కృతిక సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటానికి పిలుపునిచ్చారు. మార్చి7న సామ్రాజ్యవాద వ్యతిరేక సదస్సు జరిగింది. 'క్లింటన్ గోబ్యాక్', 'సామ్రాజ్యవాద బడితొత్తులు వాజ్‌పెయి/ చంద్రబాబు ప్రభుత్వాలు నశించాలి', 'యం.యన్.సి.లూ దేశంనుంచి వెళ్ళిపోండి' అన్నవి ఈ సదస్సు ప్రధాన నినాదాలు. మార్చి 12న రచయితలు, కళాకారులు, కార్టూనిస్టులు, నటులూ వగైరాలతో కూడిన ఒక సృజనాత్మక ప్రదర్శన జరిగింది. మార్చి 19న టాంక్‌బండ్‌పై ఒక ప్రదర్శన జరిగింది. ఫోరమ్‌కి చెందిన సుప్రసిద్ధ కార్యకర్తలైన యం.టి. ఖాన్, హరగోపాల్, రత్నమాల, చలసాని ప్రసాద్ తదితరులు అరెస్టయినారు. క్లింటన్ హైదరాబాద్‌కి వచ్చిన మార్చి 24వ తేదీన ఫోరం తిరిగి 'గోబ్యాక్ క్లింటన్' ప్రదర్శన టాంక్‌బండ్‌పై జరపగా అందరినీ అరెస్ట్ చేశారు.

బెంగుళూరులో పలు సంఘాలతో కూడిన సామ్రాజ్యవాద వ్యతిరేక ఫోరం ఏర్పడింది. ఇది రోడ్ల కూడళ్ళలో అనేక నిరసన సభలు జరిపింది. మార్చి 23న ఒక ర్యాలీలో క్లింటన్ గడ్డిబొమ్మను తగులబెట్టి సామ్రాజ్యవాద వ్యతిరేకదినాన్ని పాటించింది.

భోపాల్‌లో క్లింటన్, యూనియన్ కార్బైడ్ అధ్యక్షుడు ఆండర్సన్‌ల గడ్డిబొమ్మలు తగులబెట్టారు. పలు సంఘాలు నిరాహారదీక్ష, ధర్నాలు, ప్రదర్శనలు జరిపాయి. తర్వాత అమెరికన్ వస్తువులను తగులబెట్టారు. జనఏక్తామంచ్ కూడా మార్చి 18 నుండి దినవారీ సభలు జరిపింది. మార్చి 21ని 'సామ్రాజ్యవాదీ విరోధ్ దివస్'గా జరిపింది.

క్లింటన్ పర్యటించే ప్రధాన నగరాలలో ఒకటైన జైపూర్‌లో 24 సంఘాలు కలిసి క్లింటన్ పర్యటనని వ్యతిరేకిస్తూ అతడికి జైపూర్ ప్రజలు ఒక చుక్క నీటిని కూడా ఇవ్వరాదంటూ ప్రకటించాయి. వీరు క్లింటన్ గడ్డిబొమ్మను కాలుస్తూ హోలీ జరుపుకున్నారు. రాజస్థాన్‌లోని పలు పట్టణాలలో ర్యాలీలు జరిపారు. ఆగ్రాలో పలు సంఘాలు భారతదేశంపట్ల అమెరికా సామ్రాజ్యవాద వైఖరికి వ్యతిరేకంగా, క్లింటన్‌కి భద్రత పేరుతో స్థానిక ప్రజలను అవమానిస్తున్న తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపాయి. అమెరికన్ భద్రతాధికారుల ఆదేశంతో ఆగ్రాలో కర్ఫ్యూ లాంటి పరిస్థితిని రుద్దారని వారు ఆరోపించారు. నిరసనగా గడ్డి బొమ్మలు తగులబెట్టారు.

కాశ్మీర్‌లో అఖిల పార్టీ హురియత్ కాన్ఫరెన్స్ (ఏ.పి.హెచ్.సి.) కాశ్మీర్‌లో ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న జాతి హత్యాకాండకు వ్యతిరేకంగా మార్చి 22న బంద్‌కి పిలుపిచ్చింది. కానీ దాని ఆఫీస్‌ని పోలీసులు ఆక్రమించి ఛైర్మన్‌ని అరెస్ట్ చేశారు. ఢిల్లీలో ఒక సమావేశానికి పోనున్న జె.కె. డెమోక్రటిక్ ఫ్రీడమ్ పార్టీకి చెందిన 15 మంది సభ్యులను సైతం అరెస్ట్ చేశారు.

వీటికి తోడుగా పాట్నా, కాన్పూర్, లూధియానా, వారణాసి, కలకత్తా, కేరళలోని పలు నగరాలలో, దేశంలోని ఇతర ప్రాంతాలలో ప్రదర్శనలు, సత్యాగ్రహాలు, క్లింటన్ బొమ్మని తగులబెట్టడాలు జరిగాయి. సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] ఆంధ్రలో బంద్ పిలుపిచ్చింది. పశ్చిమబెంగాల్ సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల ర్యాలీలతో హోరెత్తిపోయింది.

క్లింటన్ పర్యటన తర్వాత ఈరోజు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని సాధారణంగానూ, అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని ప్రత్యేకంగానూ తీవ్రతరం చేయాల్సిన అవసరం మునుపెన్నటికన్నా ఎక్కువగానే వుంది. ప్రతిరోజూ, ప్రతి గంటా మన ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలు, సంస్కృతి సామ్రాజ్యవాద కౌగిలిలోకి మరింత లోతుగా పోతున్నాయి. దేశ ప్రజారాసులు మాత్రం తీవ్ర బాధలపాలవుతున్నారు. హక్కులు, స్వేచ్ఛ పద్ధతి ప్రకారం హరించుకు పోతున్నాయి. వెనుకబడిన భూస్వామ్య సంబంధాలు కొనసాగు తున్నాయి. దేశం మరింత అంధకారంలోకి పోతోంది. విప్లవాత్మక ప్రజా తిరుగుబాటు ఒకటే ఏకైక ఆశగా, ఆకాంక్షగా వుంటోంది. ఎందుకంటే ప్రస్తుత ఫాసిస్టు, సామ్రాజ్యవాద దాడిని ఒక మిలిటెంట్ శక్తి మాత్రమే తిప్పికొట్టగలదు. సామ్రాజ్యవాదులూ, టి.ఎన్.సి. యజమానులూ, వారి భారతీయ తొత్తులూ, రానున్న విప్లవ తుఫాను అలలకు కంపించి పోయేలా చేద్దాం. ❑

## మైత్రీ సదస్సులు

# రాష్ట్ర ప్రజలపై పెరిగిపోతున్న రాజ్యహింసకి తెల్ల ముసుగు మాత్రమే ''మైత్రి''

గతంలో ''ప్రజా దర్బార్లు'', ''శాంతి సంఘాలు'', ''ప్రజాసేవా కేంద్రాలు'' పేరుతో కొంత కాలం చలామణీ అయి, వీటికి సంబంధించి ప్రజలకు ఎలాంటి పాత్ర, ప్రయోజనం ఆసక్తి లేని కారణంగా వెనక్కి పోయిన కార్యక్రమాలనే తిరిగి చంద్రబాబు ప్రభుత్వం తాజాగా ''మైత్రి'' పేరుతో ప్రజల మీదికి ప్రయోగిస్తోంది.

పోలీసులు, ప్రజల మధ్య దూరాన్ని పూడ్చే వారధి అని, 'ప్రజలకే అధికారం అప్పగించే ప్రక్రియ' అని, ఈ మైత్రి గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు పరమ డాంబికంగా ప్రకటిస్తున్నాడు. సామాన్య ప్రజల పాలిట భక్షక భటులుగా పేరుమోసి పోయి, ప్రజలకు పెనుభారమై పోయిన పోలీసులు వారికి చేరువయ్యే ప్రశ్నే లేదు. కనుక ప్రజలనే పోలీసుల దగ్గరకు చేరుస్తూ, పోలీసులు ప్రజలకు చేరువై పోయారు అని చూపెట్టే ప్రక్రియే ఈ 'మైత్రి'. ఈ 'ప్రజలు' సైతం ఎక్కువ శాతం తెలుగుదేశం పార్టీ నేతల వెనుక ఆవారాగా తిరిగే అనుచరగణమే అయి వుంటారనడానికి సందేహం లేదు. ప్రజా వ్యతిరేకులుగానే ప్రజల ముందు నిల్చున్న పోలీసుల పాత్ర, ప్రవర్తనలకి ఇంత వరకు లేని నైతికతా, సాధికారతలను ఎంతో కొంత కల్పించాలనే తాపత్రయమే ఈ మైత్రి వెనుక పనిచేస్తోంది. తన పార్టీలో, ప్రభుత్వంలో తన అభిప్రాయమే తప్ప రెండో అభిప్రాయం అవసరం లేదని బాహాటంగానే కూసిన దురహంకారి చంద్రబాబు ప్రజలకు అధికారం అప్పగిస్తానంటూ చేస్తున్నదంతా పరమ డాంబికం, దగా మాత్రమే. ఇక ఈ మైత్రి సంఘంలో సభ్యులు ఎవరుండాలి అనేది ఆయా ప్రాంతాల పోలీసు అధికారులు నిర్ణయిస్తారట. ఇందులో వుండగల ప్రజాస్వామ్యమెంతో, ప్రజల భాగస్వామ్యం, ప్రజల అధికారాల పాలెంతో అర్థమవుతూనే వుంది.

శాంతి భద్రతల పరిరక్షణ, నేర నిరోధం, రహదారుల భద్రత, మహిళా వివాదాలు లాంటి సమస్యలని ఈ మైత్రి సంఘం చేపడుతుందట. అసలు, ఇలాంటి విషయాలలో ప్రజల జోక్యాన్ని, పాత్రని పోలీసులు ఏ మాత్రం కోరుకోరు, సహించరు కూడా. నిజానికి పోలీసులతో, కోర్టులతో పని లేకుండా ఇలాంటి అనేకానేక సమస్యల్ని ప్రజలు తమ స్వంత నిర్మాణాల ద్వారా, ప్రజా పంచాయితీల ద్వారా చాలా చక్కగా, సమర్థవంతంగా పరిష్కరించు కుంటూనే వున్నారు. కాని, ఇలాంటి ప్రజా కార్యక్రమాలపైన, ప్రజాసంఘాలపైన, ప్రజా పంచాయితీలపైనా 'చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం' అనే నేరారోపణతో పోలీసులు విరుచుకు పడుతూనే వున్నారు.

మైత్రి లక్ష్యాలుగా, కార్యక్రమాలుగా ప్రభుత్వం, పోలీసు అధికారులు చెబుతున్నవన్నీ పరమ బూటకం. ఇవన్నీ పచ్చి దగాకోరు అబద్ధాలు.

పరమ పాశవిక నిర్బంధ కాండను సైతం ప్రతిఘటిస్తూ రాష్ట్రంలో పదునెక్కుతున్న పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలోని విప్లవోద్యమాన్ని విచ్ఛిన్నపర్చే 'కుట్ర పథకం'లో భాగమే ఈ మైత్రి. అంతే కాదు. ప్రపంచబ్యాంక్‌కి ఆంధ్ర రాష్ట్రాన్ని టోకుగా తాకట్టు పెట్టేసిన చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కార్యక్రమాల పర్యవసానంగా ప్రజల్లో రగులుతున్న అశాంతి, ఆందోళనల్ని ఫాసిస్టు పద్ధతుల్లో ప్రక్కత్రోవలు పట్టించి దెబ్బతీసే ప్రయత్నం కూడా ఇది. ఇజ్రాయిల్ ఫాసిస్టు ప్రభుత్వం అక్కడ ప్రజా విప్లవ తిరుగుబాటులని అణచివేస్తున్న తీరు తనకు ఆదర్శం అంటూ చంద్రబాబు పదే పదే ప్రకటించుకుంటున్నాడు. అంటే, సాంకేతిక అభివృద్ధితో కూడిన ఈ ఆధునిక యుగంలో సాయుధ ప్రజా విప్లవోద్యమాలని అణచివేయడానికి ప్రపంచ సామ్రాజ్యవాద శక్తులు, వారికి ఊడిగం చేసే దేశ దేశాలలోని పాలక వర్గాల దళారీ కిరాయి ప్రభుత్వాలు (కేంద్రంలో బి.జె.పి., రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం లాంటివి) అనుసరిస్తున్న ''స్వల్ప తీవ్రతా యుద్ధతంత్రం'' (లోఇంటెన్సిటీ వార్)లో భాగమే ఈ మైత్రి లాంటి విన్యాసాలన్నీ.

చంద్రబాబు హైటెక్, ఇన్ఫోటెక్ పథకాల ప్రచారార్భాటం రాష్ట్ర ప్రజల సమస్యల్ని ఏ మాత్రం పరిష్కరించలేక పోతున్నాయి. పిడికెడు మంది సంపన్న, ఉన్నత, మధ్య తరగతి పరాన్న భుక్కులకి తప్ప సంపదల ఉత్పత్తిలో తమ శ్రమశక్తిని ధారపోస్తున్న అశేష రైతాంగం, కార్మికులు తదితర ప్రజా సామాన్యానికి ఈ పథకాలు, విధానాలు అశనిపాతాలుగానే వుంటున్నాయి. చిన్న, పెద్ద వందలాది పరిశ్రమలు మూతపడి వేలాది కార్మిక కుటుంబాలు ఉపాధిని కోల్పోయి వీధిన పడ్డాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న పచ్చి రైతు వ్యతిరేక వ్యవసాయ విధానాలు, కార్యక్రమాల కారణంగా రాష్ట్రం నలుమూలలా రైతాంగం కరువు కాటకాల బారినపడి పంటలు లేక, పండిన పంటకు గిట్టుబాటు ధరలు లేక విలవిలలాడుతున్నారు. ఎలాంటి ఉద్యోగావకాశాలు లేక రాష్ట్రంలో లక్షలాది విద్యార్థి, నిరుద్యోగ యువజనులు ఆందోళనలతో వీధుల్లో కదం తొక్కుతున్నారు. ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు ఇక పేరుకే మిగిలాయి. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశంలో పరుగులు తీస్తున్నాయి. ప్రయాణం, విద్యుత్ ఛార్జీలు ఊహించలేనంతగా పెరిగి పోతున్నాయి. ఎంతో మంది రైతులు, నిరుద్యోగ కార్మికులు, యువజనులు నిరాశోపహతులై ఒక ప్రక్క ఆత్మహత్యలను ఆశ్రయిస్తుంటే, వేరొక ప్రక్క నిత్యకృత్యమై పోయిన బూటకపు ఎన్‌కౌంటర్ హత్యాకాండల్ని వెక్కిరిస్తూ, ధిక్కరిస్తూ అనేకమంది రైతు, కార్మిక, యువజనులు, ప్రత్యేకించి మహిళలు రాష్ట్రంలోని విప్లవోద్యమంలోకి సమీకరణ అవుతున్నారు. బ్రతకలేక చావడం లేక బ్రతకడం కోసం చావడం అనే రాష్ట్ర ప్రజల వాస్తవ స్థితికి అద్దం పడుతున్న పరిణామాలివి.

రాష్ట్రం ప్రగతిపథంలో పరుగులు తీసేస్తుందని, రాష్ట్ర అభివృద్ధిని చూసి ఇతర రాష్ట్రాల నాయకులు ఈర్ష్య పడుతున్నారని, విదేశాల వారు మూర్ఛపోతున్నారని వందల కోట్ల రూ॥ల ప్రజాధనంతో ప్రసార, ప్రచార సాధనాల్ని గుప్పిట్లో పెట్టుకుని చంద్రబాబు ప్రభుత్వం నిత్యం చేయిస్తున్న అసత్య ప్రచారాన్ని అపహాస్యం పాలు చేస్తూ రైతు, కార్మిక, విద్యార్థి, యువజన, దళిత, మహిళా రంగాలకి చెందిన

ప్రజలంతా ఆగ్రహావేశాలతో వీధులకెక్కి ఆందోళన చేస్తున్నారు. ఈ ప్రజా పోరాటాలన్నింటికి రాష్ట్రంలో బలపడుతున్న పీపుల్స్‌వార్ నేతృత్వంలోని విప్లవోద్యమం కొండంత అండగా నిలుస్తుంది. చంద్రబాబును కలచి వేస్తున్న ప్రధాన అంశమల్లా ఇదే!

కనుకనే పీపుల్స్‌వార్ పార్టీ ఉద్యమాలను ఎలాగైనా అణచి-వేయడాన్నే ప్రభుత్వం తన ప్రధాన ఎజెండాగా పనిచేస్తోంది. చంద్రబాబు ప్రభుత్వపు ఈ ఎజెండాలో భాగమే నేటి ఈ 'మైత్రి' విన్యాసం. విప్లవోద్యమం వెనుక ప్రజలు లేరని చెప్పడానికి, పోలీసులు ప్రజల కోసమే అని నమ్మించడానికి, ప్రజా వ్యతిరేక, విప్లవోద్యమ వ్యతిరేక సాంఘిక పునాదిని ఫాసిస్టు పద్ధతిలో ఏర్పరచుకోవడానికి ఉపయోగించే సాధనమే ఈ 'మైత్రి'.

అసలీ 'మైత్రి' వేరుగా చూడాల్సింది కానే కాదు. రాష్ట్రంలో నక్సలైట్ల సమస్యపై ఇటీవల రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా విప్లవోద్యమ సాహితీ, సాంస్కృతిక సంఘాల నేతలైన వరవరరావు, గద్దర్‌లను సైతం అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించ గలనని ప్రకటించిన చంద్రబాబు, ఆ మరునాడే ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అద్వానీ ఆధ్వర్యంలో జరిగిన, నక్సలైట్ ఉద్యమ అణచివేతే లక్ష్యంగా ఏర్పడిన ఐదు రాష్ట్రాల సమన్వయ సంఘంలో పీపుల్స్‌వార్‌పై విషం కక్కుతూ చేసిన ప్రసంగ ప్రకటనలు, ఇవన్నీ వేరు వేరు కావు. ఒకే హారంలోని పూసలే! ప్రపంచబ్యాంక్‌కి కిరాయిగా మారిపోయిన చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచబ్యాంక్ విధానాలు, ఆదేశాలకనుగుణంగానే కేంద్రంలోని బి.జె.పి. ఫాసిస్టు ప్రభుత్వం అందించే పూర్తి అండదండలతో పీపుల్స్‌వార్ పార్టీ ఉద్యమాలపై పెద్ద ఎత్తున దాడికి సన్నద్ధమవుతుంది. ఈ దాడి లక్ష్యానికి అనుగుణంగా, అందుకు సన్నాహకంగా సాగుతున్నదే 'మైత్రి' కార్యక్రమాల ఆర్భాటం. ఒక ప్రక్క చర్చలకు ఆహ్వానం, ఇంకో ప్రక్క బాధ్యతా రహితంగా రెచ్చగొట్టుడు ప్రకటనలు గుప్పించడం ఇవన్నీ కూడా. నక్సలైట్లు జనజీవన స్రవంతిలోకి రావాలని రాష్ట్ర హోంమంత్రి దేవేందర్ గౌడ్ మొక్కుబడిగా మరోసారి ప్రకటించేశాడు. అంటే రేపు జరుగనున్న దుర్మార్గమైన దాడికి నైతిక సమర్ధనగానే ఈ బూటకపు ప్రకటనలన్నీ.

నేటి రాష్ట్ర ప్రజల దారుణ స్థితికి ప్రభుత్వ పాలనా విధానాలు, కార్యక్రమాలే కారణం. ప్రజల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తి, ఆందోళనలని, ప్రజలకి అండగా వుంటున్న పీపుల్స్‌వార్ విప్లవోద్యమాన్ని విచ్ఛిన్నం చేసి అణచివేయడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న విధాన ప్రకటనలు, చేపడుతున్న 'మైత్రి' లాంటి బూటకపు సంస్కరణ కార్యక్రమాల అసలు ఆంతర్యాన్ని గ్రహిస్తూ, వీటిని దృఢంగా నిరసిస్తూ రాష్ట్రంలోని ప్రజాతంత్రవాదులు, మేధావులు, పాత్రికేయులు తదితరులంతా మునుపెన్నటి కంటే కూడా చురుగ్గాను, చైతన్యవంతంగాను కదలి ముందుకొస్తూ, ప్రజలకు, ప్రజాందోళనలకు, విప్లవోద్యమానికి బాసటగా నిలవాలని పీపుల్స్‌వార్ విజ్ఞప్తి చేస్తుంది.

**రావైకృష్ణ**
**ప్రైనిధి**
**ఆంధ్ర రాష్ట్రకవిటీ,**
**9-4-2000** **సి.పి.ఐ. (యం-యల) [పీపుల్సవాం]**

---

( 26వ పేజీ తరువాయి.....)

కార్యక్రమాన్ని మధ్యలోనే వదిలేసి మే 3న బుల్లెట్‌ప్రూఫ్ కారులో వరంగల్ నుంచి రాత్రికి రాత్రే హైద్రాబాద్‌కు దౌడు తీశాడు. చివరకు వరంగల్ జిల్లా గ్రామ మండల స్థాయి అధికారపార్టీ నాయకులు సైతం రాష్ట్ర రాజధానిలో వాలి పోలీసుల రక్షణ కోరారు.

వీటన్నిటికీ మించి ఈ 12వ జన్మభూమి సందర్భంగా జరిగిన విస్తృత నిరసన ప్రదర్శనల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీపం, రోష్ని, మహిళా జన్మభూమి వంటి పథకాలతో ఇంతవరకూ మోసగింపబడుతూ వచ్చిన మహిళలు ఈసారి శివాలెత్తి గ్రామసభల్లో అధికారులను, రాజకీయవాదులను దుమ్మెత్తి పోశారు. వందలాది ఖాళీ కుండలతో మహిళలు జన్మభూమిని ధిక్కరించారు. రాష్ట్రంలోని మొత్తం 23 జిల్లాలలో 'జన్మభూమి' కార్యక్రమాన్ని ధిక్కరిస్తూ ప్రజలు నిరసన తెలిపారు. 'సాఫ్ట్‌వేర్ కాదు సాగునీరు కావాలి', 'ఇంటర్‌నెట్ కాదు మంచినీరు కావాలి' అనే నినాదాలు రాష్ట్రమంతటా ప్రతిధ్వనించాయి. కొన్ని పదుల గ్రామాలలో ముఖ్యమంత్రి చంద్రబాబునే మహిళలు నిలేశారంటే, అడుగడుగునా అతగాడి ప్రసంగానికి అడ్డు తగులుతూ వచ్చారంటే మహిళల కోపావేశాలు ఏ స్థాయిలో వుండినాయో అర్థమవుతుంది. మహిళాభివృద్ధికి తానెంతగా కష్టపడుతున్నదీ చెప్పడానికి ప్రయత్నించినప్పుడల్లా మహిళలు ముఖ్యమంత్రి ప్రసంగానికి అడ్డుతగిలారు. ''రెండు రూపాయల బియ్యం పథకానికి తూట్లు పొడిసి, కిలో బియ్యానికి 5.50 పైసల రేటు పెట్టి, మధ్య నిషేధం ఎత్తివేసి, కిరోసిన్, యల్.పి.జి. ధరలను కూడా పెంచేసి ఇపుడు మంచినీళ్ళకు కూడా గతి లేకుండా చేసి పైగా సుద్దులు చెప్పొచ్చావు చాల్చాల్లే వయ్యా'' అంటూ వారు అడుగడుగునా కొన్ని సభల్లో చంద్రబాబును నిలేశారు. ప్రపంచబ్యాంకు పొగడ్తలతో ఇన్నాళ్ళూ కాలం వెళ్ళబుచ్చిన వాడికి చేదు వాస్తవం ఇలా ఎదురయ్యేసరికి చంద్రబాబు ఖంగుతిన్నాడు. మునుపటిలా గదమాయింపులూ, బెదిరింపులూ పనిచేయక పోవడంతో మహిళలను ప్రజలను సమాధాన పర్చలేక చంద్రబాబు చాలా సభల్లో అర్థాంతరంగా తప్పుకున్నాడు.

ఒకటి మాత్రం స్పష్టమైంది. ప్రజల కష్టాలన్నింటికీ 'తారక మంత్రం'లా ఇన్నేళ్ళుగా తెలుగుదేశం ప్రభుత్వం చెలాయించుకుంటూ వచ్చిన 'జన్మభూమి' పటాటోపం ముసుగు తొలగిపోయింది. చంద్రబాబు, టి.డి.పి. దాన్ని ఎంతగా తిరిగి పైకి లేవనెత్తాలనుకున్నా అది ప్రజల్లో మరింతగా అభాసు పాలుకాక తప్పదు. ఇన్నాళ్ళుగా పాలకుల అసమర్థ, దోపిడీ విధానాల బారినపడి వూర్లు విడిచి దేశాల పాలైనవారు, పశువులను అమ్ముకున్న వారూ, తమ జీవితాలనే పురుగుమందులకు అమ్మేసుకుని 'ఆత్మహత్య'ల పాలైనవారూ నిజం గ్రహించారు. ఈ గ్రహింపు, ఈ పాలకవర్గ వ్యతిరేక ధిక్కార ధోరణి చంద్రబాబులనూ, నిజాలను గోదాట్లో కలిపేసిన రామోజీరావు వంటి జాతి చీడపురుగులనూ రాబోయే రోజుల్లో నల్చుకుతినడమే కాదు. భూస్వామ్యం, సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానపు విషకోరల నుండి జన్మ (మాతృ) భూమిని మొత్తంగా విముక్తి చేస్తుంది. ❑

# ప్రపంచ వ్యాప్తంగా తీవ్రతరమవుతున్న స్వేచ్ఛా మార్కెట్ల వ్యతిరేక ధోరణులు; యూరప్‌లో మేడే సందర్భంగా చెలరేగిన మిలిటెంట్ ప్రజా ప్రదర్శనలు; 'చరిత్రాంతం' గురించి చెల్లిపోతున్న సిద్ధాంతాలూ...

ఈసారి మేడే సందర్భంగా యూరప్ నగరాలన్నీ వామపక్షేతర సెక్షన్ల మిలిటెంట్ ప్రదర్శనలతో అట్టుడికిపోయినాయి. ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరంలో బాంబు పేల్చారు. లండన్‌లో అయితే ప్రదర్శనకారులు యం.యన్.సి. మెక్‌డొనాల్డ్‌కి చెందిన రెస్టారెంట్‌ని ధ్వంసం చేశారు. బ్రిటన్ ప్రధాని ఈ సంఘటనను మతిలేని దారి దోపిడీ దొంగల చర్యగా వ్యాఖ్యానించాడు. కానీ వాస్తవంగా ఇది మతిలేని దోపిడీ మాత్రం కాదు. ఎందుకంటే ఈ ప్రదర్శనకారులంతా పెట్టుబడిదారీ వ్యవస్థ సమర్థకులే. ప్రపంచీకరణ, అమెరికనీకరణల ఊక దంపుడుతో వీరు విసుగెత్తిపోయారు. అసాధారణ రీతిలో వామపక్షవాదులకన్నా మితవాద సెక్షన్ల ప్రజలే అధికంగా పాల్గొన్న ఈ సం॥రం మేడే ప్రదర్శనలు స్వేచ్ఛా మార్కెట్‌కి ప్రత్యామ్నాయం లేదంటూ పదేళ్ళుగా సాగిన ప్రచారానికి హెచ్చరిక సందేశాలు పంపాయి.

1990ల మొదట్లో 'సోషలిజం'గా చెప్పబడుతున్న దాన్ని కేపిటలిజం కబళించి తనలో కలిపేసుకోవటంతో అమెరికన్ సామాజిక శాస్త్రవేత్త 'ఫ్రాన్సిస్ ఫుకొయామా' ''చరిత్ర అంతం'' అయిదంటూ ఒక సంచలన సిద్ధాంతాన్ని ప్రపంచం మీదికి వదిలాడు. ఉదార ప్రజాస్వామ్యం, స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థలు ప్రపంచమంతటా విజయం సాధించటంతో మానవజాతి తన భావజాల పరిణామపు అంతానికి చేరుకున్నదని ప్రకటించాడు. ఉదారవాదం (లిబరలిజం), స్వేచ్ఛా మార్కెట్‌లు మానవజాతి ఇంతవరకూ ఏర్పరుస్తూ వచ్చిన పాలనల్లోకెల్లా అత్యున్నత మానవ పాలనా (హ్యూమన్ గవర్నమెంట్) రూపంగా అనివార్యంగా ఏర్పడనున్నాయంటూ ఫుకొయామా సూత్రీకరించాడు. ('చరిత్రాంతం' భావన పూర్వాపరాల గురించి చివర్లో తెలుసుకుందాం).

కానీ ఫుకొయామా ప్రతిపాదించిన పై నిర్ధారణల బోలుతనాన్ని బహిర్గత పర్చడానికి దశాబ్ద కాలం పట్టింది. మొదట సియాటిల్‌లో (1999 డిసెంబర్) తర్వాత వాషింగ్టన్‌లో (ఏప్రిల్, 2000) ఇక ఇప్పుడు పలు ఐరోపా ఖండ నగరాలలో విధ్వంసానికి దిగిన ప్రదర్శకులు అటు స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థకి, ఇటు ఉదార ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు బద్ధలవుతోందని స్పష్టంగా నిరూపించారు. చరిత్రలో ఈ రెండు సిద్ధాంతాలూ సాధించిన ఆవిష్కరణలను ఎవరూ వ్యతిరేకించలేరని, మానవజాతి పరిణామ క్రమంలో సాధించిన విజయాలకు 'స్వేచ్ఛ' అన్నది అద్భుతమైన ఉత్ప్రేరకంగా పని చేసిందని చెబుతూ, ఉదార ప్రజాస్వామ్యం, స్వేచ్ఛా మార్కెట్లు రెంటికీ ప్రాథమిక సూత్రమైన 'స్వేచ్ఛ' గురించి ఎవరికి తోచిన వ్యాఖ్యానాలు వారు చేస్తూనే వున్నారు. సంపదలను పెంచటంలో, ఆకలిపై, వ్యాధులపై, దారిద్ర్యంపై విజయం సాధించటంలో గత 50 సం॥ల కాలం మానవ చరిత్రలో కెల్లా చిరస్మరణీయ ఘట్టాల్లో ఒకటిగా నిలిచి పోతుందని ఎవరికివారు ప్రశంసిస్తూనే వున్నారు. కానీ ఈ లోపలే పై సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఇంత హింసాత్మక ప్రదర్శనల విస్ఫోటన జరిగేందుకు కారణమేమిటి అంటే.....

ప్రపంచాన్ని నమ్మింప జేస్తున్నట్లుగా ప్రపంచీకరణ (దోపిడీని ప్రపంచవ్యాప్తం చేయటం) అన్నది విజేతలను మాత్రమే సృష్టించలేదు. చివరికి అభివృద్ధి చెందిన దేశాలలో సైతం అది పరాజితులను (ఆర్థికపరంగా, జీవనపరంగా) సృష్టించింది. ఈ పరాజితులలో అధిక శాతం అనిపుణ, అర్ధనిపుణ కార్మికులు, తగిన అర్హతలు లేని కార్మికులే వున్నారు. వస్తు వ్యామోహ సంస్కృతిని ప్రపంచమంతటా వ్యాపింపజేసిన ఈ స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థే మరోవైపు సమాజంలోని వివిధ బృందాల ''కోరికలకు'' వాటిని ''తీర్చుకోవడానికి'' మధ్య ఇక సహించలేనంత అంతరాన్ని సృష్టించింది. ప్రజలు ఆశిస్తున్న దానికి, వారికి లభ్యమవుతున్న దానికి మధ్య పెరిగే అంతరమే విప్లవాలన్నింటికీ ముందు షరతుగా వుంటుంది. ఇలా జీవన అవకాశాలను కోల్పోయిన వారే ఇపుడు వీధుల్లోకి వస్తున్నారు. ప్రజల మధ్య వ్యత్యాసాలను ప్రపంచీకరణ పెంచుతున్న పద్ధతి వారి పరిస్థితిని మరింతగా విషమించిపోయేలా చేస్తోంది. ధనికులు మరింతగా ధనికులవుతున్నారు. అంతేకాదు. తమ కళ్ళ ముందే ధనికులు ఆహారం, బట్టలు, విహారాలు, మైమరపించే వస్తుజాలం వంటి జీవితావసరాల విషయంలో అపారమైన అవకాశాలను అంది పుచ్చుకొంటూ వుండటాన్ని ఈ పరాజిత బృందాలు గమనిస్తూ వున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా స్వేచ్ఛా మార్కెట్‌పట్ల పెరుగుతున్న వ్యతిరేకతకు తోడుగా, ఏక కాలంలోనే ఉదార ప్రజాస్వామ్యం పట్ల కూడా వ్యతిరేకత పెరుగుతోంది. ఈ రెండు అంశాలకూ ఈసారి జరిగిన మేడే ప్రదర్శనలు అద్దం పట్టాయి. మేడే సాధారణంగా లెఫ్టిస్టులు జరుపుకునేది కాగా ఈసారి ఆశ్చర్యకరంగా పలు యూరప్ నగరాలలో నవీన మితవాదులే (ultra Rights) మేడేని జరుపు కున్నారు. యూరప్‌లోని మితవాదులు తమ దేశాల్లోకి ఆసియా, ఆఫ్రికా దేశాల ప్రజల వలసలను సంపూర్ణంగా వ్యతిరేకిస్తూ, వలస ప్రజలను తరిమి కొట్టడం ద్వారానే తమ జీవన అవకాశాలు పరిరక్షింప బడతాయంటూ జాత్యహంకార ధోరణులలో కూరుకుపోయి వుండటం నిజమే అయినా; ప్రపంచీకరణ క్రమం వారిని సైతం వదిలి పెట్టకుండా మనుగడను దుర్లభం చేసేయటంతో యాదృచ్ఛికంగానే వారి పోరాటం నేరుగా పెట్టుబడిదారీ వ్యవస్థపైకే మళ్ళింది. ఇది డబ్ల్యు.టి.ఒ. నగ్న దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా సియాటిల్‌లో అన్ని దేశాల ప్రజల వీధి పోరాటాలతో మొదలై ఈ మేడే సందర్భంగా యూరప్ నగరాల్లో వందలాది, వేలాది ప్రదర్శకుల హింసాత్మక చర్యలతో పరాకాష్టకు చేరింది.

## సియాటిల్ నుంచి మేడే దాకా

పెట్టుబడిదారీ వ్యవస్థకు, యం.యన్.సి.లకు వ్యతిరేకంగా జన

విస్ఫోటనం మొదట సియాటిల్‌లో మొదలైంది. 1999 నవంబర్ 30 నుండి డిసెంబర్ 3 వరకు సియాటిల్‌లో జరిగిన డబ్ల్యు.టి.ఓ. 3వ మంత్రిత్వ సమావేశం వేలాదిమంది ప్రజల మిలిటెంట్, ప్రదర్శనలతో కంపించి పోయింది. 10 సం॥ల నుండి ప్రపంచీకరణ విజయ పరంపరలతో తమ కెదురులేదని విర్రవీగుతూ మోరలెత్తి తిరిగిన సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలకు, శక్తివంతమైన యం.యన్.సి.లకు, కార్పోరేషన్లకు, మొత్తంగా అమెరికా సామ్రాజ్యవాద ఆంబోతులకు ఈ ప్రజా ప్రదర్శనలు శృంగభంగం కల్గించాయి. వియత్నాం యుద్ధం తర్వాత పాశ్చాత్య ప్రపంచం కనీవినీ ఎరిగి వుండని భారీ జన ప్రదర్శనలకు సియాటిల్ వేదికైంది. బోయింగ్ కంపెనీ, మైక్రోసాఫ్ట్ వంటి భారీ యం.యన్.సి. దిగ్గజాల ప్రధాన కేంద్రమైన సియాటిల్ నగరం, యం.యన్.సి.ల అధికారదర్పాన్ని, సంపద్గర్వాతిశయాన్ని ధిక్కరిస్తూ నేల నలు చెరగుల నుండి తరలి వచ్చిన వేలాది ప్రజల సామూహిక ఘోషతో, యం.యన్.సి.ల వ్యతిరేక నినాదాలతో దద్దరిల్లి పోయింది. వాణిజ్య (దోపిడీ) సరళీకరణ గురించి ఒత్తిడి చేస్తున్న కార్పోరేషన్ల బరితెగించిన దురాశకు, డబ్ల్యు.టి.ఒ. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా 1000 గ్రూపులకు సంబంధించిన 50,000 మంది ప్రదర్శకులు మూడురోజులపాటు సియాటిల్ జన జీవితాన్ని దిగ్బంధించి వేశారు. 'డబ్ల్యు.టి.ఓ.కి చావు తప్పదు', ''కార్పొరేట్ జలగల నుండి, యం.యన్.సి. నేరగాళ్ళ నుండి డబ్ల్యు.టి.ఓ.ని విముక్తి చేయండి'' అంటూ ప్రదర్శనకారులు ఆగ్రహజ్వాలల్తో వూగిపోయారు. ఏకైక సామ్రాజ్యవాద శక్తిగా తన ధన, మద, భుజబల గర్వాతిశయాన్ని ప్రపంచానికి చాటి చెప్పడానికై, సం॥ర కాలంగా ఈ డబ్ల్యు.టి.ఒ. మూడో మంత్రిత్వ సమావేశానికి సన్నాహాలు చేస్తూ వచ్చిన అమెరికాకు ఎంత పరాభవం జరిగిందంటే, అంతర్జాతీయ చక్రవర్తిలాగా రాజసంగా వేంచేస్తాడనుకున్న శ్రీమాన్ బిల్‌క్లింటన్ అధ్యక్షులవారు ప్రజా నిరసనల ధాటికి వెరచి చీకటిమాటున వీధి దొంగలాగా నక్కుతూ నగరంలోకి వచ్చారు. 134 సభ్య దేశాల నుండి సమావేశానికి వచ్చిన పాలకవర్గ ప్రతినిధులు ప్రారంభ దినాన ప్రదర్శకులు రోడ్లు దిగ్బంధనం చేసిన కారణంగా, సమావేశం మాటేమోగాని తమ హోటల్ గదుల నుండి బయటకు రాలేక పోయారు. బయటకు రావడానికి ప్రయత్నించిన కొద్దిమందిని ప్రదర్శకులు చుట్టుముట్టి వారిని రంగునీళ్ళతో, పెయింట్‌తో ముంచేశారు. ప్రారంభ సమావేశంలో ప్రసంగించాల్సిన నలుగురు ప్రధాన వక్తలూ, (అమెరికా విదేశాంగ శాఖామంత్రి మాడలైన్ ఆల్‌బ్రైట్, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్, డబ్ల్యు.టి.ఓ. డైరెక్టర్ జనరల్ మైక్‌మోర్, అమెరికా వాణిజ్య ప్రతినిధి చార్లెస్ బార్షెప్‌స్కీ)లు తమ విడిది గదులు దాటి సమావేశపు హాలు వద్దకు రాలేక పోయారు. వాస్తవంగానే, అత్యున్నత మంత్రులూ, ప్రతినిధులూ ప్రజా ప్రదర్శకుల బందీలుగా మారిపోయారు. దీంతో ఆర్భాటంగా జరగాల్సిన ప్రారంభోత్సవం కాస్తా రద్దయింది. కాన్ఫరెన్స్ సైతం డెలిగేట్లు లేక అనుకున్న సమయానికి మొదలు కాకుండా పోయింది.

ఇంత జరిగిన తర్వాతే ప్రభుత్వ నేషనల్ గార్డ్స్, స్టేట్ ట్రూపర్స్‌తో కూలిన భారీ పోలీసు బలగాలు ఎదురుదాడికి దిగాయి. కాన్ఫరెన్సు సజావుగా జరిగేందుకుగాను పోలీస్ బలగాలు నగరాన్ని ప్రవేశ మార్గాలను మూసివేశాయి. రెండో ప్రపంచ యుద్ధానంతరం మొట్ట మొదటిసారిగా నగర మేయర్ ''అత్యవసర పరిస్థితి''ని ప్రకటించి కర్ఫ్యూని విధించాల్సి వచ్చింది. సియాటిల్ ఒక యుద్ధమండలమై పోయింది. పోలీసులు టియర్‌గ్యాస్, మిరియాల స్ప్రేలు, ప్లాస్టిక్ బుల్లెట్లు, చివరకు ప్రకంపింపజేసే గ్రనేడ్లను సైతం ఉపయోగించారు. మరోవైపు ప్రజలు షాపులు, కార్లు తదితరాలను ధ్వంసం చేస్తూ పోలీసులతో పోరాటంలో గెరిల్లా పద్ధతులను ఉపయోగించారు. పోరాటం ఎంత తీవ్రంగా సాగిందంటే పోలీసులు నగర వీధులను అదుపులోకి తెచ్చుకోవటం కోసం ప్రతి అంగుళం జాగా కోసం పోరాడాల్సి వచ్చింది. ప్రదర్శకులు పలుసార్లు తిరోగమిస్తూ పార్శ్వాల (ఫ్లాంక్స్) నుండి దాడులకు దిగారు. ఈ పోరాటం రెండో రోజు కూడా సాగింది. 600 మంది ప్రదర్శకులను అరెస్ట్ చేసి దవడలను, ఎముకలను విరగ్గొట్టారు. అరెస్టయిన వారిని చిత్రహింసల పాలు చేశారు. దారినిపోయే వారిని కూడా వెంటాడి కొట్టారు. మరోవైపు ప్రదర్శకులు వీధి నాటికలతో, పాటలతో నగర వీధులను హోరెత్తించారు. తమ తమ విడిది గృహాల నుండి బయటకు వస్తున్న మూడో ప్రపంచ దేశాల నియంతలను గేలి చేశారు. షెల్, కార్గిల్, ది గ్యాప్, యూనియన్ కార్బైడ్, మాన్‌శాంటో తదితర గుత్త సంస్థలు మానవజాతిపై నేరాలకు పాల్పడ్డాయని ఆరోపణలు చేస్తూ కోర్టులను నిర్వహించారు. మూడో ప్రపంచ దేశాల రుణ భారానికి, ఆసియాలో యం.యన్.సి.ల దోపిడీకి, జాతిహననానికి, కార్పొరేట్ దురాశకి వ్యతిరేకంగా నినదిస్తూ మానవ హారాలను ఏర్పరచారు. ఇక మూడో రోజైతే ప్రదర్శకులు పోలీసుల పాశవిక చర్యలకి, సియాటిల్‌లో వాక్స్వాతంత్ర్యంపై అణచివేతకు వ్యతిరేకంగా దృష్టి సారించారు. వేలాదిగా ప్రదర్శకులు సియాటిల్ జైలును ఘెరావ్ చేశారు. ఇలా కాన్ఫరెన్స్ పొడవునా సాగిన ప్రదర్శనలను మార్షల్ లా సైతం అడ్డుకోలేక పోయింది. కార్మిక ప్రమాణాలు, పర్యావరణంతో ముడిపెట్టిన వాణిజ్యాంశాలు వంటి ప్రదర్శకుల డిమాండ్లలో కొన్నింటిని (క్లింటన్ ఎజెండాలో ఇవి భాగం) ప్రచార సాధనాలు ప్రచారం చేశాయి. కానీ మెజారిటీ ప్రదర్శకులు డబ్ల్యు.టి.ఓ.పై దాన్ని ఆజమాయిషీ చేస్తోన్న యం.యన్.సి.లపైనే దాడి చేశారు.

సియాటిల్‌తో పాటు, ప్రపంచంలోని పలు నగరాలలో సైతం ప్రదర్శనలు జరిగాయి. లండన్‌లో, పారిస్‌లో, వాటికెంతో దూరంలో వున్న మనీలాలో సైతం జరిగిన భారీ ప్రదర్శనలు ప్రత్యేకించి ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బ్రిటన్‌లో రైల్వేల ప్రైవేటీకరణతో ముడిపెట్టి, సెంట్రల్ లండన్‌లో ప్రదర్శకులు డబ్ల్యు.టి.ఓ.కి వ్యతిరేకంగా కదం తొక్కారు. హూస్టన్ రైల్వే స్టేషన్ని వశపర్చుకుని లండన్ భూగర్భ రైలు సర్వీసులను స్తంభింపజేశారు. రైలు సర్వీసుల పునరుద్ధరణకు ముందు ప్రదర్శకులకు, పోలీసులకు మధ్య వీధి పోరాటాలు జరిగాయి. పారిస్‌లో సైతం లాభాలకన్నా ప్రజా సంక్షేమాన్నే పట్టించుకోవాలంటూ వేలాదిమంది ప్రదర్శనలు చేశారు. అమెరికా, యూరప్, ఆసియా నగరాల్లో జరిగిన ఈ పెట్టుబడిదారీ వ్యతిరేక ప్రజా ప్రదర్శనలకు సామ్రాజ్యవాద వ్యవస్థను నిర్మూలించే కార్యక్రమం, పద్ధతి లేకపోయి వుండవచ్చుగాని, అంతర్జాతీయ పరాన్నభుక్కుల్ని ప్రజలు ఇక సహించే స్థితిలో లేరన్న వాస్తవాన్ని ఈ ప్రదర్శనలు చాటి చెప్పాయి. నిస్సందేహంగానే ఇది సరైన దారిలో ప్రయాణానికి ప్రారంభం మాత్రమే. గత 50 సం॥ల

చరిత్రలోకెల్లా మొట్టమొదటిసారిగా సామ్రాజ్యవాదానికి, దాని దోపిడీ సంస్థలకు వ్యతిరేకంగా ప్రపంచమంతటా పోరాటం మొదలయింది అనడానికి ఇదొక దాఖలాగా నిలుస్తుంది. సియాటిల్ వేదికపై సామ్రాజ్యవాద దేశాల అడుగులకు మడుగులొత్తేలా వ్యవహరించిన మూడో ప్రపంచ దేశాల ప్రభుత్వాధినేతల బాటను ఆ దేశాల ప్రజలు ధిక్కరించిన చరిత్ర మొదలైంది.

## గ్రీస్‌లో వెల్లువెత్తిన అమెరికా వ్యతిరేక ప్రజా ప్రదర్శనలు

సియాటిల్ సంఘటనలకు పక్షం రోజుల ముందు ‘99 నవంబర్ మధ్యలో గ్రీస్‌లోని పలు పట్టణాలు అమెరికా వ్యతిరేక ప్రదర్శనలతో ప్రకంపించాయి. క్లింటన్ ఏథెన్స్ నగర సందర్శన సందర్భంగా ఇవి జరిగాయి. గ్రీస్ దేశంలో ప్రజల స్పందన ఎంత వ్యతిరేకంగా వుండిందంటే క్లింటన్ తన మూడురోజుల సందర్శనను ఒక్కరోజుకే కుదించుకోవాల్సి వచ్చింది, ఇది సైతం కనీవినీ ఎరుగని భద్రతా ఏర్పాట్ల మధ్యే జరిగింది.

ఎప్పటినుండో అమెరికా వ్యతిరేక భావోద్వేగాలు బలంగావున్న గ్రీస్‌లో క్లింటన్ రాకకు ముందు మరింతగా తీవ్రరూపం దాల్చాయి. క్లింటన్ రాక సందర్భంగా అమెరికా పాలనా యంత్రాంగం ప్రదర్శించిన దూకుడుతనం, దాని అవమానకరమైన డిమాండ్లు, వాటికి దాసోహమన్న గ్రీక్ ప్రభుత్వ వైఖరి వంటివి గ్రీస్ ప్రజలను రగిలించాయి. అమెరికా ప్రత్యక్ష ఆదేశాల ఆధ్వర్యంలో జరిగిన భద్రతా ఏర్పాట్లు గ్రీకు జాతీయ సార్వభౌమత్వాన్నే ఉనికిలో లేకుండా చేశాయి. దీనికి తోడుగా సైప్రస్ దీవుల సమస్య, ఏజియన్ సముద్ర సమస్యలపై టర్కీ ప్రభుత్వంతో ఏ షరతులూ లేని రాజీకి రావాలని అమెరికా గ్రీక్‌ని డిమాండ్ చేయటం గ్రీక్ ప్రజలను తీవ్రంగా గాయపర్చింది.

నవంబర్ 13న ఏథెన్స్‌లో ఇతర గ్రీకు పట్టణాలలో భారీ ప్రదర్శనలు జరిగాయి. 1973 నాటి ఫాసిస్ట్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక తిరుగుబాటు వార్షిక సందర్భంగా నవంబర్ 17న ఏథెన్స్ నగరంలో భారీ జన ప్రదర్శన జరిగింది. అమెరికా రాయబార కార్యాలయం వైపు వేలాదిమంది ప్రజలతో సాగిన ఈ ప్రదర్శన ఇటీవలి గ్రీక్ చరిత్రలోనే అతిపెద్ద మిలిటెంట్ ప్రదర్శనగా నిలిచింది. ఆరోజే గ్రీక్ పట్టణాలన్నింటిలో ఇదే స్థాయిలో అమెరికా వ్యతిరేక ప్రదర్శనలు చోటు చేసుకున్నాయి. ప్రజల మిలిటెన్సీ మరింత పెరగనుందని గమనించిన ప్రభుత్వం క్లింటన్ వచ్చే రోజున ప్రదర్శనలను పూర్తిగా నిషేధించింది.

ఇందుకు భిన్నంగా నవంబర్ 19, 20 తేదీలలో గ్రీస్ దేశ వ్యాప్తంగా వేలాది, లక్షలాదిమంది ప్రజలు అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిపారు. వీటిలో ఏథెన్స్‌లో క్లింటన్ విమానాశ్రయంలో అడుగుపెట్టే సమయంలో జరిగిన ప్రదర్శనకు అత్యంత ప్రాముఖ్యత ఏర్పడింది. అమెరికా రాయబార కార్యాలయం వైపుగా పోయే దారిని దిగ్బంధించిన ప్రత్యేక బలగాలకు వ్యతిరేకంగా వేలాది ప్రదర్శకులు కదంతొక్కారు. నగరం మొత్తాన్ని యుద్ధరంగంగా మార్చివేసిన పోలీసులు, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు దూసుకొస్తున్న ప్రదర్శకులను చెదరగొట్టేందుకు వేలాది టియర్ గ్యాస్, రసాయనాల షెల్స్‌ను వాడారు. వందలాదిమంది ప్రజలు గాయపడ్డారు. 30 మంది మిలిటెంట్లను టెర్రరిస్ట్ కార్యకలాపాలలో పాల్గొన్న ఆరోపణలతో అరెస్ట్ చేశారు.

ఈ ప్రదర్శనలలో మార్క్సిస్ట్-లెనినిస్ట్ శక్తులు ప్రముఖ పాత్ర వహించాయి. అక్టోబర్‌లో ఏర్పడిన ‘యుద్ధ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట సంఘటన’ గ్రీస్‌లోని ప్రధాన నగరాలన్నింటిలో అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేసింది. సామ్రాజ్యవాదానికి, గ్రీక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పంచి పెట్టబడిన వేలాది పోస్టర్లు, కరపత్రాలూ జరుపబడిన బహిరంగ సభలూ నవంబర్‌లో అంతిమంగా జరిగిన ప్రజా నిరసన జ్వాలలకు నాంది పలికాయి. ప్రపంచ ప్రజల నుండి అమెరికా సామ్రాజ్యవాదం రాన్రానూ వేరుపడి పోతోంది. భారత దేశం, రష్యా.....మరెన్నో దేశాలకు అమెరికా అధ్యక్షుడు వెళ్ళినా ప్రతిచోటా నిరసనల వెల్లువ సాగుతోంది.

## వాషింగ్టన్ నుంచి వైడే ప్రదర్శనల దాకా....

సియాటిల్‌లో డబ్ల్యు.టి.ఓ. వ్యతిరేక ప్రదర్శనల తర్వాత సామ్రాజ్యవాదానికి, దాని సంస్థలకు వ్యతిరేకంగా మిలిటెంట్ ప్రదర్శనలు ఉధృత రూపం దాల్చాయి. మొదట ప్రదర్శనకారుల లక్ష్యం డబ్ల్యు.టి.ఓ. కాగా, తర్వాత ప్రపంచబ్యాంకు, ఐ.యం.యఫ్., ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎ.డి.బి.) లు లక్ష్యాలుగా మారాయి. ఇక మేడే ప్రదర్శనలయితే నేరుగా పెట్టుబడిదారీ వ్యవస్థనే తమ లక్ష్యంగా మార్చుకున్నాయి. సియాటిల్ అనంతరం ఈ సంవత్సరం ఏప్రిల్ మధ్య నుండి మే మధ్య కాలం దాకా నెలరోజుల వ్యవధిలో నాలుగు ప్రముఖ అంతర్జాతీయ సమావేశాలు జరిగాయి. అవి వాషింగ్టన్‌లో ఆరు నెలలకోసారి ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలు జరిపే సమావేశం; క్యూబాలో గ్రూప్-77 దేశాల సమావేశం; కొలంబియాలో జరిగిన ఆలీన దేశాల ఉద్యమం; చివరగా థాయ్‌లాండ్‌లో జరిగిన ఆసియా అభివృద్ధి బ్యాంకు సమావేశం వీటిలో వాషింగ్టన్, థాయ్‌లాండ్ సమావేశాలు వేలాది ప్రదర్శకుల ముట్టడి మధ్య జరిగాయి. ఇక గ్రూప్-77 దేశాల సమావేశంలో మూడో ప్రపంచ దేశాలలో ప్రపంచీకరణ దుష్ప్రభావాలకు వ్యతిరేకంగా అనేక దళారీ ప్రభుత్వాలే గొంతెత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఏప్రిల్ 15, 17 తేదీలలో మెజారిటీ ప్రపంచ ప్రజల శ్రేయస్సును కాంక్షిస్తూ, ప్రపంచబ్యాంకు, ఐ.యం.యఫ్.ల నగ్నదోపిడీ విధానాలకు వ్యతిరేకంగా వాషింగ్టన్‌లో దాదాపు 50వేల మంది ప్రజలు జరిపిన భారీ ప్రజా ప్రదర్శన ప్రపంచమంతటా సంచలనం రేపుతూ బ్రహ్మాండమైన విజయం సాధించింది. వందకు పైగా పేద దేశాలకు చెందిన 60 ప్రజా సంఘాలు; ప్రభుత్వేతర

సంస్థలు; వివిధ విద్యార్థి, యువజన సంఘాలు; సాంస్కృతిక, కళా సంఘాలు; కార్మిక, ఉద్యోగ, వృత్తి సంఘాలూ; మేధావి వర్గాలతో సాగిన మూడురోజుల నిరసన ప్రదర్శనతో ప్రపంచబ్యాంకు ప్రధాన కార్యాలయం, అమెరికా అధ్యక్ష కార్యాలయం వున్న 'వైట్‌హౌస్' ప్రాంతం మొత్తంగా ప్రజా ముట్టడికి గురైనాయి. వాస్తవంగానే ప్రపంచబ్యాంకు/ఐ.యం.యఫ్. ప్రధాన కార్యాలయం యుద్ధ వాతావరణాన్ని తలపింప జేసింది. దీంట్లో భాగంగా జార్జి వాషింగ్టన్ యూనివర్శిటీ విద్యార్థులు ''కార్పొరేట్ దురాశ''కు వ్యతిరేకంగా ప్రదర్శనలు సాగిస్తున్నందువల్ల అధికారులు యూనివర్శిటీ ఐదురోజులపాటు మూసివేసి క్యాంపస్‌లోకి అతిథుల ప్రవేశాన్ని నిషేధించారు. ప్రభుత్వోద్యోగులు ప్రదర్శనలకు మద్దతిస్తున్నారన్న నెపంతో వారికి సెలవు ప్రకటించి ''యుద్ధప్రాంతం'' లోకి ప్రవేశించరాదంటూ హెచ్చరించారు. బ్యాంకు కార్యాలయ భవనాలను పోలీసులు ఆక్రమించి బ్యారికేడ్లు నిర్మించారు. ఇవన్నీ చాలక సమావేశం తొలి రోజు ఉదయం ప్రదర్శనకారుల ప్రధాన కార్యాలయంలోకి పోలీసులు దూసుకెళ్ళి సమావేశ ప్రాంతాన్ని మూసివేశారు.

అయినప్పటికీ 30,000 మంది ప్రదర్శకులు (ఇది పోలీసుల అధికారిక లెక్క) సమావేశ స్థలంలోకి ప్రతినిధుల రాకను నిరోధిస్తూ బ్యాంక్ భవంతి చుట్టూ మానవహారం కట్టారు. ఒకవైపు ఫెడరల్ పోలీసు బలగాలు, మరోవైపు ఎస్.బి.ఐ., సి.ఐ.ఎ. మష్టీ దళాలతో పాటు, పైన హెలికాప్టర్ల పర్యవేక్షణలో వాషింగ్టన్ ముట్టడికి గురైనట్లు కనిపించింది.కానీ ప్రజాసంఘాల అప్రమత్తతవల్ల ప్రపంచబ్యాంకు కార్యాలయానికి దారితీసే రోడ్లన్నీ ప్రదర్శకులతో నిండిపోయాయి. వీరు బ్యాంక్ కార్యాలయంలోకి చొరబడకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాటర్‌కేన్స్‌తో భారీ వాహనాలు సలసలకాగే వేడినీళ్ళ పైపులతో సిద్ధంగా నిలిచాయి. మాస్కులతో, బులెట్‌ప్రూఫ్ జాకెట్లతో, బాష్పవాయు సిలెండర్లతో వందలాదిమంది ఫెడరల్ పోలీసులు యుద్ధానికి సిద్ధమైనట్లు పరస్పరం ఎదురెదురుగా నుంచున్నారు. హైద్రాబాద్ నగరంలో తరచుగా జరిగే విప్లవ ప్రజా ప్రదర్శనలను గుర్తుచేస్తూ డప్పుల వాయిద్యాలు, వివిధ మ్యూజిక్ పరికరాలు, పాటలు, నినాదాలతో హోరెత్తిపోయిన ఇలాంటి ప్రదర్శనలు వాషింగ్టన్‌లో జరగటం తన జీవిత కాలంలో చూడలేదని నగర మేయర్ ప్రకటించాడు. వీటన్నిటికి మించి పేద దేశాల ప్రజాసంఘాలు సాక్షాత్తూ అమెరికా రాజధానిపైనే దండెత్తి రావటమన్నదే ప్రపంచబ్యాంక్ అధికారిక గణాన్ని హడలెత్తించింది.

టియర్‌గ్యాస్ వదలటం, మిరియాల పొడి కలిపిన నీళ్ళు చల్లడం వంటివి వుపయోగించి ప్రదర్శకులను చెదరగొట్టారు. అదీ చాలక 1971 మేడే ప్రదర్శనకారుల అరెస్ట్ తర్వాత ఎన్నడూ జరగనంతటి విస్తృత ప్రజా అరెస్టులకు దిగి పోలీసులు దాదాపు 600 మంది మిలిటెంట్లను అరెస్ట్ చేశారు. కానీ ప్రజా దిగ్బంధనలో ఫ్రెంచ్, బ్రెజిల్, పోర్చుగీస్ దేశాలతో పాటు పలు దేశాల ఆర్థికశాఖా మంత్రులు చిక్కుకుని పోయారు. వీరు తాము బస చేసిన 'వాటర్ గేట్ హోటల్'లో దాదాపు 6 గంటలపాటు ఖాళీగా కూర్చోవలసి వచ్చింది. పోలీసుల మితిమీరిన చర్యలను ధిక్కరించి వివిధ దేశాల ప్రదర్శనకారులు ప్రపంచబ్యాంకు, ఐ.యం.యఫ్. కూటమిని టి.యస్.సి.ల తొత్తుల్లాగా అభివర్ణిస్తూ నినాదాలు చేశారు. ప్రదర్శనకారుల వత్తిడి ఎంత తీవ్రంగా వుండిందంటే ఏప్రిల్, 16, 17 తేదీలలో పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక మంత్రుల సమావేశంలో పాల్గొన్న ప్రముఖులంతా తమ సమావేశ స్థలాన్ని చేరుకోవడానికి తెల్లవారుజామున అయిదుగంటలకే బయలుదేరాల్సి వచ్చింది. సియాటిల్ తరహా వీధి పోరాటాలను తాము నివారించ గలిగామని, వాషింగ్టన్‌లో సియాటిల్ ఘటనలు పునరావృతం కాకుండా అడ్డుకోగలిగామని, సియాటిల్ ప్రదర్శకులకు సంబంధించిన వీడియో టేపులను నెలల తరబడి పరిశీలించి నిరోధక చర్యలకు సమాయత్తం అయినందువల్లే వాషింగ్టన్‌లో ప్రపంచబ్యాంకు ఆర్థిక సమావేశాలు నిరాఘాటంగా కొనసాగాయని ఒకవైపు ప్రభుత్వం, పోలీసులూ, మరోవైపు బాకా ప్రచార సాధనాలు వూదరగొడు తున్నప్పటికీ నిరసన ప్రదర్శనల లక్ష్యం మాత్రం నెరవేరింది. వాషింగ్టన్ ప్రదర్శనల సందేశం ప్రపంచమంతటా అన్ని దేశాల ప్రజల ముందుకు చేరింది. ప్రజలకు జవాబు చెప్పే అలవాటులేని బ్యాంకర్లు, పాశ్చాత్య ఆర్థిక మంత్రులు వాషింగ్టన్ జన ప్రదర్శనల వత్తిడి ప్రభావంతో పదే పదే టెలివిజన్‌లను ఆశ్రయించాల్సి వచ్చింది. 'స్థూల ఆర్థిక సంస్కరణలు', 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయటం', 'మరింత గొప్ప పారదర్శకత' వంటి చిలకపలుకులు వల్లించడానికిగానూ వారిలా చేయలేదు. రుణాల వూబిలో ముంచి ప్రపంచ ప్రజలను దరిద్రులను చేస్తున్నారని, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్నారని, మూడో ప్రపంచ దేశాల సామాజిక భద్రతా చట్రాన్ని నిర్మూలిస్తున్నారని ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగాన్ని వ్యాపింపజేస్తున్నారని, పెట్టుబడిదారీ దోపిడీ ప్రపంచీకరణకు సాధనాలుగా పనిచేస్తున్నారని ఏప్రిల్ 16 ప్రజా ఉద్యమం తమపై మోపిన ఆరోపణలకు సమాధానం చెప్పుకోడానికే, తమను తాము సమర్థించుకోవడానికే వీరంతా బాకా టెలివిజన్ స్టేషన్ల ముందుకు పరుగులు తీయాల్సి వచ్చింది. సమావేశాల కాలంలో ఆ తర్వాతా వీరికి ఆరోపణల వెల్లువతో నిద్ర పట్టలేదంటే అతిశయోక్తి కాదు. మరోవైపు ఈ సమావేశాల కాలంలో ఎలాంటి గొడవలూ జరగకుండా చూసేందుకుగానూ నగర పోలీసులు డిసెంబర్‌లో జరిగిన సియాటిల్ ప్రదర్శనల వీడియో టేపులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారనీ, సకల సన్నాహాలతో పోలీస్ యంత్రాంగం సన్నద్ధంగా వుందని బాకా టీవీలు పదే పదే చిత్రీకరించినప్పటికీ ఇవేవీ వాషింగ్టన్‌లో ప్రదర్శకుల సమీకరణను అడ్డుకోలేక పోయాయి. ఈ అంశాల ప్రాతిపదికన చూస్తే వాషింగ్టన్ ప్రదర్శనలు విజయవంతం అయినట్లే లెక్క.

ఈ సమావేశం ఫలితాలు ఇంతటితో ముగియలేదు. ప్రదర్శనల తాకిడి ఫలితంగా ప్రపంచబ్యాంకు, ప్రపంచ ఆర్థిక సంస్థ అధ్యక్షులు, వాటి డైరెక్టర్లు వంటి అత్యున్నత స్థాయి అధికారులు సైతం ''పేద దేశాల ప్రజాందోళనలు తమ దృష్టికి వచ్చాయని వాటిని కాదనలేని స్థితిని తమకు కల్పించాయని'' అంగీకరించక తప్పిందికాదు. ఇక 17వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో ప్రపంచబ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఈ రెండు ఆర్థిక సంస్థల ప్రముఖులంతా పాల్గొన్నారు కానీ; పెట్టుబడిదారీ దేశాలకు, గుత్త పెట్టుబడిదారీ సంస్థలకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రభుత్వాలకు తాము చేస్తున్న ఏకపక్ష సాయం గురించి విలేఖరులు గుప్పించిన ప్రశ్నలకు వీరెవరూ సమాధానాలివ్వలేక పోయారు. పేద దేశాలకు సహాయ పడటంలో ప్రపంచబ్యాంకు విఫలమైందని వచ్చిన విమర్శకు సంబంధించి ఆ బ్యాంకు అధికార ప్రతినిధి ఏ రకంగానూ విలేఖరులను సంతృప్తి పర్చలేక పోయాడు.

ప్రపంచమంతటా వందలాది భాషలు మాట్లాడే ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ దేశాల ప్రజలు, పిల్లలు, మహిళలతో కూడిన వాషింగ్టన్ నగర ఐక్యవేదికపై ప్రసంగించిన వక్తలంతా ప్రపంచబ్యాంకు పేద దేశాలలో నిర్వహిస్తున్న పాత్రను ఎత్తిచూపారు. అమెరికా, మరో 24 పెట్టుబడిదారీ దేశాల చెప్పుచేతుల్లో వున్న ప్రపంచబ్యాంకు, ఐ.యం.యఫ్., డబ్ల్యు.టి.ఓ. వంటి ఆర్థిక సంస్థలు ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న అధిక వడ్డీతో కూడిన దోపిడీ వ్యాపారాన్ని బహిరంగ సభలో ప్రజాసంఘాల ప్రతినిధులు ఎండగట్టారు. భారత దేశంలో ప్రపంచబ్యాంకు ప్రధానంగా పంజాబ్ ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను లోబర్చుకుని ప్రజా వ్యతిరేక ఒప్పందాలను కుదుర్చుకుని వాటిని శాసిస్తున్నదని గతంలో ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యాపారం ద్వారా భారత దేశం చేత వూడిగం చేయించుకున్న పాత్రనే ప్రపంచబ్యాంకు నేడు నిర్వహిస్తోందని ఈ ప్రదర్శనలకు హాజరైన పంజాబ్‌కి చెందిన ఓ మహిళా ప్రతినిధి డా॥ వనీతాగుప్తా దుయ్యబట్టింది. దక్షిణాఫ్రికా కార్మిక సంఘ నాయకుడు ట్రివర్ నగేకెన్ ఉద్రేకపూరితంగా మాట్లాడుతూ ప్రపంచ కార్మికరంగంపై ప్రపంచబ్యాంకు గురిపెట్టిన ఆర్థిక అణ్వస్త్రాన్ని తిప్పికొట్టకపోతే మానవ మనుగడకే పెనుముప్పు తప్పదని, విశ్వవ్యాపితమైన ఆత్మగౌరవ ఉద్యమానికి వాషింగ్టన్ వుద్యమం నాంది కావాలని పిలుపిచ్చాడు. ఇక లాటిన్ అమెరికాకి చెందిన మహిళా ప్రతినిధి సిలియా ఆలారియో మాట్లాడుతూ, ప్రపంచబ్యాంకు పెట్టుబడులతో ప్రవేశిస్తున్న ప్రైవేట్ సంస్థలు వ్యవసాయ భూములను సైతం స్వాధీనం చేసుకుని, పేద రైతులను శాశ్వత బానిసలుగా మార్చే ప్రణాళికలను వివిధ దేశాలలో అమలు చేస్తున్నాయని, పేద దేశాల ప్రజలు ప్రపంచబ్యాంకు కబంధ హస్తాల నుండి బయట పడేందుకు అలుపెరుగని పోరాటాలు చేయాల్సిన తరుణం ఆసన్నమైందని పేర్కొంది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఉత్తర అమెరికా ప్రజా కళాకారులు కార్మిక, ఉద్యోగ, యువజన, మహిళా, మానవ హక్కుల సంఘాలు, విలేఖరులు, మేధావులు, చివరకు పసిబిడ్డల నెత్తుకున్న అన్ని దేశాల తల్లులు కలిసికట్టుగా పాల్గొన్న ఈ ప్రదర్శన ప్రపంచబ్యాంకు దోపిడీ ఏ స్థాయికి చేరుకుందో కళ్ళకు కట్టినట్లు చిత్రించింది. వివిధ దేశాలలో పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రపంచబ్యాంకు 'కమీషన్ ఏజెంట్లు' చేస్తున్న నిర్వాకాలను ఆయా దేశాల ప్రతినిధులంతా ముక్తకంఠంతో నిరసించారు. ప్రపంచ ప్రజల వాణిని ఈ ప్రదర్శనలు ఎంత సంఘటితంగా వినిపించాయంటే పెట్టుబడిదారీ వ్యవస్థకి సంపూర్ణ మద్దతుదార్లైన అమెరికా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సైతం ఈ ప్రదర్శనలకు సంబంధించిన వార్తలను ప్రముఖంగా ప్రచురించి, ప్రసారం చేయాల్సి వచ్చింది.

వాషింగ్టన్ ప్రదర్శనలు స్పష్టంగా ఒక విషయాన్ని ఎత్తిచూపాయి. **గుత్త సంస్థలకు, బ్యాంకులకు, పెట్టుబడిదారీ పాలకులకు విన్నపాలు చేయుటం, అర్జీలు పెట్టడం ద్వారా ఏ సామాజిక మార్పు రాదని, ప్రజల ప్రత్యక్ష కార్యాచరణే ఏ సామాజిక మార్పునైనా తీసుకు రాగలుగుతుందని ఈ ప్రదర్శనలు చాటి చెప్పాయి.** విజయవంత మైనవిగా ఇన్నాళ్ళూ వూదరగొట్టిన పెట్టుబడిదారీ వ్యవస్థకు సంబంధించిన అంశాలు తమనెంతగా మోసగిస్తోందీ అనుభవ పూర్వకంగా గ్రహించి వివిధ దేశాల ప్రజానీకం దానిపై తీవ్ర ద్వేషంతో కదిలివచ్చారని ఈ ప్రదర్శనలు సూచించాయి. యువతరంలోని మెజారిటీ నేరుగా పాలకవర్గ సమాజంపైనే తిరుగుబాటు చేసింది. ప్రపంచ ప్రజల దారిద్ర్యం నుండి పుట్టుకొస్తున్న అపార సంపదలు, విలాసాలకు వ్యతిరేకంగా వారు తిరుగుబాటు చేశారు. స్టాక్ మార్కెట్లపై పెట్టుబడిదారీ సమాజపు వీరారాధనకు, దాని అణచివేతకు, జాత్యహంకారానికి వ్యతిరేకంగా వారు తిరగబడ్డారు. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యపు దుష్ఫలితాన్ని దశాబ్ద కాలంపైగా చవిచూస్తూ వచ్చిన నూతన తరాలే ఈ ఉద్యమంలో కీలకపాత్ర వహించాయి. అందుకే అమెరికా ప్రభుత్వం వాషింగ్టన్ ప్రదర్శనలను ఏరకంగా అయినా సరే అడ్డుకోవాలని శతధా ప్రయత్నించింది. స్టాక్ మార్కెట్ విజయపరంపరలకు సంబంధించిన ప్రతి అంశమూ చతికిలబడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థ సుస్థిరత్వం మరింత సందేహాస్పదంగా మారుతున్న సంక్లిష్ట కాలంలో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ఉదారవాదులు, నిరాశావాదులు, అరాచకవాదులు, సోషల్ డెమోక్రాట్లు, మతశక్తులూ, పర్యావరణ వాదులు, కమ్యూనిస్టులూ తదితర వివిధ రకాల భావజాలాల ప్రతినిధులు మూకుమ్మడిగా వాషింగ్టన్ పైకి దండెత్తి రావటమే అమెరికా పాలకులను, ప్రపంచబ్యాంకు ప్రతినిధులను కలవర పర్చింది. సియాటిల్, వాషింగ్టన్ వరుస పరిణామాలతో సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలు తమ చరిత్రలోనే మొదటిసారిగా ప్రపంచ ప్రజలకు తమ పథకాల అమలులో జరిగిన లోపాల గురించి అంగీకరించి సంజాయిషీ ఇచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

## థాయిలాండ్‌లో పోటెత్తిన జన సందోహం

మే నెల మొదట్లో థాయ్‌లాండ్‌లో జరిగిన ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఎ.డి.బి.) 33వ వార్షిక సర్వసభ్య సమావేశపు తంతు సైతం ఇలాగే సాగింది. 38 సంస్థలకు చెందిన 25,000 మంది ప్రదర్శకులు రాజధాని బ్యాంకాక్‌లో ఏ.డి.బి. ప్రతినిధులు విడిది చేసిన ఫైవ్‌స్టార్ హోటళ్ళ చుట్టూ పోలీసులు ఏర్పర్చిన బారికేడ్లను ధ్వంసం చేసి పోలీసులను వెనక్కి నెట్టేశారు. థాయ్‌లాండ్ ప్రభుత్వం ప్రదర్శకులను చెదరగొట్టేందుకు థాయ్‌బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌ని సైన్యాన్ని పిలిపించి లాఠీలను, టియర్‌గ్యాస్‌లను, వాటర్ కేనన్‌లను ప్రయోగించింది. సమావేశ స్థలం వద్ద ప్రదర్శకులు పోలీసుల బారును నెట్టివేశారు. పోలీసులు తిరిగి జమకూడి సమావేశ ద్వారం సమీపంలో ప్రదర్శకులపై తీవ్రమైన దాడులకు పాల్పడటం ద్వారా మాత్రమే ప్రదర్శకులు సమావేశపు హాలులోనికి వెళ్ళకుండా నిరోధించ గలిగారు. సమావేశం జరిగే హాలు వెనుకవైపున మరికొంతమంది ప్రదర్శకుల బృందం పోలీసులతో తలపడింది. ''థాయ్‌లాండ్ దేశాన్ని ఎవరు పరిపాలిస్తున్నారో చెప్పమం''టూ ప్రదర్శకులు డిమాండ్ చేస్తూ థాయ్‌లాండ్ గడ్డపై నుండి ఎ.డి.బి.ని తన్ని తరిమేయాలంటూ నినదించారు.

## మిలిటెంట్ మేడే ప్రదర్శనలు

ఈ సమయంలోనే యూరప్‌లో మిలిటెంట్ ప్రదర్శనల మధ్య మేడే జరిగింది. అమెరికాలో వందలాది ప్రదర్శనకారులు అమెరికా వాణిజ్య కేంద్రాలున్న వీధుల్లోకి తరలివచ్చారు. జర్మనీలో వామపక్షవాదులు నయా నాజీలతో ఘర్షణలకు దిగారు. మరోవైపు ఈ నయా నాజీలు పోలీసులతో వీధి పోరాటాలు చేశారు. వాటర్ కేనన్లు, టియర్‌గ్యాస్, కవచాలు ధరించి సన్నద్ధంగా వచ్చిన పోలీసులతో వేలాదిమంది ప్రదర్శకులు తలపడ్డారు. హాంబర్గ్ రేవు పట్టణంలో వేరు

వేరు ఘర్షణల్లో 50 మంది గాయపడ్డారు. లండన్‌లో అయితే వేలాదిమంది ప్రదర్శకులు చర్చిల్, జనరల్ స్మట్స్ వంటి సామ్రాజ్యవాద ప్రముఖుల విగ్రహాలకు రంగు పూశారు. వీరు పార్లమెంట్ స్క్వేర్‌లో పచ్చికను తవ్వేయటమేగాక మెక్‌డొనాల్డ్ రెస్టారెంట్‌పై కూడా దాడి చేశారు. పోలీసులతో జరిపిన తీవ్ర పోరాటాలలో పలు షాపులు, కార్లూ ధ్వంసం కాగా 100 మంది దాకా ప్రదర్శకులు అరెస్టయినారు. ఆగ్రహంతో ఊగిపోయిన బ్రిటన్ ప్రధాని టోనీబ్లెయిర్ ఈ ప్రదర్శనకారులను ''మతిలేని దారి దోపిడీ దొంగలంటూ'' నిందిస్తూ మరోవైపు చర్చిల్, జనరల్ స్మట్స్ వంటి నిజమైన సామ్రాజ్యవాద బందిపోట్లను ఆకాశానికెత్తేశాడు. ఇక ఫ్రాన్స్‌లో జనసందోహంతో నిత్యం రద్దీగా వుండే పారిస్ నగరంలోని ఓ వీధిలో బాంబు పేల్చి భద్రతా బలగాలను సవాలు చేశారు. సంప్రదాయానికి భిన్నంగా, వామపక్షీయులకన్నా మితవాద సెక్షన్ల ప్రజానీకమే ఈయేటి మేడే ప్రదర్శనల్లో ఎక్కువగా పాల్గొన్న వైనమే పెట్టుబడిదారీ పాలకవర్గాలను కలవరపర్చింది. దోపిడీ వ్యవస్థ నిత్య సమర్థకులే దోపిడీ వ్యవస్థ వైఫల్యాలతో అరాచక విధానాలతో విసుగెత్తి పోయారు.

## అసమాన ప్రపంచ వ్యవస్థపై నేరారోపణ చేసిన జి-77, ఆలీన దేశాల సమావేశాలు

ఏప్రిల్ 11 నుండి 15 దాకా క్యూబా రాజధాని హవానాలో ఐదురోజులపాటు జరిగిన గ్రూప్-77 దేశాల సమావేశం తన చరిత్రలోకెల్లా మొట్ట మొదటిసారిగా, ప్రపంచీకరణ దశలో మూడో ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించింది. 133 దేశాల అధినేతలు (వీరిలో 42 మంది అధ్యక్షులు లేదా ప్రధాన మంత్రులు) పాల్గొన్న ఈ సమావేశం వర్ధమాన దేశాల మూలుగులను పీల్చేస్తున్న సామ్రాజ్యవాద విధానాలను తూర్పార బట్టింది. తన ప్రారంభోపన్యాసంలో క్యూబా అధ్యక్షుడు ఫిడెల్‌కాస్ట్రో భూమండలంపై ప్రపంచీకరణ మోపిన ప్రమాద ఘంటికలు దిగ్భ్రాంతికరంగా వున్నాయని ధ్వజమెత్తాడు. శాస్త్ర సాంకేతిక రంగాలలో ఇప్పటి విజయాలను మానవజాతి మునుపెన్నడూ చవిచూసి వుండలేదని, అసాధారణ స్థితిలో సంపదలను, సౌభాగ్యాన్ని ఇంతగా సృష్టించటం మునుపెన్నడూ ఎరుగమనీ, కానీ ఇపుడు నెలకొన్న స్థాయిలో వ్యత్యాసాలు, అసమానతలను సైతం ప్రపంచం మున్నెన్నడూ ఎరిగి వుండలేదని కాస్ట్రో చెప్పాడు. సామ్రాజ్యవాద సంస్థలు ఆరోపిస్తున్నట్లుగా వెనుకబాటుతనానికి ఆయా ప్రభుత్వాల అస్తవ్యస్థత కారణం కాదనీ, విదేశీ రుణాలే అభివృద్ధికి తీవ్రమైన ఆటంకాలుగా వున్నాయనీ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునాదులనే పేల్చివేయడానికి సిద్ధంగా వున్న బాంబుల్లాగా విదేశీ రుణాలు ఇపుడు తయారైనాయని కాస్ట్రో ఆరోపించాడు. నిరుపేదలే సంపన్నులకు ఆర్థిక సహాయం అందించే తరహా క్రూర వ్యవస్థను ఐ.యం.యఫ్.ను సృష్టించిందని, ప్రపంచ వ్యాప్తంగా గల సెంట్రల్ బ్యాంకుల్లోని 70 శాతం నిల్వలు అమెరికన్ డాలర్ల రూపంలో పోగు చేయబడినాయని, వీటిలో 727 బిలియన్ డాలర్లు ఒక్క అమెరికాలోనే పోగుపడ్డాయని, ఈ పరిస్థితి కారణంగా ప్రపంచంలోకెల్లా సంపద్వంతమైన, శక్తివంతమైన అమెరికాయే దీర్ఘకాలిక రుణాల్లో అత్యధిక భాగాన్ని పొందగలుగుతోందని వెనుకబడిన దేశాల అవకాశాలు ఇలా కొల్లబోయి, అవి ఐ.యం.యఫ్., ప్రపంచబ్యాంకుల భారీ వడ్డీరేట్లతో కూడిన విదేశీ రుణాల బారిన పడుతున్నాయని కాస్ట్రో ఆరోపించాడు. 400 కోట్ల ప్రజలను దారిద్ర్యంలో ముంచెత్తిన తరహా నూతన వర్ణ వివక్షతను పాశ్చాత్య పెట్టుబడిదారీ ప్రపంచం సృష్టించిందని దీనికి వ్యతిరేకంగా వర్ధమాన దేశాలు ఐక్య సంఘటన కట్టితీరాలని క్యూబా, నైజీరియా దేశాధ్యక్షులు పిలుపిచ్చారు. ఈ విధంగా 1954లో ఏర్పడిన జి-77 దేశాల కూటమి మొట్టమొదటిసారిగా ప్రపంచీకరణ దుష్ప్రభావాలను గురించి ఎలుగెత్తింది.

కొలంబియాలో ఏప్రిల్, 8 నుండి 10 దాకా జరిగిన ఆలీన దేశాల విదేశాంగ మంత్రుల 13వ సమావేశంలో పాల్గొన్న 115 సభ్య దేశాల విదేశాంగ మంత్రులు, ప్రతినిధులు సైతం ప్రపంచీకరణ సవాళ్ళు, సామ్రాజ్యవాదుల ''మానవతాపూర్వక బాహ్య జోక్యం'' గురించి ప్రస్తావించక తప్పిందిగాదు. ప్రపంచీకరణ, మానవతాపూర్వక జోక్యం అనేవి ఆలీన దేశాల ప్రధాన సమస్యలుగా వున్నాయని ఈ సమావేశం పేర్కొంది. యుగోస్లావియాపై అమెరికా సాగించిన యుద్ధం తేల్చి చెప్పినట్లుగా ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని త్రోసిరాజని ఏకపక్షంగా వ్యవహరించేందుకుగాను అమెరికా సమస్యాత్మక దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో ''మానవతా పూర్వకమైన జోక్యం చేసుకోవటం'' అనే ప్రతిపాదనను పదే పదే ముందుకు తీసుకువస్తోంది. ఇది తిరుగుబాట్లకు నిలయమైన వర్ధమాన దేశాల పాలక వర్గాలను కలవర పెడుతోంది. ఇదే ఆలీన దేశాల సమావేశంలో ప్రస్ఫుటించింది.

సియాటిల్ మొదలుకుని, మేడే ప్రదర్శనల దాకా వరుసగా జరుగుతూ వచ్చిన పరిణామాలను పరిశీలించినట్లయితే వివిధ దేశాల పాలకవర్గాలు సామ్రాజ్యవాద ఆర్థిక దోపిడీ విధానాల ముందు సాగిలబడిపోగా, మరోవైపు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల నిరసన వెల్లువెత్తుతోందని బోధపడుతుంది. సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా వీధుల్లోకి వస్తున్న ప్రజారాసుల సంఖ్య దినదినమూ పెరిగిపోతోందని కూడా ఈ పరిణామాలు తెలియ జేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద పాలకులుకాని, దోపిడీ ద్రవ్యనిధి సంస్థలు కాని ప్రజల తీవ్రమైన నిరసన ప్రదర్శనలు లేకుండా సభలూ, సమావేశాలూ సజావుగా జరుపుకోవటం రాన్రానూ అసాధ్య మవుతోంది. ''సోషలిజం ఇనుప తెరలు'' గా చెప్పబడుతూ వచ్చిన రివిజనిస్టు దేశాలు కుప్పగూలిన తర్వాత ఇక ఉదార ప్రజాస్వామ్యానిదే రాజ్యమంటూ విర్రవీగిన సామ్రాజ్యవాద వ్యవస్థ కేవలం పదేళ్ళలోపే అంతర్జాతీయంగా తన 'విశ్వసనీయత' అనుమానించబడేంత తీవ్ర పరిణామాలలో కూరుకుపోయింది. ఈ నేపథ్యంలో 'చరిత్ర అంతమవటం' మాటేమో కాని ఉదార ప్రజాస్వామ్యం ముసుగులోని సామ్రాజ్యవాద దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజల సామూహిక పోరాట చరిత్ర వినూత్న పద్ధతులలో మొదలైంది.

## 'చరిత్రాంతం' పూర్వాపరాలు

పదేళ్ళక్రితం సోషలిజం ముసుగులోని రివిజనిజంపై తూర్పు యూరప్‌లో ప్రజా తిరుగుబాటు చెలరేగింది. తూర్పు జర్మనీ, పశ్చిమ జర్మనీ ప్రజలను శాశ్వతంగా వేరుచేస్తూ తూర్పు జర్మనీ రివిజనిస్ట్ నియంతృత్వం 30 సం॥ల క్రితం బెర్లిన్ నగరానికి మధ్యలో కట్టిన అడ్డుగోడ 'బెర్లిన్‌వాల్'ని ప్రజలు కుప్పగూల్చేశారు. జర్మన్

( తరువాయి 58వ పేజీలో.....)

# ''జన్మభూమి బూటకం వద్దు - తాగేందుకు మంచి నీళ్ళివ్వండి'' అంటూ 'జల జన్మభూమి'కి వ్యతిరేకంగా పోటెత్తిన ప్రజానీకం.....

'దప్పికైనప్పుడు బావి తవ్వుకోవటం' సామెత జన జీవితంలోనే పుట్టినా అది పాలకులకు బ్రహ్మాండంగా వర్తిస్తుంది. నీరు-మీరు, జల జన్మభూమి, మంచినీటి సంఘాలు, జల సంరక్షణ సమితి, వాటర్‌షెడ్లూ గిడ్లూ....వంటి కొత్త కొత్త పదాలూ, భావనలూ, ప్రభుత్వ పథకాల జిమ్మిక్కులూ ఏకమొత్తంగా పై సామెతను అక్షరాక్షరంగా నిరూపిస్తున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో 18 జిల్లాల్లో 700 మండలాల్లో కరువు తాండవం చేస్తూ; సాగునీటి కోసం, మంచినీటి కోసం లక్షలాదిమంది ప్రజలు కటకటలాడుతూ పనుల కోసం, బతుకు కోసం పరాయి ప్రాంతాలకూ, రాష్ట్రాలకూ వలసపోతున్న సమయంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన జన్మభూమి నినాదం 'నీరూ-మీరూ' ప్రజల జీవితాలను ఘోరంగా అపహాస్యం చేస్తూ, నీటి ఎద్దడికి 'తూతూ మంత్రాలు' వేస్తూ కొనసాగింది.

ఏప్రిల్ మాసాంతంలో, మేనెల మొదట్లో సవాలక్ష పేర్లతో నీరూ మీరూ, వాటర్‌షెడ్ల వంటి హైటెక్ పథకాలు ఆంధ్ర రాష్ట్రంపై విరుచుకు పడటానికి నేపథ్యం ఏమిటి? దేశ వ్యాప్తంగా ఈ వేసవిలో ముంచుకొచ్చిన నీటి ఎద్దడిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాల్లో దాదాపు 18 జిల్లాలు కరువు పీడిత జిల్లాలుగా ప్రకటించబడినాయి. రాష్ట్ర భూభాగంలోని 60 శాతం తీవ్రాతితీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంది. రాష్ట్రంలోని మొత్తం 1104 మండలాల్లో 688 మండలాల్లో మంచినీరు సైతం విలాస వస్తువుపై పోయింది. కొన్ని ప్రాంతాలలో కడవనీళ్ళను 5 రూ॥లకు కొని, సంపాదించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనేక గ్రామాలలో కాసిని నీళ్ళకోసం కాలినడకన, ఎడ్లబండ్లమీద కిలోమీటర్ల దూరం పోయి తెచ్చుకోవలసి వచ్చింది. 53 సం॥ల ఘనమైన 'స్వాతంత్ర్యం' తర్వాత, కంప్యూటర్ వున్మాది చంద్రబాబు ఆధ్వర్యంలో 5 సం॥ల తెలుగుదేశం హైటెక్ పాలన తర్వాత కూడా రాష్ట్ర ప్రజలు మంచినీటి ఎద్దడితో విలవిలలాడాల్సిన దుస్థితి దాపురించింది.

ప్రత్యేకించి తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల్లోని నాలుగుకోట్ల మంది ప్రజలు దారుణంగా కరువుబారిన పడ్డారు. మచ్చుకు రెండు జిల్లాలను పరిశీలిద్దాం. అన్నం మెతుకులకు ఠికానా లేకున్నా ప్రపంచీకరణ ప్రభావంవల్ల ఆస్ట్రేలియా నారింజపళ్ళకు కరువులేని అనంతపురం జిల్లాలో దాదాపు 3,000 గ్రామాలు గుజరాత్ కంటే దారుణమైన దుర్భిక్ష పరిస్థితులలో చిక్కుకు పోయాయి. దశాబ్ద కాలంగా వెంటాడుతున్న కరువు పరిస్థితులు, అల్ప వర్షపాతం, ఆకలిదప్పులు ప్రజలింకేమాత్రం సహించలేని స్థితికి చేరుకున్నాయి. రాయదుర్గం మండలంలోని పలు గ్రామాలు చుక్కనీరు కానరాకుండా పోయి 'కొత్త ఎడారులు'గా ప్రకటించబడినాయి. జిల్లాలోని ఐదు మండలాల్లో 40 గ్రామాలలో నేల ఇసుకబారిపోయి ఎడారిగా మారటం ఇప్పటికే మొదలై పోయింది. ఇది చాలా వేగంగా ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తోంది. అయినప్పటికీ ఇంతవరకూ ఇక్కడ జరుగుతూ వచ్చిన ప్రభుత్వ జన్మభూమి కార్యక్రమాలు కాంట్రాక్టర్ల, బ్యూరాక్రాట్ల రాజకీయ నాయకుల ఫలహారంగా మారిపోయాయి. గత నవంబర్‌లో పంటలు పాడయినప్పటి నుండి ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ సహాయ పథకం కూడా ఇక్కడి ప్రజలకు అందలేదు. పనికి ఆహారం పథకం కింద ఒక్క పథకం కూడా గ్రామాల ముంగిట చేరలేదు.

ఇక మహబూబ్‌నగర్‌లో మొత్తం 64 మండలాలూ కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించబడినాయి. ఏప్రిల్ చివరి నాటికే ఐదులక్షల మంది ప్రజల వలస పోయారు. దేశవ్యాప్తంగా నిర్మాణ పనులకు కూలీలను ఈ జిల్లాయే దశాబ్దాలుగా అందజేస్తోంది. ఈ ఒక్క జిల్లాలోనే ఏప్రిల్ చివరి నాటికి 19 మంది రైతులు అప్పులు చెల్లించలేక ఆత్మహత్యల పాలయినారు. ఇవి పరిహారం చెల్లించడానికి సిద్ధపడని ప్రభుత్వ అధికారిక లెక్కలు మాత్రమే. వాస్తవానికి జడ్చెర్ల పట్టణం చుట్టుపక్కల గల కొన్ని గ్రామాలలోనే 13 మంది రైతుల ఆత్మహత్యలు నమోదైనాయి. కానీ అవి ప్రభుత్వ జాబితాకు ఎక్కలేదు. కరువుకు తోడుగా వడ్డీ వ్యాపారులు, ఎరువుల, పురుగుమందుల వ్యాపారులు చివరకు బ్యాంకులు సైతం తామిచ్చి అప్పులను వడ్డీతో సహా వెంటనే చెల్లించమని వెంటబడ్డారు. కొంతమంది రైతులు ఆస్తులమ్మి అప్పులు కట్టారు. అమ్మేందుకు ఆస్తులు లేని వారు ఆత్మహత్యల పాలబడ్డారు. ఆత్మహత్యలు సైతం రైతుల సమస్యలను అంతం చేయలేదు. ఆత్మహత్యల పాలయిన వారి భార్యలను ఈ వడ్డీ వ్యాపారపు జలగలు దారుణమైన లైంగిక దోపిడీకి గురిచేశారు. ఇక ప్రభుత్వం తన వంతుగా మార్చి 20న ఈ జిల్లాలో సంభవించిన మొట్టమొదటి ఆత్మహత్యను సహజ మరణంగా చిత్రించి నయాపైసా పరిహారం కూడా ఇవ్వకుండా చేతులు దులిపేసుకుంది. పైగా ప్రభుత్వం ఆత్మహత్యల పాలయినవారి కుటుంబాలకు తాను అందిస్తున్న లక్ష రూపాయల పరిహారం రైతుల ఆత్మహత్యలను మరింతగా ప్రోత్సహిస్తున్నదని ఆరోపిస్తూ ఆ పరిహారాన్ని ఇక మీదట ఎత్తేస్తున్నట్లు ప్రకటించింది. ఇక మదమెక్కిన రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి నాగం జనార్ధనరెడ్డి ''రైతులు మతిస్థిమితం కోల్పోయినందువల్ల మానసిక వైద్యులను సంప్రదించాల''ని కారుకూతలు గుప్పించాడు. ఏలినవారికి మనుషులూ, వారి ప్రాణాలూ అంటే ఇంత చవకై పోయాయి.

వాస్తవంగా, ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజ్యమేలుతున్న చంద్రబాబు పాలనలో గత ఐదు సం॥ల కాలంలో చాలా భాగం కరువులూ, వరదలూ, తుఫాన్‌లతోనే నడిచింది. కానీ నీటి నివారణకై ప్రభుత్వం చేసింది కలికానిక్కూడా లేదు. అట్లే చెక్ డ్యామ్‌లు నిర్మించటం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న నీటి పారుదల పథకాలను పూర్తి చేయటం, రాష్ట్రంలోని వేలాది చెరువులు, బావులలో పూడికను తీయించటం, భూగర్భజలాన్ని పరిరక్షించటం, నీరు ఆవిరైపోవడాన్ని (evaporation losses) తగ్గించటం. వర్షపు నీటిని నిల్వచేసే పథకాలను, అడవుల అభివృద్ధి పథకాలను చేపట్టడం వంటి పలు అంశాలపై చంద్రబాబు వాస్తవంగా చేపట్టిన కృషి ఏమీలేదు. 1997లో రాష్ట్ర ప్రభుత్వం నీటి వనరుల అభివృద్ధి

కార్పొరేషన్‌ని ఏర్పర్చి, బాండ్లను జారీ చేయటం ద్వారా 300 కోట్ల రూ॥లను ప్రజలనుండి వసూలు చేసింది. అయినప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం, ఉదాశీనత కారణంగా ఈ సంస్థ ఊడబొడిచిందేమీ లేదు. బ్రహ్మాండమైన ప్రచార డాంబికాల మధ్య ప్రభుత్వం 11 విడతలుగా చేపట్టిన 'జన్మభూమి' పథకం ప్రజల మౌలిక డిమాండ్లలో కనీసం ఒక్కటయినా తీర్చలేక పోయింది. గత 5 సం॥లలో ప్రభుత్వం డజన్లకొద్దీ పథకాలను ప్రకటించినప్పటికీ, చివరికి మంచినీరు సైతం ప్రజలకు అందని అరుదైన సరకులాగా మారిపోయింది. మంచినీళ్ళు, సాగునీరు, విద్యుత్ సరఫరా, వ్యవసాయ సబ్సిడీలు, సబ్సిడీ గృహాలు, పేదలకు సబ్సిడీ ధాన్యాలు వంటి కనీసావసరాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత నుండి ప్రభుత్వం ప్రక్కకు తప్పుకోవడంలో భాగంగానే తెలుగుదేశం ప్రభుత్వం 'స్వయం సహాయం', 'శ్రమదానం', 'జన్మభూమి' పేరిట ప్రజలను స్వచ్ఛందంగా అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేలా చేయటం అనే జిమ్మిక్కుల ప్రదర్శనలో మునిగి పోయింది.

కానీ, గత అయిదేళ్ళ పాలనలో చంద్రబాబు ప్రభుత్వం ఒక్క అంగుళం భూమికి కూడా అదనంగా సాగునీటిని అందించిన పాపాన పోలేదు. దీనికి బదులుగా సారవంతమైన భూభాగాలు బీళ్ళు అయిపోయాయి. అట్లే ఒక మెగావాట్ విద్యుత్‌ని సైతం ప్రభుత్వం అదనంగా రైతులకు అందించిందీ లేదు. ఇంటర్నెట్ సదుపాయాలను కల్పించటం, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించటం, ఇంకా ఇతర ఆర్భాటపు ప్రచార కార్యక్రమాలపై చేసిన కృషిలో పదోవంతు కృషిని మంచినీటిని అందజేయటంలో, నీటి పరిరక్షణ పథకాలలో చేసివుంటే ఈరోజు పరిస్థితి ఇంత ఘోరంగా వుండేది కాదు. ఇంత జరిగాక ప్రస్తుత నీటి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు టి.డి.పి. ప్రభుత్వం ఆదరాబాదరాగా చేపట్టిన చర్యలెలా వున్నాయంటే 'గుడిసె నిప్పు అంటుకున్న తర్వాతే బావిని తవ్వటం' మొదలెట్టిన వైనాన్ని తలపిస్తున్నాయి.

ఈ అయిదేళ్ళుగా గ్రామాల్లో వాస్తవంగా జరిగిన పని నామమాత్రమే అయినప్పటికీ, చేయకున్నా చేసినట్లు చూపడంలో చంద్రబాబునాయుడు భారతీయ పాలకులందరినీ మించిపోయాడు. ప్రచార మాధ్యమాలలో జిగేలుమనిపించేలా ప్రకటనలూ, పథకాలూ గుప్పించటం ద్వారా, అవధులు మీరిన ప్రభుత్వ అసమర్థతను, ప్రజావసరాలపట్ల ఉదాసీనతను మరుగునపడేసే కళలో చంద్రబాబు ఆరితేరి పోయాడు. ఇకపోతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తమ దోపిడీకి ప్రయోగశాలగా మార్చుకున్న సామ్రాజ్యవాద రుణ సంస్థలు గత కొన్నేళ్ళుగా దోపిడీ సమర్థక విదేశీ పత్రికలలో ఉద్దేశ్యపూర్వకంగానే చంద్రబాబును ఎత్తిపడుతుండటమూ కొనసాగుతోంది. కాని. ఈ కితాబులూ, జన్మభూమి రంగుల కలలూ, 10,000 సాగునీటి వినియోగదారుల సంఘాలూ వగైరా సవాలక్ష కంగాళీలు కలిపి కూడా రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత కరువును నిరోధించటంలో పూచికపుల్లంత తోడ్పాటును సైతం అందించలేక పోయాయి. ఇవన్నీ చాలవన్నట్లుగా చంద్రబాబు ఇప్పుడు సామ్రాజ్యవాద నిధులతో మరొక ''జల సంరక్షణ సమితి'ని ఆట్టహాసంగా ఏర్పర్చాడు. ఈ 'జల సంరక్షణ సమితి' భారీ స్థాయి ఉన్నతాధికార వర్గ ప్రచార బూటకం తప్ప మరొకటి కాదు. అన్నాహజారే లాంటి బడా 'నిపుణులు', ఢిల్లీ బ్యూరాక్రాట్లు, వీరితోపాటు ప్రపంచబ్యాంకు, 'స్విస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్', 'నెదర్లాండ్స్ అసిస్టెన్స్ ప్రాజెక్ట్' వంటి దోపిడీ రుణ సంస్థల ప్రతినిధులతో కూడిన ఈ 'జల సంరక్షణ సమితి' వాస్తవంగా కింది స్థాయిలో ఏ మేరకు సాధించిందోగానీ, ఈ భారతీయ, విదేశీ 'నిపుణుల' సమావేశాలకు అయిదు నక్షత్రాల హోటళ్ళలో ఆతిథ్యం ఇవ్వటానికి మాత్రం చాలా భాగం నిధులను మళ్ళించారు. ఏ గూటి పక్షులు ఆగూటికే చేరతాయన్న సామెత అక్షర సత్యమే మరి. కానీ సామ్రాజ్యవాదులూ వారి తైనాతీలూ చంద్రబాబు 'మిషన్'లనూ , 'విజన్'లనూ ఆకాశానికెత్తేస్తుండగా మరోవైపు రాష్ట్ర ప్రజలు మేనెల మొదటివారంలో జరిగిన 12వ జన్మభూమి పథకంపై ఆగ్రహావేశాలతో విరుచుకుపడ్డారు. గత కొన్నేళ్ళుగా సాగిస్తున్న నాటకం కట్టిపెట్టి తక్షణం మంచినీటిని అందివ్వమంటూ డిమాండ్ చేశారు.

ఎవరినైనా కొంతకాలంపాటు మోసగించవచ్చు కానీ ఎల్లకాలమూ అందరినీ మోసగించటం అనేది జరగని పనే అని ఒక నానుడి. నిజంగా కూడా మే 1 నుంచి 7 దాకా 12వ విడత జన్మభూమి కార్యక్రమాన్ని మొదలెడుతూ 'నీరుమీరు' నినాదంతో ప్రజల్లోకి దూకిన చంద్రబాబు ఈసారి మాత్రం చావుదెబ్బ తిన్నాడు. మంచినీటికి సైతం కరువైపోయి వున్న ప్రజల ఆగ్రహావేశాల ముందు అతడి నక్కజిత్తులేవీ పనిచేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా జన్మభూమి పథకాన్ని అమలు చేయబోయిన అధికారులను, రాజకీయ నాయకులను ప్రజలు నిరసనలతో, బహిష్కరణలతో, ఘెరావ్‌లతో, బండబూతులతో చీత్కరించారు. చంద్రబాబు భట్రాజు 'ఈనాడు', దాని ఎలక్ట్రానిక్ కవలపిల్ల 'ఈటీవీ' లను మినహాయిస్తే ఈసారి జన్మభూమి పథకం గురించి ఇతర పత్రికలు కూడా సానుకూలంగా ఒక ముక్కను సైతం రాయలేక పోయాయి. రాష్ట్రంలోని వందలాది గ్రామాలు నిరసన ప్రదర్శనలతో హోరెత్తిస్తున్న వైనాన్ని, జన్మభూమి ప్రచార జిమ్మిక్కులు ఈ దఫా గాల్లో కలిసిపోయిన వైనాన్ని గురించి పత్రికల్లో రిపోర్టులు వెల్లువెత్తాయి.

ఈ అయిదేళ్ళ కాలంలో తెలుగుదేశం ప్రభుత్వ కార్యక్రమం ఇంత విస్తృత స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా విఫలం కావటం ఇదే మొదటిసారి. చంద్రబాబు నక్కజిత్తులను ప్రజలు ఈసారి నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. గ్రామాల్లో అధికారులు నిర్వహించిన గ్రామసభలు ప్రజలులేక, రాక వెలవెల బోయాయి. ఈ సభలలో చాలాచోట్ల ప్రజలకన్నా అధికారులు, రాజకీయ నాయకుల సంఖ్యే ఎక్కువగా వున్నట్లుగా వార్తలు. వృద్ధాప్య ఫించన్లు, విధవా స్త్రీల ఫించన్లు, మంచినీటి సరఫరా, యల్.పి. గ్యాస్ కనెక్షన్లు, కరెంట్ సరఫరా, బస్సు సౌకర్యం, రోడ్డు రిపేర్లు, మరమ్మత్తులు, ఇళ్ళ స్థలాలు, రేషన్ కార్డులు వంటి పదే పదే పెండింగులో వుంచబడుతున్న తమ డిమాండ్లు ఈసారయినా తీరక పోతాయా అనే ఆశతో వచ్చినవారు తప్ప తక్కినవారు గ్రామ సభలకు పూర్తిగా గైర్ హాజరైనారు. విప్లవోద్యమం బలంగా వున్న ప్రాంతాలకు ఎప్పటిలాగే అధికారులు, రాజకీయవాదులూ రాలేకపోయారు. ఏప్రిల్ 26న వరంగల్ జిల్లా చంద్రగిరి కొండల్లో 12 మంది కామ్రేడ్స్‌ని ప్రభుత్వ హంతక బలగాలు అమానుషంగా చంపేసిన సంఘటనకు వ్యతిరేకంగా పీపుల్స్‌వార్ పార్టీ మే 4, 5 తేదీలలో వరంగల్ జిల్లా బంద్‌కు పిలుపిచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని, మంత్రి కడియం శ్రీహరి జన్మభూమి

( తరువాయి 18వ పేజీలో.....)

# ధారకొండ పోలీస్ క్యాంపును ముట్టడించడంలో ధైర్య సాహసాలతో పోరాడి ప్రాణాలర్పించిన త్యాగధనులైన కా॥ నవీన్ (బాలక్రిష్ణ), కా॥ సత్యనారాయణ (శ్రీధర్) లకు విప్లవ జోహార్లర్పిద్దాం! అమరుల ఆశయాల సాధనకై పురోగమిద్దాం!!

ప్రియతమ నాయకులైన కా॥ శ్యామ్, మహేష్, మురళి, లక్ష్మీరాజంల మోసపూరిత హత్యలకు నిరసనగా ఏ.పి. రాష్ట్రకమిటీ తీసుకున్న నిర్ణయం ప్రకారం 18-2-2000న ధారకొండ ఏ.పి.యస్.పి. పోలీస్ క్యాంపును ముట్టికరిపించి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడమైంది. ఈ వీరోచిత దాడిలో కా॥ నవీన్ (బాలక్రిష్ణ, రాకేష్), కా॥ సత్యనారాయణ (శ్రీధర్, రమేష్) వర్గకసితో విప్లవ గెరిల్లా వీరత్వాన్ని ప్రదర్శించి, పొంచివున్న శత్రువు కాల్పుల్లో అసువులు బాసారు. ఈ ఇద్దరు కామ్రేడ్స్ శత్రువును దెబ్బతీయటంలో కీలకపాత్రను వహించారు. పోరాటంలో త్యాగధనులుగా పీడిత ప్రజల పక్షపాతులుగా, వీర గెరిల్లాయోధులుగా, విప్లవ కమ్యూనిస్టులుగా, ఈ ఇద్దరు అమరుల పోరాట జీవిత చరిత్రను ఆకళింపు చేసుకుంటూ, వారి అమరత్వాన్ని కొనియాడుతూ గ్రామగ్రామాన సంస్మరణ సభలను చేపడుతూ, స్థూపాలను నిర్మిస్తూ అమరుల ఆశయ సాధనకు పునరంకితమవుదాం.

## కా॥ నవీన్ (బాలక్రిష్ణ, రాకేష్):

కా॥ నవీన్ 35 సం॥ల క్రితం పశ్చిమ గోదావరి జిల్లాలో మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టి ఏలూరులో డిగ్రీ చదివాక మీరట్ (ఉత్తరప్రదేశ్)లో యం.ఏ. (సామాజిక శాస్త్రం) కోర్స్ పూర్తి చేసాడు. యం.ఏ. ఎం.ఫిల్. కోసం 1986లో ఢిల్లీలోని జె.యన్.యు. (జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ)లో చేరాడు. 1988లో కుల సమస్యపై థీసిస్ కోసం అక్కడే పిహెచ్‌డిలో చేరాడు. పిహెచ్‌డి చేస్తున్న క్రమంలోనే 1989లో విప్లవ రాజకీయాల వైపు ఆకర్షితుడయ్యాడు. మీరట్‌లో చదువు కుంటున్నప్పుడే మార్క్సిజం పట్ల ఆకర్షితుడై మొదట యస్.యఫ్.ఐ. లో చేరాడు. త్వరలోనే యస్.యఫ్.ఐ. రాజకీయాలపై భ్రమలు వీడి, జె.యన్.యు.లో చేరిన తొలినాళ్ళలోనే దాన్నుంచి దూరమైనాడు. యస్.యఫ్.ఐ. రాజకీయాలను తీవ్రంగా విమర్శిస్తూ 'స్టూడెంట్ ఫోరమ్'ని ఏర్పర్చాడు. ఇది జె.యన్.యు.లో యస్.యఫ్.ఐ. లొంగుబాటు రాజకీయాలను ఎండగడుతూ ముందుకొచ్చింది. 1986లోనే ఢిల్లీ రాడికల్ విద్యార్థి సంఘం (డి.ఆర్.యస్.ఒ.) ఏర్పడింది. 1988లో కా॥ నవీన్ డి.యస్.ఆర్.ఒ.లో చేరాడు. దీని తొలి నాయకత్వం చొరవ కోల్పోయి క్రియాశూన్యంగా మారినప్పటికీ కా॥ నవీన్ డి.ఆర్.యస్.ఒ.ని జె.యన్.యు.లో ప్రతిధ్వనించేలా మార్చాడు.



ఆనాడు వామపక్ష విద్యార్థి కేంద్రంగా పేరొందిన జె.యన్.యు.లో వామపక్ష భావజాలం క్షీణిస్తూ వుండేది. యూనివర్శిటీలో రాడికల్ భావజాలాన్ని పునఃప్రతిష్ఠించటంలో విద్యార్థి నాయకుడిగా కా॥ నవీన్ ఎనలేని కృషి చేశాడు. అఖిల భారత విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించటానికి అవిశ్రాంతంగా కృషిచేశాడు. దాదాపు పదేళ్ళకు పైగా ఢిల్లీలో ఏ.ఐ.ఆర్.యస్.యఫ్. రాజకీయాలకు నవీన్ హాస్టల్ రూమే కేంద్రంగా వుండేది. జె.యన్.యు.లో, ఢిల్లీ యూనివర్శిటీలో, ఇతర కాలేజీలలో జరిగిన విద్యార్థి ఉద్యమాలన్నింటిలో, పాలుపంచు కోవటమే కాదు, డి.ఆర్.యస్.ఒ. ప్రతినిధిగా యం-యల్ పార్టీలూ, వాటి ప్రజాసంఘాలూ నిర్వహించిన ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొని అవి సఫలం కావడంలో తన వంతు కృషినందించాడు.

డి.ఆర్.యస్.ఒ. తొలి నాయకుల నయావలస సిద్ధాంతాలను ఎదుర్కొంటూ, డి.ఆర్.యస్.ఒ. రాజకీయ పంథాని నిలబెట్టడమేకాక, కా॥ నవీన్ జాతుల పోరాటాల స్వయం ప్రతిపత్తి హక్కును దృఢంగా బలపరుస్తూ డి.ఆర్.యస్.ఒ.ని కాశ్మీర్, ఈశాన్య భారత విద్యార్థులకు సన్నిహితమయ్యేలా చేశాడు. 1989లో ఢిల్లీ నగరం ఉన్నతవర్గ విద్యార్థుల 'మండల్ వ్యతిరేక' ఉన్మాద కేంద్రంగా మారినపుడు డి.ఆర్.యస్.ఒ. యేటికెదురీది నిల్చి వెనుకబడిన కులాల (ఒ.బి.సి.) రిజర్వేషన్లను సమర్థించింది. విప్లవ శ్రేణులలో సైతం వూగిసలాటలు నెలకొన్న సందర్భంలో కా॥ నవీన్ రిజర్వేషన్లను బలపర్చాల్సిన అవసరాన్ని దృఢంగా నొక్కిచెబుతూ డి.ఆర్.యస్.ఒ. పీడిత సెక్షన్లకు సన్నిహితమయ్యేలా చేశాడు. 1990 దశకం, సి.పి.ఐ. (యం-యల్) (పీపుల్స్‌వార్) వివిధ రాష్ట్రాలలోని విప్లవకారులపై బలంగా ప్రభావం వేస్తూ, దేశవ్యాప్తంగా విప్లవ పార్టీ నిర్మాణానికి సన్నాహాలను చేస్తూ వచ్చిన కాలం. ఈ కాలంలో తూర్పున బెంగాల్‌లోని మిద్నపూర్ నుండి, ఉత్తరప్రదేశ్‌లోని తెరాయ్ పర్వత ప్రాంతం వరకూ, అట్లే ఉత్తరాన జమ్మూ కాశ్మీర్‌దాకా దేశ వ్యాప్తంగా పలువురు విప్లవకారులు పీపుల్స్‌వార్ పార్టీతో సంబంధాల కోసం కా॥ నవీన్‌ని సంప్రదించేవారు. వారందరినీ సాదరంగా ఆహ్వానిస్తూ వారిపట్ల సరైన అంచనాకు వచ్చాక పార్టీకి వారి వివరాలు తెల్పడంలో కా॥ నవీన్ మంచి శ్రద్ధ కనపరిచాడు. ఈ దశలోనే పూర్తికాలం విప్లవకారుడిగా పనిచేయాలని తను నిర్ణయానికొచ్చాడు.

ఢిల్లీ రాడికల్ విద్యార్థి సంఘం (డి.ఆర్.యస్.ఒ.) లో చేరి యూనివర్శిటీ యూనిట్‌కు ప్రెసిడెంట్ అయ్యాడు. ఢిల్లీలో విప్లవ విద్యార్థి నిర్మాతలలో కా॥ నవీన్ ఒక్కడు. తను విద్యార్థిగా వున్నప్పటి

నుంచి సి.పి.ఐ.(యం-యల్) (పీపుల్స్‌వార్) రాజకీయాలను అనేక పార్టీలలో, కాలేజీలలో, మురికివాడలలో విస్తృతంగా ప్రచారం చేసి, క్యాంపెయిన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. విప్లవ గ్రూపులతో ఉమ్మడి సమస్యలపై ఐక్య కార్యాచరణ పోరాటంలో సి.పి.ఐ.(యం-యల్) పీపుల్స్‌వార్ పార్టీ తరపున పాల్గొనేవాడు. ఈక్రమంలో అఖిల భారత విప్లవ విద్యార్థి సమాఖ్యలో చేరి మూడు సం॥రాల పాటు ప్రెసిడెంట్‌గా, కార్యవర్గ సభ్యునిగా, ఫ్రాక్షన్ సభ్యునిగా దేశవ్యాప్త విప్లవ విద్యార్థి పోరాటాలకు నాయకత్వం వహించాడు. ఆయా రాష్ట్రాలలో ఉన్న విద్యార్థి సమస్యలను స్టడీ చేసి విద్యార్థులను ఆయా సమస్యలపై చైతన్యపర్చడానికి అనేక సెమినార్లను నిర్వహించాడు. కా॥ నవీన్ విద్యార్థులందరికి సుపరిచితుడే. చిరునవ్వుతో, నమ్రతతో ఆదర్శవంతంగా వుంటూ విద్యార్థుల్ని ఆకర్షించేవాడు. పశ్చిమబెంగాల్, ఢిల్లీ, హర్యానా విద్యార్థులకు ఫిలాసఫీ, రాజకీయ అర్థశాస్త్రం, మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానంపై క్లాసులను చెప్పి చైతన్యపరచిన మేధావి కా॥ నవీన్.

1993లో విద్యార్థుల్లో పి.ఆర్.గా పనిచేస్తూ 1994లోనే విద్యార్థుల్లో పనిచేసే సెల్‌కు కార్యదర్శి అయ్యాడు. విద్యార్థుల్లో ఆర్గనైజర్‌గా పనిచేస్తూ 1995లో ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఏరియాకమిటీలో సభ్యునిగా వున్నాడు. విద్యార్థి పత్రిక అయిన 'కలమ్' ఎడిటోరియల్ బాధ్యతను స్వీకరించి పత్రికను ఇంగ్లీష్‌లో ప్రింటు చేసి తేవడంలో ఎంతో కృషి చేసాడు.

మనపార్టీ పలుకుబడిని మేధావులలో విస్తరింపజేయటానికి మంచి కృషి చేసాడు. జాతుల వుద్యమాలకు చెందిన విద్యార్థి లోకంతో మంచి సంబంధాలను ఏర్పర్చుకుని జాతుల వుద్యమాలతో పార్టీ సంబంధాలు ఏర్పడడానికి తను చేసిన కృషి మరువలేనిది. మన పార్టీ స్పోక్స్‌మన్‌గా (అధికార ప్రతినిధి) జాతుల ఉద్యమాల పార్టీలతో, ప్రజా సంఘాలతో, నిత్య సంబంధాలను కొనసాగించాడు. జాతుల వుద్యమాల పార్టీలతో చర్చలలో అనువాదకుడుగా, చక్కగా మన పాలసీల్ని అర్థమయేటట్లు వివరించేవాడు. 1996లో ఢిల్లీలో జాతుల సమస్యపై అంతర్జాతీయంగా జరిగిన సెమినార్‌ను మంచిగా ఆర్గనైజ్ చేసి విజయవంతం చేయడంలో ప్రముఖపాత్ర వహించాడు. జాతుల వుద్యమాలతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయటంలో తీవ్ర కృషి సల్పాడు. ఇందుకు సంబంధించి కా॥ నవీన్ చేసిన కృషి జాతుల, విప్లవోద్యమాల మధ్య దృఢమైన వారధిలా నిల్చింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి జాతుల సెమినార్‌కి వచ్చిన ప్రతినిధులకు భారతదేశంలో వర్గ విప్లవోద్యమాల వునికి గురించి కా॥ నవీన్ స్పష్టంగా వివరించాడు. ప్రత్యేకించి ప్రపంచ ప్రఖ్యాత మేధావి విలియం హింటన్ ఈ జాతుల సెమినార్‌కి వచ్చి దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రయాణించినపుడు కా॥ నవీన్ ఆయనకు తోడుగా వెళ్ళి ఆయా ప్రాంతాలలో జరుగుతున్న ఉద్యమాలను అర్థం చేసుకోవడంలో సహకరించాడు. నార్త్ ఇండియాలో తను పనిచేస్తున్నపుడు భాషా సమస్య ఎదుర్కోలేదు. హిందీ, ఇంగ్లీష్‌లలో అనర్గళంగా మాట్లాడేవాడు.

అంతర్జాతీయ ప్రతినిధులతో చర్చలలో మనపార్టీ రాజకీయాలను ఇంగ్లీషులో అనువదించేవాడు. తను మంచి జ్ఞానవంతుడు అయినప్పటికీ వినమ్రంగా వుంటూ కార్మికవర్గ ఆదర్శాలను పాటించడానికి ఎప్పుడూ ప్రయత్నించేవాడు.

1994-95లో నవీన్ దండకారణ్యంలోని ఆదివాసీ వుద్యమాన్ని, గెరిల్లాజోన్ల అభివృద్ధిని అర్థం చేసుకునేందుకై మొట్టమొదటిసారిగా బాలాఘాట్ జిల్లాకు వెళ్ళాడు. అట్లే 1997-98లో ఈశాన్య భారతదేశంలోని జాతుల పోరాట ప్రాంతాలకు అనేకసార్లు వెళ్ళాడు. ఒకసారి వారి స్థావర ప్రాంతానికి కూడా వెళ్ళిన నవీన్ తన నిరాడంబరమైన, ఆదర్శప్రాయమైన ప్రవర్తన ద్వారా అక్కడి కార్యకర్తల్లో గుర్తింపును, అభిమానాన్ని పొందాడు. 1996లో ఉద్యమ అవసరాల రీత్యా జంగ్ (మిలటరీ పత్రిక) స్టాఫ్‌లోకి రావాలని పార్టీ సెంట్రల్ కమిటీ కోరిన వెంటనే ఎటువంటి శషభిషలకు తావులేకుండా మిలటరీ పత్రిక అయిన జంగ్‌ను తయారు చేయడంలో నిమగ్నమయ్యాడు. జంగ్ వ్యాసాలకు మెటీరియల్‌ను సంగ్రహించి ఇంగ్లీష్ నుంచి తెలుగులోకి అనువదించేవాడు.

1996లో దక్షిణ తెలంగాణా, ఉత్తర తెలంగాణా మిలటరీ తర్ఫీదు క్యాంపులు 1998 ఫిబ్రవరిలో జరిగిన సెంట్రల్ అర్బన్ మిలటరీ క్యాంపుకు కావలసిన కొన్ని వ్యాసాలను అనువదించి ఇన్‌స్ట్రక్టర్స్‌కు సహాయం చేసాడు. తను మిలటరీ శిక్షణకు కొత్త అయినా, కష్టపడి నేర్చుకోవడానికి ప్రయత్నించి ఇన్‌స్ట్రక్టర్‌గా తయారయ్యాడు. ఇన్‌స్ట్రక్టర్లు తెలుగులో చెప్తే హిందీ, ఇంగ్లీష్‌లో ఒక భాష తరువాత ఒక భాష తడబడకుండా విద్యార్థులకు అర్థమయ్యేటట్లు చెప్పేవాడు. మిలటరీ తర్ఫీదులో మన విప్లవ ఉద్యమానికి అనుగుణంగా మార్పు తీసుకురావడానికి తను ఎప్పుడూ ఆలోచించేవాడు. ఆచరణలో గెరిల్లా దళాల్లో, ప్లాటూన్‌లలో తిరిగి ఉద్యమ అభివృద్ధికి అనుగుణంగా తర్ఫీదు తీసుకురావాలని కోరుకునేవాడు. 1997లో ఢిల్లీ నగరంలో తన బాధ్యతలనుండి బయటకు వచ్చాడు. డి.సి.యం.గా ఎంపికై కేంద్రకమిటీ స్టాఫ్ మెంబర్‌గా ఎదిగాడు. 1998లో సెంట్రల్ కమిటీ నిర్ణయం ప్రకారం జంగ్ ఎడిటోరియల్ బోర్డ్ సభ్యునిగా బాధ్యతను స్వీకరించాడు. జంగ్‌లో కొన్ని వ్యాసాలు రాశాడు. తెలుగులో నుంచి హిందీలో అనువదించడంలో కృషి సల్పాడు. రెండు జంగ్‌ల్ని హిందీలోకి తీసుకురావడంలో తీవ్ర కృషి సల్పాడు. 1999లో తన స్థాయిని జిల్లాకమిటీ సభ్యునిగా బాధ్యతలోకి సెంట్రల్ కమిటీ ప్రమోట్ చేసింది. మావో మిలటరీ రచనలను అధ్యయనం చేస్తూ పోరాట అవసరాలకు ఉపయోగపడడానికి తీవ్ర కృషి చేస్తున్న క్రమంలోనే అమరుడు కావడం, అభివృద్ధి చెందుతున్న వుద్యమానికి చాలా లోటు. అయితే గెరిల్లా పోరాట అభివృద్ధికి పత్రిక ద్వారా తను చేసిన కృషి నిరంతరం విప్లవోద్యమంలో సజీవంగా వుంటుంది. కా॥ నవీన్‌కి తనకంటూ ఒక రంగంలో పనిచేసి నిష్ణాతుడు కావాలని కోరిక వున్నప్పటికీ, పార్టీ అవసరాల రీత్యా ఆర్గనైజర్ పనిని వదిలి మిలటరీ రంగానికొచ్చాడు. 1996 నాటికి ఒకేసారి హిందీ, తెలుగు భాషల్లో జంగ్‌ని తీసుకురావాల్సి వుండటం, ఉత్తర భారతదేశంలో పార్టీ అవసరాల రీత్యా హిందీలోకి అనువాదం, ప్రచురణ, పరిశోధనా కృషి జరపాల్సి రావటంతో అతి స్వల్పకాలంలోనే నవీన్ పెద్ద మిలటరీ లైబ్రరీని ఏర్పర్చుకున్నాడు. సోదర యం-యల్ పార్టీల ఏరియాలలోకి పోయి వారికి మిలటరీ శిక్షణ ఇచ్చాడు. యన్.టి., డి.కె., ఈస్ట్ రీజియన్, బీహార్‌లలో ఫీల్డ్ స్టడీ చేసి ప్రజలనుంచి వర్గపోరాటాన్ని నేర్చుకునేందుకు వెళ్ళాడు. ఫీల్డ్‌లో తిరుగుతూ, డి.కె. వెనుకబాటుతనాన్ని, పార్టీ కర్తవ్యాలను సమీక్షిస్తూ ఒక సిద్ధాంత స్థాయి వ్యాసాన్ని రాశాడు.

సిద్ధాంతం నేర్చుకోవడమే కాకుండా ఆచరణలో, ఆంబుష్, రెయిడ్, చికాకుపర్చే చర్యలలో ప్రత్యక్షంగా పాల్గొనాలని తపనపడుతూ...చివరగా ధారకొండ షార్ప్ సర్‌ప్రైజ్ ఎటాక్‌లో పాల్గొంటావని చెప్పినప్పుడు అమిత ఉత్సాహంతో సన్నాహకాల్లో చురుకుగా పాల్గొన్నాడు. రిహార్సల్స్‌లో మనస్ఫూర్తిగా పాల్గొని ధారకొండ దాడిలో వర్గకసితో తొందరగా శత్రువును తుదముట్టించాలని పెట్రోల్ బాంబులు శత్రువుపై ప్రయోగించి గెరిల్లాలకు ధైర్యంగా పోరాడాలని ప్రేరేపించి సోప్ బాంబులతో శత్రువును గుక్కతిప్పుకోకుండా చేయడంలో కా॥ నవీన్ చూపిన చొరవ గెరిల్లాలకు ఆదర్శంగా వుంటుంది. కామ్రేడ్ నవీన్! శత్రువుపై ఆధిపత్యం క్రమంలో చివరి నిముషంలో నీ అమరత్వం గెరిల్లాలను దుఃఖితులను  చేసింది. కామ్రేడ్ నవీన్ నీవు భౌతికంగా లేక పోయినప్పటికీ విప్లవంలో నీవు చేసిన కృషి వేల వేల విప్లవకారులను సృష్టిస్తుంది. గెరిల్లా బలగాలు, ప్రజా గెరిల్లా సైన్యంగా రూపొంది నీ ఆశయాన్ని సాధిస్తారు.

కా॥ నవీన్ వుద్యమ అవసరాల రీత్యా అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడంలో ముందుండేవాడు. నిరంతరం వినయంగా, నమ్రతగా క్యాడర్లు విద్యార్థులతో, మేధావులతో మమేకమవుతూ ఎప్పుడూ కమ్యూనిస్టు విలువలను, నైతిక అలవాట్లు క్రమబద్ధమైన జీవితాన్ని ప్రదర్శిస్తూ ప్రతి పార్టీ సభ్యుడు/సభ్యురాలు అనుసరించదగిన విప్లవ ఆదర్శ వ్యక్తిగా కా॥ నవీన్ సదా నిలుస్తాడు. కా॥ నవీన్ ఒక దశాబ్దం పైగా వున్న తన విప్లవ జీవితంలో ఎన్నో కష్టాల్ని ఎదుర్కొని సాధారణ పార్టీ సభ్యుడి నుండి పి.ఆర్.గా, ఆర్గనైజర్‌గా, ఏరియాకమిటీ సభ్యునిగా, జిల్లా కమిటీ సభ్యుని స్థాయికి ఎదిగాడు.

ఒక మధ్యతరగతి మేధావి విప్లవ మేధావిగా పరిణతి చెందిన క్రమానికి కా॥ నవీన్ జీవితం ఒక ఆదర్శప్రాయమైన నమూనాగా నిలుస్తుంది. ఢిల్లీ నగరంలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ వామపక్ష రాజకీయాలకూ, కుహనా (సూడో) వామపక్ష రాజకీయాలకు మాత్రమే కేంద్రం కాదు. అది అన్ని రాజకీయాలకూ నెలవు. దేశ దోపిడీ వ్యవస్థకు ఐ.ఏ.యస్., ఐ.పి.యస్. వంటి అత్యున్నత అధికారులను తయారుచేసే పాలకవర్గ శిక్షణా కేంద్రంగా కూడా అది వుంటుంది. వ్యక్తిగత ప్రయోజనాలకు సకల అవకాశాలనూ అందించే ఈ వర్గ విశ్వవిద్యాలయంలో కా॥ నవీన్ తానే వర్గం ప్రయోజనాలకు అనువైన జీవితం ఎంచుకోవాలో మొట్టమొదటే నిర్ణయించుకున్నాడు. 10 సం॥రాలు గడిపినా తానెంచుకున్న పీడిత పక్షపాతపు సరిహద్దులను ఈ ప్రజామేధావి ఏనాడూ అతిక్రమించలేదు.

ఆజానుబాహుడు, అభిమాన పాత్రమైన ప్రవర్తన, సూక్ష్మ విశ్లేషణా పద్ధతి, ఆదర్శప్రాయమైన జీవనశైలి, తాను కలగంటూ వచ్చి సోషలిజం కోసం నిరంతరం ప్రపంచ సాహిత్యాన్ని చదువుతూండడం, స్నేహితులతో నిత్యం భావాలను పంచుకోవటం, విప్లవం వైపు మేధావులను మళ్ళించడానికి అవిరామకృషి సల్పడం. ఏ పెటీ బూర్జువా డాంబికాలకూ గురికాకుండా సిద్ధాంత పోరాటానికి నిలబడడం....ఇవన్నీ కలిసిన రూపమే కా॥ నవీన్. విషయాలను విమర్శనాత్మకంగా పరిశీలించటమే తప్ప గుడ్డిగా చూడటానికి, నవీన్ పూర్తి విరుద్ధం. ఎల్లప్పుడూ నూతన భావాలతో పరవళ్ళు తొక్కుతూండటం, వాటికి రాత రూపమిచ్చి తగిన వేదికలపై చర్చకోసం పెట్టడం, మాటలకూ, సిద్ధాంతానికి, ఆచరణకూ మధ్య ఐక్యతను నిరంతరం ఆశించటం...వంటి లక్షణాలు నవీన్‌లో కొట్టొచ్చినట్లుగా కన్పిస్తాయి. స్పానిష్ అంతర్యుద్ధంలో ప్రాణాలర్పించిన క్రిస్టోఫర్ కాడ్వెల్, డేవిడ్‌గెస్ట్, శ్రీకాకుళం అడవుల్లో అమరుడైన యూనివర్శిటీ బంగారుపతక గ్రహీత చాగంటి భాస్కర్‌రావులలాగా, పీడిత జన పక్షపాతంతో అమూల్యమైన ప్రాణాలను ధారపోసిన మేధావుల కోవకు చెందిన కా॥ నవీన్ (బాలక్రిష్ణ) కలాన్ని, కత్తిని సమానంగా చేతపట్టి, క్రూర శత్రువుతో పోరాటంలో ప్రాణార్పణ చేశాడు. దండకారణ్యంలో ఆంధ్ర, ఉత్తర తెలంగాణాలలో, ఉత్తర భారతంలో, ఈశాన్య భారతదేశంలో, మిలటరీ క్యాంపులలో, విదేశీ విప్లవకారులతో సంప్రదింపులు, సమావేశాలలో అంతటా తానై తిరుగుతూ ఒక భాష, ఒక ప్రాంతం సరిహద్దులు అధిగమించి కార్మికవర్గ అంతర్జాతీయతా సంస్కృతికి ప్రతీకలా వెలిగిన కార్మికవర్గ ఉత్తమ పుత్రుడు కా॥ నవీన్‌కి అరుణారుణ జోహార్లు.

## కా॥ సత్యనారాయణ (రమేష్, శ్రీధర్):

సరిగ్గా దశాబ్దం క్రితం అంటే 1990 సంవత్సరంలో ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా ఉవ్వెత్తున రైతాంగ ఉద్యమం వెల్లువలా సాగిన రోజుల్లో ఉత్తేజం పొంది విప్లవ రాజకీయాలవైపు కా॥ సత్యనారాయణ (శ్రీధర్) ఆకర్షితుడయ్యాడు. శాస్త్రీయ విప్లవ భావాలతో, పీడిత జన విముక్తికై వాటిలో తన కొత్త జీవిత కార్యాచరణను, అత్యంత పట్టుదలతో ప్రారంభించాడు. పుట్టింది, ఉద్యమాలకు ఊపిరినిచ్చిన కరీంనగర్ జిల్లాలోని పోరు గ్రామంలోనే. భూమి కోల్పోయి బతుకుదెరువుకై బొగ్గుబావి కార్మికుడిగా మారిన నిరుపేద దంపతుల ముద్దుబిడ్డడు కా॥ సత్యనారాయణ. బానిస బతుకులు భగ్గున మండాలంటే అక్షర జ్ఞానం పొందాలని హైదరాబాద్‌లో చదువుకున్నాడు. ఊరి పోరాట సంబంధాలు పట్టణ పార్టీ పరిచయాలు పెనవేసుకుని పార్టీలో పూర్తికాలం పనిచేసే కార్యకర్తగా పురికొల్పాయి. అప్పటినుండి ప్రజాసేవకుడిగా ప్రజా వుద్యమంలో నిమగ్నమైనాడు.

దక్షిణ తెలంగాణా ఉద్యమ నాయకత్వ కమిటీ అయిన ఆర్.సి.కి కొరియర్‌గా వున్నాడు. శత్రువు కళ్ళుగప్పి మంచి చాకచక్యంతో ఉత్తర ప్రత్యుత్తరాలను చేరవేస్తూ పార్టీ సమన్వయానికి సమర్థవంతంగా సహకరించాడు. 1993 ఫిబ్రవరిలో రాష్ట్ర స్థాయిలో పార్టీ మెకానిజం శత్రువు చేత చిక్కినప్పుడు అందులో కా॥ సత్యనారాయణ కూడా అరెస్టు అయి 1996 ఆగస్టు వరకు అంటే మూడు సంవత్సరాలు నిబ్బరంగా శత్రు శిబిరంలో సైతం విప్లవ జీవితం గడిపాడు. జైలు అధికారుల దోపిడి, మోసం, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాన్ని నిర్వహించడంలో ముందుభాగాన నిలబడినాడు. శత్రువు అణచివేత చర్యల్ని గేలిచేస్తూ సాటి ఖైదీలకు ఆత్మస్థైర్యాన్ని, పోరాటశక్తిని అందించాడు. శత్రువు బంధించినా విప్లవకారుని గొంతు నినదిస్తూనే వుంటుందని ''బందీకాని గొంతుక'' అనే పత్రిక సంపాదకుడిగా, కవిగా కా॥ సత్యనారాయణ నిర్వహిస్తూ చూపిన చొరవ సృజనాత్మకత మరువలేనిది.

( తరువాయి 35వ పేజీలో.....)

# ప్రజా సమస్యలను సాధించటం వరకే పరిమితమైన భూమికి దుక్కుకి వున్న సంబంధాన్ని రాజ్యాధికార

(1999 అక్టోబర్ – నవంబర్ నెలల్లో జరిగిన ఆంధ్ర రాష్ట్రకమిటీ సమావేశం

కామ్రేడ్స్!

దిద్దుబాటు క్యాంపెయిన్ పూర్తయేలోపు మనకర్థమైనటువంటి విషయమేమిటంటే, మనం ఏవైతే పెడధోరణులను గుర్తించామో, అవి ఉద్యమంలో మనం గుర్తించిన స్థాయికన్నా ఇంకా బలంగానే వున్నాయి అన్నదే. మొత్తం క్యాంపెయిన్‌లో మన కామ్రేడ్స్ ప్రధానంగా, మనపార్టీ శ్రేణుల్లో ఈ విషయాల్ని, అంటే పెడధోరణులకు సంబంధించి నటువంటి మూలాలను సైద్ధాంతికంగా అధ్యయనం చేయటం, అలాగే అవి మనలో, మన కార్యాచరణలో ఎలా చోటు చేసుకున్నాయి అనే విషయాన్ని సమీక్షించు కోవటం అనేది దాదాపు అన్ని ప్రాంతాల్లో కొంత సమగ్రంగానే జరిగింది. అంటే, రాష్ట్రంలో కొనసాగు తున్నటువంటి తీవ్రమైన నూతన దాడి, ఉద్యమం ఎదుర్కొంటు న్నటువంటి నిర్బంధం మూలంగా ఈ క్యాంపెయిన్‌ని ప్రజల్లోకి తీసుకెళ్ళటంలో మనకైతే కొన్ని పరిమితులు, కొన్ని ఇబ్బందులు ఎదురైన మాట వాస్తవమే. అయినప్పటికీ వీలైన అన్నిచోట్లా తగిన రూపాల్లో ఈ క్యాంపెయిన్‌ని మనం తీసుకెళ్ళగలిగాం. తీసుకెళ్ళినచోట మనకు మంచి అనుభవాలే వచ్చినాయి.

ఈ క్యాంపెయిన్ కూడా మనకు, మన పార్టీకి ఈ రూపంలో తీసుకువెళ్ళటం అనేది మొదటిసారి. అందువల్ల, మనం ఈ క్యాంపెయిన్‌ను రూపొందించుకున్నటువంటి కాలం 4 నెలలు కాలం, మనకున్న సమర్థతను బట్టి, అట్లాగే నిర్బంధం, వేసవికాలంలో మనం ప్రారంభించటం, వీటివల్ల 4 నెలల కాలం చాలా జిల్లాలకు సరిపోలేదు. అట్లా ఈ క్యాంపెయిన్ పూర్తిగా జరగలేదు. కొన్ని కొన్ని ప్రాంతాలలో సంపూర్ణంగా జరిగింది. అయితే, ముందే పరిస్థితి మనకు అర్థమైనందువల్ల దాదాపు అన్ని జిల్లాలకు క్యాంపెయిన్ పూర్తి చేయటం ప్రధానమైనటువంటి విషయంగా రాష్ట్రకమిటీ గుర్తు చేయటం జరిగింది. దాని ప్రకారంగానే కామ్రేడ్స్ ప్లాన్ చేసుకుని క్యాంపెయిన్ చేపట్టారు. మొత్తంగా చూసినట్లయితే, ఒకటీ అరా జిల్లాలను మినహాయిస్తే క్యాంపెయిన్ పూర్తయిందనే మనం అనుకోవచ్చు. ఈ క్యాంపెయిన్‌లో మనం సాధించినటువంటి మంచి అంశం, మొదటగా మన పార్టీ శ్రేణులలో మొత్తంగా నాయకత్వం నుండి క్రింది కేడర్ వరకు ఈ పెడధోరణుల్ని క్యాంపెయిన్‌కి ముందు అర్థం చేసుకోవటానికి, ఈ క్యాంపెయిన్ ద్వారా మనం అర్థం చేసుకోవటానికి చాలా తేడా అయితే వుంది. అంటే ఒక సమగ్రత అనేది వచ్చింది. ఇవి మన ఉద్యమానికి ఎలా ఆటంకం? ఇవి, మనం విప్లవోద్యమాన్ని ముందుకు తీసెకెళ్ళటానికి ఎలా అడ్డంకిగా వున్నాయి, ప్రజల ప్రయోజనాలకు ఎలా వ్యతిరేకమైనవి అనే విషయాన్ని మరింత సమగ్రంగా, మరింత లోతుగా ఇవాళ మన పార్టీ అర్థం చేసుకోగలిగింది. ఈ విషయాల్ని క్యాంపెయిన్ ద్వారా అర్థం చేసుకోవటం ద్వారా పార్టీ చైతన్యస్థాయి పెరిగింది. ఈ క్యాంపెయిన్‌లో మన ప్రధానమైనటువంటి విజయం ఇది. ఈ అవగాహనతో, చైతన్యంతో మనం రేపు మన కార్యాచరణలో ఇదే తప్పుల్ని చేయకూడదు. అయితే ఉద్యమంలో మరలా పెడధోరణులు చోటు చేసుకోవా అంటే, ఒక దోపిడీవర్గ సమాజాన్ని మార్చాలను కుంటున్నపుడు ఈ వర్గ సమాజంలో వున్నటువంటి అన్ని చెడులు మనమీద దాడి చేస్తాయి. కాబట్టి ఆయా దశల్లో ఏవో కొన్ని బలహీనతలకు, పెడధోరణులకు ఉద్యమం గురవుతుంది. ఇది తెలిసి జరగదు. లేదా మన ఇష్టాఇష్టాలతో సంబంధంలో వుండి కూడా జరగదు. అయితే, మన పార్టీ ఒక చైతన్యవంతమైన పార్టీ, ఇలాంటి ధోరణులు చోటు చేసుకున్నపుడు మనం ముందే గుర్తించి వాటిని అధిగమించటానికి ఇలాంటి ఉద్యమాలను రేపు కూడా మనం చేపట్టాలి. మనం చైనా విప్లవం చూసినా, రష్యా విప్లవం చూసినా ఆ ఉద్యమంలో కూడా ఇట్లాంటి ధోరణులు చోటు చేసుకున్నపుడు కొన్ని క్యాంపెయిన్స్ తీసుకోవటం ద్వారా పార్టీ తనను తాను సంస్కరించుకున్నది, పార్టీ ప్రజలకు మరింత సన్నిహితంగా ఇట్లాంటి క్యాంపెయిన్స్ ద్వారా ప్రజలకు సన్నిహితంగా చేరుకున్నది. ఇవాళ మన దిద్దుబాటు ఉద్యమం ద్వారా కూడా మనం ప్రజలకు మరింత చేరువయ్యాము.

అయితే మన మొత్తం రివ్యూలో మనం గుర్తించిన దేమిటంటే,...ఇలాంటి పెడధోరణులను మనం గుర్తించటం సరయిన సమయంలోనే గుర్తించామా అన్నపుడు ధోరణులనయితే గుర్తించినాంగానీ, వాటి తీవ్రతను అర్థం చేసుకోవటంలో మనం విఫలమైనాం. రెండోది. వాటిని సరిదిద్దు కోవటానికి అవసరమైన పద్ధతిని రూపొందించు కోవటానికి ఆలస్యం చేసాం. ఈ క్యాంపెయిన్ మనం ఇంకా ముందే చేపట్టాల్సింది అన్నది మనం ఈ మొత్తం సమీక్ష ద్వారా తెల్చుకున్నటువంటి విషయం. కనీసం '95 నాటికి చేపట్టలేక పోయినా, కాన్ఫరెన్స్‌లో గుర్తించినటువంటి విషయాలను ఒక సంవత్సరం తర్వాతనైనా మనం కార్యక్రమం రూపొందించుకుని, ప్రజల్లో కొంత అనుకూల సమయంలో ఈ క్యాంపెయిన్‌ను కనుక మనం చేపట్టి వుంటే అంటే, కనీసం '96 చివరికిగానీ, '97లో గానీ మనం ఈ క్యాంపెయిన్‌ను చేపట్టి వుంటే మనకు మరిన్ని సత్ఫలితాలు వచ్చేవి. ప్రజల పాత్ర మరింతగా పెంచగలిగేవాళ్ళం. పార్టీ ప్రజల్లో మరింత లోతుగా వేళ్ళూనుకుని వుండేది. మనం కూడా ఈ ధోరణుల వలన కలిగినటువంటి, విప్లవోద్యమానికి జరిగినటువంటి నష్టాన్ని తగ్గించుకునేవాళ్ళం. ఇవి ప్రధానంగా ఈ క్యాంపెయిన్‌లో మనం సమీక్షించుకున్నటువంటి విషయాలు. దీనికి సంబంధించి, ఇంకా అన్ని కోణాల నుండి అవసరమైనటువంటి సర్క్యులర్ రాసి పార్టీ శ్రేణులకు, తర్వాత....పోతే యస్.సి. చేసినటువంటి తీర్మానాలు, ఇంకా వాటి డీటెయిల్స్ మీద యస్.సి. సభ్యులు, లేదా కింది కమిటీలు వివరంగా మీతో చర్చిస్తాయి.

ఇక్కడ ప్రధానంగా నేను చెప్పదలచుకున్నటువంటి మరొక

# లక్ష్యరహిత పోరాట పద్ధతులను పూర్తిగా విడనాడుదాం! లక్ష్యంతో ఒడిపెట్టి పోరు సాగిద్దాం!!

ముగింపు సందర్భంగా కార్యదర్శి కామ్రేడ్ మహేష్ ఇచ్చిన చివరి ఉపన్యాసం)

విషయం ఇప్పుడు మొత్తం పరిస్థితిని, ఎన్నికల తర్వాత పరిస్థితిని ఎలా అర్థం చేసుకోవాలి? మన సమావేశం ప్రారంభంలోనే ఎన్నికలు వాటి ఫలితాలు, పాలకవర్గాలు వాటి స్థిరత్వం గురించి, ఆ స్థిరత్వం గురించి అవి పలుకుతున్నటువంటి ప్రగల్భాలు మాట్లాడుకున్నాం. అవి నిజానికి అధికారంలోకి వచ్చిన తర్వాత చేయబోయేటటువంటి పనులను కూడా మనం చూచాయగా చెప్పుకున్నాం. ప్రధానంగా మనం, మన పార్టీ క్యాడర్ అర్థం చేసుకోవలసింది, ఇప్పటికే ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ఒక సైకలాజికల్ వార్‌ని, మనమీద ఒక ప్రచార యుద్ధాన్ని, మొదలెట్టింది. ప్రజల్లో ఒక తీవ్రమైనటువంటి గందరగోళాన్ని శ్రేణుల్లో ఒక తీవ్రమైనటువంటి గందరగోళాన్ని సృష్టించడానికి అది ప్రయత్నం చేస్తోంది. 6 నెలల కాలంలోనో, ఒక సంవత్సర కాలంలోనో ఈ పార్టీని మేం అణచెయ్యగలమని డి.జి.పి. దొర వాడికే నమ్మకం లేని ప్రకటనలు చేస్తున్నాడు. ''దక్షిణ తెలంగాణాలో ఇప్పటికే సగాన్ని మేం దెబ్బతీయగలిగాం, మరో సగాన్ని త్వరలోనే దెబ్బతీయగలుగుతాం.'' అని ప్రకటన కూడా ఇచ్చాడు. మరోవైపు ''ఈ ఉద్యమంలోకి వెళ్ళి చనిపోతే ఏం వస్తది, కష్టాలు తప్ప'' అని చెప్పి మన తల్లిదండ్రులమీద ఒక యుద్ధాన్ని ప్రారంభించాడు. వాడికి ఎన్నడూ లేని ప్రేమ ఈరోజు పుట్టుకొస్తోంది. కౌన్సిలింగ్ అనే పద్ధతిలో మన ఉద్యమంలోకి వచ్చినవాళ్ళ, అజ్ఞాతంలో వున్నటువంటి సంఘనాయకుల తల్లిదండ్రులను ''మీ పిల్లల్ని తెచ్చుకోండి, మేం ఏమీ అనం, పునరావాసం చూపిస్తాం'' అంటూ, అది కూడా మనలో బాగా తీవ్రంగా బలహీనతలున్న వాళ్ళని పసిగట్టి, అలాంటి వ్యక్తులమీద ప్రధానంగా కేంద్రీకరించి అలాంటి క్యాంపెయిన్ ఒకటి తీసుకున్నాడు. సాంస్కృతికంగా వాడి నాటకాలు అవీ ఇంకోవైపున నడుస్తున్నాయి. మొత్తంమీద ఈ విప్లవోద్యమం హింసాయుత పద్ధతుల ద్వారా, సాయుధ పోరాటం ద్వారా సాధించేదేమీ లేదు అంటూ ప్రజల్లోని విశ్వాసాన్ని బ్రేక్ చేయటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది. ఒక రకంగా డిస్ ఇన్ఫర్మేషన్, వాస్తవాల్ని ప్రక్కతోవ పట్టించడం అనే క్యాంపెయిన్‌ని బలంగా తీసుకుపోతోంది. దాన్ని మనం కౌంటర్ చేయాల్సిన అవసరం వుంది. తర్వాత వాడు చేసే యుద్ధానికి మనం చాలా దృఢంగా సిద్ధపడాలి. కొన్ని వార్తలు రావచ్చు మనకు. వాటికి బెదిరి పోవలసిన అవసరం లేదు. ఎందుకంటే, ప్రజలు చిట్టచివరగా విముక్తి వైపే ప్రయాణం చేస్తారు. ఇన్ని, ఇలాంటి అవరోధాలు మరెన్నో ఎదుర్కొంటూ కూడా ప్రజలు పోవలసినటువంటి మార్గం స్పష్టంగా మనకు తెలుసు. సమాజం పురోగమనం వైపు పోతోంది అని మనం అంటున్నాం అంటే ఇలాంటి సందర్భాలలో దాన్ని మనం అన్వయించుకోవాలి. పురోగమనంలో ఉన్నటువంటి మలుపులు, ఇబ్బందులు, అడ్డంకులు మనకు తెలుసు. ఇలాంటివి వుంటాయి. ఏ నది కూడా సూటిగా ప్రయాణం చేయదు. కృష్ణానది పడమటి నుండి తూర్పుకు ప్రయాణం చేస్తున్నట్లు, గోదావరి నది పడమర నుండి తూర్పుకు ప్రయాణం చేస్తుందని అంటున్నాం. దానర్థం కృష్ణానది సూటిగా పడమర నుండి తూర్పుకు పోతోందని కాదు. శ్రీశైలం నుండి సాగర్‌కు పోతోంది. సూటిగా దక్షిణంగా ప్రయాణం చేస్తుంది. దక్షిణం నుండి ఉత్తరానికి ప్రయాణం చేస్తుంది. కాని మొత్తం ప్రయాణం చెప్తాం మనం. అది తూర్పుకు ప్రయాణం చేస్తుంది అని. అలాగే ప్రజలు విప్లవం వైపు ప్రయాణం చేస్తారన్నది అంతే వాస్తవం. ప్రయాణాల్లో కొన్ని తప్పులు చేసినపుడు, ప్రజలు ఇంకా కొన్ని విషయాలను గుర్తించనపుడు, మోసపోయినపుడు, నష్టాలు జరిగినపుడు ఈ మలుపులు, మెలికలు ఇవన్నీ మనం, వీటిని చాలా దృఢంగా ఎదుర్కోవాలి. మానసికంగా చాలా సంసిద్ధం కావాలి. యుద్ధం చేయటానికి ఈ గ్రౌండ్‌లో నెలరోజులు మనం సమకూర్చుకున్న శక్తి చాలా స్వల్పం. దాన్ని పెంచుకోవటానికి చాలా శ్రమపడాలి. యుద్ధం చేసి తీరాలి. యుద్ధం చేసి తీరాలి కాబట్టి మనకు తప్పదు. ఈ రోగాల నడుమ, ఆకలిదప్పుల నడుమ, ఈ బక్కచిక్కిన శరీరాలతోనే మనం యుద్ధం చేయాలి. కాబట్టే మనం ఇంత శ్రమపడుతున్నాం. మనం యుద్ధం చెయ్యాలి, మన వెంట ప్రజల్ని యుద్ధానికి తీసుకురావాలి. అదీ మానసికంగా, వాళ్ళు చేసేటటువంటి ప్రచారాన్ని తట్టుకోవాలి, దాన్ని తిప్పికొట్టాలి. ఇప్పుడున్న పరిస్థితిలో తిరిగి రాష్ట్రంలో అదే పార్టీ అధికారంలోకొచ్చింది. కేంద్రంలో కూడా తిరిగి బి.జె.పి. అధికారంలోకి వచ్చింది. నేను వాళ్ళ బలహీనతల గురించి చెప్పదలచుకోలేదు. వాళ్ళ బలహీనతలు చాలా వున్నాయి. బి.జె.పి. అయిదు సంవత్సరాలు స్థిరంగా వుంటుందనే గ్యారంటీ ఏం లేదు. చంద్రబాబు కూడా వుంటాడనే గ్యారంటీ ఏంలేదు. వాళ్ళు ప్రశాంతంగా జీవించడానికి వీల్లేదు. అలాంటి పరిస్థితి కూడా ఏం లేదు. అయితే, వాళ్ళ చేతుల్లో అధికారం కూడా వుంది. ప్రస్తుతం వాళ్ళు అధికారంలో వున్నారు. అది వాస్తవం. దాన్ని మనం గుర్తించాలి.

ఈ రెండు ప్రభుత్వాలు కూడా విప్లవోద్యమంపట్ల ఒకే ఆలోచనా ధోరణి కలిగి వున్నాయి. అణచివేత అనే ఏకైక లక్ష్యాన్ని కలిగి వున్నాయి. బి.జె.పి. భావజాలపరంగా కూడా నక్సలైట్లను అణచివెయ్యాలనే దాంట్లో, పాలకవర్గాలలో ఒక అడుగు ముందుకే వుంది. చంద్రబాబు, మనం నిన్న ఇక్కడ వీధి నాటకంలో చూసినట్లుగా చాలా స్పష్టంగా ఐ.యం.యఫ్., ప్రపంచబ్యాంకుల కీలుబొమ్మలాగా తయారయ్యాడు కాబట్టి వాళ్ళు చెప్పినట్లుగా, వాడు ఆడాల్సిందే! వాళ్ళ పథకాలన్నీ ఇక్కడ అమలు జరగాలంటే మనందరం చనిపోవాలి. ఈ భూమ్మీద మనం లేకుండా వుంటే తప్ప, ప్రపంచబ్యాంకు పథకాలు ఇక్కడ అమలు జరగవు. వాడి దీర్ఘకాలిక పథకం ఇక్కడ అమలు జరగదు. కానీ అది అసంభవం. **ఈ ప్రపంచంలో ఒక ప్రపంచబ్యాంక్ అయినా వుండాలి, విప్లవం అయినా గెలిచి తీరాలి. ఈ రెండింటిలో ఏదో ఒకటి జరగాలి. మనకు చాలా స్పష్టంగా తెలుసు, మన సమాజం ముందుకే నడుస్తుంది. కాబట్టి,**

**వ్యూహాత్మకంగా చూసినపుడు ప్రపంచబ్యాంక్, ఐ.యం.యఫ్., చంద్రబాబు వీళ్ళంతా కూడా మట్టికరవాలి. మట్టికరిపించటానికి మనం చాలా ప్రయాసపడాల్సి వుంటుంది.** అయితే ఇప్పుడు ఈ రెండు ప్రభుత్వాలు, కేంద్రంలో బి.జె.పి., రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి రావటం 'జాయింట్ కో-ఆర్డినేషన్ సెంటర్' ఒకటి ఏర్పడి వుండటం, మన ఉద్యమాన్ని తక్షణంగా అణచాల్సిన అవసరం కూడా వాళ్ళకి ఇవాళ వుండటం, ఈ విషయాల్ని మనం పరిగణనలోకి తీసుకోవాలి. కాబట్టి మనమీద ఒక పెద్ద దాడికే ప్రయత్నం చేయబోతున్నారు అనే ముందుచూపుతో, ఈ రాజకీయ అవగాహనతో మనం వుండాలి. మరింత పెద్ద దాడికి దిగేటటువంటి పరిస్థితులు ఈరోజు వున్నాయి. కాబట్టి ఇప్పటికి మనకు గత 3 సంవత్సరాలుగా చాలా అనుభవాలు వచ్చినాయి. చాలామంది కామ్రేడ్స్‌ను కోల్పోయాం, కొన్ని దళాల్ని కోల్పోయాం, పట్టణ కామ్రేడ్స్‌ను కోల్పోయినాం. నష్టాలు చాలా అపారంగా జరిగినాయి. అయితే, ఈ నష్టాల మధ్య వాళ్ళు చేసినటువంటి త్యాగాలు మనకు కొన్ని విలువైనటువంటి గుణపాఠాల్ని కూడా అందించాయి. ఇప్పుడు ఆ పాఠాల్ని మనం ఒక ఆయుధంగా మలచుకోవాల్సిన అవసరం వుంది. శత్రువు యొక్క పథకాన్ని మనం యాదృచ్ఛికంగా కాకుండా ఒక సమగ్రతతోను, ముందుచూపుతోను వాడి పథకాన్ని మనం అర్థం చేసుకోవాలి. దానికి దీటుగా దాన్నెదుర్కోవటానికి మనం సిద్ధం కావలసిన అవసరం వుంది. కాబట్టి ఇందులో ప్రధానమైనది, నిన్న ఆ నాటకంలో చెప్పినట్లు జాలరికి చిక్కని చేపల్లాగా వుండాలి. చేపలెప్పుడు కూడా ఒక దిక్కు చేరకూడదు. మనం మరింత మరింతగా నీటి లోపలికే వెళ్ళాలి. సముద్రం ఎగిసి పడాలి. కానీ, చేపలు ఎగిసి పడకూడదు. ఇప్పుడు మనం చేయాల్సిందిదే.

మనం ఆర్థికవాదాన్ని సమీక్షించుకున్నాం. దాని ప్రకారం లక్ష్యరహితమైన పోరాటాలు చేయకూడదు, పోరాటం పోరాటం కోసమే చేయకూడదు, ప్రజలు 6 పైసలు కూలి పెంచుకోవటానికో, ఒక సెంటు భూమి సంపాదించుకోవటానికో ఇలాంటి పరిమిత లక్ష్యం కోసమే పోరాటం చేస్తే ఫలితమే వుండదు. ఆ మేరకు ప్రజలకు ప్రయోజనమైనవే చేసినాం కానీ, ప్రజల చైతన్యం అక్కడనే ఆగిపోతుంది. అది సాధించటంతోనే పని అయిపోయిందను కుంటున్నారు ప్రజలు. మనం వారిని అక్కడికే తెచ్చాం, రాజకీయంగా కూడా. ఈ భూమి దున్నుకోవాలి, ఆ కూలి పెంచుకోవాలి అనే వరకే మనం, దానిమీదే కేంద్రీకరించాం. అలా కాకుండా, ఈ భూమి దున్నుకోవాలి, దున్నుకోవటం అవసరమే, అయితే **ఈ భూమి మనకు దక్కాలంటే మాత్రం ఆ రాజ్యం కూడా మనకు రావాలి. భూమిని దున్నుకోవటానికి, రాజ్యాన్ని సాధించటానికి సంబంధం వుంది,** కాబట్టి కుటుంబంలో ఇద్దరు పిల్లలుంటే, ఒకరిని భూమి దున్నుకోవడానికి వుంచుకుని మరొకరిని పోరాటం చెయ్యటానికి ఇవ్వాలి. ఉత్పత్తిలో కొంతమంది పాల్గొంటూ పోరాటంలో కొంతమంది పాల్గొనాలి. కొంతమంది కూలీలు పోరాడాలి, కూలి వ్యవస్థను ధ్వంసం చేయటానికి కొంతమంది కూలీలు పోరాటంలోకి రావాలి. అసలుకు, కూలీ అనేటటువంటి వేతన బానిసత్వమే సమాజంలో వుండకూడదనుకుంటున్నాం మనం. భూమి, ఉత్పత్తి సాధనాలు ప్రజలకు దక్కాలంటే కొంతమంది సాయుధ పోరాటంలోకి కూడా రావాలి. ప్రజల్ని పోరాటాల్లోకి మనం దించాం. అయితే అది పరిమిత లక్ష్యంతోని, ఆర్థికవాద దృక్పథంతోని కేవలం ఆ సమస్యను సాధించటం వరకే పరిమితమైన పద్ధతి కాదు. ఈ ప్రభుత్వం ఎవరిది? ఎవడి వర్గ ప్రయోజనాల కోసం పనిచేస్తుంది? ప్రజలంతా మొత్తంగా విముక్తి కావాలంటే తక్షణ సమస్యలు పరిష్కరించు కుంటూనే, ఒక శాశ్వత పరిష్కారం కోసం కూడా ముందుకు నడవాలి. అందుకోసం సంఘాలు పెంచుకోవాలి. జి.ఆర్.డి.లు నిర్మించు కోవాలి. జి.ఆర్.సి.లు నిర్మించుకోవాలి. గెరిల్లా సైన్యంలోకి చేరాలి. మనం ఈ విషయాలను ఈ పోరాటాలకు జోడించాలి. అట్లా మనం, సముద్రంలో నుండి మనల్ని బయటపడెయ్యాలని వాడు అనుకుంటున్నాడు, మనం నీటి లోలోతుల్లోకే వెళ్ళాలి. వాడిమీదికే నీటినే చిమ్మాలి. అది మనం చెయ్యాల్సినటువంటి పని. అయితే ఇప్పుడు మనం ప్రజల్ని వాళ్ళ చైతన్య స్థాయిని బట్టి, ఏ సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు, ఏ స్థితిలో వున్నారు, అక్కడ ఏ పోరాట రూపాన్ని ఎంచుకోవాలి అన్నది అర్థం చేసుకొని నిరంతరం ప్రజల్ని వర్గ పోరాటంలో నిలబెట్టాలి. మొత్తం అన్ని విషయాలకు గుండెకాయ వర్గ పోరాటం. వర్గ పోరాటం వివిధ రూపాలు తీసుకుంటుంది. వాళ్ళు సమస్యలకు వ్యతిరేకంగా పోరాడటం అనేది ఎప్పుడూ ప్రధానంగానే వుంటుంది. అది రాజ్యాధికార లక్ష్యంతో ముడిపడి వుండాలి. మనం దాన్ని రాజ్యాధికార లక్ష్యంతో ముడిపెడుతూ నిర్వహించాలి. ఇదొకటి, మనం ప్రధానంగా దృష్టిలో పెట్టుకోవాలి. రెండవది మన ఆత్మరక్షణ విషయం ఆలోచించు కోవాలి. ఒక జిల్లాలో మనం ఆ పరిస్థితిని అర్థం చేసుకోని రీతిలో ఎక్కువగా దాడి కొనసాగినపుడు, లేదా వాడి మిలటరీ క్యాంపెయిన్ మనల్ని తిరగలేని పరిస్థితికి నెట్టినపుడు, తాత్కాలికంగా అవసరమైతే మన రక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. కొద్దికాలం పరిస్థితిని అర్థం చేసుకునే వరకు అవసరమైనటువంటి రక్షిత చర్యలను మనం చేపట్టాలి. కాబట్టి ప్రజల నుండి వేరుపడకుండానే, మన శక్తుల్ని కాపాడుకోవటమనేది కూడా మనకు చాలా ముఖ్యం. పోరాటం చేసేటపుడు మన స్వీయాత్మక శక్తుల్ని కోల్పోకుండా, తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విషయాలు కూడా అవసరమైన వంటివేవని మనకు తెలుసు. ఇప్పటికే మనకు టెక్నికల్ విషయాల్లో తప్పుల్ని, వీటన్నిటినీ కూడా రివ్యూ చేసుకుంటున్నాం. నాయకత్వం నుంచి క్రింది వరకు కూడా ఈ విషయంలో పొరపాట్లు జరగకుండా తిరిగి తిరిగి అవే జరగకుండా మనం తగిన విధంగా మొత్తం పరిస్థితిని ఆలోచించాలి, మొన్న అక్కడ మన 'గెరిల్లావాణి'లో 'విప్లవకారుల ప్రాణాలు వాళ్ళవి కావు-అవి ప్రజలవి' అని రాశారు. అది నిజం. మనకు ఆ స్వేచ్ఛ లేదు. మన ప్రాణాన్ని హరించుకోవటానికి మనకు స్వేచ్ఛ లేదు. ఆశయానికి అనుగుణంగా స్వేచ్ఛ వుండాలి. మన ఆశయం విప్లవోద్యమాన్ని సాధించటం కాబట్టి, ప్రజల పక్షాన ప్రజల ఆకాంక్షలు తీర్చడం కోసం మనం నిలబడుతున్నాం కాబట్టి, మన ప్రాణాలు పోగొట్టుకోవడం మన సొంత వ్యవహారం కాదు. 'చస్తే నేనే చస్తా కదా' అనేది మూర్ఖత్వమే అవుతుందిగానీ అందులో వివేకం ఏమీలేదు. అది సమర్థించవలసిన విషయం ఏమీకాదు. మన శక్తుల్ని కాపాడు కోవటం అన్నది చాలా ముఖ్యమైన విషయం. ఇది ప్రతి కామ్రేడ్ సీరియస్‌గా గుర్తించాలి. ఆ కామ్రేడ్ గుర్తించకపోతే ప్రక్కనున్న కామ్రేడ్ గుర్తింపజేయాలి. అయితే ఈ విషయం కేవలం టెక్నికల్ సమస్యగానే ముడిపడిలేదు. మొత్తం పరిస్థితిని గురించి ఎలాంటి

నిర్ణయాలు తీసుకోవాలనేదానికి సంబంధించి మన డి.సి., ఆర్.సి.లకు అవసరమైనటువంటి సూచనలు అందించాలని యస్.సి. అనుకుంటున్నది.

మూడవది, ఈ మొత్తం పరిస్థితిలో కీలకమైనటువంటి విషయం, బలా బలాలు తేల్చుకోవటానికి ప్రజలను పోరాటాల్లోకి దించటం ఒకటైతే, ఇంకొక దశకు పోయిన తర్వాత వివాదాలన్నీ సాయుధశక్తితోనే తేలతాయి. మావో కొటేషన్ కూడా వుంది కదా! యుద్ధం ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని, అందువల్ల మనం వాడు చేసేటటువంటి క్యాంపెయిన్‌ని కేవలం శాంతియుతంగా ప్రజల్ని కదిలించటం ద్వారానే సమస్యను మనం తిప్పికొట్టలేం. కాబట్టి వాడి సాయుధ దాడిని సాయుధంగా కూడా తిప్పికొట్టడానికి మనం అవసరమైనటువంటి పథకాన్ని వేసుకోవాలి. తక్షణమే చేపట్టాల్సిన చర్యలు, దీర్ఘకాలికంగా కూడా ఈ మొత్తం పరిస్థితిని కూడా దృష్టిలో పెట్టుకుని మన ప్రయాణం ఎటువేపు వుండాలి అని నిర్ణయించుకుని మన దళాలు, మన జి.ఆర్.డి.లు, సంఘాల్లో చురుకుగా పనిచేస్తున్నవాళ్ళు, ఈ అన్ని శక్తుల్ని ఏకోన్ముఖంగా, వీటన్నిటినీ కూడా ఒక సమన్వయంతో మనం ప్రతిఘటన వేపుగా కదిలించాల్సిన అవసరం వుంది. సాయుధ ప్రతిఘటనవైపు మనం ప్రతిఘటనను మరింత పెంచుకోవలసి నటువంటి అవసరం వుంది. మన ప్రతిఘటనలో మనం ఎదుర్కొంటున్నటువంటి చిక్కులన్నింటినీ పరిష్కరించుకోవాలి. ట్రైనింగ్ మొదలుకొని, మన ఏర్పాట్ల వరకు; సమాచార వ్యవస్థను కూడా మనం పకడ్బందీగా ఏర్పాటు చేసుకోవలసిన అవసరం వుంది. ఇప్పుడు జరుగుతున్న దాడి మరింత తీవ్రతరమయ్యే అవకాశాలున్నాయి. కాబట్టి, ప్రజల్ని అనేక కోణాల్లో అర్థం చేయించాలి. ముఖ్యంగా నక్సలైట్లకూ పోలీసులకూ సమస్య కాదు ఇది. ప్రజలకు, దోపిడీ వర్గాలకు మధ్యన సమస్య ఇది. కాబట్టి, ఆ సమస్య ఆ సమస్య రూపంలోనే వుండాలి. ఈ విషయాల్ని మనమొక్కళ్ళమే అర్థం చేసుకుంటే సరిపోదు. మనం ఏ ప్రజానీకం కొరకు పనిచేస్తున్నామో, ఆ ప్రజానీకం గుర్తించే లాగా, వాళ్ళని పోరాటాల్లోకి నడపటం ద్వారా మనం ప్రజలకు ఉద్బోధించాలి. ప్రజల్నుండి మనల్ని వేరుచేయాలనే వాడి ఎత్తుగడను ఆ విధంగా మనం దెబ్బ కొట్టాలి. మొత్తంగా పరిస్థితిపట్ల ఈ అవగాహనతో మనం నడవాల్సిన అవసరం వుంది. వాడి ప్రచార ఆర్భాటాలకు, వేటికీ మనం ప్రభావితం కానవసరం లేదు. నిజానికి వాడు ఇన్నిరకాలుగా ఇన్ని కోణాల నుండి మనమీదికి యుద్ధానికి సిద్ధమవుతున్నాడంటేనే, డి.జి.పి. దొర మనల్ని ఒక సంవత్సరంలోనే అణచిపెడతాననే అంచనా వాడికి కూడా నిజంగా లేదనేది అర్థమవుతోంది.

మన శక్తిని కూడా అర్థం చేసుకోవాలి. అయితే ఆ శక్తితోనే మనం మురిసి పోనవసరం లేదు. ఈ శక్తి ఇంతటితోనే మనకేమీ మొత్తం సమస్యని పరిష్కరించదు. ఇంకా మన శక్తి పెరగాల్సినటువంటి అవసరం కూడా వుంది. ఇందులో ప్రధానంగా, ఇంకొక విషయాన్ని కూడా గమనించాలి. ఇక్కడ కొన్ని దళాలున్నాయి, నాయకత్వ కామ్రేడ్స్ కూడా వున్నారు. విప్లవంలో మరొక కీలకమైన అంశం, అనేక రకాల అవసరాలు మనముందుకు వస్తున్నాయి. కామ్రేడ్స్‌కి చదువు చెప్పడానికి ఇవాళ ఒక 20 రోజులు మనం స్కూల్ నడిపామంటే ఇక్కడ కొంత వెసులుబాటు వుంటే తప్ప మనం ఆ పని చేయలేం. క్యాంపులో 65 మంది వుండటం ద్వారా యస్.సి. సమావేశం జరిగింది, జె.యస్.యం. వర్క్‌షాప్ జరిగింది, మహిళా కామ్రేడ్స్‌కి కొంత ప్రత్యేక శిక్షణకు అవకాశం చిక్కింది, మొత్తం కామ్రేడ్స్ ఉదయంపూట ఐ.ఏ.డి. (ఇమ్మీడియట్ యాక్షన్ డ్రిల్స్) లు .... ఇట్లాంటివి చేసుకున్నాం. ఇంకా అనేక పనులు కూడా మనం ఇక్కడ వుండి చేసుకున్నాం. 60-65 మందిమి వుండటం వల్ల ఈ పనులన్నీ కూడా చేసుకున్నాం. నిజానికి మన నెత్తిమీద ఇంకా చాలా పనులున్నాయి మనం చేయాల్సినవి. మనకు చాలా కోర్కెలున్నాయి, చాలా పనులున్నాయి. కానీ, ఇవన్నీ మనుషుల ద్వారా జరిగేటివి. ఇవన్నీ ప్రజలు చేయాల్సినవి. కాబట్టి, మన స్వీయాత్మక శక్తుల్ని పెంచుకోవటంలో కూడా మన దృక్పథంలో మార్పు రావాలి. ఈ అరాకొరగా రిక్రూట్ చేసుకొనే పరిస్థితిలో మార్పు రావాలి. ప్రజలు విప్లవానికి సంసిద్ధంగా ఉన్నపుడు మనం వాటిని పసిగట్టలేక పోతున్నాం. మనందరం కూడా విప్లవంలోకి ఎప్పుడు పడితే అప్పుడు వచ్చినవాళ్ళం కాదు. మన చరిత్రలను ఒకసారి వెనక్కి తిరిగి చూస్తే, ప్రతి కామ్రేడ్‌కి ఏదో ఒక స్వీయానుభవం వుంటుంది. ఈ విప్లవం ఏదో ఒక విషయంలో ఆకర్షించి వుంటుంది. బహుశా, ఏ ఒక్క కోణం నుంచైనా ఆకర్షించి వుంటుంది. ఇంత మొత్తంగా అర్థం కాదు మనకప్పుడు. అప్పుడు మన ఆర్గనైజర్ కూడా అందుబాటులో వుండుంటాడు బహుశా. నిజానికి ఆ ఆర్గనైజర్ అప్పుడు మనకు అందుబాటులో లేకపోతే నేటి సమాజంలోని విషసంస్కృతి ప్రభావానికి గురై మనం ఇక్కడ ఏ బజార్లు పట్టుకు తిరిగేవాళ్ళమో, మనం ఏ దోపిడీ వర్గాల గురించి మాట్లాడుతున్నామో ఆ సెక్షన్‌లోనే అందరం చేరిపోయేవాళ్ళమేమో? ఏంటిదిది? ప్రజలు వర్గ పోరాటంలో వున్నపుడు, చాలా వేడిగా, వాడిగా వున్నపుడు, మనం చెప్తాం కదా, ఇనుము బాగా వేడిగా వున్నపుడు వాడెట్లా వంగమంటే అట్లా వంగుతుంది. వంచితేనే అది కూడా. అలాగే, ప్రజల్ని మనం పోరాటంలోకి సమీకరించినపుడు ఆ దృక్పథం కూడా మనకు వుండాలి. నిజానికి వాళ్ళ అవసరాలు శాశ్వతంగా పరిష్కారం కావాలంటే, వాళ్ళందరూ కూడా విప్లవంలోకి రావాలి. కాబట్టి అలాంటి అవకాశాలున్నపుడు మనం పెద్దఎత్తున వాళ్ళని విప్లవంలోకి తీసుకురావటం, నిర్మాణాల్లోకి తీసుకోవటం, ఇంకా మన సాయుధ నిర్మాణాల్లోకి తీసుకురావటం కోసం మనం ప్రయత్నం చేయాలి. కాబట్టి రిక్రూట్‌మెంట్‌కు కూడా ఒక పథకం వుండాలి. తప్పనిసరిగా, మన ఏరియాలో ఏ మొలకలున్నాయి? కొత్త మొలకలు ఏమిటి, వాటి పెరుగుదల ఏమిటి, అవెప్పుడు కాపుకు వస్తాయి, కాపుకు రావడమంటే పూర్తికాలం విప్లవకారులుగా మారడమే. అలాంటి పరిస్థితి ఏంటిది అనేది మనం పసిగట్టగలగాలి. లేదా వాళ్ళని అలాంటి పరిస్థితికి తీసుకురావాలి. కాబట్టి, ఒక దళం ఏరియాలో శాక్‌లు, జిల్లాకమిటీ ఒక పథకాన్ని కలిగి వ్యక్తుల మీద నిఘా..., నిఘా అంటే వాళ్ళని మనం పరిశీలించడం, పసిగట్టడం, వాళ్ళకు అవసరమైన ఎడ్యుకేషన్, అవసరమైన కార్యక్రమం ఇవ్వడం. తండోపతండాలుగా ప్రజలు కదిలిన ప్రాంతాల్లో కూడా, ఇప్పుడు కూడా ఈ పరిస్థితుల్లో కూడా మనం ప్రజల్ని కదిలిస్తున్న ప్రాంతాలున్నాయి. మనచుట్టూతా మనుషులున్నారు. అనంతపూర్‌లో మన చుట్టూతా మనుషులున్నారు. గుంటూరులో మన చుట్టూతా మనుషులున్నారు. కొన్ని జిల్లాల్లో ఇప్పటికీ అలాంటి పరిస్థితులు వున్నాయి.

కొన్నిచోట్ల గతంలో ఈ పరిస్థితి వుండి ఇప్పుడు మారింది. ఈ

మారి పోవడాలు, పరిస్థితి రావడాలు మనకైతే కొత్తకాదు. చాలా జిల్లాల్లో బాగా దాడి జరిగినపుడు వెనక్కి తగ్గటం, మరలా మరింత చైతన్యవంతంగా ముందుకు రావటమనేది, అన్ని దళాలకు ఆ అనుభవం వుంది ఇవాళ మన పార్టీలో. అన్ని జిల్లాలకు ఆ అనుభవం వుంది. అనేకసార్లు మన సంఘాలు దెబ్బతిన్నాయి. మరలా నిర్మాణం జరిగింది. ఒక్క మనిషి కూడా కలవలేనటువంటి పరిస్థితి, అలాంటి అనుభవం వుంది. అలాంటిది, మనం చెప్పినా జాగ్రత్తలు పాటించనటువంటి, ఒక ఉత్సాహకరమైనటువంటి వాతావరణం మన సంఘాలకు అలాంటి అనుభవం కూడా వుంది. కాబట్టి ప్రజలు కదులుతున్నపుడే మనం ఏ పనులు చేయాలనుకున్నా, మొత్తం విప్లవోద్యమం యొక్క అవసరాలు దృష్టిలో పెట్టుకుని అలాంటి సమయంలో మరింత చొరవగా పెద్ద ఎత్తున రిక్రూట్స్‌వైపు మనం కేంద్రీకరించాలి. మన స్వీయాత్మక శక్తులు పెంపొందితే చాలా విషయాలు త్వరత్వరగా మారిపోతాయి. కొన్ని మనకు చాలా ఇబ్బందిగా అనిపించవచ్చు. కానీ, ఈ ఇబ్బందులన్నీ అవతలి కోర్టులోకి పోతాయి. వారి(డి)కి ఇబ్బందులుగా మారిపోతాయి. మనం వీటిమీద సరిగా కేంద్రీకరించగలిగితే, ఇవాళ ఇండియాలో...ఇండియా సంగతి పక్కనబెట్టి, ఆంధ్రప్రదేశ్‌లో మనకలాంటి పరిస్థితి వుంది. లేనిచోట మనం దాన్ని తీసుకురావాలి. కాబట్టి, తాత్కాలికంగా కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న దాడులను బట్టి కొన్ని ఇబ్బందులుండవచ్చు. అక్కడ కూడా మనకు, మన...దళాల్లో ఇద్దరు సభ్యులు తక్కువగా వున్నారని చెప్పి అప్పుడు రిక్రూట్‌మెంట్ కోసం వెతుక్కునేటటువంటిదే ఇప్పటికీ ప్రధానంగా వుంది. అట్లా కారాదు. ఒక టార్గెట్ పెట్టుకోవాలి. మనకు ఏరియాలో వున్న అవకాశాలు ఏమిటి? మన శక్తులు ఏమిటి? అని ఖచ్చితంగా ఒక స్పష్టమైన పథకాన్ని మనం రూపొందించుకోవాలి. కాబట్టి ఇవాళ మన విప్లవోద్యమాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్ళాలంటే మన స్వీయాత్మక శక్తులను పెంపొందించుకోవటం కూడా, చాలా అవసరం. ఈ విషయం మీద కూడా రాష్ట్రకమిటీ కొంత వివరంగానే చర్చించింది. దీనిపట్ల ఇంకా కింది వరకు కూడా అవగాహన తీసుకువెళ్ళాలి. ఆయా జిల్లా కమిటీలు, శాక్‌తో స్పష్టంగా, వివరంగా చర్చించి అవసరమైనటువంటి పథకాన్ని రూపొందించుకోవాలని కూడా రాష్ట్రకమిటీ భావిస్తోంది.

ఇంకా ఈ యస్.సి. సమావేశంలోనే ఎన్నికల రివ్యూ, అలాగే మన దిద్దుబాటు ఉద్యమం నుండి తీసుకున్నటువంటి గుణపాఠాల్ని దృష్టిలో పెట్టుకుని, ఇంకా మన సంఘాలు.... బయట మనకు ప్రతిబింబంలాగా పనిచేస్తున్నటువంటి, బహిరంగంగా పనిచేస్తున్న టువంటి ప్రజాసంఘాలున్నాయి. వాటిల్లో కొన్ని ధోరణులు, పెడధోరణులు చాలా బలంగానే వున్నాయి, వాటిని మనం సరిదిద్దడం, మొత్తం వీటి మీద కొంత వివరంగానే కిందికి, అలాగే మన పట్టణ ప్రాంతాల్లో గత నాలుగైదు సంవత్సరాలుగా జరుగుతున్న నష్టాలు, మన పని పద్ధతులు వీటిని దృష్టిలో పెట్టుకుని కూడా రాష్ట్రవ్యాపితంగా పనిచేస్తున్నటువంటి పట్టణ కామ్రేడ్స్‌ను, వాళ్ళ అవగాహనను పెంచడానికి, వీలయిన మేరకు పట్టణ ప్రాంతాలలో మన పని విధానమెట్లా వుండాలి అన్న విషయంలో సరయిన అవగాహన కల్పించడం కొరకు కూడా ఒక సర్క్యులర్‌ను సమావేశంలో చర్చించి రూపొందించుకోవటం జరిగింది. ఇవన్నీ కూడా 2, 3 నెలల్లో త్వరలో కిందిదాకా వస్తాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని, మనం మరింత పట్టుదలతో ప్రజలు మనపై పెట్టిన బాధ్యతను నెరవేర్చడానికి ఒక దృఢ సంకల్పంతో మనం వుండాల్సిన, పనిచేయాల్సిన అవసరమైతే వుంది. ఈ స్ఫూర్తితోనే మనం ఇక్కడ నుండి, ఈసమావేశం నుండి మనందరం మన మన పనులను చూసుకోవటానికి విడిపోదాం!...

❑

**దోపిడీ వర్గాల 'కంచుకోట'ల్లోనే పీఠం వేసి శత్రు గుండెలను కంపింపజేసిన 'యాక్షన్ టీమ్' అమరులకు అరుణారుణ జోహార్లు!**

**కిరాయి హంతక బలగాల పాశవిక దాడులను వీరోచితంగా ప్రతిఘటిస్తూ చంద్రగిరి కొండల్లో నేలకొరిగిన 12 మంది అమరవీరుల మహోన్నత త్యాగాన్ని నలుదిశలా ఎగరేసి నిలపండి!**

**ప్రభుత్వ హంతక బలగాల ఆకస్మిక దాడిలో చిక్కి నేల రాలిన రాచకొండ అమరులకు అరుణారుణ జోహార్లు!**

**అమరవీరుల ప్రాణ త్యాగాల సాక్షిగా కిరాయి హంతకులపై, దోపిడీ పాలకులపై ప్రతీకారం తీర్చుకుందాం!!**

( 29వ పేజీ తరువాయి.....)

జైలులో పోరాడుతూ బయటకు వచ్చిన కా॥ రమేష్ జనంలోకి పయనమయ్యాడు. దక్షిణ తెలంగాణా ఉద్యమ అనుభవాలను ఆకళింపు చేసుకుంటూ ఆ కాలంలో జరిగిన క్యాంపుల సందర్భంగా అనేకమంది కామ్రేడ్స్‌తో తన జైలు జీవితాన్ని వెలిబుచ్చుతూ సన్నిహితుడయ్యాడు. గెరిల్లా దళాలు కలుసుకున్న అనేక సందర్భాలలో సాహిత్య సృజనకై శ్రద్ధాశక్తులతో కృషిచేసి అభివృద్ధి పరిచాడు.

పార్టీ పిలుపుతో ఈస్ట్ డివిజన్ అవసరాలు తీర్చడానికి 1997 జనవరిలో తూర్పుకనుమలకు చేరుకున్నాడు. అనతికాలంలోనే ఆదివాసీ ప్రజలను చైతన్యపరుస్తూ వారి మన్ననల్ని పొందాడు. ప్రజా పోరాటాల మధ్య నిలిచి ప్రజల్ని సంఘటితపరుస్తూ కృషిసలిపాడు. మన్యం ఉద్యమం గెరిల్లాజోన్ సన్నాహక దశనుండి ప్రాథమిక గెరిల్లాజోన్‌లోకి అడుగడుగు పురోగమించడానికి పార్టీ చేస్తున్న నిర్మాణాత్మక కృషిలో చురుకైన పాత్ర పోషించాడు. యువతీ యువకుల్ని ప్రోత్సహించి ప్రజా మిలీషియా ప్రాథమిక రూపమైన గ్రామరక్షక దళాలను నడిపించటంలో బాధ్యత పడ్డాడు. ప్రజా రాజ్యాధికార అంగాలను నిర్మించి పనిచేయించే కృషిలో భాగమైనాడు. గ్రామస్థాయి నుండి పై వరకు ప్రజా రాజ్యాధికారం నెలకొనడానికి అడ్డంకిగా నిలిచిన దోపిడీ వర్గాలను, దోపిడీ రాజ్య అణచివేత దాడుల్ని ప్రతిఘటించవలసిన ప్రాముఖ్యతను గుర్తించాడు. అలాంటి అవకాశం కోసం ఉత్సాహంతో ఎదురు చూసాడు. దొరికిన ప్రతి సందర్భంలో పట్టుదలతో తన కప్పగించిన బాధ్యతను దృఢంగా నిర్వహించాడు. వర్గ పోరాటం వర్గ పోరాటంలో పుట్టిపడే వర్గకసితో మండపల్లి, కోటం పాలెం ఆంబుష్‌లలో శత్రువును తుదముట్టించడంలో ముందున్నాడు. శత్రువు ప్రత్యేక పోలీసు బలగాలు చేసిన అనేక ఎన్‌కౌంటర్ దాడుల్లో నిలిచి పోరాడుతూ దళం రిట్రీట్‌కు రక్షణ కల్పించిన సాహసి కా॥ రమేష్. ప్రజాయుద్ధానికి అనుగుణంగా దినం దినం పెంపొందుతున్న గెరిల్లా బలగాలకు ఆయుధాలు సమకూర్చడానికి జరిగిన బోడిగడ్డ (ఒరిస్సా) పోలీస్ క్యాంపుపై రెయిడ్‌లో చొరవగా పాల్గొన్నాడు. స్క్వాడ్ ఏరియా కమిటీ సభ్యునిగా, తాండవదళం డిప్యూటీగా తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల ప్రజామిలీషియా దళసభ్యుల విశ్వాసాన్ని చూరగొన్నాడు శత్రువు అణచివేతదాడుల్ని తిప్పికొడుతూ తుదముట్టించే లక్ష్యంతో ఏర్పరచిన ప్రత్యేక గెరిల్లా దళానికి డిప్యూటీ కమాండర్‌గా తన బాధ్యతని 1999 అక్టోబర్‌లో ధైర్యంగా స్వీకరించాడు.

మన కేంద్రకమిటీ నాయకత్వ కామ్రేడ్స్‌ని పోలీసులు పాశవికంగా హత్య చేయడానికి ప్రతీకారంగా హత్యల్ని ప్రజాగెరిల్లా బలగాలు, విప్లవ ప్రతిఘటనోద్యమ క్యాంపెయిన్‌లో శత్రువుని దిమ్మతిరిగేలా దెబ్బతీయాలనే పార్టీ పిలుపు కా॥ రమేష్‌లో అత్యంత ఉత్సాహాన్ని నింపింది. వర్గ కసి రగిలించింది. ప్రజల పక్షపాతి అయిన కా॥ రమేష్‌లో ప్రతిఘటన పట్ల పట్టుదల పెరిగింది. ధారకొండ ఏ.పి.యస్.పి. క్యాంపుపై దాడిచేసి శత్రువును నిర్మూలించడం, ఆయుధాలను స్వాధీనం చేసుకోవడం అనే లక్ష్యంతో రెక్కీ నుండి దాడి విజయవంతం అయేవరకు కా॥ రమేష్ చురుకైన పాత్రను పోషించాడు. శత్రువు ఆయువుపట్టుగా పెట్టుకున్న సెంట్రీ బంకర్‌పైకి అత్యంత ధైర్య సాహసాలతో మెరుపువేగంతో వెళ్లి శత్రువును భయకంపితుడిని చేసి సెకండ్లలో తుదముట్టించాడు. క్యాంపుపై ఆధిపత్యం కోసం సృజనాత్మకంగా ఆలోచించి మరో బంకర్‌లోని పోలీసును హతం చేశాడు. ఏర్పడిన వెసులుబాటులో ఆయుధాల స్వాధీనం కోసం ప్రాణాన్ని లెక్క చేయకుండా కమాండర్ కాషన్‌తో క్రమశిక్షణగల గెరిల్లా సైనికుడుగా క్యాంపులోపలికి దూసుకు పోయాడు. ఆ సమయంలో బెంబేలెత్తిన పోలీసులు చెల్లాచెదురుగా జరిపిన కాల్పుల్లో నేలకొరిగాడు.

ఈ గెరిల్లా వీరుల అత్యంత ధైర్య సాహసాలతో కూడిన చొరవ, విజయాన్ని గ్యారంటీ చేసింది. ఆ సమరయోధుల త్యాగం పోలీసుల్ని మట్టి కరిపించి ప్రజల ప్రతీకార వాంఛని దృఢ నిశ్చయంగా తీర్చింది.

మన ప్రజాయుద్ధ యోధులు కా॥ నవీన్ (బాలక్రిష్ణ), కా॥ సత్యనారాయణ (రమేష్, శ్రీధర్)లు ధైర్యసాహసాలు, చొరవ, పట్టుదల, వర్గకసి, అనన్య త్యాగాలు ఆదర్శాలుగా నెలకొల్పి నేలతల్లి విముక్తి కోసం నేలకొరిగారు. ఈ వీరుల అనుక్షణ ఆచరణని పోరాడుతున్న యువతీ, యువకులు, ప్రజా మిలీషియాలకు, గెరిల్లా బలగాలకు సదా ఆచరించాల్సిన ఆదర్శాలుగా తీసుకుందాం. అమరవీరుల ఆశయాన్ని సాధించే వరకూ, దోపిడీ వర్గ ప్రభుత్వాలను కూల్చేంత వరకూ ప్రతిఘటన ఉద్యమ క్యాంపెయిన్‌లు కొనసాగిద్దామని ప్రతిన బూనుదాం.

❑

**జూలై 28 నుండి ఆగస్టు 3 దాకా అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని వాడవాడలా జరుపుదాం!**

**ప్రజాపోరాటంలో నేలకొరిగిన వందలాది అమరుల స్మృతులను ఎత్తిపట్టుకుంటూ, అమరుల స్వప్నాల సాఫల్యం కోసం తుదిక్షణం దాకా పోరాడదాం!!**

# ఆక్రమించిన పట్టాభూముల్లో పంట పండించుకున్న రైతాంగం

పెన్న అహోబిలం దళం ఏరియాలోని ఉరవకొండ మండలం, ఆమిదాల గ్రామంలో భూస్వాములు, టి.సి. సుబ్బరాయుడిది 50 ఎకరాలు, ఏలూరు చినరామన్నది 40 ఎకరాలు, నరసయ్యది 30 ఎకరాలు పట్టాభూమి ఆక్రమించిన విషయం 'క్రాంతి' పాఠకులకు తెలిసిందే! ఆ మొత్తం 120 ఎకరాల భూమిలో ఆక్రమించుకున్న ప్రజలందరూ ఉమ్మడిగా జొన్న పంట వేశారు. 600 సంచుల పంట పండింది. ఒక్కో కుటుంబం 5 కడువులు చొప్పున పంచుకున్నారు.

ఈ పోరాటాల ఉత్తేజంతో గ్రామానికి చెందిన మరో భూస్వామి గుర్రం శ్రీరాములు పట్టాభూమి 50 ఎకరాలు, సీలింగ్ భూమి 50 ఎకరాలు ఆక్రమించుకుని, 52 కుటుంబాలు పంచుకున్నాయి.

## ఇండ్ల స్థలాల కోసం భూస్వామి పట్టాభూమి ఆక్రమణ

ఇదే దళం ఏరియాలోని గార్లదిన్నె మండలంలోని ముకుందాపురం గ్రామంలోని భూస్వామి నారపరెడ్డి మండలంలోనే పెద్ద భూస్వామి భూములతోపాటు, అనంతపురం, ఇతర పట్టణాలలో పెద్ద పెద్ద ఫ్లాట్‌లు (భవంతులు) కట్టి, అద్దెలకివ్వటమేగాక, సినిమా నిర్మాతలకు కూడా అప్పులిస్తున్న పెద్ద వడ్డీ వ్యాపారస్థుడు. వీడికి మొత్తం భూమి 300 ఎకరాలు పైననే వుంది. దళితవాడ పక్కనే వీడికి 14 ఎకరాల చీనీతోట కూడా వున్నది.

ఈ గ్రామంలోని దళితులు భూస్వాములు, ఇతర రైతాంగం వద్ద జీతాలకు పనిచేస్తూ, కూలి పనులు చేసుకుంటూ బ్రతుకుతున్నారు. అర్ధాకలి జీవితాలతో పాటు ఇండ్ల స్థలాల సమస్యను కూడా తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. ఎన్నికలప్పుడు వాగ్దానాలు చేసి ఓట్లు వేయించుకున్న నాయకులేగానీ, వాళ్ళ సమస్యని పరిష్కరించిన వాడు లేడు. దాంతో, గ్రామంలోని విప్లవ రైతుకూలీ సంఘం వెనుక దళితులు సంఘటితమయ్యారు. గ్రామంలో భూస్వామి ఆధిపత్యాన్ని కూలదోసి, పేద ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పుకునే లక్ష్యంలో భాగంగా, భూస్వామి నారపరెడ్డికి వ్యతిరేకంగా ఇండ్ల స్థలాల పోరాటం చేపట్టారు. దళితవాడ పక్కనే వున్న నారపరెడ్డి 14 ఎకరాల చీనీ తోటని ఆక్రమించటానికి పూనుకున్నారు, '99 డిసెంబరు నెలలో దాని కొరకు, దళితవాడ ప్రక్కనగల చీనీతోటను దళితులకు ఇండ్ల స్థలాల కొరకు ఇవ్వాలని గ్రామంలో పోస్టర్లు వేశారు. ఆ తర్వాత గ్రామంలో ఊరేగింపు చేసి, ఊరేగింపు భూస్వామి ఇంటిముందుగా తీసి, ఆ భూమిని ఆక్రమిస్తున్నాం అని వాడికి చెప్పి, అనంతరం చీనీతోటలో ఎర్రజెండాలు పాతి ఆక్రమించారు. తిరగబడుతున్న ప్రజలకు ఎదురొడ్డి నిలవటం సాధ్యం కాదనుకున్న భూస్వామి నారపరెడ్డి, ప్రజలముందు తలఒగ్గి, పంటను తాను కోసుకున్న తర్వాత భూమిని తీసుకోండని ప్రజలను అడిగాడు. దానికి ప్రజలు కూడా సరేనన్నారు.

ఇదే ఏరియాలో ఉరవకొండ మండలం, మైలారం పల్లి గ్రామంలో 30 ఎకరాల ముంపు భూమిని ప్రజలు ఆక్రమించి, సమిష్టిగా పంట పెట్టారు. దానికి ముందు పోస్టర్లు వేసి ప్రచారం చేశారు. గ్రామంలో ఊరేగింపు తీసి, బహిరంగ సభ జరిపారు.

## కట్నం కోసం భార్యను చంపిన హంతకుడికి ప్రజాకోర్టులో శిక్షించిన ప్రజలు

కంబదూరు మండలం అచ్చంపల్లి గ్రామంలో (పెన్నహోబిళం దళం ఏరియా)లో ఉప్పర భీమన్న అనే అతనికి 6 నెలల క్రితమే పెళ్ళి అయింది. అయితే, ఆ భార్యను వదిలించుకుంటే, 5వేలు కట్నం ఇచ్చి, కూతురిని ఇస్తానని అతని బంధువు (వదిన తండ్రి) ఆశపెట్టాడు. భీమన్న అందుకు ప్రలోభపడ్డాడు. తల్లీ వదినలు కూడా అందుకు ప్రోత్సహించారు. దాంతో, భార్యన చంపి, అలా ఆమెను వదిలించుకొని, మరో పెళ్ళి చేసుకోవటానికి సిద్ధపడ్డాడు. అందుకని కందిచేనుకి వెళ్దామని భార్యను చేనుకు వెంటబెట్టుకెళ్ళాడు. అక్కడ, భీమన్న, అతని తల్లీ, వదినలు కలిసి కొట్టి ఆమెను చంపి, బావిలో పడవేశారు. ఏమీ ఎరగనట్లు ఇంటికొచ్చి, ఆ అమ్మాయి కనపడటం లేదు అని ఆందోళన చెందుతున్నట్లుగా వెతుకుతూ నాటకం ఆడారు. అయినా, అసలు విషయం బయటపడుతుందనే భయంతో భీమన్న వూరు వదలి వెళ్ళాడు. గ్రామంలో పెద్దలు కూడా ఇదేం అన్యాయం అని ప్రశ్నించకుండా, ఉదాసీన వైఖరి అవలంభించారు. అయితే గ్రామంలోని మన సానుభూతిపరులు (అక్కడ సంఘం లేదు) కలగజేసుకుని, ఊరికినే వదలివేస్తే ఇలాంటి మరిన్ని అత్యాచారాలకు లైసెన్స్ ఇవ్వడమేనని భావించి, ప్రక్క గ్రామంలో ఉన్న విప్లవ రైతుకూలీ సంఘం సహకారంతో ఆ సమస్యను వెలుగులోకి తెచ్చారు. భార్యా హంతకుడైన భీమన్నను శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా, సంఘ నాయకత్వంలో 15 మంది వెళ్ళి భీమన్నను పట్టుకొని, అతనిచేత వాస్తవాలు చెప్పించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుండి 70 మంది ప్రజలని సమీకరించి, భీమన్నకు ప్రజల సమక్షంలో గుండుగీసారు. ఆ తర్వాత పేరూరు, ఏడుగుర్రాలపల్లి, చెన్నంపల్లి, అయ్యంపల్లి, అచ్చంపల్లిలలో ఊరేగించారు. ఊరేగింపులో మహిళలు పాల్గొని, భీమన్నను చెప్పులతో కొట్టడం, తాంబూలం నమిలి ఉమ్మివేయడం, తిట్టడం జరిగింది. ఈ సందర్భంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాల గురించి, వాటిని సంఘటితంగా ఎదుర్కోవాల్సిన అవసరం గురించి వివరించడం జరిగింది.

## మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు, హత్యలకు వ్యతిరేకంగా కదనశంఖం పూరించిన విప్లవ మహిళా సంఘం

ఈ అసమాన సమాజంలో భూస్వామ్య భావజాలాలైన పురుషాధిక్యత, పితృస్వామ్యం మహిళలను అన్నిరకాలుగా అణచివేస్తున్నాయి. దీనితోపాటు కేబుల్ టీవీల ద్వారా నేరుగా మారుమూల గ్రామసీమల్లోకి కూడా కోరలు సాచిన సామ్రాజ్యవాద విష సంస్కృతి కూడా తోడై, స్త్రీల జీవితాలను మరింత

హీనపరుస్తున్నది. వరకట్నపు హత్యలు మొదలుకొని, అసమానపు చెదపురుగు తొలచి భార్యలను హత్యలు చేయడం, వంటరిగా 'ఆడది' కనిపిస్తే చాలు, వావీ, వరుసా అనేది చూడకుండా; వృద్ధురాలా, బాలికా, బాలింతా అనేది కూడా చూడకుండా అత్యాచారాలు చేసే విష సంస్కృతి రోజురోజుకీ పెచ్చరిల్లి పోతున్నది.

అయితే, అనంతపురం జిల్లాలో గత కొన్ని ఏండ్లుగా జరుగుతున్న వర్గ పోరాటం, అన్ని సెక్షన్ల ప్రజలని తనలో భాగస్వాములను చేసుకుంటున్నది. దానిలో భాగంగా, విప్లవంలో కీలకపాత్ర పోషింప వలసిన, సమాజంలో సగభాగమైన మహిళలను సంఘటితం చేసేందుకు, వాళ్ళనీ వర్గ పోరాటంలో రాటుదేల్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నది. అలా గ్రామాల్లో విప్లవ మహిళా సంఘాల్లో సంఘటితమవుతున్న మహిళలు, తమ గ్రామాల్లో, ప్రాంతంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా కదనశంఖం పూరించారు.

పెన్న అహోబిళం దళం ఏరియా ఎం.పి.ఆర్. డ్యామ్ గ్రామంలో ఒకతను భార్యను అనుమానిస్తూ, రోజురోజుకూ ఆ వేధింపులు తీవ్రం చేయడంతో, తట్టుకోలేక ఆమె బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. భర్తపెట్టే బాధలు భరించలేకనే తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు ఈ విషయాన్ని విప్లవ మహిళా సంఘం ముందుకు తీసుకొచ్చారు. విప్లవ మహిళా సంఘం ఈ విషయాన్ని విచారించి, ఆ గ్రామంకు వెళ్ళి హంతకుడిని పట్టుకుని గుండుగీయిస్తుండగా, హంతకుడి స్నేహితులైన గ్రామంలోని లంపెన్‌గ్యాంగ్ వి.మ.స. కార్యకర్తలమీద రాళ్ళు విసిరారు. వి.మ.స. అరాచకాలకు వ్యతిరేకంగా గ్రామస్థుల తిరుగుబాటు అని ప్రకటించుకున్నారు. ప్రచార సాధనాలు కూడా అదే ప్రచారం చేసాయి. అయితే, ఆ తర్వాత తాము చేసింది తప్పుడు ప్రచారం అని వాళ్ల తిరిగి ప్రకటన ఇచ్చారు. అలాగే భార్యను హత్య చేసినతను గ్రామంలో బహిరంగంగా ప్రజల ముందు చేసిన తప్పును ఒప్పుకోవటం జరిగింది. దానితోపాటు, తను హత్య చేసిన భార్య తల్లిదండ్రులకు 10వేలు ఇచ్చాడు. గ్రామంలో అతనికి సహకరించిన ప్రకాశ్‌రెడ్డి, కాంట్రాక్టర్ శ్రీనివాస్‌లచేత 20వేల రూ॥లు కూడా ఇప్పించటం జరిగింది.

పామిడి మండలం రామగిరి గ్రామంలో, కామంతో కళ్ళు మూసుకుపోయిన ఓ కాముకుడు ఒక బాలికపై అత్యాచారం చేసాడు. ఈ విషయంపై విప్లవ మహిళా సంఘం చుట్టుప్రక్క గ్రామాల్లో పోస్టర్లు వేసి ప్రచారం చేసి, బాలికపై అత్యాచారం చేసిన వాడిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ దానితోపాటు మహిళలను కదిలించి, అత్యాచారం చేసిన వాడిని పట్టుకుని దేహశుద్ధి చేసి, గుండు గీయించి, గాడిదమీద ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామంలో మహిళలు పాల్గొన్నారు. చుట్టుప్రక్కల గ్రామాలనుండి కూడా 200 మంది స్త్రీ, పురుషులు వచ్చి పాల్గొన్నారు.

## 'పోరాటశీలతను చాటి చెప్తూ జరిగిన అంతర్జాతీయ మహిళాదినం'

అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినమైన మార్చి 8ని ఇవాళ ప్రపంచవ్యాప్తంగా పాలకవర్గాలు ఒక తంతుగా మార్చివేశాయి. ఒకప్రక్క మహిళలమీద దోపిడీ, అత్యాచారాలు పెరగటానికి మరింతగా ఊతమిచ్చే విధానాలు అవలంభిస్తూ, మరోప్రక్క మహిళల ఉద్ధరణకే మేమున్నామని మేకవన్నెపులి మాటలు మాట్లాడుతున్నారు.

మన రాష్ట్రంలో విప్లవ మహిళా కార్యకర్తలని బూటకపు ఎదురుకాల్పుల పేరుమీద కాల్చిచంపుతూ తమ సమస్యల పరిష్కారం కోసం కదిలిన సాధారణ అంగన్‌వాడీ టీచర్లపై సైతం పోలీసులను ఉసిగొల్పి, గొడ్డను బాదినట్లు బాదించిన తెలుగుదేశం ప్రభుత్వం, దాని నాయకుడు చంద్రబాబునాయుడు కూడా మహిళా దినోత్సవాలని జరిపి, ప్రజల పోరాట దినాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు.

వీటన్నిటినీ తిప్పికొడ్తూ, అంతర్జాతీయ మహిళాదినం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించటానికి పెన్నహోబిళం దళం ఏరియాలో వి.మ.స. కార్యక్రమం తీసుకుంది. దానిలో భాగంగా 6గురు మహిళలతో క్యాంపెయిన్ దళంగా ఏర్పడి, 20 గ్రామాలలో ప్రచారం చేసారు. దాని ముగింపుగా, ఒక గ్రామంలో మార్చి 8న బహిరంగ సభ జరిపారు. ఈ సభలో 400 మంది మహిళలు, 300 మంది పురుషులు పాల్గొన్నారు.

## బోగినేపల్లి గ్రామంలో...

రామగిరి దళం ఏరియాలోని కనగానపల్లి మండలం బోగినేపల్లి గ్రామంలో చాకలి చౌడప్ప అనే అతను ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తర్వాత, ఆమెకు ఇతరులతో సంబంధాలున్నాయి అనే నెపంతో, కురుబ బయప్ప, బోయ యాదన్న అనేవాళ్ళ సహాయం తీసుకుని హత్యచేసి, శవాన్ని పూడ్చిపెట్టారు. గ్రామంలో ఆ విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. గ్రామంలోని విప్లవ రైతుకూలీ సంఘం కూడా ఆ సమస్య చేపట్టడానికి చొరవ చూపించలేదు. తర్వాత ఈ సమస్యను ప్రజలు దళం దృష్టికి తేగా, దళం సమస్యను చేపట్టింది. చాకలి చౌడప్ప, మిగిలిన ఇద్దరిని పిలిచి విచారించగా తాము హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. ప్రజల ముందు ఆ విషయాన్ని బహిరంగపరిచే బాధ్యతను ప్రక్క గ్రామాల వి.మ.స.లకు అప్పగించారు. మహిళా సంఘాల కార్యకర్తలు చాడప్పకు, బయప్పకు గుండుగీసి, మెడలో చెప్పులు హారాలేసి, తగరకుంట గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపు జరుగుతున్నపుడు మహిళలు వాళ్ళకి దేహశుద్ధి చేస్తూనే ఉన్నారు. 150 మందితో ఊరేగింపు జరిగింది. ఆ తర్వాత, బోగినేపల్లి గ్రామంలో ప్రజలందర్నీ సమావేశపరిచి బహిరంగసభ ఏర్పాటు చేశారు. ఆ సభలో తాము హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. అనంతరం వాళ్ళని గ్రామం నుండి బహిష్కరించటం జరిగింది.

## ప్రజా పంచాయితీల

పెన్నహోబిళం దళం ఏరియాలోని గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామంలో భూస్వామి నారపురెడ్డి తమ్ముడు ట్రాక్టర్ నడుపుతూ యాక్సిడెంట్ చేశాడు. ఆ ప్రమాదంలో వాళ్ళింట్లో జీతానికి పనిచేసే అతను చనిపోయాడు. మరో కూలీకి తీవ్రంగా గాయాలైనాయి. ఈ విషయం మన సంఘం దృష్టికి వెళ్తే, ఎక్కువ నష్ట పరిహారం ఇవ్వవలసి వస్తుందనే దానితో, నారపురెడ్డి చనిపోయిన పాలేరు కుటుంబాన్ని పిలిచి, అతి తక్కువ నష్ట పరిహారం తీసుకునేటట్లుగా వాళ్ళని ఒప్పించాడు. భూస్వామి అంటే వున్న భయంతో వాళ్ళు అంగీకరించారు. ఈ విషయం తెలిసిన సంఘం బాధితులను కలిసి మాట్లాడితే, తమగోడు చెప్పుకున్నారు. వాళ్ళకి

ధైర్యం చెప్పి, ప్రజలని కూడగట్టి, సంఘం ఆ విషయమై ప్రజాపంచాయితీకి పూనుకుంది. ఆ పంచాయితీలో చనిపోయినతని కుటుంబానికి భూస్వామి లక్ష రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని, దానితోపాటు అప్పులక్రింద ఆ కుటుంబం దగ్గర రాయించుకున్న 80వేల రూపాయల ప్రో నోటులను రద్దు చేయాలనే నిర్ణయం జరిగింది. అలాగే, తీవ్రంగా గాయపడిన అతనికి వైద్యం ఖర్చులు ఇవ్వడంతోపాటు, వడ్డీకి అప్పు ఇచ్చి అతని దగ్గర రాయించుకున్న ప్రో నోటును కూడా రద్దు చేయాలని చెప్పడం జరిగింది. ఆ సమస్యపట్ల ప్రజల స్పందన, మద్దతు, సంఘటితశక్తి చూసిన భూస్వామి నారపురెడ్డి, వాటికి ఒప్పుకుని, వెంటనే నష్టపరిహారం చెల్లించి, అప్పు పత్రాలు రద్దు చేశాడు.

ఇదే దళ ఏరియాలోని పామిడి మండలం పాల్యం గ్రామంలో అతిచిన్న వయస్సు నుండి, భూస్వాముల ఇండ్లలో జీతాలకు కుదురుకుని, వెట్టిచాకిరీచేస్తూ జీవితాలు గడుపుతున్న అనేకమంది పిల్లలున్నారు. భూస్వాముల దగ్గర పనిచేస్తూ, ప్రమాదాలు జరిగి చనిపోయిన వాళ్ళు అనేకమంది ఎంతమందో అన్నది లెక్క చెప్పడం కూడా కష్టమే అలా చనిపోయినవాళ్ళు ఖర్మకొద్దీనో, వాళ్ళ అశ్రద్ధవల్లే ప్రమాదానికి గురై చనిపోయారనో మాట్లాడి దులిపేసుకోవటం, నామమాత్రపు నష్టపరిహారం ఇచ్చి వాళ్ళని ఉద్ధరించినట్లు ఫోజులు పెట్టడం భూస్వాములకు ఆనవాయితీగా వుంది. ఆ ఆనవాయితీని దళిత సుధాకర్ మరణం తిరగరాసింది. 15 సంవత్సరాల వయసు గలిగిన దళిత సుధాకర్ భూస్వామి నారాయణరెడ్డి ఇంట్లో జీతానికి పనిచేస్తున్నాడు. కంటికి కునుకు లేకుండా కరెంట్ కోసం ఎదురుచూస్తూ ఏ అర్ధరాత్రో , అపరాత్రో కరెంట్వస్తే, కాలుకాలు కొట్టుకుంటూ అప్పుడెళ్ళి నీళ్ళు పెట్టాలి. అలా ఒకరోజు రాత్రి నారాయణరెడ్డి తోటలోకి నీళ్ళు పెట్టడానికి వెళ్ళి, కరెంట్ మీటర్ వేస్తున్నపుడు, కరెంట్ షాక్ కొట్టి చనిపోయాడు. ఈ విషయం సంఘం దృష్టికి రాగా, సుధాకర్ తల్లిదండ్రులకు సంఘం అండగా నిలబడింది. సుధాకర్ మరణానికి భూస్వామి బాధ్యతపడాలని, తగిన నష్టపరిహారం ఇవ్వాలనే డిమాండ్లతో పోస్టర్లు వేసి, గ్రామంలో ఊరేగింపు తీశారు. అనంతరం భూస్వామి నారాయణరెడ్డిని పంచాయితీలోకి లాగి నష్టపరిహారం లక్ష రూపాయలు ఇవ్వాలని తీర్పు చెప్పారు. ప్రజా తీర్పు ముందు భూస్వామి మెడలువంచి, లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లించాడు.

## ప్రజాపోరాటాలకు అడ్డుగా నిలుస్తున్న సాయుధ గూండాలకు దేహశుద్ధులు

అనంతపురం జిల్లాలో భూస్వాములు తమ ముఠా ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి ఎదుటి ముఠాపై దాడిచేసి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ తమ దోపిడీ ఆధిపత్యాన్ని కొనసాగించటం ఆనవాయితీ. మన పార్టీ నాయకత్వంలో పీడిత ప్రజలు విప్లవ ప్రజాసంఘాలలో సంఘటితమౌతూ భూస్వామ్య ముఠాల ఆధిపత్యాలకు వ్యతిరేకంగా వర్గ చైతన్యం పెంచు కుంటున్నారు. రెండు ముఠాల వెనుక వున్న పీడిత ప్రజలు మన పార్టీ సంఘాల వెనుక సమీకృతమౌతున్నారు. ఇది సహించలేని భూస్వాములు సాయుధ గూండాలచే ప్రజలపై, సంఘ నాయకులపై దాడులు చేయిస్తున్నారు. వాటికి వెరవక ప్రజల మరింత సంఘటితంగా ప్రతిఘటిస్తున్నారు. అటువంటి సంఘటనలు కొన్ని క్రాంతి పాఠకులకు అందిస్తున్నాం.

రామగిరి దళం ఏరియాలోని కనగానపల్లి మండలం మద్దుల చెరువు గ్రామంలో విప్లవ రైతుకూలీ సంఘం నాయకత్వంలో ప్రజలు సంఘటితంగా కొనసాగిస్తున్న భూపోరాటాలను అడ్డుకోవాలని, భూస్వామి అయిన సూర్య నారాయణరెడ్డి (హైదరాబాదులో కారుబాంబు పేల్చింది ఇతడే) ఆస్తులు కాపాడాలని వాడి సాయుధ గూండాలు సంఘ కార్యకర్తలపై దాడులు చేయటం మొదలు పెట్టారు. ఈ దాడులను నిరసిస్తూ గ్రామంలో సంఘ నాయకత్వంలో బహిరంగ సభ జరుపుతుంటే దాన్ని అడ్డుకున్నారు. ఆ సాయుధ గూండాలను ప్రతిఘటించి తగిన బుద్ధి చెప్పకుండా భూపోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళటం సాధ్యంకాక పోవటంతో, పార్టీ నాయకత్వంలో ప్రజలు ఆ సాయుధ గూండాలకు దేహశుద్ధులు చేయాలని నిర్ణయించుకున్నారు. దళం నేతృత్వంలో 65 మంది మిలిటెంట్లు కదిలి, భూస్వామి గూండా కురుబ పుజ్జనప్పను పట్టుకుని దేహశుద్ధి చేసారు. ఆ రోజు మరో ఇద్దరు గూండాలు శీనప్ప, శివలింగంలు తప్పించుకోగా, 10 రోజుల తర్వాత 30 మంది మిలిటెంట్లు శీనప్పను పట్టుకుని దేహశుద్ధి చేశారు. 200 మంది ప్రజల ముందు గూండాలు తాము చేసిన తప్పులను ఒప్పుకున్నారు. వారి దగ్గరున్న ఆయుధాలు, బాంబులు ఇవ్వాలని ప్రజలు హెచ్చరించారు.

## చంద్రాచర్లలో పెత్తందార్ల సుబ్బయ్యకు దేహశుద్ధి

రామగిరి ఏరియా కనగానపల్లి మండలం చంద్రాచర్ల గ్రామంలో గోపాక, కిష్టా, రామసుబ్బయ్య అనేవాళ్ళు పెత్తందార్లుగా వ్యవహరిస్తూ, ప్రజలకు కంటకంగా మారారు. దొంగతనాలు చేయటం, బలవంతంగా వసూళ్ళు చేయటం, మహిళలపై అత్యాచారాలు చేయటం ఎక్కువై పోయింది. వీరిలో కిష్టా అనేవాడు గతంలో భూస్వాముల ప్రోత్సాహంతో మన సంఘ నాయకుడు కా॥ నాగన్నను హత్య చేశాడు. వీళ్ళని ఎన్నిసార్లు హెచ్చరించినా పద్ధతులు మార్చుకోలేదు. దాంతో, ప్రజల అభీష్టం మేరకు వాళ్ళకు దేహశుద్ధి చేయాలని నిర్ణయించుకుని దళం వెంటరాగా 25 మంది మిలిటెంట్లు కొడవండ్లు, బాంబులతో కదిలి, గూండాల ఇళ్ళకు వెళ్ళి, వాళ్ళను బయటికి లాగి దేహశుద్ధి చేశారు. అయితే, కిష్టిగాడు ఆరోజు దొరకలేదు. వాడికి కూడా త్వరలో ఇదే గతి పడుతుందని హెచ్చరించారు.

## సంఘ నాయకుడిని చంపాలని ప్రయత్నించిన భూస్వామికి దేహశుద్ధి

రామగిరి మండలంలోని కుంటిమద్ది గ్రామంలో భూస్వాములకు, పెత్తందారులకు వ్యతిరేకంగా సంఘం మిలిటెన్సీగా నిలబడి వాళ్ళ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతూ, ప్రజల మద్దతు కూడగడుతూ బలపడుతున్నది.

తమ ఆధిపత్యాన్ని నేలమట్టం చేస్తున్న సంఘాన్ని దెబ్బ తీయాలని గ్రామంలో ఒక ముఠా భూస్వాములు కుట్ర పన్నారు. దాని ప్రకారం తమ ప్రత్యర్ధి ముఠాకు చెందిన వేరుశెనగ కాయలు తగులబెట్టి సంఘంపై నెట్టారు. క్రమంగా ప్రజలకు వాస్తవం అర్థమైంది.

భూస్వాముల తొత్తు అయిన డీలరు శేషు అక్రమాలను అడ్డుకుని ప్రజలు వాడు రాజీనామా చేయాలని ఎం.ఆర్.ఓ. ఆఫీసు ముందు

ధర్నా చేశారు. లంచాలకు, అక్రమాలకు అలవాటు పడిన ఎం.ఆర్.ఓ. పట్టించుకోలేదు. కానీ, ప్రజల్ని కూడగట్టి సంఘం గట్టిగా డిమాండ్ చేయటంతో డీలర్ రాజీనామా చేశాడు. ఈ అక్కసుతో శేషు భూస్వాములతో కలిసి, సంఘ నాయకుడిని చంపించటానికి పథకం వేశారు. తమ గూండాలను పెట్టి సంఘ నాయకుడైన బాబును మాటుగాసి కొట్టారు. చనిపోయాడని భావించి బొంద తవ్వి పూడ్చిపెట్టడానికి తీసుకెళ్తుండగా, మధ్యలో స్పృహ వచ్చి బాబు తప్పించుకుని బయట పడ్డాడు. అనంతరం బాబు పై హత్యా పథకాన్ని ప్రజలకు వివరించి, డీలర్ శేషుకు దేహశుద్ధి చేసారు. మిగిలిన గూండాలను హెచ్చరించారు.

## గ్రామ ఉమ్మడి ఆస్థిని కాజేయాలని ప్రయత్నించిన ఆర్.ఓ.సి. (సురేష్) ముఠా గూండాల ఆటకట్టించిన ప్రజలు

రామగిరి మండలం పేరూరు గ్రామంలో పీపుల్స్‌వార్ భూమిలో 200 వందల చింతమానులు ఉన్నాయి. ప్రతి సం॥రం వేలం వేసి, ఆర్.ఓ.సి. గూండా, గ్రామ సర్పంచ్ అయిన బడగొర్ల ఆంజనేయులు తింటున్నాడు. గత సంవత్సరం మన సంఘం ఆ డబ్బును గ్రామాభివృద్ధికి ఉపయోగించాలనే ఉద్దేశంతో 50 వేల రూ॥లకు వేలం వేసింది. అప్పటికింకా గ్రామంలో మన సంఘం బలహీనంగా ఉండటంవల్ల పోలీసుల అండతో గూండాలు దాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రజలకు ఆ విషయాన్ని అర్థం చేయించటం జరిగింది. క్రమంగా గ్రామంలో బలం పుంజుకొన్న సంఘం తిరిగి ఈ సం॥రం ప్రజలందర్నీ కూడగట్టి, అందరి అభీష్టం మేరకు 30 వేల రూ॥లకు వేలం వేశారు. గత ఏడాది లాగా ఈ ఏడాది కూడా భయపెట్టి తమ అక్రమార్జన కొనసాగించాలని ఆర్.ఓ.సి. ముఠా ప్రయత్నించింది. అయినా ప్రజల పట్టుదల ముందు అవి సాగలేదు. ఏమైనాగానీ, గ్రామ ఉమ్మడికి వేలం డబ్బులు దక్కకుండా చెయ్యాలనే కుట్రతో, చింతకాయలను ఉచితంగా కోసుకోమని చుట్టుప్రక్కల గ్రామాల్లో దండోరా వేశారు. ఫిబ్రవరి 10న తమ ముఠాలోని ప్రజలను 150 మందిని కదిలించి చింతకాయలు తెంపే ప్రయత్నం చేశారు. సంఘ నాయకత్వంలో ప్రజలు వెళ్ళి, తెంపవద్దని నచ్చజెప్పటానికి ప్రయత్నించినా వినలేదు. దాంతో, ప్రజలు ఆగ్రహించి, దానికి నాయకత్వం వహిస్తున్న గూండా రమేష్‌కు దేహశుద్ధి చేసారు. బాంబులు కూడా వేశారు. దాంతో, వాడి వెంట వచ్చిన వాళ్ళు బతుకుజీవుడా అని పారిపోయారు. తర్వాత దీనిపై సంఘం విస్తృతంగా ప్రచారం చేసి, గ్రామ ప్రజలు, ఇతర సంఘాల సహకారం తీసుకుని చింతకాయలు స్వాధీనం చేసుకున్నారు. ప్రజల సంఘటిత శక్తికి బడగొర్ల ఆంజనేయులు తోక ముడిచాడు. వాడి దాడులకు నలిగిన ప్రజలలో ఉత్సాహం పెరిగింది.

## రవి గూండా ఆదెప్పకు దేహశుద్ధి చేసిన సంఘం

రామగిరి మండలం పోతపల్లి గ్రామంలో ఎం.ఎల్.ఏ. పరిటాల రవి ప్రైవేట్ సైన్యం అయిన ఆర్.ఓ.సి. గూండాలు సంఘ కార్యక్రమాలను అడ్డుకుంటూ ప్రజలపై దాడులు చేస్తున్నారు. ఆ పద్ధతులను మానుకోమని హెచ్చరించినా, పెడచెవిన పెట్టడమే కాకుండా 15 మంది ఆర్.ఓ.సి. గూండాలు ఆదెప్ప నాయకత్వంలో దాడిచేసి, సంఘ నాయకులను కొట్టారు. కొడుతున్నపుడు స్త్రీలు, పురుషులు వెళ్ళి అడ్డుకో ప్రయత్నించినా, గూండాల దగ్గర వేటకొడవళ్ళు, బాంబులు వుండటంతో వీలు కాలేదు. ఎన్నిసార్లు హెచ్చరించినా వినకపోవడమేకాక, దాడులు తీవ్రతరం చేయటంతో ఆర్.ఓ.సి. గూండాలకి దేహశుద్ధి చేయాలని సంఘం నిర్ణయించింది. దానికనుగుణంగా మార్చి 9వ తేదీన 20 మంది మిలిటెంట్‌లు కొడవళ్ళు, బాంబులతో సాయుధంగా కదలివెళ్ళి గూండాలలో ముఖ్యుడైన ఆదెప్పను పట్టుకుని దేహశుద్ధి చేసారు.

## విప్లవద్రోహి, అవకాశవాది బండయ్య ముఠాకు దేహశుద్ధి

పెన్న అహోబిళం దళం ఏరియాలో విప్లవద్రోహి, అవకాశవాది బండయ్య మన ఉద్యమాన్ని దెబ్బతీయటానికి భూస్వాములతోటి, ముఠాలతోటి చేతులు కలుపుతున్నాడు. గ్రామాలలో మన సంఘాలను దెబ్బతీయటం కోసం భూస్వామ్య ముఠాలను మన పైకి ఎగదోస్తున్నాడు. సంఘ సభ్యులను నాయకత్వాన్ని కొట్టడం, చంపడంద్వారా మనల్ని బలహీనపర్చాలని చూస్తున్నాడు. అందులో భాగంగా వజ్రకరూరు మండలం పందికుంట గ్రామంలో మన సంఘ నాయకుల్ని హత్య చేశారు. ఆ గ్రామంలోని సంఘనాయకులు కా॥ కుమారస్వామి, నాగరాజు, రామలింగలు బండయ్య ముఠా, స్థానిక పెత్తందారులు, కానల దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితపర్చి పోరాడటంలో ముందు నిలిచారు. సంఘ నాయకుల కృషి వలన ప్రజలలో పూర్తిగా బహిర్గతమైన బండయ్య ముఠా, సంఘ నాయకత్వాన్ని దెబ్బతీసి, ప్రజల్ని భయపెట్టి తన ఉనికిని నిలుపుకోవాలని కుట్రపన్నింది. దాన్లో భాగంగా, మన దళాన్ని కలవడానికి వెళ్తున్న ముగ్గురు సంఘ నాయకులను దారికాచి పట్టుకుని క్రూరంగా చిత్రహింసలు పెట్టి, కాల్చి చంపారు. ఇందులో ప్రధాన పాత్ర రాపలపాడు నీలకంఠారెడ్డిది. వీడితోపాటు శంకర్‌రెడ్డి, తిప్పారెడ్డిలు కూడా ముఖ్యులే. '99 నవంబర్ నెలలో వీళ్ళ ముగ్గురినీ పట్టుకొని, దేహశుద్ధి చేసి, కసువు ఊడిపించడం జరిగింది. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ సంఘటన '99 నవంబర్ నెలలో జరిగింది.

## కోనేపల్లి గ్రామంలో...

పామిడి మండలం కోనేపల్లి గ్రామంలో '90లలో మన సంఘం నాయకత్వంలో పేదలు 7 ఎకరాల భూమిని ఆక్రమించి పంచుకున్నారు. 1991-92లో వచ్చిన నిర్బంధంలో పోలీసుల దాడులలో సంఘ నాయకులు అరెస్టు కావడం, దిగజారడం తదితర కారణాలను ఆసరా చేసుకుని, పేదలు ఆక్రమించిన భూమిని గ్రామంలోని పెత్తందారులైన ఓబయ్య, నారాయణలు ఆక్రమించి, పంటబెడుతున్నారు. కొంత నిర్బంధం సడలడటం వలన, ప్రక్క గ్రామాలలో జరుగుతున్న పోరాటాలను చూసి, తిరిగి పేదలు ఆ భూమిని ఆక్రమించి పంట వేశారు. ఆ పంటను పెత్తందారులు స్వాధీనం చేసుకోవటమే కాకుండా, అడిగినందుకు సంఘ నాయకులను పోలీసుల చేత అరెస్టు చేయించారు. దాంతో, వాళ్ళకు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్న ప్రజలు దళం నేతృత్వంలో ఓబయ్య, నారాయణలకు దేహశుద్ధి చేశారు. దాంతో తప్పుడు కేసులు పెట్టించినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పించి, పంటను స్వాధీనం చేయటానికి వాళ్ళు ఒప్పుకున్నారు.

## ఇన్‌ఫార్మర్‌కు దేహశుద్ధి

రామగిరి దళ ఏరియా కనగానపల్లి మండలం కోనాపురం గ్రామంలో భజనరంగ నాయకులు గతంలో దళసభ్యుడిగా పనిచేశాడు. వ్యక్తిగత బలహీనతలు, కులతత్వంతో, పార్టీ రహస్యాలను చెప్పాడు. అంతటితో ఆగకుండా, తర్వాత కూడా మన సంఘంలోని వ్యక్తులతో స్నేహం నటిస్తూ, మోసపు మాటలతో, వాళ్ళ దగ్గర నుండి సమాచారాన్ని రాబడ్తూ, ఎప్పటికప్పుడు పోలీసులకు అందజేస్తున్నాడు. మరోప్రక్క భూస్వాములతో చేతులు కలిపి సంఘాన్ని దెబ్బతీసే కుట్రకు పాల్పడ్డాడు. దళం, సంఘం మూడుసార్లు అర్థం చేయించినా, ఆపై హెచ్చరించినా, తన పద్ధతులు మార్చుకోలేదు. దీనితో, సంఘ నిర్ణయం మేరకు ఫిబ్రవరి 7న 13 మంది మిలిటెంట్‌లు కలిసి దేహశుద్ధి చేసి, ఇదే పద్ధతి కొనసాగితే పరిణామాలు మరింత తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

## బూటకపు జన్మభూమికి వ్యతిరేకంగా...

ఒకప్రక్క యావత్ ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రపంచబ్యాంక్‌కు, వివిధ సామ్రాజ్యవాదులకు ఫలహారంగా అందిస్తున్న ద్రోహి, విదేశీతొత్తు అయిన చంద్రబాబు, మరోప్రక్క 'జన్మభూమి' పేరుతో హోరెత్తించే ప్రచారంతో ప్రజలను మోసం చేస్తున్నాడు. ఈ జన్మభూమి బూటకత్వాన్ని ఎండగడుతూ, జనవరిలో జరిగిన జన్మభూమి సందర్భంగా రామగిరి దళం ఏరియాలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఏరియాలో గ్రామ గ్రామాన జన్మభూమిని బహిష్కరించమంటూ పోస్టర్లు వేశారు. ప్రతిసారీ 'జన్మభూమి' పేరుతో నాయకులు, అధికారులు గ్రామాలకు రావటంతప్ప, ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నది లేదు. ఈ తతంగం గురించి ప్రజలకు అర్థం చేయించడంతో, జనవరి 3న రామగిరి మండల కేంద్రంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో వచ్చిన, నాయకులను, వి.ఆర్.సి.యస్. నాయకత్వంలో ప్రజలు నిలదీశారు. వాటికి సమాధానాలు చెప్పలేని నాయకులు తోకముడిచారు. అధికారులకు విషయాలు అర్థం చేయించి పంపడం జరిగింది.

## బోగస్ కార్డులకు వ్యతిరేకంగా భూస్వామిని లొంగదీసుకున్న ప్రజలు

కనగానపల్లి మండలం వల్లమడుగుల గ్రామంలో భూస్వామి, టి.డి.పి. జిల్లా నాయకుడు వేపకుంట రాజన్న 12 బోగస్ కార్డులు తన దగ్గిరే వుంచుకుని అవి తనే అమ్ముకుంటున్నాడు. అనేకమంది పేదలు కార్డులు లేకుండా ఇబ్బంది పడుతున్నారు. అర్హులైన వాళ్ళకి రేషన్ కార్డులు ఇవ్వాలని, బోగస్ కార్డులు ఏరివేయాలని డిమాండ్‌చేస్తూ; డీలర్‌కు, ఎం.ఆర్.ఓ.కు విజ్ఞప్తి చేశారు. తన బండారం బైటపడిన రాజన్న కారాలు, మిరియాలు నూరుతూ సంఘం అంతు చూస్తానని హెచ్చరించాడు. అయినా సంఘ సభ్యులు భయపడకుండా, ఇంతటికి తిరిగి విషయాన్ని వివరించి, రాజన్న తన దగ్గరున్న బోగస్ కార్డులను ప్రజలకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేసారు. చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా పోస్టర్లు వేసి ప్రచారం చేసారు. రాజన్న దగ్గర వున్న బోగస్ కార్డులు అర్హులైన పేదవాళ్ళకు ఇచ్చేవరకు డీలర్‌చేత బియ్యం అమ్మకం బంద్ పెట్టించారు. తన ఉనికికి అసలుకే మోసం వస్తుందనుకున్న టి.డి.పి. నాయకుడు రాజన్న ప్రజలకు క్షమాపణలు చెప్పి, తనవద్ద వున్న బోగస్‌కార్డులను సంఘానికి అప్పజెప్పాడు. ఈ పోరాటంలో మహిళలు విస్తృతంగా పాల్గొన్నారు.

## వి.ఏ.ఓ. అక్రమాలని అరికట్టుకున్న ప్రజలు

కనగానపల్లి మండలం మద్దుల చెరువు గ్రామ వి.ఏ.ఓ. నాగిరెడ్డి అవినీతి, అక్రమాలలో ఆరితేరినవాడు. ప్రజలకు భూములిప్పిస్తాననే పేరుతో, వేలకు వేలు డబ్బులు వసూలు చేసాడు. ఒకరు సాగు చేసుకుంటున్న భూమిని ఇంకొకరికి పట్టాలిప్పిస్తూ, ప్రజలమధ్య తగాదాలు పెట్టి పబ్బం గడుపుకొంటున్నాడు. అనేకమంది ప్రజలని ఇప్పుడు పట్టా, అపుడు పట్టా అని మధ్యపెడుతూ మోసం చేస్తున్నాడు. వీటికి వ్యతిరేకంగా సంఘం కార్యక్రమం చేపట్టి, హెచ్చరించింది. దాంతో వాడు సంఘం మీద కక్షగట్టి, అక్రమ కేసులు పెట్టించి పోలీసులతో దాడులు చేయించి ఇండ్లు ధ్వంసం చేయించాడు. ఈ విషయాలపై సంఘం ప్రజలలో ప్రచారంచేసి, ప్రజలని కూడగట్టి, పోస్టర్లు వేసి, ఎవరి భూమి వారికే (సాగుదారునికే) పట్టా ఇవ్వాలని, లంచంగా తీసుకున్న డబ్బులు వాపసు ఇవ్వాలని, అక్రమ కేసులు ఎత్తివేసి ధ్వంసం చేసిన వాటికి నష్టపరిహారం కట్టించాలని డిమాండ్ చేసారు. దీనికి తలొగ్గిన వి.ఏ.ఓ. నాగిరెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పి, అన్ని డిమాండ్లు ఒప్పుకున్నాడు.

కనగానిపల్లి మండలం తగరకుంట గ్రామంలోని ముఠా నాయకుడు ప్రభాకర్ తన కత్తికి ఎదురు లేదనే విధంగా చలాయిస్తున్నాడు. ప్రజలపై దాడులు చేయటం, కాంట్రాక్టు హత్యలు చేయటం, ప్రభుత్వం నుండి ప్రజలకు వచ్చే వనరులను పూర్తిగా స్వాహా చేస్తున్నాడు. ఇదేంటి? అని ప్రశ్నించిన వాళ్ళను వీడి మనుషులు దాడిచేసి కాళ్ళు, చేతులు విరగ్గొట్టి, పగలు కూడా కొడవళ్ళు, తుపాకులు ధరించి తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులను చేయటం నిత్యకృత్యంగా జరుగుతోంది.

మాలపున్నం పండుగరోజు దళిత నారాయణ అనే వృద్ధుడు తాగానికి మామూలు ఇవ్వమని అడిగితే ఒక్క రూపాయి ఇచ్చాడు. దీనికేమి వస్తుందని అడిగినందుకు ప్రభాకర్ ఆ ముసలి అతన్ని ఒకదెబ్బ కొట్టి, తన అనుచరుడు మారుతీచేత మెడబట్టి గెంటించాడు. ''నేనే వెళతాను, ఎందుకు నెడతారు'' అని మాల నారాయణ అడిగినందుకు, ''మాకే ఎదురుచెప్తావా మాలనాకొడకా'' అంటూ కొట్టాడు. ఆ దెబ్బలకు మాల నారాయణ అక్కడికక్కడే చనిపోయాడు. ఇది సంతలో అందరూ చూస్తుండగానే, వందలమంది మధ్యలో జరిగింది. ఈ విషయం పోలీసులకు చెప్పి, కేసుపెడ్తే చంపేస్తానని దళితులను భయపెట్టి, నారాయణ చావుఖర్చుకు 500 రూ॥లు ఇచ్చాడు. భయపడ్డ దళితులు నోరు మెదపక శవదహనం చేసారు. విప్లవ రైతుకూలీ సంఘం నాయకత్వంలో దళితులకు ధైర్యం చెప్పి, ప్రక్క గ్రామాలలోని సంఘాల మద్దతు కూడగట్టుకుని గ్రామంలో బహిరంగసభ పెట్టారు. నారాయణను అన్యాయంగా చంపినందుకు, నారాయణ భార్య కాళ్ళు పట్టుకుని ప్రభాకర్ క్షమాపణ చెప్పాలని, నష్టపరిహారం 50వేల రూ॥లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. తర్వాత వాడి ఇంటికిపోయి హెచ్చరించారు. అప్పటిదాకా తను ఏంచేసినా కిమ్మనకుండా వున్న ప్రజలు, సంఘం అండతో సంఘటిత పోరాటానికి దిగారు. దాంతో వెనక్కి తగ్గిన ప్రభాకర్ ప్రజలకు లొంగివచ్చి, నారాయణ భార్య కాళ్ళు పట్టుకుని

క్షమాపణచెప్పి, 50వేల రూ॥లు నష్ట పరిహారం ఇచ్చాడు.

## ఆర్.ఓ.సి. గూండాలని నిలేసి మద్యం అమ్మకాన్ని బంద్ పెట్టించిన మాదాపురం ప్రజలు

రామగిరి దళం ఏరియాలోని రామగిరి మండలం మాదాపురం గ్రామంలో విప్లవ మహిళా సంఘం ప్రజలందర్నీ కూడగట్టి, ఆ గ్రామంలో సారా, చీప్‌లిక్కర్ అమ్మకాలు లేకుండా చేసారు. సంవత్సరం నుండీ అది అమలవుతూ వుంది. అయితే, ఫిబ్రవరి 2వ తేదీన గ్రామంలో నాయక ప్రదర్శన జరుగుతుంటే, ప్రక్కనే వున్న ససనకోట వాళ్ళు టీ బండి తీసుకొచ్చి అమ్ముకుంటున్నట్లుగా, ఆ ముసుగులో మద్యం అమ్మటం మొదలు పెట్టారు. వీళ్ళు పరిటాల రవి ప్రైవేట్ సైన్యం ఆర్.ఓ.సి.కి చెందిన ఆర్గనైజర్ సూర్యం బంధువులు. ఇది సంఘం దృష్టికి వచ్చి, 'గ్రామంలో మద్యం అమ్మకం బంద్ పెట్టుకున్నాం, మీరిలా తెచ్చి అమ్మడం సరైంది కాదని' చెప్పారు. వాళ్ళు, మేము ఆర్.ఓ.సి.కి చెందినవాళ్ళమని రొమ్ము విరుచుకుంటూ అమ్మకాలు కొనసాగించటం మొదలు పెట్టారు. దాంతో సంఘం వాళ్ళు ఆ సీసాలను పగులగొట్టారు. దాంతో, ఆర్.ఓ.సి. ముఠావాళ్ళు మరుసటి రోజునుండి మాదాపురం వాళ్ళను ససనకోట రాకుండా అడ్డుకున్నారు. దాంతో సంఘం ప్రజల్ని కూడదీసి, దానికి వ్యతిరేకంగా, రవి ముఠా వాళ్ళను మద్యం అమ్మకుండా వ్యతిరేకించినందుకు ఈ విధంగా చేస్తున్నారనే విషయాన్ని ఎండగడుతూ, నిరసనగా ర్యాలీ చేయాలని నిర్ణయించుకున్నారు. 300 మందికి పైగా ప్రజలు నిరసన ర్యాలీకి సిద్ధమై, బయల్దేరుతుండగా, ప్రజల్లో మరింతగా భ్రష్టుపడతాం అనే భయంతో, పరిటాల రవి ముఠా వాళ్ళు దిగివచ్చి ప్రజలకు క్షమాపణ చెప్పారు. ప్రజల్ని గ్రామంలోకి రానివ్వక పోవటం తప్పేనని, అలాగే, ఇకనుండి మద్యం తీసుకురాము అని ప్రజలకు క్షమాపణ చెప్పారు.

## వర్క్ డే

పార్టీని ఆర్థికంగా ఆదుకోవాలని పార్టీ పిలుపునివ్వటంతో, రామగిరి ఏరియాలో సంఘాల నాయకత్వంలో వర్క్‌డేలు నిర్వహించి, ప్రతి ఏడాది ఫండ్ ఇస్తున్నారు. ఈ సంవత్సరం కూడా పేరూరు డ్యాం గ్రామ విప్లవ రైతుకూలీ సంఘం, మహిళా సంఘాల నాయకత్వంలో 30 మంది కూలికిపోయి ఒక్కరోజు చింతకాయలు తెంపగా వచ్చిన కూలి డబ్బులు 1000 రూ॥లను, దుబ్బర్లపల్లి విప్లవ రైతుకూలీ సంఘం నాయకత్వంలో 20 మంది, వేరుశెనగ కట్టె మిషన్‌కు వేయగా వచ్చిన ఒకరోజు కూలి 900 రూ॥లను, వేపచెర్ల సంఘం నాయకత్వంలో ఒకరోజు పనిచేసి, వచ్చిన 700 రూ॥లను పార్టీ నిధికి ఇచ్చారు.

అనంతపురం జిల్లాలో వర్గ పోరాటం తీవ్రమవుతున్న క్రమంలో ప్రజలు భూస్వాముల పట్టాభూములు ఆక్రమించటం కొనసాగిస్తూ తరతరాలుగా వూడలు దిగిన భూస్వామ్యం వేళ్ళను పెకలించటం ప్రారంభించారు. ఇంకోప్రక్క, ముఠా నాయకుల ఆధిపత్యాలకు వ్యతిరేకంగా, సంఘాల వెనుక సంఘటితమై, ప్రజలు ముఠా నాయకుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా మిలిటెంట్‌గా పోరాడుతున్నారు. తమ ఆధిపత్యాన్ని ఎలాగైనా కొనసాగించాలని సాయుధ ముఠా నాయకులు సంఘాలపై, ప్రజలపై దాడులుచేసి, భయపెట్టి లొంగదీసుకోవాలనే విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవంక, భూస్వామ్య ఆధిపత్యం నిలబెట్టడం కోసం చంద్రబాబు ప్రభుత్వం పోలీసుల ద్వారా దళాలను భౌతికంగా నిర్మూలించాలనే లక్ష్యంతో రాత్రింబవళ్ళు ఒక్కొక్క ఏరియాలో 3 బ్యాచ్‌లుగా కూంబింగ్ చేయిస్తూ, వైర్‌లెస్ ద్వారా సమన్వయం చేసుకుంటున్నది. హంతక చంద్రబాబు, దొరల పోలీసుముఠా దారులు కాయటం, గ్రామంచుట్టూ మాటు కాయడం, అన్నలమని చెప్పి నమ్మించే ప్రయత్నం చేయడం, సంఘ నాయకులను అరెస్టుచేసి, అర్థనగ్నంగా గ్రామాలలో ఊరేగించి ప్రజల ముందే తీవ్రంగా కొడ్తూ, సంఘాలలో ఎవరు చేరినా ఇదే గతి పడుతుందని హెచ్చరిస్తున్నారు.

## ఇన్ఫార్మర్లపై చర్యలు

దళాల ఆచూకీ కోసం, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్, మరోమాటలో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రజా వ్యతిరేకులను, సంఘ వ్యతిరేకులను ఇన్‌ఫార్మర్లుగా మార్చుకుంటున్నారు. సంఘ నాయకులను భయపెట్టి బలవంతంగా తమకనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇన్‌ఫార్మర్లుగా మారినవాళ్ళకు దండిగా డబ్బులు ఇస్తూ, రహస్యంగా సమాచారం ఇవ్వండి అంటూ వాకీటాకీలు కూడా ఇస్తున్నారు. కొందరు ఇన్‌ఫార్మర్లకు బైకులు, తుపాకులు ఇచ్చి దళాల సమాచారం సేకరించమని పంపుతున్నారు. దళాలు తీసుకోవలసిన ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, శత్రువు విస్తృతంగా ఏర్పాటు చేసుకున్న ఇన్‌ఫార్మర్ల నెట్‌వర్క్ వలన, ఏ చిన్న పొరపాటు చేసినా దెబ్బతినే పరిస్థితి ఉత్పన్నమైంది. జిల్లాలో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకు పోవాలంటే, శత్రువు ఏర్పాటు చేసుకుంటున్న ఇన్‌ఫార్మర్ల యంత్రాంగాన్ని దెబ్బతీయకుండా సాధ్యంకాని పరిస్థితి ఏర్పడింది. అందువలన, పోరాటంలో భాగంగా ఇన్‌ఫార్మర్ల యంత్రాంగాన్ని దెబ్బతీసే చర్యలు కూడా చేపట్టడం జరిగింది. వాటిలో కొన్ని....

## కా॥ నిర్మల హత్యకు కారకుడైన ఇన్‌ఫార్మర్ ఖతం

కూడేరు మండలం అముచ్చాపల్లి గ్రామంలో 1998 మార్చి 28తేదీన ఒక రైతు ఇంట్లో పెన్న అహోబిళం దళం షెల్టర్ తీసుకోగా, ఆ విషయం తెలుసుకున్న పోలీస్ ఇన్‌ఫార్మర్ కొర్రకాళ్ళ కేశవరావు పోలీసులకు సమాచారమిచ్చాడు. ఆ సమాచారంతో షెల్టర్‌పై పోలీసులు దాడిచేయగా, ఇద్దరు కామ్రేడ్స్ తప్పించుకోగా, కా॥ నిర్మల పోలీసులకు చిక్కి హత్య చేయబడింది. అప్పటినుండి, మరింత చురుకుగా ఇన్‌ఫార్మర్‌గిరీ వెలగబెడుతూ, పోలీసులకు దళం, సంఘ నాయకుల సమాచారం అందిస్తూ, కూంబింగ్ ఆపరేషన్లలో కూడా తోడుగా పాల్గొంటున్నాడు. దళం వీడు పోలీస్ ఇన్‌ఫార్మర్ అని ఏరియాలో విస్తృతంగా ప్రచారం చేసింది. దాంతో, ఎస్.పి. విర్.ఆర్.కె. మోహనరావు వీడిని అనంతపురంలోనే వుంచి, పోలీస్ కానిస్టేబుల్‌గా తీసుకోవటానికి ఏర్పాట్లు చేశాడు. ప్రజాద్రోహి, పోలీస్ ఇన్‌ఫార్మర్ అయిన వీడిని చంపాలని నిర్ణయించి, అందుకోసం ఒక ప్రత్యేక దళంను ఏర్పాటు చేసింది. '99 డిసెంబర్ 22న వీడిని, అనంతపురంలో వాడు కాపురముంటున్న ఇంటివద్దే దళం ఖతం చేసింది. తర్వాత ఇన్‌ఫార్మర్లందరికీ ఇదే హెచ్చరిక అని కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు.

కూడేరు మండలం మరుట్ల మూడవ కాలనీకి చెందిన ఏకిల

నారాయణ కుటుంబం గ్రామంలో పెత్తందారులుగా చెలాయిస్తూ, బండయ్య ముఠాతో సంబంధాలలో వుంటూ, ప్రజలపై దాడులు చేస్తున్నారు. వీళ్ళు గ్రామంలో చేస్తున్న ఆకృత్యాలని ప్రశ్నిస్తున్న మన సంఘ నాయకులపై బండయ్య ముఠాతో దాడి చేయించటంతోపాటు, పోలీసుల చేత అరెస్టులు చేయించి తీవ్రంగా చిత్రహింసలు పెట్టించారు. అంతేకాక, పోలీసు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తూ, దళాన్ని దెబ్బతీయటానికి కూడా ప్రయత్నం చేస్తున్నారు. ఈ పద్ధతులను మానుకోమని హెచ్చరించినా మానుకోక పోవటంతో, '99 ఆగస్టు 21న ఏకిల నారాయణకు దేహశుద్ధి చేయటం జరిగింది. అయితే, ఆ దెబ్బలకు వాడు చనిపోయాడు.

గార్లదిన్నె మండలం పెనకచర్ల గ్రామంలో సి.పి.ఐ. పార్టీకి చెందిన నాగమ్మ అనే ఆమె గ్రామంలో లిటిగెంట్‌గా వ్యవహరిస్తున్నది. పంచాయితీలు చేస్తూ ప్రజల మధ్య తగాదాలు పెంచడం, పోలీసులతో సంబంధాలలో వుంటూ తన వద్ద పరిష్కారం కాని సమస్యలను పోలీసుల దగ్గరకు తీసుకెళ్ళి పరిష్కరించటం చేస్తుంది. అంతేగాక, పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా కూడా పనిచేస్తూ, సంఘ నాయకుల వివరాలు పోలీసులకు అందజేసి, వాళ్ళ అరెస్టులకు కారణమైంది. 2, 3 సార్లు హెచ్చరించినా తన పద్ధతులు మార్చుకోక పోవడంతో విప్లవ మహిళా సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో బహిరంగ సభ పెట్టి, ప్రజల సమక్షంలో నాగమ్మకు మహిళలు దేహశుద్ధి చేశారు.

## సంఘనాయకుడిని విడిపించుకున్న ప్రజలు

గార్లదిన్నె మండలం ఎర్రగుంట్ల గ్రామంలో సంఘ నాయకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వెంటనే సంఘం నాయకత్వంలో ప్రజలు కదిలి, సంఘ నాయకుడి అరెస్టుకు కారణమైన స్థానిక భూస్వామి తోటలోని మోటార్లు ధ్వంసంచేసి, సంఘ నాయకుడిని విడిపించాలని డిమాండ్ చేశారు. అక్కడనుండి పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి సంఘ నాయకుడిని వదలాలని డిమాండ్ చేశారు. దాంతో, పోలీసులు సంఘనాయకుడిని విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ముకుందాపురం సంఘం కూడా పాల్గొంది.

# అమరవీరుల జీవిత చరిత్రలు

మెదక్ జిల్లాలో మన పార్టీ నాయకత్వాన బలపడుతున్న విప్లవోద్యమాన్ని అణచి వెయ్యటానికి పెద్ద ఎత్తున దాడులు చేస్తూ, ఇన్‌ఫార్మర్ల సహాయంతో దళాల ఆచూకీ తెలుసుకొని హత్యాకాండ కొనసాగిస్తున్నది. '97లో రాష్ట్ర ప్రభుత్వం మన ఉద్యమంపై 'మరో దాడి' మొదలుపెట్టిన దగ్గరనుండీ, అనేక ఎన్‌కౌంటర్లలో మన దళాలను కొన్నిటిని మొత్తంగా దెబ్బతీయ గలిగింది. జరుగుతున్న నష్టాలను సమీక్షించుకుంటూ, గుణపాఠాలను తీసుకొని, అవసరమైన పద్ధతులు రూపొందించుకుంటూ, ఒక్కొక్కటిగా దెబ్బతిన్న దళాలను పునర్నిర్మించుకుంటూ, ఉద్యమం ముందుకు పోతూనే వుంది. జిల్లాలో బీభత్స వాతావరణాన్ని పోలీసులు సృష్టించినా, అప్పటిదాకా తమకు మార్గదర్శకంగా వున్న దళాలు దెబ్బతినిపోయినా, గ్రామాల్లోని సంఘ నాయకత్వం, సభ్యులు, మిలిటెంట్స్ ఏ మాత్రం వెరవకుండా, తిరిగి పార్టీతో సంబంధాలు నెలకొల్పుకుంటూ, తమ తమ గ్రామాల్లో, ఏరియాల్లో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. ఉద్యమంలో కీలక పాత్ర వహిస్తున్నారు. ప్రజలకు, మనకు సజీవ వారధిగా వున్న, వీళ్ళను హత్య చేయటం ద్వారా, ఉద్యమాన్ని మరింత దెబ్బతీయాలని కుట్రలు పన్ని, పాశవిక పథకాలు అమలు చేస్తోంది. సంఘ నాయకత్వాన్ని, మిలిటెంట్స్‌ను పట్టుకెళ్ళి కాల్చి చంపి, 'ఎన్‌కౌంటర్' అని మిగిలిన ప్రాంతాల్లో పోలీసులు కట్టుకథలు చెప్తుండగా, ఇక్కడ పోలీసులు మరింత ఫాసిస్టు పద్ధతి అమలు చేస్తున్నారు. ఇన్‌ఫార్మర్లను, లంపెన్సను, పెత్తందార్లను, భూస్వాములను ప్రోత్సహిస్తూ, గ్రామాల్లో మన సంఘ నాయకత్వాన్ని, మిలిటెంట్స్‌ను వాళ్ళ చేత హత్య చేయిస్తూ, పీపుల్స్‌వార్ మిలిటెంట్లను ప్రజలే తిరగబడి చంపుతున్నారని అబద్ధపు ప్రచారాలు చేస్తూ, ప్రజల్ని ముఖ్యంగా బయటి ప్రపంచాన్ని, నమ్మించ (వంచింప) చూస్తున్నారు. కానీ, స్థానిక ప్రజలు ఈ గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొడుతూ, తమ ముద్దుబిడ్డల శవాలను స్వాధీనం చేసుకొని, ఊరేగింపులు తీస్తూ, సంస్మరణ సభలు జరుపుతూ వారి ఆశయాలను కొనసాగిస్తామని శపథాలు చేస్తున్నారు. అలా చంపబడిన కా॥ డప్పు మల్లేశం, కా॥ లక్ష్మీ నారాయణల జీవిత చరిత్రలు కింద ఇస్తున్నాం. వాళ్ళ త్యాగం మనకు నిత్యం స్ఫూర్తిదాయకంగానే వుంటుంది.

## కా॥ డప్పు మల్లేశం

కా॥ మల్లేశం మిర్‌దొడ్డి మండలం గుడికందుల గ్రామంలో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించాడు. ఇంటర్ వరకు చదివి పేదరికంవల్ల విద్యాభ్యాసం మానుకొని విప్లవోద్యమం వైపు ఆకర్షితుడై రాడికల్ యువజన సంఘంలో చేరాడు. గ్రామ యూత్‌క్లబ్‌ను చురుకుగా నడిపిస్తూ ప్రతి సం॥రం క్రీడలను నిర్వహించేవాడు. యువకులను సమీకరించి రోడ్లు, బజార్లలో గుంతలు, నిరుపయోగంగా వున్న పాత బావులను శ్రమదానం ద్వారా పూడ్చి గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దేవాడు. భూస్వాముల, సంఘ వ్యతిరేకుల ఆటలు కట్టించాడు. రాడికల్ యువజన సంఘాలను, రైతుకూలీ సంఘాలను మార్చడం వలన రైతుకూలీ సంఘంలో చురుకుగా పనిచేస్తూ వ్యవసాయ కూలీల, నిరుపేదల సంఘటితపర్చి కూలీలు, జీతాల పెరుగుదల కోసం పోరాటాలు నిర్వహించాడు. భూస్వాములు ఎల్లాగౌడ్, బాల బైరాగౌడ్, రామిరెడ్డిల భూములు దున్నియ్యడానికి సన్నద్ధపర్చాడు. ఈ క్రమంలో పార్టీ సభ్యుడిగా ఎదిగి పార్టీ కార్యకలాపాలను విస్తృత పర్చడానికి గ్రామాలకు తరలండి క్యాంపెయిన్‌లో పాల్గొన్నాడు. శత్రు నిర్బంధాన్ని అధిగమిస్తూ కుటుంబ బంధనాలను తెంచుకొని సంఘం కోసం పూర్తి టైంను కేటాయించాడు. 1998 జనవరిలో జరిగిన జిల్లా మిలటరీ క్యాంపులో పాల్గొని రక్షణ తదితర కార్యకలాపాలు చురుకుగా పాల్గొన్నాడు. తన సహచరులు, నాయకుడు లొంగిపోయినా మొక్కవోని ధైర్యంతో పోరాడాడు. సీతారాంపల్లి ఎన్‌కౌంటర్లో గెరిల్లా దళ కామ్రేడ్స్ అమరులు కాగా ఎన్‌కౌంటర్‌కు నిరసనగా యాక్టివిస్టులను కూడగట్టి భూస్వామి అధికార తెలుగుదేశం పార్టీ నాయకుడు, సిద్దిపేట మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ యం. శ్రీనివాసరెడ్డి రైస్‌మిల్‌ను పేల్చి వేశాడు. విప్లవోద్యమ నిర్మాణం కోసం దళంలో పనిచేస్తానని ప్రతిపాదన పెట్టాడు. తన గ్రామాన్ని గిరాయిపల్లి దళం పరిధిలోకి కలుపుగా చురుకుగా కార్యకలాపాలు నిర్వహించాడు. '99లో జరిగిన ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్ నిర్వహించడానికి సి.సి. సర్క్యులర్‌ను, వ్యూహం-ఎత్తుగడలు, టెక్నికల్ జాగ్రత్తలు అనే అంశాలపై జరిగిన 3 రోజుల రాజకీయ తరగతులలో చురుకుగా పాల్గొన్నాడు. తీవ్ర నిర్బంధంలో ఎన్నికలు బహిష్కరించాలంటూ

గ్రామంలో వాల్‌పోస్టర్లు, రైటింగ్ చేయించాడు. బహిష్కరణ క్యాంపెయిన్‌లో చురుకుగా పాల్గొన్నాడు. గిరాయిపల్లి విప్లవ రైతుకూలీ సంఘంలో కార్యదర్శి అయ్యాడు.

సంఘంలో యాక్టివ్‌గా పనిచేస్తూనే స్వార్థ రాజకీయాల కోసం, భూస్వాముల పంచన చేరి, అరాచకాలకు పాల్పడుతుండే కుర్మయాదయ్యను సంఘం నుండి బహిష్కరించాడు. దీంతో సంఘాన్ని తమ గుప్పిట్లో ఉంచుకోవాలనుకున్న భూస్వాముల పాచకలు పారకపోవడంతో సంఘాన్ని లేకుండా చేయాలని కుట్రపన్ని అవకాశవాది అయిన అయిలయ్య, పెత్తందారు బైరెడ్డి, తాగుబోతు ముత్యంరెడ్డితో పాటు మరో 7 గురు పోలీసులతో కుమ్మక్కయి, నవజ్యోతి మహిళామండలి వాళ్ళను కలుపుకొని భూస్వాముల భూములలో పాతిన జెండాను పీకివేసి, బూటకపు స్వాతంత్ర్య దినాన్ని నిరసిస్తూ పాతిన నల్లజెండాలను పీకివేసి మహిళామండలిని ముందుకు నెట్టారు. ఈ విషయాన్ని మహిళామండలి వాళ్ళతో సామరస్యంగా మాట్లాడుతున్న కా॥ మల్లేశం, నర్సింహులను, బెస్త లక్ష్మి నారాయణ, ఆనందం, నర్సింహారెడ్డి, బైల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, ఐలయ్యలు వెనుకనుండి దాడిచేసి తలపై తీవ్రంగా కొట్టి పోలీసులకు కబురు చేసారు. పోలీసులు సివిల్ డ్రస్‌లో వచ్చి, జనశక్తి జిందాబాద్ అని నినాదాలు చేస్తూ, రాళ్ళతో క్రూరంగా కొట్టి కా॥ డప్పు మల్లేశంను హత్య చేసారు.

## కా॥ లక్ష్మీనారాయణ

కా॥ లక్ష్మి నారాయణ దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలో నిరుపేద గౌడ కుటుంబంలో జన్మించాడు. విప్లవోద్యమ ప్రభావంతో తను 1996లో విప్లవ రైతుకూలీ సంఘంలో చేరాడు. తలలు పండిన సంఘ నాయకత్వం స్వార్థంతో అవకాశవాద రాజకీయాలను కొనసాగిస్తుంటే వ్యతిరేకించాడు. గ్రామ పెత్తందార్ల, సంఘ వ్యతిరేకుల, ప్రజా వ్యతిరేకుల కార్యకలాపాలను ఎండగట్టాడు. నిస్వార్థంగా రైతుకూలీల, యువజనుల, మహిళలను కూడగట్టి ప్రజాసంఘాల నిర్మాణాలను చేశాడు. ప్రజలను సంఘటితపర్చి రోడ్లు, స్కూలు నిర్మాణం మొదలగు అభివృద్ధి కార్యక్రమాలను నాయకత్వం వహించి చంద్రబాబు నాయుడి జన్మభూమి జిమ్మిక్కులను బహిర్గత పర్చాడు. ఈ క్రమంలో పెరిగిన నిర్బంధంవల్ల కుటుంబ బంధనాలను తెంచుకొని పూర్తికాలం కార్యకర్తగా సంఘ నిర్మాణాలు గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు టైమును కేటాయించాడు. పోలీసులు లక్ష్మి నారాయణను లొంగి పోవాలని అనేకసార్లు పత్రికా ప్రకటనలు ఇచ్చారు. తన తండ్రితో ఇప్పించారు. కుటుంబంమీద అనేక సార్లు దాడులు చేసి ఆస్తులు ధ్వంసం చేశారు. కుటుంబ సభ్యులను కొట్టారు. పోలీసు నిర్బంధానికి సవాల్ చేస్తూ అనేకసార్లు వెంట్రుక వాసిలో తప్పించుకున్నాడు. సీతారాంపల్లి ఎన్‌కౌంటర్‌లో తమ రైతాంగ గెరిల్లా దళ కామ్రేడ్స్ అమరులైనా, మరింత కసితో పార్టీ కార్యకలాపాలను కొనసాగించాడు. ఎలాగయినా లక్ష్మి నారాయణను అంతమొందించాలనుకున్న పోలీసులు కుట్రలుపన్ని తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటూ నమ్మించి మోసం చేశారు. లక్ష్మి నారాయణను అరెస్టు చేసిన మఫ్టీ పోలీసులు తీవ్ర చిత్రహింసలు పెట్టి కాల్చి చంపి హెడ్ కానిస్టేబుల్ దగ్గర పిస్టల్ గుంజుకొని కాల్పులు జరపగా ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపగా చనిపోయినట్టు కట్టుకథ అల్లారు. ఎన్నికల బహిష్కరణను విఫలం చేయాలన్న కుట్రలో భాగంగా స్థానిక యం.యల్.ఏ. సి.హెచ్. ముత్యంరెడ్డి, సి.ఐ.సీతారాంలు కా॥ లక్ష్మి నారాయణను పొట్టన పెట్టుకున్నారు.

**ఉప్పెనలా ఎగిసిన జనసముద్రం :** కా॥ లక్ష్మి నారాయణ మరణవార్త విన్న వందలాది ప్రజలు గ్రామంలో బంద్‌ను పాటించారు. శవాన్ని స్వాధీనం చేసుకొని పెద్ద ఎత్తున ఊరేగింపు తీస్తూ, బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించారు. అమరుల ఆశయాలను కొనసాగిస్తామని శపథం చేశారు. ఊరేగింపును చెదరగొట్టడానికి పోలీసులు లాఠీ చార్జీ చేసి, గాలిలోకి కాల్పులు జరిపితే, ప్రజలు పోలీసులకు రాళ్ళు, చెప్పులతో సమాధానం చెప్పారు.

## ప్రజల కోసం ప్రాణాలర్పించిన కా॥ చంద్రమౌళి (లచ్చన్న)కు విప్లవ జోహార్లు!

ఓపిక, వర్గకసి, ఎదగాలనే తపన, ప్రజల కోసం పనిచేయాలనే పట్టుదల కలగలసి కా॥ లచ్చన్న. కా॥ లచ్చన్న (చంద్రమౌళి) మహబూబ్‌నగర్ జిల్లా, అమ్రాబాద్ మండలం, కద్మలోనిపల్లి గ్రామంలో జన్మించాడు. దోపిడీ, అన్యాయాలను చూసి, ఎదిరించి వర్గ పోరాటంలో భాగమై ఉద్యమంలో కొనసాగుతున్న క్రమంలో 19వ తేది (జనవరి 2000) నాడు ప్రమాదవశాత్తు వేటకోసం వేసిన కరెంటుతీగకు తగిలి తోటి కా॥ హరి (సుధాకర్ రెడ్డి)తో పాటు అమరుడైనాడు.

కా॥ చంద్రమౌళికి చిన్నప్పుడే పెళ్లి అయి ముగ్గురు పిల్లలు వున్నారు. వ్యవసాయం చేసుకుంటూ, అడవిలోని కట్టెలను నరికితెచ్చి అమ్ముకొని కుటుంబాన్ని పోషించేవాడు. ఏరియాలో జరుగుతున్న ప్రజా పోరాటాలకు ఆకర్షితుడై 1994లో సంఘంలో చేరి కూలీ, జీతాల, తునికాకు రేట్ల పెంపుదల పోరాటాలలో చురుకుగా పాల్గొన్నాడు. ప్రజలను కదిలించి అడవి, భూస్వాముల భూముల ఆక్రమణ పోరాటాలకు నాయకత్వం వహించాడు. 1996లో పార్టీ సభ్యుడై 3 గ్రామాలను కలిపి ఏర్పాటు చేసిన సెల్‌లో మెంబరయినాడు. ఏరియా రైతుకూలీ సంఘంలో కార్యవర్గ సభ్యుడుగా ఎన్నుకోబడ్డాడు. పోలీసు ఇన్‌ఫార్మర్లకు దేహశుద్ధి చేయడంలో, దళం నిర్వహించిన యాక్షన్‌లలో చురుకుగా పాల్గొన్నాడు. 1996లో ఏరియాలో శత్రువు సీరియస్‌గా నిర్బంధం తీసుకువచ్చి అరెస్టులు కొనసాగిస్తున్న క్రమంలో, తోటి సంఘ సభ్యుల, కుటుంబ వత్తిడి మేరకు పోలీసులకు లొంగిపోయినాడు. జైలులో తాను చేసిన పొరపాటును సీరియస్‌గా ఆత్మవిమర్శ చేసుకొని విడుదలయిన వెంటనే పార్టీతో సంబంధాలు పెట్టుకొని, గ్రామంలో యువకులను కూడగట్టి సంఘాన్ని ఏర్పాటు చేసి సంఘ నాయకుడైనాడు. గ్రామంలో భూమిలేని పేదవారిని కూడగట్టి సంఘాన్ని ఏర్పాటుచేసి సంఘ నాయకుడైనాడు. గ్రామంలో భూమిలేని పేదవారిని కూడగట్టి దేవాలయ మరియు భూస్వామి చెన్నారెడ్డి భూములను ఆక్రమించడంలో ప్రజలకు నాయకత్వం వహించాడు. గ్రామంలో పెత్తందారీ అయిన యం.పి.టి.సి.కి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి వాడి మోసాన్ని బయటపెట్టాడు. గ్రామం పేరుమీద వస్తున్న పనులను కాంట్రాక్టరు, దళారీలు కాంట్రాక్టుపట్టి కూలీలను మోసం చేసి డబ్బులు దండుకోవడాన్ని అడ్డుకొని, గ్రామం పేరుమీద వచ్చిన పనులను ప్రజలు సమిష్టిగా చేసుకొని, మిగిలిన డబ్బులను గ్రామ అభివృద్ధికి ఖర్చు చేయించడంలో చురుకైన పాత్ర నిర్వహించాడు. గ్రామంలో పంచాయితీ కమిటీని

ఏర్పాటు చేసి ప్రజా పంచాయితీల ద్వారా కోర్టులలో, పోలీసు స్టేషన్‌లలో సామాన్య మానవుడికి దొరకని న్యాయాన్ని అందించాడు. పత్తిరేట్ల పెంపుదల పోరాటంలో ప్రజలను కదిలించి ప్రత్తి వ్యాపారుల, వడ్డీ షావుకార్ల మెడలు వంచాడు.

శత్రువు తీసుకువచ్చిన నిర్బంధానికి జడవక గ్రామంలోనే రహస్యంగా వుంటూ, చుట్టుప్రక్కల గ్రామాల యువకులను, రైతులను కలిసి పార్టీ పరిచయాలు పెంచాడు. తాను పూర్తి కాలం ప్రజల కోసం పనిచేయడం కోసం 1998 ఆగస్టులో దళసభ్యునిగా రిక్రూట్ అయినాడు. తాను వచ్చిన కొత్తలోనే వటువర్లపల్లి దగ్గర దళంపై జరిగిన ఎన్‌కౌంటర్‌లో తన ఆయుధం ఫైర్ కాకున్నా గందరగోళపడకుండా దళంతో పాటు రిట్రీట్ అయినాడు. తన కుటుంబంపై శత్రువు వత్తిడి తెచ్చినా, తన కుటుంబం అనే ఆలోచన మదిలో రానివ్వలేదు. తన సొంత గ్రామానికి దళం పోయినా కుటుంబాన్ని కలువకుండా మొదట పార్టీ పనికి ప్రాముఖ్యత నిచ్చేవాడు. తనకు చదువు రాకపోయినా, తనకు తెలిసిన మేరకు, అలాగే ఇతర కామ్రేడ్స్ మాట్లాడుతున్నప్పుడు విన్న రాజకీయాలను తనదైన రైతు భాషలో ప్రజలకు చెప్పేవాడు. చదువు నేర్చుకోవాలని, రాజకీయంగా ఎదగాలనే పట్టుదలతో నిరంతరం కృషి చేసేవాడు. చొరవతో ప్రజలలోకి వెళ్లి వారి కష్టాలను, బాధలను తెలుసుకుంటూ, ప్రజల నోళ్ళల్లో లచ్చన్నగా నిలిచిపోయాడు. ఎంత ఇబ్బంది అయినా దళ సమిష్టి పనికి అడ్డంకి కాకుండా తన బాధ్యతలను, తనకు అప్పజెప్పిన పనులను పూర్తి చేసేవాడు. అన్నింట్లో ముందు వుండాలనే తపన, ఎదగాలనే పట్టుదల, నిరంతర కృషి కనబర్చేవాడు. ఈ క్రమంలోనే 2000 జనవరి 19వ తేదీన రాత్రి పార్టీ పనిమీద బయటకు వెళ్తున్న కామ్రేడ్‌ను ప్రక్క గ్రామంలో పడుకోబెట్టి వస్తున్న క్రమంలో వేటకోసం వేసిన కరెంటు తీగకు తగిలి ప్రమాదవశాత్తు అమరుడైనాడు. దళ జీవితం తక్కువ కాలమే అయినా ప్రజల్లో, దళ సభ్యుల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు. దళంతోటి కామ్రేడ్స్‌తో కలగలసిపోతూ, అందరి కష్టాల్లో పాలుపంచుకుని ఆదర్శ గెరిల్లాగా నిలిచిపోయాడు. ఆ కామ్రేడ్‌కు వినమ్రంగా జోహార్లు అర్పిస్తూ, ఆ కామ్రేడ్ యొక్క ఆశయాలను ముందుకు తీసుకుపోదామని శపథం చేద్దాం! ❑

---

( 58వ పేజీ తరువాయి.....)

సంఘర్షణను అంటే బూర్జువాలకి కార్మికులకు మధ్య వుండే ఘర్షణని పరిష్కరించటంలో ఉదార రాజ్యం విఫలమైందని మార్క్స్ సిద్ధాంతీకరించాడు. బూర్జువా సమాజంలో మానవులందరి మౌలిక సమస్యలు, డిమాండ్లు తీరడం, నెరవేరడం సాధ్యంకాదని, కార్మికులను, పెట్టుబడి దోపిడీ చేస్తుండటంవల్ల కార్మికులు తమ శ్రమకు, తమ ఉత్పత్తికి, తమ జీవితాలకు కూడా దూరమైపోయి పరాయీకరింపబడతారని; అందుకే పెట్టుబడిదారులూ, కార్మికులు అనే రెండు ప్రధాన వర్గాలూ ప్రపంచంలో వున్నంతవరకూ సమాజంలో మానవుల అవసరాలూ, కోరికలూ తీరవని మార్క్స్ ప్రతిపాదించాడు. కార్మికవర్గం విజయం సాధించి విశ్వవ్యాప్తంగా కమ్యూనిస్టు వ్యవస్థ నెలకొల్పటంతో ఇక వర్గాల మధ్య పోరాటమున్నది ముగుస్తుందని; వర్గ విభేదాలూ, వర్గ వ్యత్యాసాలూ లేకుండా, అసలు వర్గాలే లేకుండా మనుషులను నిజమైన పరిపూర్ణ మానవులుగా తీర్చిదిద్దే కమ్యూనిస్టు సమాజంతోనే చరిత్ర అంతిమలక్ష్యం సాధ్యమవుతుందని అదే 'చరిత్రకు అంత'మని మార్క్స్ ప్రకటించాడు.

చరిత్రకు అంతం అంటే చరిత్రే లేకుండా పోతుందనో, మానవ సమాజం, దాని చరిత్రా అంతరించి పోతాయనో అర్థంకాదు. ఇన్నివేల సం॥లుగా మానవ సమాజం తన ముందు నిర్ధేశించుకున్న లక్ష్యాలు పరిపూర్తి అవుతాయని, మానవులు గత సమాజాల నుండి ఎదుర్కొంటూ వస్తున్న సమస్యలూ, వైరుధ్యాలూ, సంఘర్షణలూ అన్నీ అంతిమ పరిష్కారాన్ని పొందుతాయని, దీనర్థం. సమాజంలో భిన్నవర్గాల మధ్య వైరుధ్యాలు సంఘర్షించే క్రమం అంతిమంగా ముగిసిపోయి ప్రకృతికి, మానవజాతికి మధ్య వైరుధ్యాలు కొనసాగుతూ, మానవులు ప్రకృతిని సంపూర్ణంగా వినియోగించుకొనే క్రమం మొదలవుతుందని దీనర్థం. మనిషి ప్రకృతిని జయించటంకాక ప్రకృతి సూత్రాలను పరిపూర్ణ స్థాయిలో అర్థం చేసుకుని, ఉపయోగించుకుంటారని, ప్రకృతివిధ్వంసం చేయటంకాక దాన్ని సంరక్షిస్తూ, పునర్నవీకరిస్తూ, నూతన ప్రకృతులను ఆవిష్కరిస్తూ మానవజాతి ముందడుగేస్తుందని దానర్థం. ప్రకృతికి, మానవజాతికి మధ్య బంధం ఈ దశలో శిఖరస్థాయికి చేరుకుంటుంది. రాజ్యం, జాతి, వర్ణం, మతం, కులం, లింగం వంటి సకల సంకుచిత సరిహద్దుల్ని అధిగమించిన మనుషులు పరిపూర్ణ వ్యక్తిత్వాలతో సహజ స్వేచ్ఛావర్తనలతో పరిఢవిల్లుతారు.

'చరిత్రాంతం' నేపధ్యం ఇదే. గడచిన 50 సం॥ల పైగా సోషలిజం-పెట్టుబడిదారీ విధానం మధ్య జరుగుతున్న పోరాటంలో రివిజనిజం బారిన పడిన సోషలిజం తాత్కాలికంగా వెనుకంజ వేసింది. సోషలిజానికి దెబ్బతగిలిన ప్రతి దశలోనూ మార్క్సిజానికి 'కాలం చెల్లిం'దంటూ, మార్క్సిజానికి మరణ శాసనం రాసేసే పనిలో బూర్జువా సిద్ధాంతకారులు తలమునకలవుతూ వచ్చారు. 'మార్క్సిజానికి అంతం', 'విఫలమైన మార్క్సిజం', 'చేవచచ్చిన మార్క్సిజం' అంటూ పలు రకాలుగా ఈ పెట్టుబడిదారీ 'సిద్ధాంతి'లు మంత్రజపం చేస్తూ వచ్చారు. ఇలా పదేపదే వూదరగొట్టడంలో వీరి వుద్దేశం విస్తృత ప్రజారాసులకు దోపిడీ, పీడన, యుద్ధాలూ లేని నూతన జీవితాన్ని కల్పించే సామర్థ్యం, సామ్రాజ్యవాదాన్ని కూలద్రోసే సామర్థ్యం కార్మికవర్గానికి లేదని ప్రపంచాన్ని నమ్మింప జేయటమే తప్ప మరొకటి కాదు.

కాని మానవజాతిని ఆకలిదప్పుల నుండి, యుద్ధభయాలూ, బాధల నుండి, క్షీణత నుండి బయటపడేయాల్సిన అవసరం మునుపెన్నటికంటే ఇపుడే అధికంగా వుంది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై పోయిన పదేళ్ళ తర్వాత సామ్రాజ్యవాదం మునుపెన్నడూ లేనంత తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయింది. సియాటిల్ నుంచి మేడే ప్రదర్శనలదాకా యూరప్, అమెరికా, ఆసియా నగరాల్లో సకల ప్రజా బృందాలూ పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కోడై కూయటం ఉదార ప్రజాస్వామ్యపు డొల్లతనాన్ని స్పష్టంగా నిరూపించింది. మానవుల కనీస అవసరాల్ని తీర్చలేక, ప్రపంచవ్యాప్తంగా ప్రజలలో ప్రపంచీకరణ పేరిట భయాందోళనలను కల్గిస్తూ వస్తున్న ఉదార ప్రజాస్వామిక వ్యవస్థ మానవ సమాజంలో అంతిమ ఘట్టం కాదని, అంతిమ ప్రభుత్వ రూపం కాదని, అది 'చరిత్రాంతం' కాదని, సకల ప్రజారాసుల వినూత్న పోరాట చరిత్రకు అదొక 'ప్రారంభం' మాత్రమేనని రుజువైంది. సియాటిల్ నుండి మేడే వరకూ సాగిన ప్రపంచ ప్రజల నిరసన ప్రదర్శనలు మనకు చెబుతున్న సారమిదే. ❑

# కేంద్ర పారా మిలటరీ బలగాలతో పోరాడుతూ నేలరాలిన జెహనాబాద్ అమరులకు అరుణారుణ జోహార్లు!!

బీహార్‌లో ప్రతీఘాతుక భారత ప్రభుత్వ సాయుధ బలగాలు కుచ్నావన్ గ్రామంలో మార్చి 3న పదిమంది కమ్యూనిస్టు గెరిల్లాలను చుట్టుముట్టి చంపేశాయి. ఈ గ్రామం జెహనాబాద్ జిల్లా ముఖ్దాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది. మార్చి 3న వందలాదిమంది సి.ఆర్.పి.యఫ్., బి.యం.పి. (బీహార్ మిలటరీ పోలీస్), బి.పి. బలగాలు కుచ్నావన్ గ్రామాన్ని నలువైపుల నుండి చుట్టుముట్టి రోడ్లను దిగ్బంధించి వేశాయి. పీపుల్స్‌వార్ గెరిల్లాలు ఈ గ్రామంలోని ఒక షెల్టర్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారన్న సమాచారాన్ని ఒక పోలీస్ ఏజెంట్ ద్వారా అందుకున్న జిల్లా ఎస్పీ అబ్దుల్‌గని మిర్ ఈ చుట్టివేత చర్యకు నాయకత్వం వహించి వచ్చాడు. గెరిల్లాలు వేకువజామునే ఈ గ్రామంలోకి వచ్చారు కానీ ఒక పోలీస్ ఏజెంట్ వీరు గ్రామంలోకి ప్రవేశిస్తుండగా చూశాడు. ఉదయం 9 గంటలకు పోలీసులు షెల్టర్‌ని చేరుకున్నారు. పోలీసులు షెల్టర్ ఇంటి తలుపు వద్దకు వచ్చినపుడు మాత్రమే సెంట్రీ వారిని గమనించగలిగాడు. ఊహించని విధంగా చిక్కుబడ్డ గెరిల్లాలు పోలీసులపై వెంటనే దాడికి దిగి ఇద్దరు పోలీసులను కాల్చిచంపి ఇంటి గేట్‌ని తమ వశంలో ఉంచుకోగలిగారు. తర్వాత గెరిల్లాలందరూ గ్రామం బయటకుపోయే వీధులను దాటుకుంటూ శత్రువు నుండి తప్పించుకోడానికి సమిష్టి ప్రయత్నం చేపట్టారు. ఈ ప్రయత్నంలో బీహార్ రాష్ట్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ విజయ్ (శ్రీకాంత్) చంపబడినాడు. తక్కిన గెరిల్లాలందరూ గ్రామం నుండి విజయవంతంగా బయటపడి సమీపంలోని నదివద్దకు తరలివెళ్ళారు. కానీ ఆ స్థలాన్ని మొత్తంగా అప్పటికే చుట్టుముట్టేసి వున్న ప్రతీఘాతుక పోలీసులు వీరిపై కాల్పులు మొదలెట్టారు. ఎటూ పోలేని స్థితిలో కూడా గెరిల్లాలు మధ్యాహ్నం 2 గంటల 30 నిముషాల వరకు వీరోచితంగా పోరు సాగించారు. అసంఖ్యాకంగా వున్న ప్రభుత్వ బలగాల బుల్లెట్ల బారినపడి చిట్టచివరి కామ్రేడ్ నేల కూలేంత వరకూ గెరిల్లాలు శత్రువులతో వీరోచితంగా పోరాడారు. ఈ దాడిలో ఇద్దరు పోలీసులు చావగా మరో ముగ్గురు గాయపడ్డారు. తర్వాత గెరిల్లాలకు షెల్టర్ ఇచ్చినంత మాత్రానే పోలీసులు యువకుడైన మనోహర్ పాశ్వాన్‌ని పట్టుకుని అక్కడికక్కడే కాల్చేశారు. కిరాయి బలగాలతో సాహసోపేతంగా పోరాడిన విప్లవ గెరిల్లాలు 1980ల నుండి బీహార్‌లో జరుగుతున్న విప్లవోద్యమానికి తమ అమూల్య ప్రాణాలను పోరాడుతూనే అర్పించారు.

## భూస్వామ్య ప్రభువుల ప్రయోజనాలను పరిరక్షిస్తున్న ప్రభుత్వ సాయుధ బలగాలు

మునుపటి పార్టీ యూనిటీ, ఇప్పటి సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] పార్టీకి చెందిన గెరిల్లాలు గత రెండు దశాబ్దాలుగా ఫ్యూడల్ దోపిడీకి, బీభత్సానికి వ్యతిరేకంగా పోరాడుతూ భూస్వాముల ప్రైవేట్ సేనలను చావుదెబ్బతీసి భూస్వామ్య శక్తులను అదుపులో వుంచుకున్నారు. అయితే 1995లో పాశవికపు రణవీర్ సేనను రంగంలోకి తెచ్చిన భూస్వామ్య శక్తులు దళితులపై, వెనుకబడిన కులాల ప్రజలపై ఊచకోతకు దిగుతూ వచ్చారు. 1995 నుండి ప్రైవేట్ సేనలకు బదులు ప్రతీఘాతుక పోలీస్, పారా మిలటరీ బలగాలే భూస్వామ్య శక్తుల ప్రయోజనాల పరిరక్షణ బాధ్యతను నెత్తినేసుకున్నాయి. రణవీర్‌సేన ఊచకోతలను నిరోధించే పేరిట బీహార్ రాష్ట్ర ప్రభుత్వం మధ్య బీహార్ అంతటా ఏర్పర్చిన పోలీస్ క్యాంపులు వాస్తవంగా రణవీర్‌సేనకే ఉపయోగపడుతూ, ఫ్యూడల్ శక్తులకు వ్యతిరేకంగా బలమైన ప్రతిఘటనా ఉద్యమాన్ని నిర్మించకుండా విప్లవశక్తులను అడ్డుకుంటున్నాయి. నిరాయుధ దళిత 'టోలా' పీడిత ప్రజలపై నీచమైన దాడులకు పాల్పడుతున్న, ఊచకోతలు మొదలెట్టిన రణవీర్‌సేనకు వ్యతిరేకంగా ఇంతవరకూ ప్రభుత్వ బలగాలు ఒక్క 'ఎన్‌కౌంటర్' కూడా చేయలేక పోయాయి. కానీ విప్లవ ప్రజాశక్తుల కదలికల గురించి ఏ ప్రాంతంలోనైనా కాస్త ఉప్పందిందంటే చాలు ప్రభుత్వ బలగాలు పెద్ద సంఖ్యలో తరలివస్తూ వారిపై దాడికి పూనుకుంటున్నాయి. భూస్వామ్య దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా బీహార్‌లో సాగుతున్న ప్రతిఘటనోద్యమం భూస్వాముల ప్రయోజనాల కోసం పాటుపడుతున్న ప్రభుత్వ సాయుధ బలగాల రూపంలోని బలమైన శత్రువు దాడులను ఎదుర్కోవాల్సి వస్తోంది.

ప్రస్తుతం బీహార్‌లో పీపుల్స్‌వార్ గెరిల్లా బలగాలు పీడిత, తాడిత ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడంలో ముందుపీఠిన వుంటున్నారు. నక్సలైట్ ఉద్యమం పీడితులను పీడకులకు ఎదురు నిల్చేలా చేయగల్గింది. గ్రామీణ బీహార్ చరిత్రలోకెల్లా మొదటిసారిగా పీడిత ప్రజానీకం తమ ప్రయోజనాలకు నిలబెట్టుకునేందుకు, అత్యాచారాల గురించి మాట్లాడేందుకు, తమ మహిళలపై ప్రతీఘాత శక్తుల దాడిని ప్రతిఘటించేందుకు తగిన శక్తిని, ధైర్యసాహసాలను సమకూర్చుకున్నారు. ఇది దక్షిణ, మధ్య బీహార్ ప్రాంతమంతటా శతాబ్దాలపాటు భూస్వామ్య ప్రభువులు సాగించిన ఆధిపత్యానికి సవాలుగా నిలిచే ఒక నూతన రాజకీయశక్తి ఆవిర్భావానికి దారితీసింది.

తమ ఆత్మగౌరవాన్ని నిలుపుకొని, గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు ఇదొక్కటే మార్గం కాబట్టే పీడితులు తమకుతామే విప్లవ గెరిల్లా బలగాలలో చేరుతున్నారు.

ప్రజల క్రియాశీలక పాత్ర ద్వారా పీపుల్స్‌వార్ పార్టీ చేస్తున్న ప్రతిఘటనను అణచివేయటమే ప్రభుత్వ లక్ష్యంగా వుంటోంది. అందుచేత గెరిల్లాలను చంపడం అనేది పీపుల్స్‌వార్ పార్టీపై దాడి మాత్రమే కాదు, అది భూమి, అడవులు, ప్రజాస్వామ్యం కోసం న్యాయమైన పోరాటం చేస్తున్న పీడిత, తాడిత, దళిత, మైనారిటీలపై కూడా దాడిగానే చెప్పాలి. అందుకే బీహార్‌లో వర్గాల మధ్య విభజన రేఖ చాలా స్పష్టంగానే కనిపిస్తోంది. విప్లవ, ప్రజాస్వామిక శక్తులు ప్రజలవైపు

వుండగా పోలీస్ యంత్రాంగం పెట్టుబడిదారుల, భూస్వాముల పక్షాన వుంటోంది.

అమరులైన విప్లవకారులు ఈ లక్ష్యంతోనే ఆ ప్రాంతానికి వెళ్ళారు. రణవీర్‌సేన ఆ ప్రాంతంపై తిరిగి ఎన్నడూ దాడికి పాల్పడకుండా హెచ్చరించి, పీడిత ప్రజలలో ఆత్మవిశ్వాసం పెరిగేలా చేసేందుకే గెరిల్లా దళం కుచ్నావన్ గ్రామానికి వెళ్ళి సభలు జరిపింది. పోలీసుల చుట్టివేతలో గెరిల్లాలతో పాటు అమరుడైన రాష్ట్రకమిటీ సభ్యుడు కా॥ శ్రీకాంత్ మగధ్ రీజియన్ పార్టీ కార్యదర్శిగా వుండినందువల్ల గెరిల్లా స్క్వాడ్‌తో కలిసి ఆ ప్రాంతానికి వెళ్ళాడు. అమూల్యమైన ప్రాణ త్యాగాలతో బీహార్ నేలను రక్తమయం గావించిన జెహనాబాద్ అమరులకు విప్లవ జోహార్లు తెలుపుదాం.

## సాధారణ వ్యక్తి దశనుండి నాయకుడిగా, పీడిత ప్రజలపక్షాన పోరాట యోధుడిగా ఎదిగిన కామ్రేడ్ శ్రీకాంత్ కి అరుణారుణ జోహార్లు

దృఢ నిశ్చయుడూ, పీడిత ప్రజల పక్షాన అలుపెరుగని పోరాట యోధుడూ అయిన కామ్రేడ్ శ్రీకాంత్ జెహనాబాద్ జిల్లా పెరియారి గ్రామానికి చెందిన ఒక దిగువ మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టాడు. బాల్యంలో దళితుల బాధలపట్ల ఎంతో సున్నితంగా స్పందించడమేగాక దళితులను పీడిస్తూ, నలిపివేస్తున్న భూస్వామ్య దొరలపట్ల తీవ్ర ద్వేషం పెంచుకున్నాడు. కాలేజీ చదువులప్పుడు సైతం తన భవిష్యత్తు గురించికాక, ఊపిరాడకుండా చేస్తున్న సామాజిక వ్యవస్థలో మార్పుకోసం పనిచేయాలని కోరుకునేవాడు. సమాజంలోని అలక్ష్యం అస్తవ్యస్థతలు, తనకు ఒరగబెట్టేదేమీ లేదని భావించేవాడు. పీడకుల దౌర్జన్యాలను నిరంతరం ద్వేషిస్తూ, తన భావాలకు కార్యరూపమిచ్చే శక్తికోసం ఎదురుచూడటం మొదలుపెట్టాడు. కొంతకాలం ''శోషిత్ సమాజ్‌దళ్''లో పనిచేసినా, త్వరలోనే అది సామాజిక మార్పుకు సాధనంకాదని అర్థం చేసుకున్నాడు. విరామమెరుగకుండా పనిచేస్తూ కూడా పైకి దానిని వ్యక్తీకరించేవాడు కాదు. తర్వాత ఒకరోజు విప్లవకారులతో సంబంధం దొరికింది. ఆ మరుక్షణమే మనసావాచా ఉద్యమంలోకి దూకాడు. అది మొదలు తాను వెనుదిరిగింది లేదు. ఇప్పటికి తనకో లక్ష్యం ఏర్పడింది. ఆ లక్ష్యంకోసం సహప్రయాణికులు కూడా దొరికారు. 1979లో కాలేజీ వదిలిపెట్టి, అజ్ఞాత జీవితంలోకి వెళ్ళాడు. ఆనాటి పార్టీయూనిటీ తనను అక్కున చేర్చుకుంది. పార్టీ రహస్య కార్యకర్తగా కార్పి, పాలిగంజి ప్రాంతంలో పేదలను సమీకరించటం మొదలెట్టాడు.

రెండు దశాబ్దాలపాటు మగధ్‌లోని పేద ప్రజానీకంలో పనిచేశాడు. కా॥ శ్రీకాంత్ (సాదన్; సొంతపేరు విజయ్) నిరుపేదల బతుకుకోసం అలుపెరగని యోధుడైనాడు. 1982లో కార్పి బ్లాక్ పార్టీయూనిటీ కార్యదర్శిగా ఎదిగాడు. జెహనాబాద్ మషాహరి ఏరియాకమిటీ సభ్యుడైనాడు. 'కార్పి'లో బ్లాక్ స్థాయి దళాన్ని ఏర్పర్చినపుడు దాని నాయకత్వ బాధ్యతలు తీసుకున్నాడు. కార్పి, పాలి, ఆర్వాల్ ఏరియాలలోని భూస్వామ్య వ్యతిరేకపోరాటాలు తనను భవిష్యనేతగా, నిబద్ధయోధుడిగాను నిరూపించాయి. భూమిసేన, లోరిక్‌సేన, బ్రాహమ్ రిదోహిసేన, రణవీర్‌సేన వంటి భూస్వాముల ప్రైవేట్ సైన్యాలకు వ్యతిరేకంగా పోరాటంలో ముఖ్యపాత్ర వహించేలా ఈ లక్షణాలే తీర్చిదిద్దాయి.

భూస్వామ్య హంతక దొరలకు సంబంధించిన 'సేజా-అస్లోకి' ముఠాని తుడిచి పెట్టాలని పార్టీ నిర్ణయించుకున్నపుడు జరిగిన ఒకానొక ముఖ్యమైన గెరిల్లా చర్యలో కా॥ శ్రీకాంత్ తీవ్రంగా గాయపడినాడు. 1990లో పోలీసులు తనను అరెస్ట్ చేశారు. 1992 మధ్యలో విడుదలైనాక తిరిగి ప్రజలలో కలిసి పార్టీ గెరిల్లా యాక్షన్‌లలో పాల్గొనడాన్ని కొనసాగించాడు. 1992లో రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎన్నికై మగధ్‌సేన సంచాలన్ టీమ్ నాయకత్వ బాధ్యతల నుంచి వైదొలిగి, చివరిదాకా రాష్ట్రకమిటీ బాధ్యతల్లో వుండినాడు. శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరుడైన కా॥ శ్రీకాంత్ తన మరణం ద్వారా కూడా భారత విప్లవ లక్ష్యం కోసం నిబద్ధత కల్గిన పోరాటయోధుడి దృఢ దీక్షాదక్షితలను నిరూపించాడు.

కా॥ శ్రీకాంత్ తుపాకితో మాత్రమే పోరాటం చేసిన యోధుడు కాడు. ఒక విధవరాలిని పెళ్ళాడటం ద్వారా తాను పనిచేస్తున్న ఏరియాలో సైతం సాంఘిక సంస్కరణలకు సంబంధించిన గొప్ప ఆదర్శాన్ని నెలకొల్పాడు. మహిళా విముక్తి అన్నది సంస్కరణల వద్దే ఆగిపోదన్నది అతని ఉద్దేశ్యం. పూర్తి కాలం విప్లవకర జీవితాన్ని ఎంచుకోవటం ద్వారా విముక్తి మార్గంలో పయనించడాన్ని కొనసాగించాల్సిందిగా తన సహచరికి సిద్ధాంతపరంగా నచ్చజెప్పడాన్ని తాను కొనసాగించాడు. అతడి సహచరి విప్లవ జీవితాన్ని ఎంచుకోవటం ద్వారా అతనితోటి విప్లవకారిణిగా మారింది. ఆమె విప్లవం కోసం పీడిత ప్రజలలో నేటికీ పనిచేస్తూనే వుంది.

అరెస్టై జైళ్లో వున్నపుడు సైతం కా॥ శ్రీకాంత్ జైలు అధికారుల అమానుష ప్రవర్తనకు వ్యతిరేకంగా తోటి సభ్యులను కూడగట్టడంలో ముఖ్యపాత్ర వహించాడు. జైల్లో కమిటీని నెలకొల్పి ప్రజా పంచాయితీలు పెట్టించి, ఖైదీల హక్కుల కోసం నిరాహార దీక్షలకు పూనుకున్నాడు. జైల్లో సైతం విప్లవ కార్యకలాపాలను కొనసాగించటంతో తనను దూరాన వున్న భాగల్పూర్ సెంట్రల్ జైలుకు మార్చారు.

10మంది తోటి కామ్రేడ్స్‌తోపాటు అమరుడైన క్షణాన కా॥ శ్రీకాంత్ ఒక ముఖ్యమైన పనిలో వుండినాడు. దాంట్లో భాగంగా వారొక షెల్టర్‌లో వుంటున్నపుడు ప్రతీఘాతుక పోలీస్ బలగాలు నలువైపుల నుండి చుట్టుముట్టి వున్నట్లుండి దళంపై దాడి జరిపారు. దళంతోపాటు ఇద్దరు పోలీసులు సైతం చనిపోయారు. కానీ బీహార్ ఉద్యమానికి సంబంధించినంతవరకూ ఈ నష్టం భరించలేనిది. అనుభవజ్ఞుడైన యోధుడు, ఆర్గనైజర్ అయిన కా॥ శ్రీకాంత్ అమరత్వం వల్ల ఉద్యమంలో వెలితి ఏర్పడింది. మగధ్ ఏరియాతోపాటూ గత రెండు సం॥లుగా భోజ్‌పూర్ - బక్సర్ ఏరియాలకు కూడా అతడు నాయకత్వమందించాడు. ధీరోదాత్తమైన, నిబద్ధత కలిగిన కా॥ శ్రీకాంత్ విప్లవకర జీవితం యువ విప్లవకారులను ఉత్తేజపరుస్తూనే వుంటుంది. ❑

## ''తాగేందుకు నీరు లేకుంటేనేమి! జనాలకు 'కోక్' ఇవ్వండి!!''

### నీటి ఎద్దడితో కుంగిపోతున్న వేలాది గ్రామాలకు కంప్యూటర్ల మాయాజాలం రుచిచూపుతూ నీరోలను మించిపోతున్న భారత పాలకవర్గాలు.....

ఫ్రెంచి విప్లవ కాలంలో ఆకలితో అలమటిస్తున్న ప్రజలు రొట్టె కోసం డిమాండు చేస్తుంటే ''రొట్టెలు దొరక్కపోతే మంచి కేకులు తినొచ్చు కదా! ఎందుకంత హంగామా?'' అంటూ వ్యాఖ్యానించింది ఫ్రెంచి రాణి మేరీ ఆంటొనెట్. సరిగ్గా ఈ విధంగానే భారతదేశంలో పాలకులు నేడు తాగునీటిని మినహాయిస్తే, కోక్, పెప్సీ, మినరల్ వాటర్‌లను మాత్రం క్రమం తప్పకుండా అందిస్తూ, ఫ్రెంచి రాణి ప్రకటనను పోలిన ఒక అప్రకటిత విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈరోజు కరువు పీడిత ప్రాంతాలలోని 'దాబా'లలో కోకోకోలాలు వద్దన్నా దొరుకుతాయి తప్ప చుక్క మంచినీరు కూడా దొరకదు. కొద్ది నెలల క్రితం భారతదేశ సందర్శనకు వచ్చిన బిల్‌క్లింటన్ రాజస్థాన్‌లో 'నయోలా' గ్రామ మహిళలతో కలిసి డాన్స్ చేసిన తర్వాత, ''గ్రామాలన్నీ 'నయోలా'ని ఉదా॥గా తీసుకుని కంప్యూటర్/ ఇంటర్‌నెట్ కనెక్షన్లను పొందాల''ని సెలవిచ్చాడు.మన పాలకవర్గ రాజకీయ పక్షాలకు ఇప్పుడిదొక తారక మంత్రం అయిపోయింది. ''అన్ని గ్రామాలకూ కంప్యూటర్లు అందజేస్తాం''... చంద్రబాబులూ, మహాజన్‌లూ, క్రిష్ణలూ, గెహ్లాట్‌లూ తదితర పాలకవర్గ ముఠా మొత్తంగా పదే పదే ఈ మంత్రాన్నే జపిస్తోంది. 'స్వదేశీ' రాగాలాపనతో ఊదరగొడుతున్న అద్వానీ సైతం అన్ని గ్రామాలకూ కంప్యూటర్లను పరిచయం చేయాలంటే దేశీయ సాఫ్ట్‌వేర్ అవసరమంటూ నొక్కి చెప్పాడు. ''జనాలకు తాగేందుకు మంచినీళ్ళు లేకుంటే నేం..... వాళ్ళకు కంప్యూటర్లివ్వండి''. ఈ కోణంలో భారత పాలకవర్గ ముఠా ఆనాటి ఫ్రెంచి రాణిని కూడా తలదన్నుతోంది. (అయితే రొట్టెలు లేని జనాలకు కేకులు తినమని చెప్పిన ఫ్రెంచి రాణి తలను ఫ్రెంచి విప్లవానంతరం గిలిటెన్‌లో పెట్టి నరకటం చరిత్రలో నమోదైంది.)

కరువొచ్చినా, రాకున్నా, ప్రతి వేసవి కాలంలోనూ తాగునీరు దొరకటం మాత్రం దుర్లభమౌతోంది. ఈయేటి కరువు ప్రజల, పశువుల కొనవూపిరిని కూడా పీల్చేసింది. ఇంత బీభత్స, భయానకమైన నీటి ఎద్దడి రుతుపవనాల సంపూర్ణ వైఫల్యం వల్ల కాకుండా, దేశ సగటు వర్షపాతంలో ఒక్కగానొక్క శాతం పడిపోవటంవల్లే సంభవించిందన్న వాస్తవం నుండే పరిస్థితి తీవ్రతను అంచనా వేయవచ్చు. వరుసగా 11 సం॥లపాటు వర్షాలు బాగా పడిన తర్వాత సైతం కరువు పీడిత ప్రాంతాలలో కేవలం ఒక్క నెలరోజులకే పరిస్థితి మహా భయానకంగా తయారయింది. దీన్ని బట్టి చూస్తే, ఒక్క సం॥రం రుతుపవనాల రాక ఆగిపోయిందంటే దేశం ఏ పరిస్థితుల బారిన పడుతుందో ఎవరయినా ఊహించుకోవచ్చు.

సగటు వర్షపాతంలో ఒక్కశాతం పడిపోతేనే గ్రామీణ ప్రాంతాల పరిస్థితి ఇంతగా అస్తవ్యస్తమైపోయేలా ఎందుకు జరుగుతోంది? కటిక ఆకలి, నోరెండి పోవటం, వ్యాధుల పాలవటం వంటి కారణాలతో కరువు పీడిత గ్రామీణ ప్రాంతాలలో వేలాది ప్రజలు చనిపోతున్నందుకు, గ్రామాలకు గ్రామాలు వల్లకాడులయి పోతున్నందుకు ఎవరిని నిందించాలి? ఎగురలేక నేలపైపడి ఎండ వేడికి చనిపోయే పక్షుల్లాగా లక్షలాది పశువుల దారుణ మరణాలకు కారకులెవ్వరు? ఇది 'ప్రకృతి వైపరీత్యం' కాదని మానవ తప్పిదమని, మానవులు సృష్టించిన విషాదమని అందరూ అంగీకరిస్తారు. కానీ ఎవరీ 'మనుషులు'? అసంఖ్యాక మరణాలకూ, కోట్లాది ప్రజల 'నరక' బాధలకు కారణభూతులైన ఈ నేరగాళ్ళూ, హంతకులూ, కసాయిలూ ఎవరు? వీరికెలాంటి శిక్షలుండాలి మరి?

అయితే, ఈ ప్రశ్నలకు జవాబిచ్చేముందు, ప్రస్తుత విషాదం ముంచుకొస్తున్న పెనుకల్లోలానికి నాంది మాత్రమేననీ, దాని పూర్తి దుష్ప్రభావం ఈ సం॥రం రుతుపవనాల స్వభావంపైనే ఆధారపడి వుంటుందని మనం గ్రహించాలి. ఈసారి రుతుపవనాలు ఇటీవలి దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేనంత స్వల్పస్థాయికి పడిపోతాయని వాతావరణ శాస్త్రజ్ఞులు నివేదించారు. మన పాలకమ్మన్యులు మాత్రం ఇటువంటి రిపోర్టులను ''వూరికే కలవరం కల్గించేవే తప్ప పసలేనివి'' గా కొట్టి పారేస్తున్నారు. నిజంగానే, ఈ రిపోర్టులు వాస్తవం కాలేదనుకోండి... అయితే ఇందుకు సంబంధించి అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సింది పాలకులే తప్ప మరెవ్వరూ కాదు. తమ సొంత వాతావరణశాఖ రిపోర్టులనే ప్రభుత్వం తోసిపారేయటం క్షమించరాని నిర్లక్ష్యం కిందికే వస్తుంది. ఇప్పటికే ఒక నెలరోజులలోపే దేశంలోని 12 రాష్ట్రాలలో 10 కోట్లమంది ప్రజలూ, 6 కోట్ల పశువులూ కరువు బారిన పడ్డారు. వీటిలో ప్రత్యేకించి గుజరాత్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాలలో మానవ విషాదానికి సంబంధించిన భయానకమైన రిపోర్టులు వచ్చాయి.

తిండి, తీర్థాల కోసం ఈ రాష్ట్రాల నుండి వేలాది, లక్షలాది ప్రజలు వలసపోతున్నారు. వృద్ధులూ, వ్యాధిగ్రస్తులూ, మాత్రమే ముంచుకొచ్చే చావుకోసం ఎదురుచూస్తూ బీడుపోయిన గ్రామాలలో పడివుంటున్నారు. మనుషులకు పశువులు ఆహారంగా మారుతున్నాయి. మండుటెండలో చంకన చిన్న పిల్లలతో పనికోసం వెదుకుతూ పోతున్న కుటుంబాలలోని చాలామంది దారిప్రక్కే శోషవచ్చి పడిపోతున్నారు. ప్రభుత్వం ఇలాంటి సంఘటనలను సహజ మరణాలంటూ ప్రకటించి దులుపుకుంటున్నది. ఏ విధమైన నష్టపరిహారమూ లేదు. చావగా మిగిలినవారు మురికి కుంటలలో నీరు తాగుతూ చస్తూ బ్రతుకుతూ కొద్దిమేరకున్న సహాయ కేంద్రాలకు చేరుకుంటున్నారు. వీరిలో కొందరికి రోడ్డు నిర్మాణ పనుల్లో అవకాశం దొరుకుతోంది. మలమలమాడే ఎండలో నడుములిరిగేలా పనిచేస్తే వారికి ప్రకటించినట్లుగా 60 రూ॥లు కాకుండా రోజు 8 లేక 10 రూ॥ల కూలి మాత్రమే ఇస్తారు. వీరిలో కాస్త 'అదృష్టవంతుల'కు 15 రూ॥ల మేరకు దొరుకుతుంది. ఇంత కనాకష్టపు కనీస మొత్తంతో వాళ్ళు బియ్యం, గోధుమలను ఇటీవలే పెంచిన రేట్ల ప్రకారం కిలో రూ॥ 5.5 లు (బియ్యం), రూ॥ 4.5లు (గోధుమలకు) చొప్పున కొనాల్సి వుంటుంది. ఒక నెల ముందుగా సబ్సిడీ ధాన్యం రేట్లు 75 శాతం మేరకు పెంచిన కేంద్ర ప్రభుత్వం, కరువు పీడిత ప్రాంతాలకు నయాపైసా రాయితీ ఇచ్చేందుకు సిద్ధపడలేదు. మే నెల

4వ తేదీన కేంద్ర బడ్జెట్‌ని ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి ఐ.టి. (సమాచార సాంకేతిక శాస్త్ర రంగం) కి మరో 1000 కోట్ల రూ॥లను అదనపు బహుమతిగా అందించాడు గానీ ఆకలితో అలమటిస్తున్న ప్రజలకు నయాపైసాను ఖర్చుపెట్టేందుకు కూడా పూనుకోలేదు. ఈ 1000 కోట్ల రూ॥ల మొత్తంతో కోటీ 60 లక్షల కుటుంబాలకు రెండు నెలలపాటు తిండి పెట్టొచ్చు. కానీ వేళ్ళమీద లెక్కపెట్టగల కొద్దిమంది శక్తిమంతులైన బహుళజాతి సంస్థలకు, భారతీయ దళారీలకు బహుమతిగా ఆ మొత్తాన్ని అందించటానికే అతగాడు పూనుకున్నాడు.

ఈ 'ఘనతరమైన', 'మహా గొప్ప'దైన ప్రజాస్వామ్యాన్ని గురించి పెడబొబ్బలు పెడుతున్న వారికి ఈ క్రూరమైన, అమానుషమైన నిర్ణయాలను తిప్పికొట్టేందుకుగాను ఒక 'ప్రజాస్వామిక' మార్గం అంటూ వుండటం లేదు. కనుకే మన 'ప్రజాతంత్ర' సంస్థల బలిపీఠాలపై వేలాది ప్రజలూ, లక్షలాది పశువులూ చావక తప్పదు. 'రాజకీయ ప్రధాన స్రవంతి'లో ఎవరైనా భాగం కావటం అంటే, వేలాదిమందిని ఇలా ఇచ్ఛాపూర్వకంగా, ముందే వేసుకున్న పథకం ప్రకారం వూచకోత కోయటంలో భాగం కావటం, భాగం పుచ్చుకోవటమే అవుతుంది.

ఈ వ్యాసంలో ముందుగా కరువుతో వ్యవహరించటంలో కేంద్ర ప్రభుత్వ పాత్రను పరిశీలిద్దాం. కరువుబారిన పడిన కొన్ని రాష్ట్రాలలో వాస్తవస్థితిని, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పాత్రనూ గమనిద్దాం. చివరగా ఈ కరువు, దుర్భిక్షపు విషవ్యాధికి కారణాలు, పరిష్కారాలకేసి చూపుసారిద్దాం.

## ప్రజా నిర్మూలనే కేంద్ర ప్రభ్వ్ 'కరవు నివారణా' విధానం

కరువు నివారణలో మందకొడితనాన్ని కేవలం నిర్లక్ష్యంగా మాత్రమే చిత్రిస్తూ ప్రచారమాధ్యమాలు ప్రభుత్వాన్ని నిందించ పూనుకున్నాయి. అయితే ఇది పూర్తిగా తప్పులతడక వైఖరి మాత్రమే. ఎందుకంటే ఇది మార్కెట్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించే ఉన్మత్తపూరిత స్వభావంతో, కరువుపీడిత ప్రజారాసులపట్ల నిర్లక్ష్యం ప్రదర్శించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పథకం ప్రకారం అవలంభిస్తున్న విధానం మాతమ్రే. లక్షలాదిమంది చనిపోతేనేం, ప్రభుత్వ విధానాన్ని నడుపుతున్న ప్రస్తుత మార్కెట్ మాయాజాలం దృష్టిలో వారంతా విలువలేనివారే. కరువు ధాటికి పేదల్లోకెల్లా నిరుపేదలే తీవ్రంగా దెబ్బతినిపోయారు. కరువు/దుర్భిక్షానికి సంబంధించి ప్రభుత్వం బాధల్లా ఏమిటంటే అది పారిశ్రామిక సరకులకు మార్కెట్ లేకుండా చేస్తుందని, తద్వారా అది బడా వాణిజ్య వర్గాల లాభాలను దెబ్బతీస్తుందన్నదే. కరువు బారినపడి కుప్పగూలిపోయే వారికి, వారి స్థితిగతులు బాగా వున్న కాలాల్లో కూడా కొనుగోలు శక్తి ఎన్నడూ వుండదు. అలా వారు సరకుల మార్కెట్ దరిదాపుల్లోకి కూడా చేరుకోలేరు. కాబట్టి వారు వదిలివేయదగ్గవారే. వీరు చచ్చినా, బతికినా కొనసాగుతున్న మార్కెట్‌పై ఏ ప్రభావమూ వేయలేరు. అందుచేత ఇలాంటి వారి మనుగడకు వనరులను 'వృధా' చేయటమంటే ఐ.టి. లేక మౌలిక సదుపాయాల స్థాపన వంటి రంగాలలో ఫలవంతంగా ఉపయోగింపబడుతున్న నిధులను దారిమళ్ళించినట్లే అవుతుంది. గ్రామీణ జనాభాలో ఏ మేరకయినా పట్టించుకోవాల్సిన వారున్నారా అంటే ధనిక, ఎగువ మధ్యతరగతి రైతాంగ సెక్షన్‌కి చెందినవారు మాత్రమే. కరువు కారణంగా వీరి కొనుగోలుశక్తి పడిపోయే అవకాశముంది. అందుకే పట్టించుకుంటే వీరిని మాత్రమే కాస్త పట్టించుకోవచ్చు. ప్రభుత్వ విధానాన్ని నిర్దేశిస్తున్న అంశం ఇదే. ఉదాసీనతో లేక నిర్లక్ష్యమో ఏ మాత్రం కాదు. లక్షలాదిమంది చావక తప్పదంటే చావనీ...ఆర్థిక సంస్కరణలు మాత్రం ప్రధానమైనవి. 'మార్కెట్' మాత్రమే ఇపుడు 'దేవుళ్ళు'. శివాలెత్తుతూ సమాజం ఇపుడు వీటినే పూజించాలి. ఈ 'దేవతా'రాధన కోసం కొన్ని వేలమందిని, కాకుంటే లక్షలాదిమందిని కూడా కావచ్చు....బలి చేయటమన్నది 'దేవత'కు చాలా చిన్న నైవేద్యం మాత్రమే.

కరువుపట్ల, దుర్భిక్షంపట్ల ప్రస్తుత ప్రభుత్వ విధానంలో పై తర్కమే ప్రతిబింబించింది. కరువు సూచనలు చాలా ముందుగానే బయటపడినా, ముంచుకొస్తున్న విషాదపు తీవ్రత నెలలముందే పొడసూపినా, ప్రభుత్వం మాత్రం నడుంకట్టిన పాపానే పోలేదు. ఉదా॥ కరువు పీడిత రాష్ట్రాలైన గుజరాత్, రాజస్థాన్‌లకు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ మంత్రులు అద్వానీ, జస్వంత్ సింగ్‌లు మార్చి-ఏప్రిల్ మాసాల పొడవునా తమ నియోజక వర్గాలలోనే గడిపినా పొడసూపుతున్న కరువు వాసనలను కూడా గమనించలేక పోయారు. క్లింటన్, అతడి కూతరు చెల్సియా, రాబిన్‌కుక్‌లకు రాజస్థాన్‌లో కల్పించాల్సివున్న వినోద కార్యక్రమాలే జస్వంత్‌సింగ్‌కి ప్రాధాన్యాంశాలుగా మారిపోయాయి. అతడి 'విదేశాంగ మంత్రిత్వ పదవికి' ఈ రకంగా సార్థకత లభించింది మరి. ఇక వల్లభాయ్ పటేల్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఏప్రిల్ మధ్యలో గుజరాత్‌కి వచ్చిన ప్రధాని వాజ్‌పేయి కరువు పీడిత ప్రాంతాలకంటే మధ్య గుజరాత్‌లోని జలసమృద్ధి ప్రాంతాల సందర్శనకే ప్రాధాన్యతనిచ్చాడు. ఈ 'నేత'లలో ఎవ్వరూ పొడసూపుతున్న ఉపద్రవం గురించి ఒక్కమాట కూడా ప్రస్తావించలేక పోయారు.

వాస్తవానికి కరువుకు సంబంధించిన ఛాయలు గత సం॥రం సెప్టెంబర్ నెలలోనే పొడసూపాయి. గుజరాత్, రాజస్థాన్‌లలో ప్రజలు గ్రామాలను వదలిపెట్టి వెళుతున్నపుడే లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి వచ్చిన అద్వానీని ''మొదట నీళ్ళు, తర్వాతే అద్వానీ'' వంటి నినాదాలు పలకరించాయి. గుజరాత్‌లోని సౌరాష్ట్రలో డ్యాముల నిల్వ సామర్థ్యంలో 9శాతం మాత్రమే వర్షపు నీటితో నిండింది. ఈ కాస్త నీరు సైతం జనవరి నాటికి ఖాళీ అయిపోయింది. మధ్య, పశ్చిమ భారతంలో వర్షపాతం ఎప్పటిలాగే వుందంటూ 'అధికారిక' ప్రకటనలు చేసింది. దక్షిణ భారతంలో కూడా ఈశాన్య రుతుపవనం విఫలమయిందని తెలిసినా కేంద్ర ప్రభుత్వం మొత్తం 4 శాతం మాత్రమే వర్షపాతం తగ్గిందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ తీవ్రమైన కరువు ప్రమాదం గురించి హెచ్చరించినా క్లింటన్ పర్యటన సన్నాహక చర్యలలో మునిగివున్న ప్రభుత్వం తలకెక్కించుకోలేదు.

ఈ దశ పొడవునా ఏప్రిల్ మధ్యవరకూ కరువు పరిస్థితుల గురించి కుట్రపూరిత మౌనం పాటించిన మీడియా చివరకు గుజరాత్‌లో నీటిదాడులు, ఆకలిచావులు, పశువుల తరలింపు, లక్షలాది ప్రజల వలస వంటివి వరుసగా బద్దలవటంతో, ఇక తప్పనిసరిగా గొంతు విప్పింది. ఏప్రిల్ 20 నాటికి కరువు విధ్వంసం తారాస్థాయిలో వెలుగులోకి వచ్చింది. మొదట్లో వాస్తవాన్ని నిర్లక్ష్యం

చేసి నిజాలను తొక్కిపెట్టి చూసిన ప్రభుత్వ విధానం కాస్తా ఇపుడు కరువు వున్నదని, వీలైనంత మేరకు నివారణకు పూనుకుంటామని నమ్మించే విధానంగా మారింది. నిజానికి 1940ల దుర్భిక్ష కాలంలో రైతాంగంపై పన్నులు పెంచిన బ్రిటీష్ వలస పాలకుల కుటిలత్వానికి ఎన్డీఏ ప్రభుత్వ విధానం తీసిపోదు. నెలల తరబడి కరువు సూచనలను నిర్లక్ష్య పెట్టిన తర్వాత, మీడియాలో కరువు వార్తల వెల్లువతో వాజ్‌పేయి నాటకీయంగా టీ.వీ.లో ప్రసంగిస్తూ ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్‌కి ఉదార సాయం గురించి విన్నపాలు చేశాడు. ఇప్పుడు సైతం ప్రభుత్వ స్థాయిలో ఖర్చుపెట్టడంద్వారా తన వాస్తవ బాధ్యత నెరవేర్చటం కాకుండా ప్రజలనుంచే విరాళాలను కోరే పనికి పూనుకుంది ప్రభుత్వం.

ప్రభుత్వ స్థాయిలోనూ చేసిందేమిటి? గుజరాత్, రాజస్థాన్ కరువు పీడిత ప్రాంతాల కుటుంబాలకు 20 కేజీల చొప్పున అదనపు ధాన్య పంపిణీకి 2 లక్షల టన్నుల మేరకు ధాన్యం విడుదల చేస్తానని ప్రకటించిన ప్రభుత్వం దాన్నయినా మునుపటి ధరలకుగాక కొత్తగా 75% మేరకు పెంచిన ధరలకు అమ్మింది. దీంతో కరువు బాధిత కుటుంబాలకు కొనుగోలు శక్తిలేక వాస్తవంగానే ధాన్య పంపిణీ కాలేదు. ఇలా కొంత మేరకు అదనపు ధాన్యం పంపిణీకాగా అధిక భాగం బహిరంగ మార్కెట్‌కి పోయి వ్యాపారస్తులు, అధికారులూ చావువిందు చేసుకునేందుకు అవకాశమిచ్చింది. ఇక పనికి ఆహారం పథకం కింద ఈ రెండు రాష్ట్రాలకు కేవలం 15వేల టన్నుల ధాన్యాన్ని పెంచిన ధరలతో కేంద్రం విడుదల చేసింది. నాలుగు కరువు పీడిత రాష్ట్రాలకు కలిసి 750 కోట్ల రూ॥ల నామమాత్రపు సాయం విదిల్చింది. ఇది ప్రస్తుత బడ్జెట్‌లో బడా వాణిజ్య వర్గాలకు కల్పించిన పెను రాయితీలతో పోలిస్తే నిజంగా నామమాత్రపు సాయంగానే వుంది. కేంద్రం ఉచితంగా విడుదల చేసిన ధాన్యం 2వేల టన్నులు మాత్రమే. అది కూడా పుచ్చిపోయి, మానవ వినియోగానికి వీలుపడని రీతిలో వున్న ధాన్యాన్ని అలా విదిల్చింది. మరింత దుర్మార్గమేమిటంటే ప్రధానమంత్రి సహాయనిధి పేరిట సేకరించిన భారీ మొత్తంలో కేవలం 30 కోట్ల రూ॥లను అది 'పోషకాహార పథకం' కింద ఇచ్చింది.

ప్రభుత్వ పట్టింపు ఎంత అధమంగా వుందంటే 1998 అక్టోబర్‌లో స్వయానా అది రూపొందించిన ''సవరించిన జాతీయ నీటి విధానం ముసాయిదా''ను కనీస చర్చకు కూడా తీసుకురాకుండా బుట్టదాఖలు చేసింది. ఈ ముసాయిదా పాలసీని చర్చించేందుకు ఏప్రిల్ 3న ''వాటర్ ప్రాసెసింగ్ కౌన్సిల్'' సమావేశానికి పిలుపిస్తే ప్రభుత్వం ఆకస్మికంగా దాన్ని వాయిదావేసి తదుపరి సమావేశపు తేదీని కూడా ఇంతవరకు ప్రకటించలేదు. చివరకు తన బడ్జెటరీ విధానంలో సైతం అది గ్రామీణ ప్రాంతాల, గ్రామీణ ఉపాధి పథకాలకు కేటాయింపులపై బాగా కోత పెట్టింది. ఈ సం॥రం కమ్యూనికేషన్లకు 19,455 కోట్లను, రవాణాకు 20,992 కోట్లను కేటాయించి సాగునీరు, వరద నివారణలకు కేవలం 452 కోట్లు కేటాయించింది.

ఈ విధంగా కరువు నెదుర్కోవటంలో ప్రభుత్వ క్రియాశూన్యతకి ఉదాసీనతో, లేక అజాగ్రత్తో కారణం కాదు. కాకపోగా దాని తక్షణ ప్రతిస్పందనలోకాని, అలాగే దీర్ఘకాలిక ప్రణాళిక విషయంలోగానీ గ్రామీణ ప్రజారాసులను ఇచ్ఛాపూర్వకంగా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఒక ఎన్డిఏ ప్రభుత్వం అనే కాదు అన్ని పార్టీల వైఖరిలోనూ ఇదే వైఖరి పొడసూపుతోంది. ఇది ఎంత మొరటుగా వ్యక్తమైందంటే లోక్‌సభలో కరువు పరిస్థితులపై ఐదుగంటల చర్చ జరిగితే కేవలం 55 మంది ఎంపీలే పాల్గొన్నారు. అంతకంటే ఘోరంగా, కరువు నివారణకు ఏమాత్రం నిధులు లేవని ప్రభుత్వం ప్రకటిస్తున్నపుడే, మే నెల మొదట్లో బి.జె.పి.కి చెందిన మంత్రి ప్రమోద్ మహాజన్ కోట్ల రూ॥ల ఖర్చుతో యం.పి.ల సౌకర్యాల పెంపుకి సంబంధించిన బిల్లును సభలో ప్రవేశపెట్టాడు. కనీస చర్చ లేకుండా ఇది అన్ని పార్టీల మద్దతుతో సభామోదం పొందింది.

## రాష్ట్రాల ప్రభుత్వాలకు సిద్ధాన్నమూ, ప్రజలకు మన్నా మశానమూ

'కరువు సహాయం' అనేది స్థానిక రాజకీయ నాయకులకు, బ్యూరాక్రాట్లకి బంగారు బాతుగుడ్డు లాంటిది. ఇంత వేగంగా ఏ రంగంలోనూ లాభాలు సంపాదించలేరు. సంక్షోభ నివారణకిగానూ ప్రకటించే అభివృద్ధి పథకాలలో భాగంగా కేటాయించే నిధులు ఈ పథకాలు అమలయ్యే కాలం పొడవునా తరలి వస్తూనే వుంటాయి. అపార మొత్తాలు తక్షణం మంజూరవుతాయి కాబట్టి విపత్తు నివారణ పథకాలు రాత్రికి రాత్రే లక్షాధికారులను చేసేస్తాయి. సర్వస్వం కోల్పోయిన ప్రజలు గడ్డిపోచస్థాయి మొత్తానికి సైతం వెంపర్లాడు తుంటారు కాబట్టి ఈ నిధుల పంపిణీలో లెక్కా జమా అనేవి కలికానికూడా వుండవు. సరిగ్గా ప్రజల ఈ దుర్భర పరిస్థితినే రాబందులు విందుగా మార్చుకుంటాయి.

అందుకే....అది గుజరాత్‌లో బి.జె.పి. ప్రభుత్వమయినా, రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వమయినా, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వమయినా, ఒరిస్సాలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వమైనా సరే కరువు పీడిత ప్రజలపట్ల దృక్పథానికి సంబంధించి వీరంతా ఒకటే. కేంద్రం నుంచో, ప్రపంచబ్యాంకు నుంచో లేక ఏ ఇతర దాత నుంచైనా సరే పెద్ద మొత్తంలో నిధులు వసూలు చేసుకోడానికి, వాటిని కరువు పీడిత ప్రజలపై అల్పాతిఅల్పంగా మాత్రమే ఖర్చుపెట్టి మొత్తాన్ని దిగమింగడానికి ఇది ప్రాథమికంగా అద్భుతమైన మార్గం మరి. జరిగిన మానవ విషాదాన్ని సంఖ్యలో తగ్గించి చూపడంలో ప్రతి ప్రభుత్వమూ పోటీ పడుతుంది. అందుకే విపత్తు జరిగిన ప్రతిసారీ, పోషకాహార లేమివల్ల, వ్యాధుల కారణంగా, డీహైడ్రేషన్‌వల్ల ఎంతమంది చనిపోయారన్న దానికి సంబంధించి ఏనాడూ సరైన లెక్కలుండవు. కానీ జరిగిన సహాయ పనుల గురించి అర్ధసత్యాలు, లేక పచ్చి అబద్ధాలు చెప్పడంలో మాత్రం ప్రతి ఒక్కరూ పోటీ పడతారు.

పై నాలుగు రాష్ట్రాలలోనూ ఎటువంటి సహాయమూ అందని గ్రామాల గురించి సమగ్రమైన రిపోర్టులు వస్తూనే వున్నాయి. మంచినీటి టాంకులు వెళ్ళినచోట సైతం ప్రజలు తరచుగా కాంట్రాక్టర్‌కి 500 నుంచి 600 రూ॥ల దాకా ఇచ్చుకోవలసి వచ్చింది. అదనంగా ఇచ్చిన 20 కిలోల ఆహార ధాన్యం గ్రామాలకు చేరలేదు. కానీ చేరిన గ్రామాల్లో సైతం పెరిగిన ధరల రీత్యా ధాన్యాన్ని కొనేవారు లేకుండా పోయారు. ఇక 'పనికి ఆహారం పథకం'గా పిలవబడుతున్నది పై కుంభకోణాల్లోకెల్లా పెద్ద కుంభకోణంగానూ, డబ్బును కొల్లగొట్టేదిగానూ వుంటోంది. అత్యంత నిరాశాపూరిత పరిస్థితులలో మానవ మనుగడకు ఈ పథకమొక్కటే నిజమైన వనరుగా వున్నప్పటికీ రాజకీయ రాబందులు ఈపథకం నుంచే పెద్ద మొత్తాలను దిగమింగుతారు. సహాయ నిధులలో చాలా భాగం ఈ పథకంలోకే వస్తాయి. అనేక ప్రాంతాలలో, ప్రత్యేకించి ఆంధ్ర, ఒరిస్సాలలో ఈ

పథకాలు అమలైన ప్రాంతాల్లో చాలా కొద్దిమందికే పని కల్పించారని, అలా పని దొరికిన వారికి కూడా అధికారిక రేటులో చాలా తక్కువ భాగమే కూలీ కింద ముట్టిందని గ్రామీణ ప్రజలు ఆరోపించారు. నిజంగా పనిలోకి దిగిన వారికంటే రెట్టింపు సంఖ్యలో కూలీలను పేర్కొని కాగితాలలో చూపించారు. మరీ దారుణమైన విషయమేమిటంటే ఈ పథకం కింద రిజర్వాయిర్లను, చెక్‌డ్యామ్‌లను, మడుగులను ఇతర నీటి నిల్వ పథకాలను నిర్మించడానికి బదులు చాలా వరకు రోడ్డుపక్కగల విలువలేని ప్రాజెక్టుల మీదే కాసిన్ని నిధులను సైతం వ్యర్థపుచ్చారు. రాజకీయ నాయకులు, బ్యూరాక్రాట్లు, కాంట్రాక్టర్ల ముఠా ప్రతి విపత్తు సందర్భంగా ప్రజల ప్రాణాలపై 'కాసుల పందెం' ఆడటాన్ని చూస్తూ వచ్చిన ప్రజలు ఈసారి ప్రభుత్వ వ్యవస్థ తమకు తాగునీటిని సైతం అందించక, పైగా విపత్తు సమయంలో నీటి రాజకీయాలను మొదలెట్టడంతో ఇక సహించలేక తిరగబడ్డారు. గుజరాత్‌లో పల్లెల్లో పట్టణాల్లో కూడా నీటి సరఫరా కల్పించక పోవటంతో పట్టణ మేయర్లపై మునిసిపల్ అధికారులపై దాడులకు దిగారు. స్థానిక డ్యామ్ నుండి జామ్ నగర పట్టణానికి నీటిని మళ్ళించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఫల్లా గ్రామస్థులు అడ్డుకుని రాస్తారోకో చేస్తే పోలీసు కాల్పుల్లో ముగ్గురు రైతులు చనిపోయారు. నీటికోసం డిమాండ్ చేసే ప్రజలకు ఇవాళ తూటాలను, లాఠీచార్జీలను ప్రసాదించటం దేశవ్యాప్తంగా మామూలు వ్యవహారమైపోయింది.

## ప్రపంచబ్యాంకు పథకాల కారణంగా నిలువునా దోచేయబడుతున్న గ్రామీణ ప్రాంతం

భారతదేశంలో సగటు వర్షపాతంకంటే అధికంగా వర్షాలు పడతాయి. కానీ సగటు నీటి వినియోగం తక్కువ... ప్రపంచ సగటు వర్షపాతం 800 మిల్లీ లీటర్లు కాగా భారతదేశంలో మరో 300 మి.మీ. వర్షం అధికంగా పడుతుంది. అయితే దేశంలో లభ్యమయ్యే తాజానీటిలో 2/3 వ వంతు నీరు ఆవిరవటం లేక సముద్రంలోకి పోవటం జరుగుతోంది. అందుకే ప్రపంచ తలసరి నీటి లభ్యత 8,500 క్యూబిక్ మీటర్ల మేరకు వుండగా దేశంలో తలసరి 2,300 క్యూబిక్ మీటర్ల నీరే లభ్యమవుతోంది. నీరు అపారంగా లభ్యమౌతున్నపుడు ఈ తరహా కొరత ఎందుకొస్తోంది? దీనికి చరిత్రనోసారి తడమాలి. 1947లో భారతదేశ తలసరి నీటి లభ్యత 6,000 క్యూబిక్ మీటర్లుగా వుండేది. అంటే భారతీయ సాంప్రదాయిక జల సంరక్షణ పథకాలను చాలా వరకూ కుప్పకూల్చేసిన బ్రిటీష్‌వారి 180 సం॥ల వలస పాలన తర్వాత సైతం తలసరి నీటి లభ్యత దేశంలో ఇంత స్థాయిలో వుండేది. అలాంటిది భారతీయ నల్లదొరలు పాలించిన కేవలం 50 సం॥లలో అది 2,300 క్యూబిక్ మీటర్లకు పడిపోయింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన లాభార్జన తత్వంగల గ్రామీణ పథకాలే ఈ వినాశనానికి కారణం. ఈ పథకాలలో చాలా వరకు సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం ప్రపంచబ్యాంకు నిర్దేశించి రూపొందించినవే.

భూగర్భ జలాలను తోడి పారేయటమే ప్రస్తుత వినాశనానికి మూల కారణం. ఇంతకుముందయితే, ఒక ఏడు రుతుపవనాలు విఫలమయినా, అది బావులు, చెరువులు, నదులు మున్నగు వాటిని ఎండిపోయేలా చేసేది కాదు. భూగర్భంలో నీటిమట్టం బాగుండటంవల్ల, ఒకవేళ రుతుపవనాలు విఫలమైనా, గ్రామీణ జనాభాకు ఏదో ఒక మేరకు మనగలిగే పరిస్థితులుండేవి. ఇప్పుడు నాలుగు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంత మూలుగులను పీల్చేసినందువల్ల పరిస్థితి ఎంత దిగజారి పోయిందంటే వర్షపాతంలో ఒక శాతం మేర తరుగుదల ఏర్పడినా మొత్తం జల వనరులే అడుగంటి పోతున్నాయి. ఇంతేకాదు 11 సం॥లుగా రుతుపవనాలు వరుసగా బాగానే వస్తున్నా గ్రామీణ ప్రాంతంలో చాలా వరకు వేసవిలో బీళ్ళయిపోతున్నాయి. జనాభాలో అధిక భాగం నీటి టాంకులపై ఆధారపడుతున్నారు. లాభాలు తప్ప మరేమీ చూడని రాబందులు భారతీయ గ్రామీణ వ్యవస్థకు నిర్దాక్షిణ్యంగా కల్గించిన చేటు ఇంతగా వుంది.

**భూగర్భ జలమట్టం పడిపోవటానికి అత్యంత ప్రధాన కారణాలు రెండు. 1. అడవుల నిర్మూలన, 2. హరిత విప్లవ విధానాలు. ప్రపంచ బ్యాంకే ఈ రెంటినీ ప్రవేశపెట్టింది. అంతేకాదు. వాటికి నిధులు కూడా తానే ఇచ్చింది. వీటికేసి చూద్దాం.**

కలప కోసం అడవుల నరికివేత, గనుల తవ్వకం ఒకే పంట విధానాలు వంటివి కరువు, వరదల సృష్టికి అతి ప్రధాన కారణాలు. అటవీ పరీవాహక ప్రాంతాలు నిర్మూలించబడటం, లేదా వాటి స్థానంలో ఒకే పంట విధానాలు (మోనో కల్చర్స్) వచ్చి చేరినపుడు పర్యావరణ వ్యవస్థలు నీటిని లోపలకు పీల్చుకోవటం, నేలను చెమ్మగిల్ల జేయటం అనే పనుల్లో తమ సామర్థ్యాన్ని కోల్పోతాయి. దీంతో రుతుపవనాల కాలంలో వర్షపునీరు నేలమీద పడిన వెంటనే వురకలేస్తూ శరవేగంతో పల్లానికి పోతూ వరదలకు దారితీస్తుంది. వివిధ అవసరాల పేరిట అటవీ పరీవాహక ప్రాంతాలను కుదించి వేసినపుడు వర్షం సమతలంగా పారుతూ నేలపైనుండి భూమి పొరల్లోకి నీరు చేరే ప్రక్రియ దెబ్బతింటుంది. ఈ పరిస్థితి మరోవైపు వేసవిలో వాగుల్ని, నదులను ఎండిపోయేలా చేస్తుంది. వరదనీరు వచ్చి పడిందే ఆలస్యంగా 'ఇరుకైన నదులగుండా' వేగంగా సముద్రాల్లోకి చేరిపోతున్నపుడు భూగర్భజలం పొంగి ఊరటం అనే ప్రశ్నే లేదు. భూమ్మీద అడవులను నిర్మూలించే కార్యక్రమాల వల్ల అటవీ పరీవాహక ప్రాంతాలు కుదించుకుపోయి మానవ నివాస ప్రాంతాలు వరదలను, నీటి ఎద్దడిని ఏకకాలంలోనే చవిచూస్తుంటాయి. ఏక పంట విధానం ఈ పర్యావరణ విధ్వంసాన్ని తారాస్థాయికి తీసుకు పోయింది.

ఈ నాలుగు దశాబ్దాలలో విస్తారమైన అటవీ ప్రాంతాలు నరికి వేయబడినాయి. అటవీశాఖే ఇందుకు ప్రధాన దోషి. ఇది కాంట్రాక్టర్లతో, అటవీ మాఫియాలతో కుమ్మక్కైంది. దీనికి తోడుగా గనులు, పెద్ద పెద్ద డ్యాములు వంటి వాటితో కూడిన భారీ 'అభివృద్ధి' పథకాలు అటవీ ప్రాంతాన్ని అధిక మొత్తంలో తొలగించివేశాయి. ఉద్దేశ్యపూర్వకంగా, అభీష్టానుసారంగా చేసిన ఈ విధ్వంసంవల్ల 33శాతం కనీస పరిమాణంలో వుండాల్సిన దేశ అటవీ ప్రాంతం ఇప్పుడు కేవలం 19 శాతానికి పడిపోయింది. ఇదయినా అధికారిక ప్రకటనలే. వాస్తవానికి ఇది మరింతగా పడిపోయే వుంటుంది. దీనికి తోడుగా అటవీ ప్రాంతంగా ఇప్పుడు ప్రకటించబడినది చాలావరకు టేకు, యూకలిప్టస్ వనాలే తప్ప దట్టమైన అడవుల రూపంలో లేదు. ఇదంతా పెనులాభాలను కొల్లగొట్టేందుకుగాను సంపద్వంతమైన వైవిధ్యపూరితమైన అడవులను నరికివేసి పై విధంగా ఏకజాతి మొక్కల, వృక్షాల సంస్కృతిని బలవంతంగా రుద్దిన ప్రపంచబ్యాంకు పథకాల ఫలితం మాత్రమే. వాణిజ్య అవసరాల కోసం ఒకేజాతి

మొక్కలను, ఒకే జాతి అడవులను కృత్రికమంగా పెంచటమన్నది ప్రకృతి పర్యావరణ వ్యవస్థను ధ్వంసం చేసివేసింది.

1995 నుంచి 1997 దాకా కేవలం రెండు సం॥రాల లోపే 5,500 చదరపు కి.మీ. మేర అడవులు తరిగిపోయాయంటే అటవీ ప్రాంతం ఎంత వేగంగా అంతరించి పోతున్నదో అర్థమౌతుంది. అయితే ఈ వాస్తవం సైతం శరవేగంగా అడవుల నిర్మూలన జరుగుతున్న పరిణామాల్లోని విధ్వంసాన్ని సమగ్రంగా చిత్రించటంలేదు. అడవులు పరీవాహక ప్రాంతాలుగా (eatchment- వర్షపునీరు పల్లానికి పారటం ద్వారా ఒక నది పుట్టినచోటు నుండి సముద్రంలో కలిసేవరకూ దానిచుట్టు ప్రక్కల ఎంత విస్తృతిగల ప్రాంతం నుండి వర్షపునీటిని పొందుతుందో ఆ ప్రాంతం మొత్తాన్ని నదీపరివాహక ప్రాంతం, వాటర్‌షెడ్ లేక 'అరగాణి' అంటారు. అంటే ఈ పరీవాహక ప్రాంతం అడవుల్లోంచే మొదలవుతుంది) పనిచేయాలంటే వృక్షాల సాంద్రత తగు ప్రమాణాల్లో వుండాలి. అంటే చెట్లు దట్టంగా వుండాలి. అయితే ప్రభుత్వ అధికారిక అటవీ గణాంకాల ప్రకారం పొదలు, తుప్పలు కూడా అడవుల కిందే లెక్క. వాస్తవంగా చూస్తే, ఒక స్వచ్ఛమైన అడవి ((Virgin Forest) లో మూడింట ఒక భాగం చెట్లు కొట్టేయటం జరిగినా సరే, వర్షపు నీటిని నిల్వచేసి నేలకోతను నిలువరించే సామర్థ్యాన్ని ఆ అడవి కోల్పోయినట్లే అవుతుంది. ఈ లెక్కన 1995-97 రెండు సం॥ల వ్యవధిలోనే 20వేల చదరపు కి.మీ. ప్రాంతంలో దట్టమైన అడవులు క్షీణించిపోయి పలుచబారి (ఓపెన్ పారెస్ట్స్) పోయాయి. అంటే కేవలం రెండేళ్ళలో మొత్తం దట్టమైన అటవీ ప్రాంతంలో 6 శాతం క్షీణించి పోయింది. పరిసరాలకు, పర్యావరణానికి ఈ భారీ క్షీణత ఎంత విధ్వంసాన్ని కొనితెచ్చిందో కరువుల, వరదల వెల్లువ తేటతెల్లం చేస్తూనే వుంది కదా!

ఇలా ఒకవైపున అటవీ విధ్వంసం కారణంగా ఊటజలాలు క్షీణించిపోగా, మరోవైపు హరిత విప్లవ అవసరాలను తీర్చేందుకోసం భూగర్భ జలాలను ఉన్మాదపూరితంగా వెలికితోడేయటం జరిగింది. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, ట్రాక్టర్లు వగైరాలకు సామ్రాజ్యవాద మార్కెట్ కల్పించటం కోసం మన దేశంలో 1960ల చివర్లో హరిత విప్లవం ప్రవేశపెట్ట బడింది. అయితే ఇందుకు అవసరమైన సాగునీటి సదుపాయాల వ్యవస్థను సృష్టించకుండానే ఈ నూతన వ్యవసాయ విధానాన్ని దేశంలో ప్రవేశపెట్టినందువల్ల బోర్‌వెల్స్‌ని తవ్వటమొక్కటే సత్వరమైన, చౌక అయిన వనరుగా భావించి ప్రపంచబ్యాంకు దేశాన్ని బోర్‌వెల్స్ మార్గానికి మళ్ళించేసింది. అటు తర్వాత కరువులను తట్టుకుని నిలిచే దేశీయ విత్తనాల స్థానంలో రసాయనాలకు అత్యధికంగా స్పందించే తరహా అధిక దిగుబడి వంగడాలను ప్రవేశపెట్టింది. అయితే ఈ అధిక దిగుబడి విత్తనాలు పురాణాల్లోని బ్రహ్మ రాక్షసుల్లాంటివి. ఇవి ఎదిగి కాపుకు రావాలంటే దేశీయ విత్తనాలకన్నా 3 లేక 4 రెట్ల పరిమాణంలో నీటిని చెడతాగేస్తాయి. అంతేకాకుండా హరిత విప్లవ నమూనా అయి ఒకేపంట సాగు పద్ధతులు పంటల వైఫల్యం ప్రమాదాన్ని పెంచివేశాయి ఉదా॥కు ఏక పంటగా పండే జొన్నపంట 8 సం॥లకోసారి (బఠాణి) పంట 5 సం॥లకోసారి విఫలమవుతున్నట్లు శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. అదే సమయంలో జొన్న, బఠాణిలతో కూడిన అంతర (ఇన్నర్ క్రాప్) పంట 36 సం॥ల కొక్కసారి మాత్రమే విఫలమవుతుందని తేలింది.

ఈరోజు వ్యవసాయోత్పత్తికి అవసరమైన సాగునీటిలో 70 నుండి 80 శాతం దాకా భూగర్భజలం నుండీ వస్తోందన్న వాస్తవంనుండే, నీటిని భారీ మొత్తంలో పీల్చి పడేస్తున్న వ్యాపార పంటల ప్రవేశంతో మన భూగర్భ జలం ఎంతగా నాశనమవుతోందో అర్థం చేసుకోవచ్చు. భూగర్భజలాన్ని ఇంత నిర్దాక్షిణ్యంగా తోడేయటం పంట దిగుబడిపై రాబడులు పడిపోయేందుకు దారి తీస్తోంది. ఆహార ధాన్యాల దిగుబడి పెరుగుదల రేటు 1980లలో 2.35 శాతంకి పడిపోయింది. అట్లే వ్యవసాయ సాగుభూములు 1990-91లో 128 మిలియన్ హెక్టార్ల మేరకు వుండగా 1998-99 నాటికి అవి 126 మిలియన్ హెక్టార్లకు పడిపోయాయి. దశాబ్దం పైకాలంగా రుతుపవనాలు వరుసగా వస్తున్నప్పటికీ పంట దిగుబడి, సాగుభూమి రెండింటిలో క్షీణత తప్పనిసరైంది.

కాబట్టి ఏ విధంగా చూసినా మన వ్యవసాయ విధానం వినాశకరంగానే వుంటోంది. నీటి నిల్వలు, నీటిని తిరిగి తోడుకోవటం ధ్వంసమైపోయాయి. పంట దిగుబడులలో పెరుగుదల నామమాత్రంగానే వుంది. సాగు కింది భూమి తగ్గిపోతోంది. ప్రస్తుత కరువుకి, దుర్భిక్షానికి నిజమైన కారణం ఇక్కడే వుంది. ఇక గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెడుతున్న ఖర్చు కూడా పడిపోతే, వ్యవసాయంలో వినాశనానికి సంబంధించిన చిత్రం పూర్తవుతుంది.

## పరిష్కారమేమిటి?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యపట్ల ఏమాత్రం స్పందించలేదు. ఈ ప్రభుత్వాలు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉన్నత వర్గాలకు నీరు ఒక సమస్యే కాదు....వీళ్ళు తమ బోర్‌వెల్స్‌ని మరింత లోతుగా తవ్వుకుంటారు. లేకపోతే టాంకర్ల ద్వారా నీటిని కొంటారు...నీరు ఎంతగా కలుషితమైవున్నా, నీటిశుద్ధి సామాగ్రి (వాటర్ ప్యూరిఫైయర్స్) వీరి సొంత వాడకానికి ఇన్ఫెక్షన్లు సోకని మంచినీటిని అందిస్తాయి....ప్రస్తుత కరువు తాకిడి ప్రాంతాలలో ఈ వర్గ వ్యత్యాసాలు స్పష్టంగా కన్పిస్తూనే వున్నాయి. అగ్రకుల సంపన్న రైతాంగ సెక్షన్లు నీటిని కొనగలగడమే కాదు. దళితుల నీటి అవసరాన్ని తొక్కిపెట్టగలరు కూడా. దొరికే కాసిని నీళ్ళు తెచ్చుకోనీయకుండా దళితులకు అడ్డుపడుతున్నారని కొన్నిచోట్ల తామంతా పట్టుకున్న తర్వాతే దళితులకు చివరలో నీళ్ళు వదులుతున్నారని పలుచోట్ల నుండి రిపోర్టులందాయి. ఇక పట్టణ ప్రాంతాలలో సంపన్నులు ట్యాంకర్ల ద్వారా సరఫరా అయ్యే నీటిని డబ్బిచ్చి కొంటున్నారు. ఎటొచ్చీ పేద మధ్యతరగతి వర్గాలవారే ఇక్కట్ల పాలవుతున్నారు. ప్రభుత్వ నీటి పథకాల మీద వీరే పూర్తిగా ఆధారపడుతున్నారు. అయితే సమీప భవిష్యత్తులో ఇవి సైతం లభ్యం కాకపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రైవేట్ బోర్‌వెల్స్‌ని దింపే విధానం ఇప్పటికే నీటి సరఫరాకి సంబంధించి వాస్తవంగానే నీటి ప్రైవేటీకరణను తెచ్చేసింది. ఇప్పుడు ప్రభుత్వం నీటి పబ్లిక్ పంపిణీని కూడా ప్రైవేటీకరించాలని పథకమేస్తోంది. అంతేగాక నీటి వాడకం చార్జీలను అపారంగా పెంచివేసేందుకు సిద్ధమవుతోంది. దీంతో ఆహారమే కాక నీళ్ళు సైతం లభ్యంకాని స్థితిలో పేద, మధ్య తరగతి ప్రజల పరిస్థితి మరింత దుర్భరమౌతుంది.

నీటి ప్రైవేటీకరణ రంగంలోకి ప్రధాన యం.యన్.సి.లన్నీ అడుగు పెట్టడం, నీటి ప్రైవేటీకరణకు ప్రపంచబ్యాంకు తీవ్రంగా

ఒత్తిడి చేయటం వల్ల నీటి ప్రైవేటీకరణ ప్రపంచ వ్యాప్తంగా లాభసాటి వ్యాపారంగా మారుతోంది. నిజానికి ఈ సం॥రం మార్చి 17-22 తేదీల మధ్య నీటి సమస్యపై 'రెండవ ప్రపంచ నీటి సదస్సు మరియు మంత్రిత్వ కాన్ఫరెన్స్' హేగ్ పట్టణంలో సమావేశమైంది. ఈ ఫోరమ్ నుండి నీటికి సంబంధించిన ఒక 'విజన్' రూపొందింది. ఇది నీటిపైన, నీటి సర్వీసులపైనా పూర్తిస్థాయి చార్జీలను విధించాలనే భావనను పూర్తిగా బలపర్చింది. ఈ 'విజన్' ఇంకా ఇలా చెబుతోంది. ''బహిరంగ మార్కెట్‌లో పోటీపడుతూ, నీటి హక్కులు, ధరల ఫార్ములాలను స్పష్టంగా నిర్వచించేటటువంటి జాతీయ, అంతర్జాతీయ రెగ్యులేటరీ వ్యవస్థలలో భాగమైవున్నటువంటి; పారదర్శకత, జవాబుదారీతనం కలిగివున్నటువంటి ప్రైవేట్ వాటర్ కంపెనీల ద్వారా మాత్రమే ఈ నీటి సర్వీసులు అందించబడాలి''. అందుచేత ఈ ప్రపంచ నీటి సదస్సు ప్రపంచ వ్యాప్తంగా నీటి ప్రైవేటీకరణకు సంబంధించిన సమగ్ర నమూనాని రూపొందించింది. దాస్య ప్రవృత్తితో కూడిన భారత ప్రభుత్వం ఇప్పటికే తలవంచి, దేశంలోకి ఇప్పటికే చొరబడిన ఒక ప్రముఖ ఫ్రెంచ్ టి.యన్.సి.తో కలిసి నీటి సరఫరా ప్రైవేటీకరణలో పాలు పంచుకుంటానని ప్రకటించేసింది. ఈ పాలసీకి అనుగుణంగా సి.ఐ.ఐ. అధినేత భరత్‌రామ్ మే 4న ఒక ప్రకటన చేస్తూ నీటి వాడకానికిగాను ప్రభుత్వం వినియోగదారుల నుండి వాడకపు చార్జీలను వసూలు చేయాలని కూశాడు.

ఈ విధంగా ఇదొక ప్రకటిత విధానం కాగా ప్రస్తుత కరువు నేపథ్యంలో వీళ్ళెవరూ నోరు విప్పడంలేదు. ఈ కారణంగానే 'నూతన జల విధానం'పై చర్చ కోసం సమావేశాన్ని వాయిదా వేశారు కూడా. అంటే, కరువు వాతావరణం పోగానే నిస్సందేహంగా ఇది ఆమోదింపబడుతుంది. ఈలోగా ప్రజల్ని మోసపుచ్చడానికిగాను ప్రభుత్వం మరిన్ని కుతంత్రాలకు, జిత్తులకు పాల్పడుతోంది. ఒకవైపు స్థానిక వాటర్‌షెడ్ నిర్మాణాల గురించి గొంతెత్తి అరుస్తూనే ప్రభుత్వం మరోవైపు 3.3 లక్షల కోట్ల రూ॥ల విలువైన గంగా-కావేరి లింక్ ప్రాజెక్టు గురించి సోది చెబుతూనే వుంది. అయినా, రాష్ట్రపతి స్విమ్మింగ్‌పూల్, సుందరోద్యానవనాల నీటి అవసరాన్ని తీర్చేందుకు, రాష్ట్రపతి భవన్‌లో నీటినిల్వ నిర్మాణాలను ఏర్పర్చటం కూడా జరిగిపోయింది కదా...నీటి నిల్వ, ఈతకొలనులూ.... పొంతన బాగానే వుంది కదా!

ప్రభుత్వం నీటి ప్రైవేటీకరణ వైపు అడుగులేస్తుండగా, మరోవైపు ప్రభుత్వేతర సంస్థలు, ప్రైవేట్ పార్టీలచే వాటర్‌షెడ్ నిర్మాణాల గురించి మీడియా గొంతెత్తి అరుస్తోంది. టెక్నికల్‌గా ఇది సాధ్యమే అయినా బయటినుంచి గుమ్మరించ బడుతున్న అపార నిధులతోటే ఇవి నిర్మించబడుతున్నాయి. ఉదా॥కు గుజరాత్‌లోని భావనగర్, రాజ్‌కోట్, జునాగడ్‌లలోని 100 గ్రామాలకు నీరందించే వాగులపై నిర్మించిన 210 డ్యాములకు సంబంధించి వజ్రాల వ్యాపారులు కోటి రూ॥ల మదుపు పెట్టగా గ్రామీణులు 35 లక్షల రూ॥లను మదుపు పెట్టారు. గ్రామీణ ప్రాంతంలో, ప్రత్యేకించి అత్యంత దారిద్ర్య పీడిత ప్రాంతాలలో ఇటువంటి ప్రాజెక్టులు అసాధ్యమే అవుతాయి. నిజానికి యన్.జి.ఒ. స్కీమ్‌లలో చాలా వరకు ఎగువ మధ్యతరగతి, ధనిక రైతులకే మేలు చేస్తున్నాయి.

మంచినీరు, సాగునీరు ప్రజలకు అందాలంటే మొట్టమొదటగా అది మరింత న్యాయబద్ధమైన జలపంపిణీ ద్వారానే సాధించబడాలి. సహజంగానే దేశంలో భూమి, ఇతర ఆస్తి సంబంధాల నిష్పాక్షిక పంపిణీ ద్వారానే ఇది సాధించబడగలదు. అప్పుడు మాత్రమే విలాసాలలో, టూరిజంలో, కోకోకోలాల రూపంలో ఉన్నత వర్గాలు వ్యక్తిగతంగా పెడుతున్న రోతపుట్టించే వినియోగం నిలిచిపోయి, దారిద్ర్య పీడితులు తమ కనీస అవసరాలైనా పొందగలుగుతారు. కాని, ఇటువంటి న్యాయబద్ధమైన ఆస్తి సంబంధాలూ, జల పంపిణీలనేవి ఈ వ్యవస్థ పరిమితుల్లో అసాధ్యంకాగా, నూతన ప్రజాస్వామిక విప్లవంతో ఈ వ్యవస్థను కూలదోయటం ద్వారా మాత్రమే అవి సాధ్యమౌతాయి.

వాటర్‌షెడ్ సంరక్షణ పథకాలకు సంబంధించి చూసినపుడు అవి పెట్టుబడి దృక్పథంతోకాక ప్రజల దృక్పథంతో మాత్రమే వుండాలి. అటవీ అభివృద్ధి పథకాలు, వాటర్‌షెడ్ స్కీమ్‌లూ, నేల పరిరక్షణ పద్ధతులూ వంటివి మొత్తంగా ప్రజారాసులను కదిలించటం ద్వారా, వారికనుకూలంగా వుండే వాతావరణంలో, వారి రాజకీయాధికార బలం ద్వారా మాత్రమే నిజంగా అమలవుతాయి. అడవి, భూమి, జలవనరులూ సమాజం మొత్తానికి చెంది వుండాలి. వీటిపైన ప్రజలకే సంపూర్ణ అధికారముండాలి. అప్పుడు, అటువంటపుడు మాత్రమే భూమిని పునరుజ్జీవింప జేయడానికి అది చిరకాలం నిలదొక్కుకుని అమలవుతాయి. స్థానికంగా ప్రజలు తమ అధికారాన్ని నెలకొల్పుకున్నపుడు శ్రమదానం ద్వారా స్వచ్ఛంద పనిని వారు మొదలెట్టినపుడు మాత్రమే ఇవి సాధ్యమవుతాయి. ఇది మాత్రమే స్థానికులలో సృజనాత్మక పనిని ప్రోత్సహించగలుగుతాయి. అయితే ఈ వ్యవస్థలో ఇవేవీ సాధ్యంకావు. విప్లవం ద్వారా మాత్రమే అలాంటి స్థానిక శక్తి నిలబడ గలుగుతుంది.

ఉత్తర తెలంగాణా, దండకారణ్య గెరిల్లాజోన్‌లలో సి.పి.ఐ. (యం-యల్) (పీపుల్స్‌వార్) సాధించినది ఇందుకు ఓ మంచి ఉదా॥గా నిలుస్తుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒకటున్నర దశాబ్దంపాటు సాయుధ పోరాటం సాగించిన తర్వాత ప్రజలు గ్రామస్థాయిలో ప్రత్యామ్నాయ రాజ్యాధికార అంగాలను ఏర్పర్చుకున్నారు. వీటిద్వారా ప్రజలు చెక్‌డామ్‌లు, నీటి మడుగులు, చెరువులు వంటి అభివృద్ధి పథకాలను అటవీ అభివృద్ధి పథకాలను అమలు చేయటం వంటి పనులు చేయగలుగుతున్నారు. చిన్నదీ, పెద్దది అని కాకుండా ఏ ప్రాజెక్ట్‌మీద అయినా ప్రజల ఆజమాయిషీ వుంటేనే అది నిజంగా ఫలవంతం కాగలదు. దీనికితోడు ఏ ప్రజా ప్రభుత్వమైనా వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. అప్పుడు మాత్రమే నీటి సమస్యకు వాస్తవ ప్రాతిపదికన పరిష్కారం లభిస్తుంది.

ఈలోగా, ప్రభుత్వం నీటి ప్రైవేటీకరణ విధానాన్ని త్వరలోనే ప్రవేశపెట్టనున్నందున పరిస్థితులు మరింతగా దిగజారనున్నాయి. విప్లవకర ప్రత్యామ్నాయ నీటి వనరుల పరిరక్షణ విధానం ఎంత ప్రాథమికంగా అయినా సరే దేశ ప్రజల ముందుకొచ్చింది. అది ప్రపంచబ్యాంకు ఆదేశాలతో అమలవుతున్న జన్మభూమిల, వాటర్‌షెడ్‌ల, జల సంరక్షణ సమితుల స్థాయి ఆర్భాటపు ప్రచారాలను పొందక పోవచ్చుకానీ, సామ్రాజ్యవాద సంస్థల నిధులతో దూసుకువస్తున్న ఈ రకరకాల నీటి ప్రైవేటీకరణ విధానాలు ప్రజల అవసరాలను యం.యన్.సి.ల వ్యాపార లాభాకాంక్షలకు బలిపెట్టడాన్ని నిరోధించాలంటే అందుకు ఏకైక మార్గం విప్లవకర ప్రత్యామ్నాయ నీటి వనరుల పరిరక్షణ విధానాలు మాత్రమే. ❑

# భార్త దేశంలో నీటి సంక్షోభం - ప్రపంచబ్యాంకు సృష్టి

దొంగతనం గురించి దొంగే బాగా చెప్పగలడన్నది జగమెరిగిన సత్యం. 21వ శతాబ్దం నీటి సంక్షోభ శతాబ్దమని, జల యుద్ధాలు జరిగే శతాబ్దమని ఈ మధ్యకాలంలో అమెరికన్ 'అంకుల్ శామ్'లూ, ప్రపంచబ్యాంకూ, ఐ.యం.యఫ్.లూ చేస్తూ వస్తున్న అంచనాలు పై సత్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి. ''ఎవరి కొంపలు గోదాట్లో కలిసినా తన కొంప మాత్రం కొల్లేరవకూడద''నుకునే అవధులు మీరిన వ్యక్తి స్వార్థానికి కారణభూతమైన పెట్టుబడిదారీ విధానమే, ప్రపంచంలో ప్రతి రంగంలోనూ తీవ్రమయిన సంక్షోభాలకు దారితీస్తూ వస్తోంది. ఆర్థిక సంక్షోభం, రాజకీయ సంక్షోభం, సాంస్కృతిక సంక్షోభం, పర్యావరణ సంక్షోభం, సహజ వనరుల సంక్షోభం.....ఇలా మానవ జాతికి, ప్రకృతికి సంబంధించిన ప్రతి సంక్షోభమూ వ్యక్తి స్వార్థాన్ని పరాకాష్టకు తీసుకుపోయిన పెట్టుబడిదారీ మూలాల్లోంచే పుట్టుకొస్తోంది. ఇప్పటికి 80 దేశాలలో తీవ్రస్థాయికి చేరిన నీటి సంక్షోభాన్ని ఈ ప్రాతిపదిక లోంచే చూడాలి. ఇలా కాకుండా 'ప్రకృతి వైపరీత్యాలం'టూనో, 'మానవ తప్పిదాలం'టూనో చేసే వ్యాఖ్యానాలన్నీ వాస్తవానికి మసిబూసి మారేడుకాయ చేసేవే తప్ప మరేమీ కావు. ప్రపంచంలో నీటి సంక్షోభాలకు కారకులైనవారే 'రేపటి జలయుద్ధాల' గురించి కోడై కూస్తూండటాన్ని ఈ నేపథ్యంలోంచే చూడాలి.

జల వనరుల సంక్షోభం ఇపుడు ఎంత తీవ్రస్థాయికి చేరిందంటే, ఈ అంశం దేశాల ఆర్థిక, రాజకీయ ఎజెండాల్లో ప్రధాన స్థానాన్ని ఆక్రమించడం ఇప్పటికే మొదలైంది. నీటి వినియోగంపై మనదేశంలోనూ, వివిధ రాష్ట్రాలు, జిల్లాలు, ప్రాంతాలు, చివరకు వర్గాల మధ్యకూడా వివాదాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జల వనరుల నిర్వహణపై వివిధ దేశాల ప్రభుత్వ విధానాలలో జోక్యం చేసుకుంటూ వస్తున్న ప్రపంచబ్యాంకు, తదితర దోపిడీ రుణ సంస్థలు ''కొండ నాలుకను నయం చేసే పేరుతో ఉన్న నాలుకనే కోసివేయడా''నికి సిద్ధమవుతున్నాయి. అవసరాలూ, ఉపయోగాల స్థానంలో లాభాలకు, అమ్మకాలకూ చోటిచ్చిన సామ్రాజ్యవాదం గత మూడు దశాబ్దాలుగా సాంప్రదాయక వ్యవసాయక విధానాలను నలిపివేసి వాణిజ్య వ్యవసాయ విధానాలవైపు భారతీయ పాలకవర్గాలను నడిపించింది. దీంతో శతాబ్దాలుగా చెరువుల, వాగుల రూపంలో దేశంలో సాగవుతూ వచ్చిన సాంప్రదాయిక వ్యవసాయ విధానాలు ప్రాధాన్యత కోల్పోయి, హరిత విప్లవం అడుగుపెట్టింది. ఈక్రమంలోనే వాణిజ్య పంటల సాగుకోసం బావులు, ట్యూబ్‌వెల్స్ వేయటం విపరీతంగా పెరిగింది. అధిక దిగుబడులకుగాను అధిక మొత్తంలో పెట్టుబడుల అవసరమే కాదు సాగునీటి లభ్యత కోసం ఇంధన శక్తి కూడా అందుబాటులో వుండాల్సి వచ్చింది. దీనివలన హరిత విప్లవ ప్రారంభంలో ప్రభుత్వాలు సులభ షరతులతో కూడిన రుణాలు అందజేయటమే కాక, విద్యుత్, డీజిల్‌లను కూడా సబ్సిడీకి అందజేస్తూ వచ్చాయి. హరిత విప్లవ ప్రారంభంలో నూతన వాణిజ్య వ్యవసాయ విధానాలకు ప్రోత్సాహమిచ్చేందుకు ప్రభుత్వాలు ధనిక రైతాంగానికి, భూస్వాములకు వరుసగా వ్యవసాయ సబ్సిడీలను ఇస్తూ పోవడాన్ని ప్రపంచబ్యాంకు, ద్రవ్య సంస్థలు ఏ మాత్రం వ్యతిరేకించక పోగా సబ్సిడీ విధానాలకు చేయూతనిచ్చాయి. భారతదేశంలో భూగర్భ జల వనరులకు ఆనాడే గండి పడింది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు వాణిజ్య స్వభావంతో పోటీపడి నీటిని తోడేయటం మొదలై సరిగ్గా 30 సం॥ రాలైనా కాకముందే దేశంలో నీటి వనరులు కరువై పోతున్నాయి.

వర్షాధార వ్యవసాయ విధానాలతో కొనసాగుతున్న ఏ దేశమైనా కరువుల బారిన పడక తప్పదు. భారతీయ రైతాంగం ఈ సత్యాన్ని ''వానరాకడ, ప్రాణం పోకడ తెలీదు'' అన్న సామెత ద్వారా చాలా స్పష్టంగా వ్యక్తీకరించింది. అతివృష్టి, అనావృష్టి రెండూ కూడా కరువులను, నీటి ఎద్దడిని అమాంతంగా పెంచివేస్తున్న చరిత్ర మనది. అందుకే కరువుల బారిన పడే అశేష ప్రజలకు భద్రత చేకూర్చడమన్నది ఏ ప్రభుత్వానికైనా అత్యంత ప్రాథమిక కర్తవ్యమౌతుంది. కాని ప్రపంచబ్యాంకు సాగిస్తూ వస్తున్న 'అభివృద్ధి సహాయ పథకాలు' దేశంలో కరువును, ఎడారీకరణను మరింతగా పెంచటమేగాక నీటి సంక్షోభానికి తలుపులు తెరచి వేస్తున్నాయి. గత మూడు దశాబ్దాలకు పైగా ప్రపంచబ్యాంకు మన దేశంలో పరిచయం చేసిన నూతన వాణిజ్య వ్యవసాయ విధానాలు దేశ వ్యాప్తంగా జల సంక్షోభాన్ని పరాకాష్టకు తీసుకు పోయాయి. ఒకే ఒక్క చిన్న ఉదాహరణతో దేశంలో నీటి సంక్షోభ తీవ్రతను ఎవరయినా అంచనా వేయవచ్చు. సాంప్రదాయకమైన బావులు, చెరువులకు నిలయంగా పేరుగాంచిన గుజరాత్‌లో ఈరోజు భూగర్భ జలాన్ని వెలికితీయాలంటే 1,500 నుంచి 1,800 అడుగుల లోతుకి భూమిని తవ్వాల్సి వస్తోంది. భూమిని ఇంత దారుణంగా పీడించిన ఫలితంగా గుజరాత్‌లో ఈరోజు చెరువులు, డ్యామ్‌లు, నదులు వంటి భూమి పై భాగంలో నీటిని నిల్వచేసే వ్యవస్థలు అడుగంటి పోయాయి. 1930లలో గుజరాత్‌లో 78 శాతం పైగా సాగునీటి అవసరాలను సాంప్రదాయిక బావుల ద్వారా పొందేవారు. అలాంటిది కేవలం 70 సం॥లలోనే....ఇంకా చెప్పాలంటే హరిత విప్లవం మొదలైన గత 30 సం॥లలోనే గుజరాత్ రాష్ట్రం తన జలవనరుల సంపదను మొత్తంగా కోల్పోయింది. ఇది గుజరాత్‌కే పరిమితమైనది కాదు. దేశం మొత్తం పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ఇలా ఎందుకు జరిగింది అంటే ప్రపంచబ్యాంకు మన నెత్తిన రుద్దిన ప్రకృతి వ్యతిరేక, మానవ వ్యతిరేక విధానాలనే వేలెత్తి చూపాలి.

## మన జలవనరులపై 'బ్యాంకు' నిర్వాకం

పాశ్చాత్య 'సహాయక సంస్థలు' రూపొందించిన రుణ విధానాల ఫలితంగా దేశంలో సాంద్ర (ఇంటెన్సివ్ ఇరిగేషన్) వ్యవసాయ పద్ధతులు మొదలైనాయి. నీటిని వినియోగించే తరతరాల సాంకేతిక జ్ఞానం నేలమీది బావుల (ఓపెన్ వెల్స్) నుంచి ట్యూబ్‌వెల్స్ (భూమి లోపల నుంచి నీటిని తోడేవి) రూపంలోకి మారింది. భారతదేశంలో ఇప్పుడు కరెంట్ లేక డీజెల్ ద్వారా నడిచే 'శక్తి ఆధారిత' (energised)

బావులు కోటి 70 లక్షల దాకా వున్నాయి. ఇలా భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడేయడాన్ని ప్రోత్సహించడంలో ప్రపంచబ్యాంకుదే 'నెంబర్ వన్' స్థానం. భారతదేశంలో నీటి సంక్షోభానికి సంబంధించిన అత్యంత ప్రధానాంశంగా ఇదే నిలుస్తుంది. ఇంతటితోనే సరిపోలేదు. గుజరాత్‌లోని ప్రస్తుత నీటి ఎద్దడి, 1985-86 నాటి నీటి ఎద్దడి సమస్యలో జోక్యం చేసుకున్న ప్రపంచబ్యాంకు విధానాల ఫలితమే. 1985-86లో గుజరాత్‌కి ప్రత్యేక రైళ్ళు, టాంకర్లు, ఒంటెలు, ఎద్దులబండ్లు ద్వారా తాగునీటిని ఇతర ప్రాంతాల నుంచి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో 86 కోట్ల రూ॥లను ప్రభుత్వం తాగునీటికై ఖర్చుచేసినా సమస్య తీరలేదు. నూతనంగా నీటి వనరులు లభ్యం కాకపోవడంతో పాటు, 4,000 ట్యూబ్‌వెల్స్ ఎండిపోయాయి. ప్రభుత్వం మరిన్ని ట్యూబ్‌వెల్స్ కోసం మరో 93 కోట్ల రూ॥లను ఖర్చుపెట్టేందుకు సిద్ధపడింది. దీనికి అదనంగా 136 కోట్ల రూ॥ విలువైన ప్రపంచబ్యాంకు రుణంతో కూడిన నీటి సరఫరా పథకాన్ని సైతం గుజరాత్ పొందింది. కాని సాంకేతిక మదుపు, ఆర్థికపరమైన మదుపు రెండూ కూడా అప్పట్లోనే గుజరాత్‌కి తాగునీటిని సైతం అందించలేక పోయాయి. ఎందుకంటే నూతన వాణిజ్య వ్యవసాయ విధానాల ఫలితంగా అప్పటికే అక్కడి జలవనరులు హరించుకు పోయాయి.

ఇదే విధంగా 1980లలోనే మహారాష్ట్రలో నెలకొన్న నీటి ఎద్దడి సైతం ప్రపంచబ్యాంకు సృష్టిగానే మిగిలింది. భూగర్భ జలాన్ని మహారాష్ట్రలో సాంప్రదాయకంగా (భూమి పైనుండి తవ్విన) బావుల ద్వారానే తోడటం వుంది. ఈ రాష్ట్ర సాగుభూమిలో 60 శాతం దాకా 9.39 లక్షల బావుల ద్వారా సాగయ్యేది. మహారాష్ట్ర భూభాగంలో 93 శాతం పైగా దక్కన్ పీఠభూమికి సంబంధించిన బండరాతి పొరలతో కూడి వుంటుంది. ఇక్కడ భూగర్భజలం లభ్యం కావటంకాని, దాన్ని తోడుకోవటం-రీచార్జ్-కానీ చాలా స్వల్ప స్థాయిలో వుంటాయి. ప్రకృతి సహజమైన ఈ జలవనరుల పరిమితిని ప్రత్యామ్నాయ విధానాలతోకాక, మరింత లోతుగా భూమిని తవ్వితీసే నూతన సాంకేతిక జ్ఞానం ద్వారా అధిగమించాలని ప్రపంచబ్యాంకు చేపట్టిన విధానాలు మహారాష్ట్రలో పరిస్థితిని మరింతగా దిగజార్చివేశాయి.

ఊరూరికీ ఓ కథ వుందో లేదో తెలియదుగానీ, భారతదేశంలో ప్రతి రాష్ట్రం, ప్రతి భూభాగం కథ ఇదే...ప్రపంచబ్యాంకు సృష్టించిన ఈ విపత్కర పరిస్థితికి తోడుగా, దాని 'మార్కెట్ సామర్థ్యతా తర్కం' ప్రకారం గుజరాత్‌లోని సంపన్నుల వినోదాల కోసం నిర్మించిన 'వాటర్ పార్క్'లకు, ఆ రాష్ట్రంలోని పశుల కాపర్ల నీటి అవసరాల కంటే ఎక్కువ విలువ వుంటుంది. ఆహార భద్రత కోసం చిరుధాన్యాలు పండించటం కోసం, కొనుగోలు శక్తి లేని ప్రజల దప్పికను తీర్చటం కోసం వాడే నీటికన్నా; పూల తోటల మీద, రొయ్యలమీద ఖర్చుపెట్టే నీటికి ఉత్పాదక ప్రయోజనం అధికంగా వుంటుదన్నది ప్రపంచబ్యాంకు ఫిలాసఫీ. మరోవైపు ఈ ఫిలాసఫీ బారిన పడిన పేద ప్రజలు తమ జీవితాలనే మార్పిడీ చేయటం ద్వారా తమకు లేని కొనుగోలు శక్తిని సృష్టించుకుంటున్నారు. పత్తి, పొగాకు వంటి వాణిజ్య పంటలకు అవసరమయ్యే లోతు బావుల (ట్యూబ్‌వెల్స్) తవ్వకానికయ్యే డబ్బు కోసం ఆంధ్రప్రదేశ్‌లో రైతులు తమ కిడ్నీలనే అమ్ముకున్నారు. శ్రమతోనే కాదు. కిడ్నీల అమ్మకంద్వారా తమ జీవితాల్ని ఫణంగా పెట్టికూడా ప్రజలు తమ కొనుగోలు శక్తిని పెంచుకోవచ్చున్న వికృతమైన, పరమ భయానకమైన ఆర్థిక సూత్రాన్ని ప్రపంచబ్యాంకు ఈ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆవిష్కరించింది. ఇలా కిడ్నీలు అమ్ముకునే ''అదృష్టానికి'' కూడా నోచుకోని అభాగ్యులు వాణిజ్య పంటల అంతిమ సారాంశాన్ని నిరూపిస్తూ ఆత్మహత్యల రూపంలో తమను తాము చంపుకుంటున్నారు. నీటిని జీవనాధార వస్తువుగా గాక వాణిజ్య వస్తువుగా మార్చిన క్రమానికి ఇవి కొన్ని ఉదా॥లు మాత్రమే.

## నీటి ప్రైవేటీకరణ ఎవరికోసం

ప్రపంచబ్యాంకు ఈ విధంగా తనకు తానుగా సృష్టించిన నీటి సంక్షోభాన్నే ఇపుడు జలవనరుల ప్రైవేటీకరణను, నీటి నిర్వహణలో ప్రైవేటీకరణలను ప్రతిపాదించటానికి బరితెగించి వాడుకుంటోంది. ఇది నీటి ఎద్దడిని, తత్సంబంధిత నీటి సంఘర్షణలను మరింతగా పెంచి పోషిస్తుందంతే. ప్రపంచబ్యాంకు ప్రకటిస్తోన్న జలవనరుల ప్రైవేటీకరణ ప్రతిపాదనలు పైకి మాత్రం స్థానిక సంస్థలకే నీటి వనరులపై పెత్తనమివ్వాలంటూ బీరాలు పోతున్నాయి. కానీ అవి వాస్తవంగా స్థానిక ప్రజలను ''ఉమ్మడి నీటి సొంతదార్ల'' స్థితి నుండి 'నీటి వినియోగదారుల' స్థానంలోకి నెట్టివేస్తున్నాయి. ఇంకా స్థానిక సంస్థలను ప్రైవేట్ సెక్టర్‌తో సమానం చేస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ప్రభుత్వేతర సంస్థలను, ప్రైవేట్ సెక్టరును ఒకే విభాగంలోకి చేర్చటం ద్వారా ప్రైవేటీకరణ నేపథ్యంలో ఈ ఎన్.జి.ఒ.ల పాత్రను చెప్పకనే చెప్పినట్లయింది.

నీటి లభ్యత, నీటి వాడకంలోని పరిమితులను నిర్లక్ష్యం చేస్తున్న ప్రపంచబ్యాంకు నీటికి సంబంధించి 'సరఫరా దృక్కోణం' (ప్రజల అవసరాలకు ప్రాధాన్యత నివ్వటం) స్థానంలో 'డిమాండ్ దృక్కోణం' (నీటి కొనుగోలుకు ప్రాధాన్యతనివ్వటం)ని ముందుకు నెడుతోంది. ఇందువల్ల ఆర్థికంగా శక్తివంతమైన వారి డిమాండ్లు పేదల అవసరాలను, ప్రకృతి పరిమితులను లెక్కించకుండా ఆకాశంలో స్వారీ చేస్తాయి. ప్రపంచబ్యాంకు రుణ సహాయంచేస్తూ ఈ 'డిమాండు దృక్కోణపు' తర్కాన్ని పాక్షికంగా ఆచరిస్తున్న ఫలితమే నీటి సంక్షోభానికి మూలంగా నిలుస్తోంది. ఈ డిమాండు ప్రాధాన్యతా తర్కాన్ని అది సంపూర్ణంగా అమలు చేసినపుడు నీటి సంక్షోభం తొలగి పోవటం మాట అటుంచి దీన్ని మరింత తీవ్రతరం చేస్తుంది.

ప్రపంచబ్యాంకు 'నీరు ఒక అరుదైన సరకు' అనే భావనను ప్రపంచం ముందుకు తెచ్చి నీటికి మార్కెట్‌ని కల్పించటం 'అభివృద్ధి'కి తప్పనిసరి అవసరమంటూ ప్రతిపాదిస్తోంది. ఈ 'నీటి మార్కెటీకరణ' నూతన విధానాలు మన పాలనా వ్యవస్థను ఎంతగా లోబర్చుకున్నాయంటే వందలాది, వేలాది సం॥లుగా కొనసాగుతూ వస్తున్న ప్రకృతి సహజమైన నీటి నిల్వ పద్ధతులు దారుణంగా దెబ్బతిని పోయాయి. ఉదా॥ ఇండో గంగా మైదానాన్ని మినహాయిస్తే, తక్కిన భారత గ్రామీణ ప్రాంతం మొత్తంలో నీటి విలువకి సంబంధించి

ప్రకృతి సహజమైన సదుపాయాలు ఇబ్బడిముబ్బడిగా వున్నాయి. చిన్నపాటి చెక్‌డ్యామ్‌లను నిర్మించినా చాలు; అవి వెల్లువలాగా నీటి నిల్వ సదుపాయాలను సృష్టించగలుగుతాయి. చరిత్రను తిరగేస్తే ఒకప్పటి రాజులు, జమీందార్లు చెరువులను, సరస్సులను, ఇంకా ఇతర నీటిని నిల్వ చేసే నిర్మాణాలను తవ్వేందుకు, లోతు చేసేందుకు, లేక పూడిక తీసేందుకు జీతమిచ్చి మరీ మనుషులను నియమించేవారని తెలుస్తుంది. ఇంకాస్త ముందుకుపోతే హరప్పా నాగరికతా కాలంలోనే భూగర్భ జలాల్ని నిల్వచేసే పద్ధతులను అవలంభించేవారని తెలుస్తుంది. ఇవి మార్కెట్‌ని, లాభాన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పర్చిన విధానాలు కావు. ఒక సమాజ మొత్తం అన్నావసరాలను తీర్చగలిగే రైతాంగానికి, ప్రభుత్వ ఖజానాను అదనపు మిగులుతో నింపగలిగే రైతాంగానికి ఆనాటి రాజరిక వ్యవస్థలు కల్పించిన కనీస సదుపాయాలివి. ఒక సహజ వనరును మొత్తం సమాజ అవసరాలకు, వ్యవస్థ మనుగడకుగాను సరఫరా చేసిన వ్యవస్థలివి.

కానీ, ఏ సమాజమైనా తన అవసరాలను తానే తీర్చుకోవటం, తన తిండిని తానే పండించుకోవటం అనేవి ప్రపంచబ్యాంకుకే కాదు మొత్తం సామ్రాజ్యవాద ఫిలాసఫీకే బద్ధ వ్యతిరేకమైనట్టివి. కాబట్టే అది వెనుకబడిన దేశాలకు తన సొంత అన్నావసరాలను తనకి తానే తీర్చుకోనివ్వకుండా చేస్తూంది. అందుకే ప్రపంచం మొత్తం ఆహార అవసరాలను తన నియంత్రణలోకి తెచ్చుకునేందుకు, వివిధ దేశాలకు తానందించిన రుణ మొత్తాలను వాణిజ్య పంటల రూపంలో వసూలు చేసుకునేందుకు సామ్రాజ్యవాదం పన్నిన పథకాలలో భాగంగా నీరు మార్కెటీకరింపబడుతోంది. మన దేశంలో సాంప్రదాయిక జలవనరుల స్థానంలో కృత్రిమ జలవనరులు పెద్ద పెద్ద డ్యాములు, ప్రాజెక్టులు, రిజర్వాయర్ల రూపంలో ఏర్పడటానికి వెనుక చరిత్ర కూడా ఇదే. వందలమైళ్ళ దూరం నుండి నీటిని మళ్ళించటం, ఇందుకోసం అపారమైన వ్యయం జరగాల్సి రావటం ఆ వ్యయాలకు ప్రపంచబ్యాంకే మదుపుదారుగా వ్యవహరించటం, ఈ 'ప్రజాకేంద్రక' వ్యతిరేక విధానాల కారణంగా పెద్ద పెద్ద ప్రాజెక్టుల కాంట్రాక్టర్లు బలిసి పోవటం, ప్రాజెక్టు చివరి భూములకు ప్రతి సందర్భంలోనూ సాగునీరు లభ్యంకాక పంటలెండి పోవటం.... ఈ క్రమంలో ఉమ్మడి సమాజ వనరుగా నీటికున్న స్థానం పోయి మార్కెట్ వనరుగా మారిపోతోంది. అచ్చంగా ఈ 'మార్కెట్ వనరే' ఇపుడు రైతాంగాన్ని అన్ని రకాలుగా బలిగొంటోంది.

అందుకనే నీటి వనరుల ప్రైవేటీకరణ అన్నది ప్రస్తుత నీటి సంక్షోభానికి ఏ మాత్రం సమాధానం కాదు. ఎందుకంటే ఇది నీటి సంక్షోభానికి కారణమైన ప్రస్తుత పర్యావరణ, రాజకీయ వ్యవస్థల క్రమాన్నే మరింతగా బలోపేతం చేస్తుంది. జలచక్రపు (వాటర్ సైకిల్) పర్యావరణాన్ని, ప్రజాస్వామిక జల రాజకీయాలను (పాలిటిక్స్ ఆఫ్ వాటర్ డెమాక్రసీ) నిర్లక్ష్యం చేసిన ఫలితమే నీటి సంక్షోభానికి కారణమయింది. తగిన ప్రమాణంలో నీటి వనరులను వాడుకోవటం అనేది జలావరణాన్ని (వాటర్ సైకిల్) నిర్వహించే తీరుపై ఆధారపడి వుంటుంది. ఇందుకుగాను జల వినియోగపు టెక్నాలజీలు, భూమి వినియోగ టెక్నాలజీలు తప్పనిసరిగా ప్రకృతికున్న పరిమితులను గుర్తించి గౌరవించాలి. భూగర్భ జల వనరుల ద్వారా సాగే పెట్టుబడిదారీ సాంద్ర వ్యవసాయం ప్రకృతిని అధిగమించవచ్చునని, ప్రకృతి హద్దులను ఉల్లంఘించవచ్చుననే భ్రమల్ని కల్గజేస్తుంది. కానీ అధిక మొత్తంలో నీరు అవసరమయ్యే పంటల సాగుకోసం భూగర్భ జలాలను కొద్ది సంవత్సరాలపాటు తోడేయటంతోటే, మొత్తం వ్యవసాయ సాగు సాధ్యతనే ధ్వంసం చేయగలిగినట్టి నీటి కరువు సృష్టింపబడింది. ఈరోజు గుజరాత్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్‌లలోని నీటి ఎద్దడి ఇందుకు ప్రత్యక్ష సాక్షీభూతమై నిలుస్తోంది. పర్యావరణ వ్యవస్థకు చెందిన జల సంపదను గౌరవించగల, దాని పరిమితులలోంచే వాడుకోగల పంటల విధానాలనే సమాజం చేపట్టాలి. అందుకే ఆహార భద్రత అన్నది జల భద్రత మీదే ఆధారపడి వుంటుంది.

నీటి వనరులను ప్రజాస్వామ్యయుతంగా మొత్తం సమాజ నియంత్రణలో వుంచి వాడుకోవాలి. అవధులు మీరిన జల వినియోగాన్ని అరికట్టాలి. సమాన భాగస్వామ్యాన్ని కల్పించాలి. అప్పుడే సమాజంలోని ఏ ఒక్కరూ... ప్రత్యేకించి మహిళలు, పిల్లలూ, పేదలూ నీటి వాటాలో వివక్షతకు గురికారు. వాటర్ డెమోక్రసీ అమలు కావాలంటే నీటిని సమిష్టి సంపదగానే తప్ప వ్యక్తిగత ఆస్థిలాగా గుర్తించని పరిస్థితులేర్పడాలి. నీరు వ్యక్తిగత ఆస్థిగా వున్న సమాజంలో ఆర్థికాధికారం వున్నవారు ఈ జీవనాధార వనరులను పేదలకు సరకుగానే అమ్ముతారు. ఇది సమాజంలోని వెనుకబడిన సెక్షన్ల నీటి హక్కులను హరించి వేస్తుంది. నీటి ప్రైవేటీకరణ అనేది నీటి సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది. ధనికులకు పేదలకు మధ్య; పరిశ్రమలకు, వ్యవసాయానికి మధ్య; పట్టణాలకూ, గ్రామాలకూ మధ్య అసమానతలు తీవ్రంగా వున్న సామాజిక పరిస్థితుల్లో నీటి మార్కెట్లు నీటిని పేదల నుండి సంపన్నులకు 'దారిద్ర్య పీడిత గ్రామాల' నుండి సంపద్వంత నగరాలకు బదిలీ చేస్తాయి. సమాజం నీటి వనరులను గ్రహించటమన్నది ఆ సమాజంలో నీటి లభ్యతను బట్టికాక మార్కెట్‌ని బట్టి, కొనుగోలుశక్తిని బట్టి, సుదూర ప్రాంతాలనుండి వ్యాపారం, రవాణాలను బట్టి నిర్ణయింపబడటంవల్ల నీటి వనరుల వినియోగానికి హద్దుల్లేకుండా పోతాయి. దీనివల్ల జలావరణం, ప్రజల నీటి హక్కులు క్రమానుగతంగా ఉల్లంఘించబడతాయి.

అంతిమంగా....ప్రైవేటీకరణ అనే పదం 'ప్రైవేట్' అనే మూలపదం నుండి పుట్టుకొచ్చింది. ప్రైవేట్ అంటే 'హరించటం', 'లేకుండా చేయటం' అని నిఘంటు అర్థం. నీటి ప్రైవేటీకరణ అంటే సామాన్య ప్రజానీకానికి నీటి వనరులను లేకుండా చేయటమనే అర్థం. ప్రపంచబ్యాంకు ప్రతిపాదిస్తున్న నీటి ప్రైవేటీకరణ అన్నది పేదలకు నీరు దొరక్కుండా పోయేలా చేసే వ్యవస్థీకృత చౌర్యమే తప్ప మరొకటి కాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పరమ దుర్మార్గపు నీటి దొంగతనాన్ని అనుమతించకూడదు. ప్రజాస్వామిక నీటి వనరుల వినియోగం నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థలోనే సాధ్యమౌతుంది. ❑

# పీపుల్స్‌వార్ గెరిల్లాల సాహసోపేత దాడుల్లో మట్టి కరచిన పోలీసులు; భారీ ఎత్తున ఆయుధాల స్వాధీనం

దక్షిణాదిన ఆంధ్రప్రదేశ్, మధ్య భారతంలోని మధ్యప్రదేశ్, ఉత్తరాదిన బీహార్‌లలో 2000 సం॥ ఫిబ్రవరి నెలలో జరిపిన మూడు ప్రధానమైన ఎత్తుగడల పరమైన దాడులలో పీపుల్స్‌వార్ గెరిల్లాలు 40 మంది పోలీసులను తుడిచిపెట్టి భారీ స్థాయిలో అత్యాధునిక ఆయుధాలను, మందుగుండు సామాగ్రిని శత్రువునుండి స్వాధీన పర్చుకున్నారు. శత్రువును దిగ్భ్రాంతి పర్చిన ఈ సాయుధ చర్యలు ''సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] ముగ్గురు ప్రధాన నేతలను- కామ్రేడ్స్ శ్యామ్, మహేష్, మురళి-కోల్పోవడంతో తీవ్రంగా దెబ్బతిని పోయిందనీ, ఏ ముఖ్యమైన దాడులను ప్రారంభించడానికైనా దానికి ఇక శక్తి లేదం''టూ అంతకు ముందు రెండు నెలలుగా భారత పాలకవర్గాలు ఊదరగొట్టిన అబద్ధాలను వమ్ము చేశాయి.

ఫిబ్రవరి 18న విశాఖపట్నం జిల్లా గూడెం కొత్తవీధి మండలం ధారకొండ గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసు బలగాలకు చెందిన సాయుధ నిఘా కేంద్రం (అవుట్‌పోస్ట్)పై గెరిల్లాలు సాహసోపేతమైన దాడి జరిపి, సబ్‌ఇన్స్పెక్టర్, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్‌తో సహా ఎ.పి.ఎస్.పి. 5వ బెటాలియన్‌కి చెందిన ఏడుగురు పోలీసులను తుడిచిపెట్టారు. ఈ గెరిల్లా దాడిలో కనీసం మరో 9 మంది పోలీసులు గాయపడ్డారు. శత్రు బలగాల నుండి పెద్ద మొత్తంలో అత్యాధునిక ఆయుధాలను (24 ఎస్.ఎల్.ఆర్.లు, ఒక ఎ.కె.-47, 3 స్టెన్ గన్‌లు, వీటితోపాటు కొంత మందుగుండు) గెరిల్లాలు స్వాధీనపర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంతవరకు ఆయుధాల స్వాధీనానికి సంబంధించిన ఘటనల్లోకెల్లా అతిపెద్ద ఘటన ఇది. రాత్రి 7 నుండి 10 గంటల దాకా దాదాపు మూడు గంటలపాటు సాగిన కాల్పుల్లో ఇద్దరు గెరిల్లాలు కామ్రేడ్స్ నవీన్ (బాలక్రిష్ణ), సత్యనారాయణ (శ్రీధర్)లు అమరులయ్యారు. కా॥ నవీన్ ఎ.ఐ.ఆర్.ఎస్.ఎఫ్.కి గతంలో నాయకుడు, ప్రస్తుతం పార్టీ మిలటరీ పత్రిక జంగ్ ఎడిటోరియల్ బోర్డు సభ్యునిగా వున్నాడు. కా॥ సత్యనారాయణ ఈస్ట్ డివిజన్ స్పెషల్ స్క్వాడ్ డిప్యూటీ కమాండర్. ఈ నష్టాలున్నప్పటికీ గెరిల్లాలు అత్యంత సాహసోపేతంగా స్పెషల్ పోలీస్ క్యాంపును అదుపులోకి తెచ్చుకుని ఈ దాడిని విజయవంతంగా ముగించారు. ఈ రెయిడ్ అనంతరం గెరిల్లాలు విప్లవ గేయాలు ఆలపిస్తూ గ్రామమంతా కలియతిరిగారు.

ఉత్తరాంధ్రలోని ఈస్ట్ డివిజన్ సాయుధ గెరిల్లా దళాలు అత్యంత నైపుణ్యంతో పథకం ప్రకారం మొత్తం దాడిని నిర్వహించాయి. పోలీసులు సరిగ్గా భోజనాల కోసం వెళుతున్న సమయంలో ఈ దాడి జరిగింది. అవుట్‌పోస్ట్‌కి పక్కనున్న బిల్డింగ్‌పైకి ఎక్కిన గెరిల్లాలు పోలీసులను లొంగిపొమ్మంటూ లౌడ్ స్పీకర్ ద్వారా హెచ్చరించారు. అయితే వారలా లొంగక పోవడంతో గెరిల్లాలు పెట్రోలు బాంబుల్ని, పొగబాంబులను విసిరారు. ఇది పోలీసులను గందరగోళానికి గురిచేసి వారిని దిగ్భ్రాంతి పర్చింది. గెరిల్లాలకు చెందిన ఒక బ్యాచ్ క్యాంపుమీదికి దాడి చేసినపుడు మరో రెండు బ్యాచీలు గ్రామానికి అదనపు బలగాల రాకను నిరోధించేందుకుగాను ధారకొండ వైపుకు దారితీసే రెండు రోడ్లను స్వాధీనపర్చుకున్నారు. సీలేరు-ధారకొండ రోడ్డుమీది తుప్పలపాడు గ్రామం వద్ద, జి.కె. వీధి-ధారకొండ రోడ్డు మీది లంకపాకల సమీపంలోనూ పోలీసులకు చెందిన రెండు రెస్క్యూ టీములు ఎదురుకాల్పులు జరుపుకున్న సందర్భంలో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. గెరిల్లాలతో సాయుధంగా తలపడ్డ తరువాత ఈ రెండు టీములూ ఆ ప్రాంతాన్ని వదిలిపెట్టి వెళ్ళాయి. మరుసటి దినం ఉదయాన మాత్రమే గ్రామానికి అదనపు బలగాలు చేరుకోగలిగాయి. రాత్రంతా గాయపడ్డ పోలీసులు అవుట్‌పోస్ట్ వద్దే పడివుండినారు కాని గ్రామస్థులు వారికి గ్లాసెడు మంచినీళ్ళివ్వడానికి కూడా తిరస్కరించారు. ప్రజలకు వ్యతిరేకంగా దౌర్జన్యాలకు దిగటంలో ఆరితేరిపోయిన కిరాతక ప్రభుత్వ బలగాల పట్ల ప్రజల ఆగ్రహావేశాలు అటువంటివి మరి!

1999 డిసెంబర్ 2న ముగ్గురు కేంద్రకమిటీ సభ్యుల అమరత్వంతో పీపుల్స్‌వార్ పని ఇక ముగిసిపోయినట్లే అంటూ పూదరగొట్టిన చంద్రబాబు ఫాసిస్ట్ పాలనకు ధారకొండ పోలీస్ క్యాంపుపై గెరిల్లాల దాడి సరైన సమాధానమున్నట్లైంది.

రెండు రోజుల తర్వాత ఫిబ్రవరి 20న మధ్య భారతంలో దండకారణ్యంలో మరొక అతి ముఖ్యమైన గెరిల్లాదాడి జరిగింది. పీపుల్స్‌వార్ గెరిల్లాలు పేల్చిన మందుపాతరలో 23 మంది పోలీసులు మట్టికరిచారు. మరణించిన వారిలో ఒక అడిషనల్ పోలీసు సూపరెంటెంటు, సబ్ ఇన్స్పెక్టర్, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్, ఇద్దరు హెడ్ కానిస్టేబిల్స్‌తోపాటు మరో 18 మంది పోలీసులు కూడా వున్నారు. మధ్యప్రదేశ్ బస్తర్ జిల్లాలోని నారాయణ్‌పూర్ పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో ఈ దాడి జరిగింది. ఇది భారత విప్లవోద్యమ చరిత్రలోకెల్లా అతిపెద్ద ఘటన. దీంతో 1991 నుండి మధ్యప్రదేశ్ రాష్ట్రంలో గెరిల్లాలు మట్టుపెట్టిన పోలీసుల సంఖ్య 115కి చేరుకుంది.

అడవి లోతట్టు ప్రాంతంలోకి శత్రు బలగాలను రప్పించేందుకు గాను ఎరవేయటం ద్వారా ఈ ఆంబుష్ పథకం ప్రకారం జరిగింది. బకుల్‌వాడి ప్రాంతంలో కొంతమంది 'నక్సలైట్లు' విడిది చేసి

వున్నట్లుగా పోలీసులకు సమాచారం పంపించడమైంది. ఈ సమాచారం మీద ఆధారపడి పోలీసులు తామెవరి దృష్టిలోనూ పడకుండా వుండేందుకని ఒక ప్రైవేట్ మెటాడోర్ వ్యాన్‌లో వచ్చారు. నక్సలైట్లు క్యాంపు చేసి వున్నారంటూ చెప్పబడిన ప్రాంతాన్ని పోలీసులు సమీపిస్తూండినపుడు గెరిల్లాలు మందుపాతర పేల్చారు. 22 మంది పోలీసులు అక్కడికక్కడే చావగా మరో ఇద్దరు గాయపడినారు. వీరిలో ఒకడు ఆసుపత్రిలో చనిపోయాడు. ఇతర ఆయుధాలతోపాటు కనీసం 11 ఎస్.ఎల్.ఆర్.లను గెరిల్లాలు చేజిక్కించుకున్నారు. ఇటీవలి కొద్ది మాసాలుగా బస్తర్, దంతేవాడ, కాంకేర్ జిల్లాలలో మధ్యప్రదేశ్ పోలీసులు వరుసగా దాడులు జరిపి కొంతమంది గెరిల్లాలను చంపి, అనేకమందిని అరెస్టు చేసినందుకు ప్రతీకారంగా ఈ దాడి జరిగింది.

దీనికి సరిగ్గా వారం రోజుల ముందు ఫిబ్రవరి 12న జరగనున్న రాష్ట్ర తొలి విడత ఎన్నికల సమయంలో బీహార్‌లోని పలామూ జిల్లాలో పీపుల్స్‌వార్ గెరిల్లాలు పేల్చిన మందుపాతరలో ఫిబ్రవరి 12న కనీసం ఆరుగురు సి.ఆర్.పి.ఎఫ్. పోలీసులు మట్టికొట్టుకు పోయారు. మార్చి 11న బీహార్‌లోనే జరిగిన మరొక మందుపాతర సంఘటనలో 9 మంది మిలటరీ పోలీసులు చావగా వారి ఆయుధాలన్నీ గెరిల్లాలు స్వాధీనపర్చుకున్నారు. జెహనాబాద్ జిల్లా కచ్నావన్ గ్రామంలో కేంద్ర పారా మిలటరీ బలగాలు, రాష్ట్రకమిటీ సభ్యుడు కా॥ శ్రీకాంత్‌తో సహా 11 మంది పీపుల్స్‌వార్ గెరిల్లాలను చుట్టుముట్టి చంపిన తర్వాత వారం రోజులలోపే గెరిల్లాలు జరిపిన ప్రతీకారంగా పేల్చిన మందుపాతరలో చిక్కి జయాల్‌పూర్ హెడ్‌క్వార్టర్స్‌లోని బీహార్ మిలటరీ పోలీస్ 9వ బెటాలియన్‌కి చెందిన 9 మంది పోలీసులు మట్టి కరిచారు. ఇది జరగడానికి ఐదురోజుల క్రితమే కేంద్ర హోంశాఖ కార్యదర్శి కమాల్ పాండే ఆధ్యక్షతన ఐదు రాష్ట్రాల (ఆంధ్ర, మధ్యప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, ఒరిస్సా) డి.జి.పి.లు హోంశాఖ అధికార్లతోపాటు సమావేశమై సి.పి.ఐ. (యం-యల్) (పీపుల్స్‌వార్) నాయకత్వంలో శరవేగంగా వ్యాపిస్తున్న విప్లవోద్యమాన్ని అరికట్టడానికి పై ఐదు రాష్ట్రాలు, కేంద్రం కలిసి చేపట్టదలచిన విస్తృత చర్యల గురించి ప్రకటించారు. 11 మంది గెరిల్లాల పాశవిక హత్య అనంతరం కొద్దిరోజులలోపే గెరిల్లాలు జరిపి ఈ ప్రతీకారచర్య కేంద్రాన్ని, పై ఐదు రాష్ట్రాలను ఖంగు తినిపించింది. బీహార్‌లోనే కాక యావద్దేశంలోనూ విప్లవ శక్తులను ఈ చర్య ఎంతో ఉత్తేజపర్చింది.

ఉత్తర తెలంగాణా ఖమ్మం జిల్లా కారేపల్లెలోని దుర్భేద్యమైన (అటాక్ ప్రూఫ్) అధునాతన పోలీస్ స్టేషన్‌పై పీపుల్స్‌వార్ గెరిల్లాలు ఫిబ్రవరి 8న దాడి జరిపారు. కానీ కొన్ని సాంకేతిక లోపాలవల్ల దాన్ని పేల్చివేయలేక పోయారు. మరుసటి దినం ఈ పోలీస్‌స్టేషన్‌ని ప్రారంభించే ఏర్పాట్లలో ప్రభుత్వం వున్నప్పుడు ఇది జరిగింది.

జనవరి 11న ఉత్తర తెలంగాణా ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని డి.ఎస్పీ. ఆఫీస్‌ని డైనమైట్లతో పేల్చివేసిన సంఘటనలో డ్యూటీలో వున్న ఇద్దరు పోలీసులు చనిపోయారు. ఫిబ్రవరిలోనే ఉత్తర తెలంగాణాలో జరిగిన రెండు విడి ఘటనలలో మరో ఇద్దరు పోలీసులు చనిపోయారు.

మార్చి 5న సి.పి.ఐ. (యం-యల్) (పీపుల్స్‌వార్) మిలటరీ ప్లెటూన్ గెరిల్లాలు మహారాష్ట్ర ఘడ్‌చిరోలి జిల్లా సిరొంచ తాలూకాలోని అసరల్లీ పోలీస్ స్టేషన్‌పై సాహసోపేతంగా దాడిచేసి భారీ ఎత్తున ఆయుధాలను, మందుగుండు సామాగ్రిని చేజిక్కించు కున్నారు. కనీసం 20 యస్.యల్.ఆర్.లు, 13 రైఫిల్స్‌తో మొత్తం 33 ఆయుధాలను శత్రువు నుంచి గెరిల్లాలు వశపర్చుకున్నారు. ఈ దాడి శత్రువును దిగ్భ్రాంతి పరుస్తూ వినూత్న పద్ధతిలో జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ని ఒక ముఖ్య విషయమై వెంటనే కలవాలనే మిషతో ముగ్గురు మఫ్టీలోని గెరిల్లాలు పోలీస్ స్టేషన్‌లోకి వచ్చారు. సెంట్రీ పోలీస్ వారిని స్టేషన్‌లోకి పోనివ్వగానే గెరిల్లాలు ఒక్కసారిగా దాచుకున్న ఆటోమేటిక్ ఆయుధాలను బయటకులాగి స్టేషన్‌లోని వారిని లొంగి పొమ్మని చెప్పటమేగాక స్టేషన్ మొత్తాన్ని గెరిల్లాలు చుట్టుముట్టారని వారితో చెప్పారు. ఈలోగా కంపెనీ ఫార్మేషన్‌లో స్టేషన్‌ని చుట్టుముట్టి వున్న గెరిల్లా బలగం పోలీసులను మైక్‌లో హెచ్చరిస్తూ ప్రతిఘటించకుండా ఆయుధాలతో లొంగిపోతే పోలీసులకు ఏ హానీ తలపెట్టబోమని ప్రకటించింది. దాదాపు పోలీసులందరూ వెంటనే లొంగిపోయారు. ప్రతిఘటించాలని చూసిన ఒక పోలీసుని గెరిల్లాలు కాల్చి గాయపర్చారు. ఆయుధాలను మందుగుండు వశపర్చుకున్నాక గెరిల్లాలు క్షేమంగా రిట్రీట్ అయ్యారు. పొరుగునున్న ఉత్తర తెలంగాణా నుండి గోదావరి నది దాటి వచ్చిన గెరిల్లాలు ఈ రెయిడ్‌ని సాగించారు. గోదావరిని తిరిగి బోటు ద్వారా దాటాక గెరిల్లాలు ఉత్తర తెలంగాణా గెరిల్లాజోన్ అటవీ ప్రాంతానికి ఆయుధాలను నిరాటంకంగా తరలించుకు పోయారు.

వీటన్నిటికీ పరాకాష్టగా మార్చి 7 రాత్రి 11 గంటల సమయంలో ఆంధ్రప్రదేశ్ రాజధానీ నగరానికి 30 కి.మీ. సమీపంలో జరిగిన అత్యంత సాహసోపేతమైన దాడిలో ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ శాఖామంత్రి, మునుపటి హోంమంత్రి ఎ. మాధవరెడ్డి పీపుల్స్‌వార్ వీర గెరిల్లాలు పేల్చిన మందుపాతరలో మట్టికరిచాడు.

పీపుల్స్‌వార్ పార్టీ గావించిన ఈ సాహసోపేతమైన ఎత్తుగడల పరమైన దాడులు భారత దేశ వ్యాప్తంగా విప్లవ ప్రజానీకాన్ని ఆనందడోలికల్లో ముంచెత్తి పరవశింప జేశాయి. భారత దళారీ పాలకవర్గాలు రూపొందించిన ఏ కోవర్ట్ యుద్ధాలూ, సంయుక్త సమన్వయ కేంద్రాలూ కూడా పీపుల్స్‌వార్ పురోగమనాన్ని నిరోధించలేవన్న సత్యాన్ని ఈ సంఘటనలు గొప్పగా ప్రదర్శించాయి. ❑

(24వ పేజీ తరువాయి.....)

జాతిని ఈ గోడకు అటూ ఇటూగా చీల్చివేసి రివిజనిస్ట్ 'నియంతృత్వపు మహానమూనా'గా పేరొందిన బెర్లిన్ గోడ పతనమవటంతో సామ్రాజ్యవాద సమర్థక సిద్ధాంతకారులు 'చరిత్ర అంతమై పోయిం'దంటూ ప్రకటించేశారు. అంటే సోషలిజానికి, పెట్టుబడిదారీ విధానానికీ మధ్య 20వ శతాబ్దం పొడవునా తీవ్రంగా సాగుతూ వచ్చిన వర్గ పోరాటం, దాని చరిత్ర అంతమై పోయాయనే దీనర్థం. 'సోషలిజం' పతనమైపోయిన ఈ ప్రపంచంలో ఇకమీదట ఏ వర్గ పోరాటమూ వుండదని, ఏ సైద్ధాంతిక పోరాటమూ వుండదని; వీటికి భిన్నంగా సమాజం ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను నిరంతరాయంగా పరిష్కరించుకుంటూ పోయే క్రమమే వుంటుందని, ప్రపంచమంతటా ''వినియోగదారుల డిమాండ్ల'ను తీరుస్తూ సంతృప్తిపర్చే క్రమమే వుంటుందని పెట్టుబడిదారీ మేధావులు తేల్చేశారు. 'చరిత్రాంతం' భావనని 1989లో ప్రతిపాదించిన అమెరికా యూనివర్శిటీ ప్రొఫెసర్ ఫ్రాన్సిస్ 'ఫుకుయామా' సొంత మాటల్లోనే దీన్ని చూద్దాం.

''చరిత్ర అంతం అనేది మహా విషాదకరమైన క్షణం. గుర్తింపు కోసం పోరాటం; ఒకానొక 'శుద్ధ అమూర్త (అస్పష్ట) లక్ష్యం' కోసం (అంటే కమ్యూనిజం కోసం) తమ సొంత జీవితాల్నే ఫణంగా పెట్టేందుకు సంసిద్ధ పడటం; సాహసోపేతమైనదిగా, ధీరోదాత్తమైనట్టిదిగా, ఆదర్శపూరిత మైనట్టిదిగా చెప్పబడుతూ వస్తున్న ప్రపంచవ్యాప్త (సోషలిస్టు) సైద్ధాంతిక పోరాటం వంటివి ఇక అంతం అవుతాయి. వాటి స్థానంలో ఇక మీదట ఆర్థిక గణాంకాలు; సాంకేతిక సమస్యలను, పర్యావరణ సమస్యలను నిరంతరం పరిష్కరించు కుంటూ పోవడం; వినియోగదారుల డిమాండ్లను, అవసరాలను సమర్థవంతంగా తీర్చుకుంటూ పోవడం వంటివి ప్రపంచంలో మిగిలి వుంటాయి''. (ప్రొఫెసర్ ఫుకుయామా, 1989).

'బెర్లిన్ గోడ' పతనమయిన రెండేళ్ళకు 1991లో బల సంపన్నమైన సోవియట్ యూనియన్ సైతం విచ్ఛిన్నమయిపోయింది. 30 సం॥ల కృశ్చేవ్, వాడి వారసుల రివిజనిస్ట్ మహా విద్రోహం; రాజకీయ అర్థశాస్త్రం , తత్వశాస్త్రం, వర్గపోరాట రంగాలలో మార్క్సిజం-లెనినిజం సూత్రాలను విడనాడడం వంటివి అంతిమంగా యూనియన్ విచ్ఛిన్నమై పోవడంగా పరిణమించాయి. సోషలిజానికి (రివిజనిజానికి) వ్యతిరేకంగా జరిగిన ఈ వరుస పరిణామాలతో బూర్జువా వర్గం విజయోల్లాసంతో ఉప్పొంగిపోయింది. ఆ ఉన్మత్త క్షణాల్లో బూర్జువా వర్గం మార్క్సిజానికి మరణ శాసనం ప్రకటించేసింది. పెట్టుబడిదారీ విధానమే అంతిమమైనదని, మానవజాతికి అదే అంతిమ లక్ష్యం అని ప్రకటించేసింది. ఇకపోతే 1994లో పెట్టుబడివాణి అయిన 'బిజినెస్ వీక్' తన ప్రత్యేక సంచికలో చరిత్ర అభివృద్ధి సూత్రాలను మొత్తంగా నిర్లక్ష్యం చేస్తూ ఈ క్రింది విధంగా ఒక మతిమాలిన ప్రకటనను చేసింది.

''కమ్యూనిజం మరణ వేదనలు (నిజంగా అవి రివిజనిజం మరణవేదనలే. కానీ వాటికి ముసుగుకప్పి ఇలా కమ్యూనిజానికి వర్తింపజేస్తున్నారు) స్పష్టంగా ఒక నూతన యుగాన్ని కొనితెస్తున్నాయి. దాదాపు అన్ని దేశాలకూ ఒకే మార్గాన్ని అంటే మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో చేరిపోయే మార్గాన్ని, ఎంపికను అవి సూచిస్తున్నాయి. 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' ప్రచురింపబడిన దాదాపు 150 సం॥ల తర్వాత; 50 సం॥లు పైగా 'కమ్యూనిస్టు నిరంకుశత్వ' రాజ్యాల వికాసం తర్వాత బూర్జువా వర్గం అంతిమంగా గెలుపొందింది'' (నిజానికి కమ్యూనిజం బూర్జువావర్గంపట్లే అత్యంత నిరంకుశత్వంతో వ్యవహరించింది. ఎందుకంటే బూర్జువావర్గం నిత్యం స్మరించే, వాంఛించే స్వాతంత్ర్యాన్ని (దోపిడీ చేయడానికి హక్కుని) కమ్యూనిజం అత్యంత నిరంకుశంగా హరించివేసింది మరి).

విషయ విస్తరణా భీతి కారణంగా 'చరిత్రాంతం' భావనను కొన్ని పరిమితుల్లోనే ప్రస్తుతం చూద్దాం. చరిత్రకు అంతం వుంది అనే భావన కొత్తదేం కాదు. చరిత్రకు ఒక లక్ష్యం వుంది. అదే దాని అంతిమ బిందువు. ఆ లక్ష్యాన్ని, ఆ బిందువును చేరుకోగానే చరిత్ర అంటే మానవ చరిత్ర ముగిసిపోతుంది అనే భావన వేల సం॥ల నుండే మానవ మేధస్సును సంఘర్షింపజేస్తూ వచ్చింది. మానవ సమాజాలకు ఒక పరిణామాత్మక క్రమం వుంది. ఈ పరిణామక్రమం మానవజాతి తన మౌలిక, గాఢమైన వాంఛల్ని తీర్చగలిగే సమాజ రూపాన్ని సాధించగలగటంతో ముగుస్తుంది. అనే భావన 2000 సం॥ల క్రితం గ్రీకు తత్వవేత్తలు ప్లేటో, అరిస్టాటిల్ కాలం నుంచి మానవుల ఆలోచనా క్రమంలో కొనసాగుతూ వస్తోంది. ఏ పాలనా పద్ధతులూ మనిషిని పూర్తిగా సంతృప్తి పర్చలేదు కాబట్టి ప్రజల్లోని అసంతృప్తి నిరంతరాయంగా పాలనా పద్ధతుల్ని మారుస్తూవుంటుంది. ఇలా ఒక పాలనా పద్ధతి ఇంకో పాలనా పద్ధతికి చోటిస్తూ వస్తూంటుందని ప్రాచీన తత్వవేత్తలు వ్యాఖ్యానించారు. మధ్యయుగాల తర్వాత పెట్టుబడిదారీ విధానం ప్రపంచ పాలనా వ్యవస్థగా నెలకొన్నపుడు 19వ శతాబ్దంలో ఈ భావం యూరప్‌లో పలు వ్యాఖ్యలకు గురయింది. ఆనాటి జర్మన్ తత్వవేత్తలు హెగెల్, మార్క్స్‌లు ఈ భావాన్ని మరింతగా ముందుకు తీసుకు పోయారు. నిరంతర సంఘర్షణల క్రమంలో చరిత్ర పురోగమిస్తుందని, రాజకీయ, భావజాల వ్యవస్థల సంఘర్షణల క్రమంలో చరిత్ర పురోగమిస్తుందని, రాజకీయ, భావజాల వ్యవస్థలు వాటి అంతర్గత వైరుధ్యాల కారణంగా పతనమై తక్కువ వైరుధ్యాలతో కూడిన వ్యవస్థలు ముందుకు వస్తూంటాయని చెబుతూ హెగెల్ గతితర్కాన్ని ప్రతిపాదించాడు. అయితే ఈ విధమైన మానవ పరిణామ చరిత్రకు అప్పుడపుడే ఏర్పడివున్న బూర్జువా ఉదార రాజ్యమే ముగింపు పలుకుతుందని, కాబట్టి ఉదార ప్రజాస్వామిక రాజ్యమే చరిత్రకు అంతిమ లక్ష్యమని హెగెల్ పేర్కొన్నాడు. 'మానవులందరూ సమానులే' అని ప్రకటించిన బూర్జువా ఉదార ప్రజాస్వామ్య (లిబరల్ బూర్జువా) రాజ్యం ప్రపంచంలో స్థిరపడటంతోనే 'చరిత్ర అంత'మై పోతుందని వైరుధ్యాలన్నీ కనీసస్థాయికి తగ్గిపోయిన ఆ దశలో చరిత్రకు ఇక అంతిమ లక్ష్యమేమీ వుండదనీ హెగెల్ భావించాడు. అందుకే హెగెల్ బూర్జువా వర్గమూ, అది తీసుకువచ్చిన ఉదార ప్రజాస్వామ్యమూ మాత్రమే అంతిమ సత్యమని ఆ అంతిమ సత్యానికి చేరుకోవడమే మానవ చరిత్రకు అంతిమ బిందువవుతుందని ప్రకటించాడు.

హెగెల్ ప్రతిపాదించిన పై మానవ పరిణామక్రమాన్ని, చరిత్రాంతం గురించిన హెగెల్ మౌలిక ప్రతిపాదనని మార్క్స్ అంగీకరించాడు. కానీ చరిత్రాంతంలో ఏ సమాజం ఆవిర్భవిస్తుందనే అంశంపైనే మార్క్స్ హెగెల్‌తో విభేదించాడు. ఉదార బూర్జువా రాజ్యం స్వేచ్ఛని ప్రజలందరికీ ప్రసాదించలేదని, స్వేచ్ఛని విశ్వజనీనం చేయలేదని, అది కొన్నివర్గాలకే స్వేచ్ఛనిచ్చిందని మార్క్స్ సూత్రీకరించాడు. బూర్జువా సమాజంలో ప్రధాన వైరుధ్యమైన వర్గ

( తరువాయి 44వ పేజీలో.....)

( 60వ పేజీ తరువాయి.....)

ఎలాంటి చర్చలనైనా ఫలవంతం చేయగలదని వారు డిమాండ్ చేశారు.

ప్రపంచబ్యాంకు పనుపున బహుళజాతి కంపెనీల సేల్స్‌మేనేజర్‌గిరీ వెలగబెడుతున్న చంద్రబాబు తర్వాత కొద్దిరోజులకే అంటే ఏప్రిల్ 14న పీపుల్స్‌వార్‌పై, ఇతర ప్రజా సంఘాలపై నిషేధాన్ని ఎత్తివేసే ప్రశ్నే లేదని ప్రకటించినపుడు ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టంగా తెలిసి పోయింది.

ఆయుధాలు విడవకుంటే పీపుల్స్‌వార్‌తో చర్చల ప్రసక్తే లేదని అతడు కొట్టిపారేశాడు. ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ ఇతగాడు ''ఆయుధాలు ధరించిన పీపుల్స్‌వార్ ప్రతినిధి బృందంతో చర్చలు ఎలా సాధ్యం'' అంటూ స్కూల్ పిల్లవాడి తరహాలో ప్రశ్న లేవనెత్తాడు. అంతేగాక ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల సమస్యతో వ్యవహరించేందుకు ఒక సలహామండలిని ఏర్పరుస్తున్నట్లుగా ప్రకటించాడు. భూస్వామ్యవాదం, సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం పిషకోరల నుండి దేశాన్ని విముక్తి చేసేందుకుగాను దీర్ఘకాలిక ప్రజాయుద్ధం సాగిస్తున్న ఒక అంకితభావం గల విప్లవ పార్టీ అంతిమ విజయం సాధించేదాకా ఆయుధాలు వదిలిపెట్టదనే విషయం సామాన్యులకు కూడా తెలిసిన విషయమే.

పోరాటంలో నిర్దిష్ట పరిస్థితులపై ఆధారపడి, కాల్పుల విరమణ దశలుంటే ఉండొచ్చు. పీపుల్స్‌వార్ నాయకత్వం ప్రస్తుతదశలో అలాంటి కాల్పుల విరమణకు సిద్ధమవుతుందా లేదా అన్నది వేరే విషయం. అయితే చర్చల విషయమై ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న అసాధ్యమైన షరతులు తెలుగుదేశం పార్టీకి చర్చలపై నిజంగా చిత్తశుద్ధి లేదన్న వాస్తవాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిపాదించిన షరతులు లొంగుబాటుకి పిలుపే తప్ప మరొకటి కావు. రాష్ట్రంలో హింసా, రక్తపాతాలకు ముగింపు కావాలని తపనపడుతున్న శాంతికాముక పౌరులను మోసపుచ్చేందుకు ప్రభుత్వం నాటకాలు ఆడుతున్నదనేదే చర్చల ప్రతిపాదన సారాంశం.

చర్చల పిలుపు ప్రకటన వెనుక చంద్రబాబు అసలు ఉద్దేశం ప్రతి ఒక్కరికీ తేటతెల్లమైపోగా మరోవైపు కొందరు ప్రముఖ పాత్రికేయుల నుండి, పౌరస్పందన వేదిక నుండి చిత్తశుద్ధితో కూడిన అభ్యర్థనలు ముందుకొచ్చాయి. పౌరస్పందన వేదిక సిద్ధం చేయగా, పలువురు జర్నలిస్టులు సంతకాలు పెట్టిన ప్రకటన ఏప్రిల్ 1న వెలుగులోకి వచ్చింది. నక్సలైట్ ఉద్యమాన్ని ప్రభుత్వం సామాజిక ఆర్థిక, రాజకీయ పరమైనదిగానే ప్రభుత్వం గుర్తించాలని, దాన్ని కేవలం శాంతి భద్రతల సమస్యగా భావించి ఆ రీతిలో వ్యవహరించరాదని వారు ప్రత్యేకించి డిమాండ్ చేశారు. 'శాంతి స్థాపన' వేపు తొలి అడుగుగా ఒక నిర్దిష్ట తేదీ నుండి ప్రభుత్వం, పీపుల్స్‌వార్ రెండూ బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించాలని ఆ ప్రకటన పిలుపిచ్చింది. అయితే ఆశ్చర్యకరంగా, పరస్పరం అంగీకరించిన ఒక నిర్దిష్ట తేదీ నుండి రెండు పక్షాలూ కాల్పుల విరమణను అమలు చేయాలని పిలుపిస్తూ తటస్థంగా వున్నట్లుగా కన్పిస్తూనే, ఈ ప్రకటన ఒకవైపు ప్రభుత్వ అణచివేత బలగాలు హత్యాపరంపర సాగిస్తూండగానే పీపుల్స్‌వార్‌ని మాత్రం కాల్పుల విరమణపై చొరవ తీసుకోవాలని అభ్యర్థించింది. ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని సమర్థించే విషపత్రిక ఈనాడు తప్ప, ఆంధ్రప్రదేశ్‌లో ప్రచురింపబడుతున్న దినపత్రికల సంపాదకులందరూ ఈ స్టేట్‌మెంట్‌పై సంతకాలు పెట్టారు.

సి.పి.ఐ. (యం) రాష్ట్ర యూనిట్ సైతం మే 8న ఇరుపక్షాలకూ ఇదే విధమైన అభ్యర్థనను చేసింది. హింసాకాండను వదిలిపెట్టి చర్చలకు కూర్చోవలసిందిగా ఇరుపక్షాలను కోరుతూ వార్తాపత్రికలు సంపాదకీయాలు రాశాయి.

శాంతి చర్చలపై ప్రభుత్వ బోలుతనాన్ని ఎండగడుతూ, బూటకపు ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, ప్రజా వేధింపు వగైరాలను ఆపివేయాలని, కొయ్యూరు 'ఎన్‌కౌంటర్' తదితరాలపై 'అత్యున్నతస్థాయి' న్యాయవిచారణ జరిపించాలని కోరుతూ సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] కార్యదర్శి మేనెల మొదటి వారంలో పత్రికా ప్రకటన ఇచ్చాడు. చంద్రబాబు ప్రభుత్వం నక్సలైట్లు ఆయుధాలను కిందపడ వేయాలంటూ ప్రకటిస్తూనే తాను చర్చలకు సిద్ధమే అని అబద్ధాలాడటాన్ని కొనసాగిస్తోంది. అదే సమయంలోనే ప్రజలపై మారణకాండను తీవ్రస్థాయికి తీసుకుని పోతూనే వుంది.

ఒక్క ఏప్రిల్ నెలలోనే తొమ్మిదిమంది మహిళా కామ్రేడ్స్‌తో సహా 32 మంది విప్లవకారులు ఆంధ్ర పోలీసులచే కిరాతకంగా చంపబడ్డారు. ఏప్రిల్ 14న నలుగురు పీపుల్స్‌వార్ యాక్షన్ టీం సభ్యులు రాష్ట్ర రాజధాని నగరం హైద్రాబాద్‌లో కాల్చి చంపబడ్డారు. అదేరోజు నిజామాబాద్‌లో ఒక లోకల్ గెరిల్లా దళ కమాండర్, మరో దళ సభ్యురాలు కాల్చి చంపబడ్డారు. ఏప్రిల్ 26న ఇన్ఫార్మర్లచే ఖచ్చితమైన సమాచారం పొందిన పోలీసులు నల్గొండ జిల్లా తాళ్ళవెల్లం గ్రామంలో ఆరుగురు కామ్రేడ్స్‌ని కాల్చిచంపేశారు. వీరిలో రాచకొండ దళ కమాండర్‌తో సహా కొందరు దళసభ్యులు కూడా వున్నారు. ఈ పాశవిక హత్యలకు పరాకాష్టగా ఏప్రిల్ 27న వరంగల్ చంద్రగిరి కొండల్లో 12 మంది కామ్రేడ్స్‌ని దారుణాతిదారుణంగా కాల్చి చంపారు. ఏప్రిల్‌లో చంపబడిన 32 మంది విప్లవకారులలో 26మంది పీపుల్స్‌వార్ పార్టీకి చెందినవారు కాగా, 6మంది ఇతర యం-యల్ పార్టీల కార్యకర్తలు. పీపుల్స్‌వార్‌నే కాక నక్సలైట్ ముద్ర తగిలించుకున్న వారందరినీ ప్రభుత్వం నిర్మూలించడానికి పూనుకుందని స్పష్టమైంది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిజమైన ప్రతిపక్షంలాగా అడ్డుకుంటున్న విప్లవ శక్తులను నిర్మూలించనిదే అంతర్జాతీయ పెట్టుబడికి, దాని స్థానిక దళారీ మేనేజర్లకు ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలను అమలు చేయటం సాధ్యంకాదు. అందుకే శాంతి చర్చలకు, ''శాంతి ప్రజాస్వామ్యాల పునరుద్ధరణ''కు ఆహ్వానం పలుకుతూ పిలుపివ్వడమన్నది భారత పాలకవర్గాల దూకుడు ఫాసిస్ట్ దాడిని దాచిపెట్టే ముసుగు మాత్రమే తప్ప మరేం కాదు.

చర్చలు జరిగినా, జరగక పోయినా ప్రజలపై దాడులు మరింత పాశవికంగా కొనసాగుతున్నందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో, భారతదేశం మొత్తంలో వర్గ పోరాటం రోజురోజుకూ తీవ్రతరమవుతూ పదునెక్కుతూంది. ప్రజాయుద్ధాన్ని విస్తృతం చేసి మరింత తీవ్రంగా పోరాడటం తప్ప విప్లవకారులకు మరొక ప్రత్యామ్నాయమంటూ ఏదీ లేదు. రాష్ట్రంలోనూ కేంద్రంలోనూ టి.డి.పి., బి.జె.పి. ప్రభుత్వాల ఫాసిస్ట్ దాడులను ఓడించడానికి ఐక్యమయ్యే వీలున్న శక్తులన్నింటితో ఐక్యం కావడం, విశాల ఐక్య సంఘటనని ఏర్పర్చడమే ప్రస్తుతం విప్లవకారులందరి విధి. ❑

# పీపుల్స్‌వార్‌తో 'శాంతి' చర్చల పేరిట చంద్రబాబు నడిపిన దొంగాటను, నయవంచనను తిప్పికొడదాం!

కపటత్వం, రెండు నాలుకల మాటలతో కాలం గడపటం అనే పాలనా పద్ధతులను భారత పాలకవర్గాలు ఎప్పటినుండో పుణికి పుచ్చుకుని కొనసాగిస్తున్నాయి. ప్రాచీన కాలంలో 'అర్థశాస్త్రం' గ్రంథంలో జిత్తులమారి కౌటిల్యుడు రాజపాలన కోసం నిర్దేశించిన జిత్తులను, పన్నాగాలనే వీరు పదే పదే తవ్వి తలకెత్తుకుంటున్నారు. ఆధునిక కాలపు ఆంధ్ర కౌటిల్యుడైన చంద్రబాబునాయుడు పాలనలో ఈ జిత్తులమారితనం మరింత నైపుణ్యాన్ని సంతరించుకుంది. జిత్తులమారితనంలో రాటుదేలకుండా ఏ పాలకుడూ అధికారంలో కొనసాగడం సాధ్యంకాదు. తన మామ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడూ అయిన యన్.టి. రామారావును 1995లో అంతఃపుర కుట్రద్వారా గద్దెదింపి అధికారాన్ని చేజిక్కించుకున్నది మొదలుగా చంద్రబాబు ఈ కౌటిల్య సిద్ధాంతాలను తీవ్రస్థాయిలో అమలుచేస్తూ వస్తున్నాడు. 1994 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలన్నీ కొద్ది నెలల కాలంలోనే అత్యంత క్రూరమైన పద్ధతుల్లో వెనక్కు తిప్పేశారు. మద్యనిషేధం ఎత్తేశారు. 2 రూ॥లకు కిలో బియ్యం పథకాన్ని అభాసుపాల్జేశారు. విద్యుత్ పన్ను, నీటిపన్ను పెంచేశారు. ఇంకా ఇలాంటివెన్నో మొదలెట్టారు.

పీపుల్స్‌వార్‌ని 'శాంతి' చర్చల కోసం ఆహ్వానించడమన్నది చంద్రబాబు రెండు నాలుకల ధోరణికి, వంచనకు తాజా ఉదాహరణ. చంద్రబాబు కుడిభుజం, ఆంధ్రప్రదేశ్ మాజీ హోంమంత్రి, ప్రస్తుత పంచాయితీరాజ్ మంత్రి అయిన మాధవరెడ్డిని మార్చి 7న పీపుల్స్‌వార్ గెరిల్లాలు మట్టుబెట్టిన కొద్దిరోజులలోపే ఈ చర్చల గురించిన ప్రతిపాదన ముందుకొచ్చింది. మొట్టమొదటగా, నక్సలైట్ సమస్యను పరిష్కరించడానికి దేశంలోని విప్లవ సాహిత్య, సాంస్కృతి కోద్యమంలో అత్యంత ప్రముఖ వ్యక్తులైన కామ్రేడ్స్ గద్దర్, వరవరరావులతో చర్చలు జరిపేందుకు తన ప్రభుత్వం సిద్ధమేనంటూ అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించాడు. అయితే ఏప్రిల్ 1 'ఆల్‌ఫూల్స్ డే' రోజున చంద్రబాబునాయుడు చేసిన ఈ ప్రకటన యాదృచ్ఛికం కాకపోవచ్చు.

అసెంబ్లీలో ఈ ప్రకటన చేస్తూండగానే చంద్రబాబు మష్టీ గూండాలైన గ్రేహౌండ్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, సి.ఆర్.పి.యఫ్., స్థానిక పోలీసులు పీపుల్స్‌వార్ పార్టీ పట్ల సానుభూతివున్న గ్రామీణ యువతీ యువకుల్ని అరెస్టు చేస్తూ, హింసిస్తూ, చంపుతూ, విధ్వంసం చేస్తూనే వున్నారు. పీపుల్స్‌వార్ సాయుధ దళాలను, ఇతర మార్క్సిస్ట్-లెనినిస్ట్ పార్టీలకు చెందినవారిని సైతం నిర్మూలించడానికి భారీ సంఖ్యలో బలగాలను దింపుతూనే వచ్చారు.

అంతకుముందే విప్లవోద్యమాన్ని అణిచివేయడానికిగాను వేసవి క్యాంపెయిన్‌ని అత్యున్నత రాజకీయ స్థాయిలో పాలకవర్గం రూపొందించింది. గెరిల్లాలకు అననుకూలమైన వాతావరణ పరిస్థితులను అనుకూలంగా తీసుకుంటూ వేసవికాలంలో పీపుల్స్‌వార్ దళాలకు సాధ్యమైనంత అధికంగా నష్టం కల్గించడానికిగాను ప్రభుత్వ అణచివేత బలగాలను భారీ సంఖ్యలో కేంద్రీకరించడానికి పథకం వేశారు. వేసవిలో చెట్లు కవర్ లేకుండా పోవటం, నీటి కొరత ఏర్పడటం అనేవి శత్రువు ఎదురుదాడి చర్యలకు చాలా అనుకూలమైన అంశాలు. ఏప్రిల్ 4న ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అద్వానీ అధ్యక్షతన జరిగిన ఐదు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, బీహార్) ముఖ్యమంత్రుల సమావేశంలో నక్సల్ ఉపద్రవాన్ని నిర్మూలించి వేయాలంటూ ఆంధ్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సమావేశంలో చంద్రబాబు సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] పై దేశవ్యాప్తంగా నిషేధం విధించాలని ఒత్తిడి చేయగా కేంద్రం ఈ అంశంపై త్వరలోనే తానొక నిర్ణయం తీసుకొంటానని హామీ ఇచ్చింది.

నిజానికి తెలుగుదేశం పార్టీ మొదటినుండి నక్సలైట్ సమస్య శాంతిభద్రతల సమస్యే తప్ప సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్య కానేకాదనే వైఖరిని కలిగి వుంటున్నది. నక్సలైట్లను ప్రత్యేకించి పీపుల్స్‌వార్ నక్సలైట్లని రాజకీయ కార్యకర్తలుగా అది అంగీకరించలేదు. దీనికి బదులుగా వారిని నేరస్థులుగా ముద్రిస్తూ వస్తోంది. అయినప్పటికీ తెలుగుదేశం పార్టీ నక్సలైట్ సమస్యకు శాంతియుత పరిష్కారాన్నే తాను కోరుకుంటున్నట్లుగా చెబుతూ ప్రజలను మోసగించాలని ప్రయత్నిస్తున్నది.

అందుకనే కామ్రేడ్స్ గద్దర్, వరవరరావులు రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడంలో టి.డి.పి. ప్రభుత్వ నిజాయితీని ప్రశ్నిస్తూ ఏప్రిల్ 3న ఒక ఉమ్మడి ప్రకటన ఇచ్చారు. ఒకవైపున శాంతి ప్రక్రియలో తమ జోక్యాన్ని కోరుకుంటూనే మరోవైపు అదే సమయంలో నక్సలైట్లపై హంతక దాడులను పెంచుతున్న చంద్రబాబు ద్వంద్వ ప్రమాణాలను వారిరువురూ ఎండగట్టారు. అన్ని బూటకపు ఎన్‌కౌంటర్లనూ, విప్లవ సానుభూతిపరులైన ప్రజలపై చేస్తున్న దాడులనూ తక్షణమే నిలిపి వేయాలని వారు డిమాండ్ చేశారు. ముగ్గురు పీపుల్స్‌వార్ పార్టీ సీనియర్ నేతలు చంపబడిన డిసెంబర్ 2, 1999 'కొయ్యూరు ఎన్‌కౌంటర్'' తదితరాలపై అత్యున్నతస్థాయి న్యాయ విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన టెర్రర్ క్యాంపెయిన్‌ని వదిలిపెట్టి శాంతియుత వాతావరణాన్ని సృష్టించాలని అది మాత్రమే ఇరుపక్షాల మధ్య

( తరువాయి 59వ పేజీలో.....)